అద్భుత సంచలన నవల

# మహోమహుడు

('స్వాతి' సీరియల్)



## డా॥ కె. కిరణ్ కుమార్

***He is the Hero of Heros***
***He is more than a Super Hero***

# మహామహుడు

*(స్వాతి సపరివారపత్రిక సీరియల్)*

## డా॥ కె. కిరణ్ కుమార్

ప్రచురణ

**శ్రీ వైభవ పబ్లికేషన్స్**

ప్లాట్ నెం. 102, దివ్యసాయి అపార్ట్‌మెంట్స్
ఇం.నెం. 1-9-285/9/1, విద్యానగర్
హైదరాబాద్-44. ఫోన్ : 27090541
e-mail: srivaibhavapublications@gmail.com

© with writer

**MAHAAMAHUDU**
*(Serialised in Swati Weekly)*
*by*
**Dr. K. KIRAN KUMAR**

**Price : Rs. 100/-**

*First Edition:*
**August, 2014**

*Publishers:*
**SRI VAIBHAVA PUBLICATIONS**
102, Divyasai Apartments
1-9-285/9/1, Vidyanagar
Hyderabad - 500 044
Phone : 040-27090541

**గమనిక**

ఈ నవలలో

పాత్రలు,

సన్నివేశాలు

అన్నీ కల్పితం.

ఎవరిని ఉద్దేశించి

రాయబడినవి కావు.

*- రచయిత, పబ్లిషర్*

**గమనిక**

ఈ నవలలో సంభవించిన తప్పులకు, ప్రింటింగ్ లోపాలకు రచయిత, పబ్లిషర్ బాధ్యులు కారు. కాకపోతే అలాంటివాటిని మా దృష్టికి తీసుకొస్తే వాటిని మలి ముద్రణలో సరిచేసుకోగలం.

***– పబ్లిషర్***

# ముందుమాట

"ఇటీవల 'స్వాతి' సపరివారపత్రికలో సంచలనం సృష్టించిన నవల ఇది. ఇప్పటివరకూ రాసిన నవలల్లో అత్యధిక మలుపులు తిప్పిన నవల ఇది.

హై–రేంజ్ పొలిటికల్ థ్రిల్లర్స్ రాయడం నాకిష్టం. నా ఇతర నవలల్లోలా ఈ నవలలో కూడా ప్రధాని పాత్ర ప్రముఖంగా కన్పిస్తుంది. ఓ ప్రధానికి, ఆమె మాజీ ప్రియుడైన ఓ సైంటిస్ట్‌కు మధ్య జరిగే రసవత్తరమైన పోరాటమే ఈ నవల సారాంశం.

ఈ నవల ప్రతిని చదివి తగు సలహాలు ఇచ్చిన సాయిదేదీప్య, శ్రీలాస్యలకు నా కృతజ్ఞతలు. అలాగే ఈ నవల స్క్రిప్ట్‌ని అణువణువూ పరిశీలించి సలహాలు ఇచ్చిన అట్లూరి జ్యోతికి నా కృతజ్ఞతలు.

ఈ నవలని సీరియల్‌గా 'స్వాతి' సపరివారపత్రికలో అందంగా ప్రచురించిన 'స్వాతి' యాజమాన్యానికి నా కృతజ్ఞతలు.

మీ

**కిరణ్‌కుమార్**

# మహామహుడు

## నాంది

*"యురేకా... ఐ గాట్ ఇట్! నేను సాధించాను"*

అతడిలో సంతోషం అవధులు త్రొక్కుతోంది. అతడి మొహమంతా వేయి బల్బుల సూర్యకాంతుల కంటే ఎక్కువగా ప్రకాశిస్తోంది.

చెట్టు పై నుండి ఆపిల్ పండు క్రింద పడ్డప్పుడు న్యూటన్ కూడా అంతగా సంతోషించి ఉండడు. భూఆకర్షణ సిద్ధాంతాన్ని కనుక్కున్న న్యూటన్ కూడా అంతగా ఎగిరి గంతేసి ఎరగడు.

సాధించాను! నేను సాధించాను! ప్రపంచంలో మరో అద్భుతాన్ని నేను ఆవిష్కరించాను. ఇక నుండి సైన్స్ చరిత్రలో తన పేరు సువర్ణాక్షరాలతో లిఖిస్తారు. ఇది ప్రపంచంలోనే అరుదైన విజయం. ఎన్నో దేశాల ప్రజలు ఎలుగెత్తి చాటుతారు తన ప్రతిభని. రేపట్నుంచి ప్రెస్, మీడియా తన ప్రయోగం గురించి వేయి కళ్ళతో చాటుతారు. వైద్య ప్రపంచానికి సవాలుగా పరిణమించిన మహమ్మారి కాన్సర్‌కి ప్రివెంటివ్ ఇంజక్షన్ కనుక్కున్నాడు. టి.బి.కి, మశూచికి, పోలియోకి బాల్యంలోనే ప్రివెంటివ్ ఇంజక్షన్ ఇస్తున్నట్లుగా కాన్సర్‌కు కూడా అలాంటిది తను కనుక్కున్నాడు.

ఆనందం అర్ణవమైపోతోంది. అతడి కృషి అభినందిస్తున్నట్లుగా ఆ ప్రయోగ శాలలో చిలకలు, నెమళ్ళు, ఎలుకలు అతడి వేపు చూస్తున్నాయి.

*కాని కాన్సర్‌కు మందు కనిపెట్టానన్న ఆనందంతో తేలియాడుతున్న అతడికి ఆ క్షణంలో తెలియదు రాబోతున్న ప్రమాదం.*

◆ ◆ ◆

# కథాప్రారంభం

"ప్రొఫెసర్‌జీ! ఇది నేను సాధించాను..." అంటూ అతడు మొత్తం విషయాన్ని వివరించాడు.

"వెల్‌డన్ మైడియర్ బాయ్. యూ ఆర్ గ్రేట్..." అతడి భుజాన్ని తడుతూ కదిలింది ప్రొఫెసర్ కంఠం.

"దీనినే నా పిహెచ్.డి. థీసిస్‌గా నేను సబ్‌మిట్ చేస్తాను..."

"అలాగే మైడియర్ బాయ్! ప్రపంచంలోనే అరుదైన ఆవిష్కరణల్లో ఇది ఒకటిగా చెలామణీ అవుతుంది."

"థాంక్స్ ప్రొఫెసర్ జీ!"

"ఐయామ్ వెరీ ప్రౌడ్ ఆఫ్ యూ బాయ్! నీకు దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు, పబ్లిసిటీ వస్తాయి".

"సార్...! చిన్నప్పట్నుంచి ఒక ఆశయం కోసం ప్రయత్నిస్తున్నాను. ఆ సుందర స్వప్నం నిజమయ్యే క్షణం వచ్చింది. థాంక్స్ సార్".

"శభాష్! నీ వల్ల గైడ్‌గా నాకు కూడా పేరు వస్తుంది. నీవు నాకు కొడుకు లాంటివాడివి. కొడుకు పైకి వస్తే తండ్రి ఎంతో సంతోషిస్తాడు..."

ఆనందం ముప్పిరికొనగా ప్రొఫెసర్‌కి చేతులెత్తి దండం పెట్టాడు.

"సార్! చిన్నప్పుడే తండ్రి చనిపోయిన నాకు ఈ మాట చెప్పి పన్నీటిజల్లు కురిపించారు. థాంక్స్ సార్, థాంక్స్...."

"నో మెన్షన్ ప్లీజ్! నా శిష్యుడికి పేరు వస్తే నాకు వచ్చినట్లే కదా! ఇదే ఆవిష్కరణని నీ పిహెచ్‌డీ థీసిస్‌గా సబ్‌మిట్ చేద్దాం. దాంతో నీకు అటూ డాక్టరేట్, ఇటూ పేరు, ప్రఖ్యాతులు వస్తాయి."

"అలాగే సార్! మీరు ఎలా చెపితే అలా చేద్దాం..." ఆనందం హృదయాన్ని తాకగా ప్రొఫెసర్‌కి మరోసారి దండం పెట్టాడు. "ఎక్కడో పల్లెటూరులో ఉండే నన్ను ఈ యూనివర్సిటీకి తీసుకొని నన్ను ఇంతవాడిని చేశారు. మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేను సార్..."

"ఇందులో రుణాల ప్రసక్తి ఎందుకులే! ఇంకా నాలుగు నెలల్లో నీ పిహెచ్.డి. థీసిస్‌ని సబ్‌మిట్ చేస్తే, ఆ పై నెలలో వైవా పెట్టే ఏర్పాటు చేస్తారు...

"థాంక్స్ సార్" కళ్ళలో నీరు చిప్పిల్లాయి అతడికి.

ప్రొఫెసర్ అతడిని దగ్గరకు తీసుకొని భుజం మీద చేయి వేసి ఓదార్చాడు.

◆ ◆ ◆

# 2

జీవితం చిత్రమైనది. అది మనిషి జీవితాన్ని అనేక మలుపులు తిప్పుతుంది.

పుడుతూనే తండ్రిని పోగొట్టుకున్నాడు ఆర్య. అతడు కడుపులో ఉండగానే తండ్రిని ఓ యాక్సిడెంట్ కబళించేసింది. దాంతో పుట్టెడు దుఃఖంతోనే తల్లి అతడిని కన్నది.

ఆర్యకు ముందు ఓ అమ్మాయి పుట్టింది. అయితే దురదృష్టకరమైన విషయం ఏమిటంటే – ఆ అమ్మాయి పుట్టుగుడ్డిది. ఆ షాక్‌లో నుండి అతడి తల్లిదండ్రులు చాలాకాలం తేరుకోలేకపోయారు.

తమ దురదృష్టానికి చింతిస్తూ రోజులు తరబడి ఆలోచిస్తూండేవారు. అలాంటి సమయంలో... ఓ రోజు అన్యమనస్కంగా కూతురు గురించే ఆలోచిస్తున్న తండ్రిని రోడ్డు మీద ఓ లారీ గుద్దేసింది.

అసలు దిగులు మీదున్న తల్లి ఆ వార్త వినగానే షాక్ తగిలినట్లయింది. అప్పటికే ఆమె గర్భవతి. భర్త తాలూకు మృతి వార్త ఆమెని దాదాపు పిచ్చిదానిని చేసింది. అలాంటి స్థితిలోనే ఆర్య పుట్టాడామెకు.

తండ్రి చనిపోవడం, ఉన్న తల్లి మానసిక పరిస్థితి బాగోలేకపోవడం వల్లే 'ఆర్య'ని అక్కే సాకింది. కళ్ళు లేకపోయినా తన స్పర్శతో ఆ పసివాడిని సాకింది. అతడికి ఆకలి పసిగట్టి, తడుముకుంటూ స్టౌ దగ్గరకు వెళ్ళి పాలు వేడి చేసి పట్టేది. అతడు ఏడిస్తే తన లాలిపాటలతో ఓదార్చేది. ఉదయం లేస్తూనే ఆర్య ఆలన పాలన మొత్తం ఆమె చూసుకునేది. ఇంత చేస్తే ఆమె వయసు ఆరేళ్ళు.

భగవంతుడు కొందరికి అన్నీ ఇస్తాడు. కొందరికి ఏదొక అవకరం ఇస్తాడు. అయితే ఆ అవకరానికి తోడు ఇంకో కోణంలో అద్భుత తెలివితేటలు సైతం ఇస్తాడు. అలా ఆ అమ్మాయికి కళ్ళు లేకపోయినా పూర్తి విచక్షణాజ్ఞానాన్ని ఇచ్చాడు. దాంతో ఆ అమ్మాయి తన ఇంటి పరిస్థితులను పూర్తిగా ఆకళింపు చేసుకొని తదనుగుణంగా వ్యవహరించేది.

అడుగుల చప్పుడుని బట్టి ఎవరొచ్చింది ఆమెకు తెలిసిపోతుంది. గాలిని బట్టి అది ఏ కాలమో తెలుస్తుంది. స్పర్శని బట్టి వస్తువు మంచి చెడ్డలు నిర్ణయిస్తుంది.

అలా ఆ అమ్మాయి తనకు కళ్ళు లేకపోయినా పూర్తి అవగాహనతో తమ్ముడిని తానే తల్లై సాకేది.

అదృష్టవశాత్తూ అతడి తండ్రి సర్వీసులో పోయాడు కాబట్టి పెన్షన్ వస్తుంది. ఆ డబ్బుతో కుటుంబాన్ని ఎలాగోలా నెట్టుకొచ్చేది. ఆ అమ్మాయిలో మరో అద్భుత లక్షణం – ఇరుగూ పొరుగుతో చక్కటి సంబంధాలు మెయిన్‌టెయిన్ చేయడం. వృద్ధులను, అత్తా, మామ అంటూ, తన వయసు కంటే కొంచెం పెద్ద వారిని అక్కా, అన్నా అంటూ ఆప్యాయంగా పలకరించేది. ఆ అమ్మాయికి కళ్లు లేవు కాబట్టి వారు సైతం ఆమె పట్లా చక్కటి ఆప్యాయతతో ఉండేవారు.

కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు. మార్పు సహజం. ఆర్య సైతం పెద్దవాడు అవసాగాడు. అప్పటివరకూ అక్క చేతిలో అనురాగం, ఆప్యాయతలు చవి చూసిన అతడికి ఇంట్లో పరిస్థితులు క్రమక్రమంగా అర్థమవసాగాయి.

తండ్రి తాను పుట్టుకముందే చనిపోవడం, తల్లి భౌతికంగా ఉన్నా మానసికంగా లేనట్లే ఉండడం అతడిని షాక్‌కు గురిచేశాయి. అక్క లేకపోతే తాను ఎప్పుడో రోడ్డున పడేవాడన్న సత్యం అతడిని దిగ్భ్రాంతికి లోను చేసింది.

ఆ షాక్‌లో నుండి అతడి మెదడు పాదరసంలా ఎదగసాగింది. ఎప్పుడైతే కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేవో, మనిషి పతనమవుతాడు లేదా మరింతగా పదును సంతరించుకుంటాడు.

ఆర్య విషయంలో ఆ రెండోదే జరిగింది. తాను కష్టపడి తన కుటుంబాన్ని ఎలాగైనా పైకి తేవాలన్న కాంక్ష అతడిలో ప్రబలంగా పాతుకుంది. ఆ పట్టుదలలోనే అతడు ఒక్కో క్లాసు ఫస్ట్‌గా వచ్చేవాడు. ఒక్కో క్లాసుని దాటుకుంటూ ఉండగా అతడి పట్టుదల మరింతగా పెరగసాగింది. తాను కష్టపడాలి. ఈ ప్రపంచంలో ఓ చిన్న సంతోషం కూడా చిగురించుకోలేని అక్క, అమ్మల కోసం తాను ఎదగాలి. ఎదిగి వారిని ఆనందపెట్టాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు.

అతడు పదవ తరగతిలో ఉండగానే అప్పటివరకూ మానసికంగా సరిగా లేని తల్లి కాన్సర్‌తో చనిపోయింది. ఉన్న ఇద్దరిలో ఒకరు పోవడం అతడిని షాక్‌కి గురిచేసింది. తల్లి పోవడం, ఉన్న అక్కకు చూపులేకపోవడం అతడిని నిశ్చేష్టతలోకి దింపింది.

అదిగో ఆ స్థితిలోనే తిరిగి అక్క అతడిలో ధైర్యాన్ని నూరిపోసింది. ఇది సృష్టికర్త రాజ్యమని, ఒకోసారి ఆ సృష్టికర్త ఎలా ఆడితే అలా బొమ్మల్లా తాము ఆడాలని,

అలాంటి పరిస్థితుల్లోనే మరింత ధైర్యం తెచ్చుకొని జీవితంలో ముందుకు సాగాలని ఆమె అతడికి ప్రోత్సాహం ఇచ్చింది. ఈ ప్రపంచంలో అతడికి ఎవరున్నా, లేకపోయినా తానున్నానని, ఓ ప్రబలశక్తిలా అతడు ఎదగాలని ఆమె అనుక్షణం ధైర్యాన్ని నూరిపోసింది.

ఆ అనునయ వాక్యాలు – ఆర్యలో తిరిగి కొద్దికొద్దిగా జీవితం పట్లా ఆశను, ఉత్సాహాన్ని నింపాయి. ఆ ఆశ, ఉత్సాహం అతడిలో నిప్పై పట్టుదలగా మారి టెన్త్ క్లాస్‌లో జిల్లా ప్రథముడిగా నిలిపాయి.

అక్కడ నుండి ఒక్కో మెట్టు ఎక్కసాగాడు. ఐఐటి ఎంట్రన్స్‌లో ఇండియాలోనే టాప్‌ర్యాంకును పొందటం, ఖరగ్‌పూర్‌లోని ఐఐటీలో చేరి గోల్డ్‌మెడల్ సంపాదించడం, ఆ వెంటనే యూజిసి నేషనల్ ట్యాలెంట్ టెస్ట్ రాయడం, అందులో మెరిట్ స్కాలర్‌షిప్‌ని సాధించడం చకచకా జరిగిపొయ్యాయి.

ఆ మెరిట్ స్కాలర్‌షిప్ ఆధారంగా దేశంలో రకరకాల ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలకు, సైన్స్ సెంటర్లకు అప్లయి చేశాడు. దేశంలో దాదాపు అన్ని యూనివర్సిటీలు, సైన్స్ ఇనిస్టిట్యూట్‌లు అతడిని తమ రీసెర్చి స్కాలర్‌గా తీసుకోవడానికి అంగీకరించాయి. దాంతో తన ప్రతిభకు తగిన ఇనిస్టిట్యూట్ ఏదా అనే అన్వేషించాడు.

ఆ అన్వేషణలో కన్పించింది కపిలవర్ధ సైన్స్ ఇనిస్టిట్యూట్. దేశంలో యుజిసి పర్మిషన్ పొందిన ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీ అది. ఆ సైన్స్ ఇనిస్టిట్యూట్‌కు దేశవిదేశాల్లో ఎల్లెడలా విశేష పేరూ, ప్రఖ్యాతులు ఉన్నాయి. అందులో రీసెర్చి చేయాలని ప్రతి ఒక్కరూ ఉవ్విళ్ళూరుపోతారు.

అందుకు రెండు కారణాలు ఉన్నాయి. అందులో పిహెచ్.డి. చేసిన వారిని లక్షలాది రూపాయలు ఇచ్చి తమ సంస్థల్లో చేర్చుకోవడానికి అనేక రీసెర్చి కంపెనీలు పోటీపడడం ఒకటి కాగా, ఆ కపిలవర్ధ యూనివర్సిటీ ఛైర్మన్ ధన్‌రాజ్ స్వయాన దేశ ప్రధానికి అన్నయ్య కావడం మరో కారణం. అలాంటి సైన్స్ సెంటర్‌లో ఆర్యకు తేలికగానే ప్రవేశం దొరికింది. టెన్త్ నుండి ఎంఎస్సీ దాకా అన్నింటా తొంభై శాతం మార్కులు సంపాదించిన అతడిని తమ రీసెర్చి స్కాలర్‌గా స్వీకరించడానికి ఆ సైన్స్ సెంటర్ సంసిద్ధత తెలియజేసింది. అతడిని ఇంటర్వ్యూ చేసిన బోర్డు ఆఫ్ డైరెక్టర్లు సైతం అతడి నాలెడ్జికి అచ్చెరువొందారు. తాము అడిగిన ప్రశ్నలకు చకచకా సమాధానాలు చెప్పడమే కాకుండా ఆ సందేహాలలో ఇంకా ఎంత వరకూ రీసెర్చి

పరిధిని విస్తరించవచ్చో కూడా వివరించాడు. ఆ సమయంలో ఇంటర్వ్యూ చేసిన వారికి అర్థమైంది తమ ముందు ఉన్న వ్యక్తి మామూలు వ్యక్తి కాదని, ఓ విజ్ఞానగని. నిజానికీ తాము అతడిని ఎన్నుకోవడం ముఖ్యం కాదని, అతడు ఆ ఇనిస్టిట్యూట్‌ని ఎన్నుకోవడం తమ అదృష్టమని వారికి అర్థమైంది. త్వరలోనే దేశానికి ఓ మాణిక్యం లాంటి సైంటిస్ట్ దొరకబోతున్నాడని వారికి అర్థమైంది.

అనుకున్నట్లుగానే ఆ ఇనిస్టిట్యూట్‌లో చేరుతూనే ఆర్య సంచలనం సృష్టించాడు. చేరుతూనే ప్రతిష్ఠాత్మకమైన విదేశీ మ్యాగజైన్లకు ఆర్టికల్స్ రాశాడు. వాటిని ప్రచురించిన విదేశీ మ్యాగజైన్‌లకు అభినందన పరంపరలు వెల్లువలా వచ్చిపడ్డాయి. అలాంటి గొప్ప ఆర్టికల్ రాసిన అతడి పరిజ్ఞానానికి అనేకమంది అభినందించారు. మొత్తం మీద ఆ ఇనిస్టిట్యూట్‌లో అతడొక అపూర్వవ్యక్తిగా, ఆరాధించే మనిషిగా పేరు పొందాడు.

*ఆ ఆరాధించే వ్యక్తుల్లో ఒకరు సమీర.*

*సమీర ఎవరో కాదు. ఆ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ ధన్‌రాజు కూతురు.*

◆ ◆ ◆

మేనేజ్‌మెంట్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసిన ఆమె తన తండ్రి ఇనిస్టిట్యూట్‌లో చేదోడు వాదోడుగా ఉంటుండేది. సరిగ్గా అప్పుడే ఆమె ఆర్యతో పరిచయం కలిగింది.

ఇతర రీసెర్చి స్కాలర్లు కాకుండా ఇరవై నాలుగు గంటలూ రీసెర్చి మీదే దృష్టిని నిలిపిన అతడి గురించి ఆమె మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు.

కాని వారిద్దరి జీవితాలను పెనవేసుకునే సంఘటన ఆ రోజు జరిగింది.

ఆ రోజు....

ఎప్పటిలా బయోకెమిస్ట్రీ లాబ్‌లో సూపర్‌వైజ్ చేస్తోంది సమీర. అందమైన శారీలో అటూ ఇటూ తిరుగుతున్న ఆమెను గుటక తిప్పకుండా చూస్తున్నారు కొంతమంది రీసెర్చి స్కాలర్లు.

హడావిడిగా అటూ ఇటూ తిరిగేస్తున్న ఆమె చీర వెనుక భాగం స్వేచ్ఛగా విహరిస్తోంది. అదే సమయంలో సెల్‌ఫోన్ మ్రోగడంతో ఆమె దృష్టి బ్యాగ్‌లో ఉన్న సెల్‌ఫోన్‌ని అందుకోవడం కోసం క్రిందికి వంగింది. ల్యాబ్‌లో ఓ పక్కన టబ్‌లో పోసిన భయంకరమైన యాసిడ్ ఆమె కొంగుని ఎలా అంటుకోవాలా అన్నట్లుగా ఆకలిగా చూస్తూ బుసలు కొడుతోంది.

ఒక్క క్షణం. ఆమె కొంగు అందులో పడేదే.

కాని ఏదో ఎక్స్‌పరిమెంట్ పని మీద అటుగా వచ్చిన ఆర్య ఆ దృశ్యాన్ని చూడడం, ఆమె కొంగుని పట్టి ముందుకు లాగడం, ఆ విసురుకు ఆమె అతడి మీద వేగంగా పడటం, అతడు ఏదో దురుద్దేశంతో తన పైటలాగాడని ఆమె భ్రమపడడం, మరుక్షణం ఆమె చేతివేళ్ళు అతడి చెంపమీద  కసిగా నాట్యమాడటం చకచకా జరిగిపొయ్యాయ్.

జరిగిన సంఘటనకు నిశ్చేష్టుడైనట్లుగా చెంప మీద చేయి ఉంచుకొని అలాగే నిల్చుండిపోయాడు  ఆర్య.

మరో పదిసెకండ్ల తర్వాత జరిగిన విషయం తెలుసుకున్న ఆమె అతడికి సారీ చెప్పింది.... పశ్చాత్తాపంతో.

అది ప్రారంభం... ఆమెకు ఆర్య ఇంకో కోణంలో కన్పించాడు. అతడి మీద ప్రేమ ఉదయించిందా సంఘటనతో.

ఆ ప్రేమ కాస్తా అభిమానంగా, ఆ అభినయం కాస్తా ఆరాధనగా పరిణామం చెందాయ్. ఆ ప్రేమ ఎంత దూరం పోయిందంటే, అనితర సాధ్యమైన అతడి మేధస్సుకి తోడుగా తన జీవితాన్ని ముడివెయ్యాలని నిర్ణయించుకునేంత దూరం పోయింది. ఓ రోజు తన మనస్సులో చోటుచేసుకున్న నిర్ణయాన్ని అతడి దగ్గర స్పష్టంగా వెలిబుచ్చింది సమీర.

అప్పటివరకూ ప్రేమ, పెళ్ళిలాంటి పదాలకు దూరంగా ఉన్న ఆర్య ఆ మాటలు విని దిగ్భ్రాంతికి లోనయ్యాడు. రకరకాల ఆలోచనలు అతడిని చుట్టుముడుతుంటే షాక్‌లోనే  ఉండిపోయాడు.

తన బాస్ కూతురు ఆమె. ఆమెతో పెట్టుకుంటే తన జీవితం ఎటువెళ్తుందో? ఆమె గొప్పింటి పిల్ల. తాను కష్టాల కొలిమిలో ఇరుక్కున్న వ్యక్తి. పుడుతూనే బంగారు స్పూన్‌తో పుట్టిందామె. అక్క అనురాగం తప్ప మరి దేనికీ నోచుకోని దౌర్భాగ్యుడు తాను. అలాంటి తనకు, బంగారు పువ్వులాంటి ఆమెతో... ఈ విషయం బాస్‌కు తెలిస్తే తన జీవితాన్ని కాలరాసే ప్రమాదం ఉంది.

అందుకే తన ప్రతిఘటనని అతడు ఒకే ఒక పదంతో తెలియజేశాడు.

“నో”

ఆమె దిగ్భ్రాంతితో అలాగే నిల్చుండిపోయింది. అదేమిటో తను కోరి వలిచి వస్తే, నో అంటాడేమిటి? తాను కాలేజీ బ్యూటీ. అలాంటి తనని నిరాకరించడం ...ఓహ్ ఇటీజ్ హారిబుల్.

మరో రోజు గడవకుండానే ఆమెకు అర్థం అయింది. ఆమెకు అతడు 'నో' అని ఎందుకన్నాడో. అర్థమైన మరుక్షణం ఆమె పెదవుల పైన చిరునవ్వు మొలకెత్తింది.

ఆ మర్నాడు అతడిని పార్కులో కలుసుకోవడానికి రమ్మని కబురు పంపింది. అతడు దడదడలాడే గుండెలతో వెళ్ళాడు.

తన తండ్రిని తాను ఒప్పిస్తానని, తన ప్రేమకు తండ్రి అనుమతి తీసుకునే అతడిని వరిస్తానని ఎంతో సేపూ అతడిని కన్విన్స్ చేసింది.

అతడు ఆలోచిస్తూ వుండిపోయాడు. ఆమె నార్త్ ఇండియన్, తాను సౌత్ ఇండియన్. ఆమె మిస్ ఇండియా లెవల్‌లో అందగత్తె. తాను సైతం అందగాడే కావచ్చు. కాని ఆమెకు, తనకు అంతస్తులో చాలా తేడా ఉంది. అయినప్పటికీ పేదవాడినైన తనని వలచి వస్తోంది.

ఓ పదినిముషాల తర్వాత అతడి కంఠం కదిలింది.

"చిన్నప్పట్నుంచి ఒక ఆశయం కోసం పాటుపడుతున్నాను. ఆ ఆశయంలో పూర్తయ్యేదాకా ప్రేమ, పెళ్ళి లాంటివాటికి దూరంగా ఉండాలన్నదే నా ధ్యేయం."

ఆ అభ్యంతరానికి ప్రతిగా సమాధానం ఆమె నోటి నుండి వెలువడింది.

"మీ ఆశయం పూర్తయ్యాకనే మనం పెళ్ళి చేసుకుందాం. సరేనా?"

తిరిగి దిగ్భ్రాంతికి లోనయ్యాడు ఆర్య. తాను ఎటు వెళితే ఈమె అటుగా కదులుతుందేమిటి? తనంటే చాలా లోతుగా ప్రేమను పెంచుకున్నట్లుంది.

అయినా ఆమె అపురూప సౌందర్యరాశి. వినయం, సౌశీల్యం కలబోసుకున్న యువతి. పేరుకు బాస్ కూతురైనా ఎప్పుడూ ఎవరి మీద ఆధిపత్యం చూపలేదు. అందరిలో తేలికగా కలిసిపోతుంది. ఆమెను తిరస్కరించడానికి కారణం కన్పించ లేదతడికి.

"మరి మన పెళ్ళికి మీ నాన్నగారు ఒప్పుకుంటారా?" తుపాకు గుండెలా తాకిందామెకు అతడి ప్రశ్న.

"నాన్నగారికి నేనంటే ప్రేమ. చిన్నప్పట్నుంచి అమ్మ పోయిన నన్ను తానే అల్లారు ముద్దుగా పెంచారు. నా పెళ్ళి నా యిష్టం అని తానే ఎన్నోసార్లు చెప్పారు".

ఆమె మాటలు అతడిని తిరిగి ఆలోచనలో పడిపోయింది.

అప్పుడు కదిలిందతడి కంఠం ఇక గత్యంతరం లేనట్లుగా –

“మరోసారి ఆలోచించుకో సమీరా” అని.

ఆ మాటతో ఆమె మొహంలో ఆనందం మెరుపులా మెరిసింది. అతడి దగ్గర నుండి అంతగా అభ్యంతరం లేదన్న ఊహ ఆమె శరీరంలో అణువణువూ ఉద్విగ్నతను నింపేసింది.

ఆ ఉద్విగ్నతను అణుచుకునే ప్రయత్నం కూడా చేయలేదామె. అతడి దగ్గరకు జరిగి అతడి చేతిని తన పెదాలతో ముద్దు కలిపింది.

ఆ తర్వాత సంఘటనలు వేగంగా జరిగిపోయాయి.

నార్త్ – సౌత్ ఇండియన్‌ల కలయికలా వారు తమ భావాలను ఒకరినొకరు పంచుకున్నారు. ఆమె మహమ్మద్ రఫీ పాటల విషాదం అతడికి విన్పిస్తే, అతడు ఆమెకు జేసుదాస్ పాటలు వినిపించేవాడు. ఆమె రవీంద్రనాథ్ ‘గీతాంజలి’ని అతడి ముందు ఆలపిస్తే, అతడు కూచిపూడి, భరతనాట్యం విశిష్టతని వివరించేవాడు.

ఇద్దరూ సాయంకాలం కాగానే ఆ కపిలవర్థ యూనివర్సిటీలో ఒకరి చేయి ఒకరు పట్టుకొని తిరిగేవారు. పై నుండి చెట్లు పూలు రాల్చేవి వారి మీద.

దూరంగా సముద్రం, ఆ సముద్రం దిగువ నుండి చంద్రుడు అప్పుడప్పుడే పైకి రావడం, ఆ దృశ్యాలను చూస్తూ ఇద్దరూ పరవశించిపోవడం జరిగేవి. అతడు ఓ పొద దగ్గర ఆమె ఒడిలో తలపెట్టుకు కూర్చోవడం, ఆమె తన హిందీ పాటలతో అతడిని రంజింపచేయడం, దూరంగా ఉన్న చెట్ల మీద పక్షుల కిలకిలరావాలు విన్పించడం చకచకా జరిగిపొయ్యాయ్.

అతడు తను చేసే ప్రయోగాలు, కొత్తగా కనిపెట్టబోయే ఆవిష్కరణల గురించి వివరించేవాడు. అది ఫిజిక్స్ కాని, కెమిస్ట్రీ కాని, ఆఖరికి కంప్యూటర్‌గానీ అతడికి అపరిమితమైన పరిజ్ఞానం ఉందని ఆమెకు అర్థమైంది. అంతేకాదు, మేనేజ్‌మెంట్‌లో ఆమె పీటర్ డ్రక్కర్ దగ్గర నుండి ఆధునిక మేనేజ్‌మెంట్ గురూల దాకా అనర్గళంగా ఉపన్యసించేది. దాంతో ఆమె ఒక గొప్ప అడ్మినిస్ట్రేటర్‌గా అన్పించేది అతడికి.

అలా రాత్రి తొమ్మిదింటిదాకా ఇద్దరూ కలిసి ఆ దీవంతా తిరిగేవారు.

అలా కాలం గడుస్తుండగా.... ఆమెకు అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో

పిహెచ్.డి. చేయడానికి అడ్మిషన్ దొరికింది. చాలా అరుదైన అవకాశం అది. తప్పకుండా వెళ్ళమని తండ్రి ఉత్సాహపరిచాడు. ఆర్య కూడా ఆమెని వెళ్ళడానికి ప్రోత్సాహపరిచాడు. తన రీసెర్చి ముగించడానికి ఇంకొంత కాలం పడుతుంది కాబట్టి ఈ లోగా ఆమె అమెరికా వెళ్ళి పిహెచ్.డి. పూర్తి చేసుకోవచ్చని, ఆ తర్వాత తామిద్దరు కలిసి జీవితాన్ని పంచుకోవచ్చని నచ్చచెప్పాడు.

దాంతో సమీర అతడిని విడవలేక విడవలేక బయలుదేరి వెళ్ళింది.

ఆమె వెళ్ళాక ఆర్య తన రీసెర్చి మీద పూర్తి దృష్టిని కేంద్రీకరించడం, క్రమక్రమంగా అతడి ప్రయోగాలు ఫలించడం, దాంతో అతడు కాన్సర్‌కి వాక్సిన్ కనిపెట్టడం చకచకా జరిగిపొయ్యాయి.

◆ ◆ ◆

ఆర్య జీవితాన్ని మలుపు తిరిగే సంఘటన ఆ రోజు జరిగింది.

అతడి ప్రొఫెసర్‌కు బెస్ట్ రీసెర్చి గైడ్ అవార్డ్ వచ్చింది. ఆ సందర్భంగా అంతా పార్టీ ఇవ్వమని ప్రొఫెసర్‌ని బలవంతం చేశారు. దాంతో ఫలానా రోజు కపిలవస్థ దీవిలో పార్టీని అరెంజ్ చేస్తున్నానని ప్రకటించారు ప్రొఫెసర్.

సరిగ్గా అదే సమయంలో తన అక్కని చూడటానికి వూరికి వెళ్ళాడు ఆర్య. అక్కడ అక్కని రోటీన్ చెకప్‌కోసం ఎల్.వి. ప్రసాద్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు. వాళ్ళు ఆమెని చూసి ఆమెకు కళ్ళు వచ్చే అవకాశం ఉందని, అందుకోసం న్యూఢిల్లీలోని జహంగీర్ హాస్పిటల్‌లోని ఐ స్పెషలిస్ట్ అభిప్రాయం తీసుకోమని చెప్పారు. దాంతో జరిగిందంతా ప్రొఫెసర్‌కు ఫోన్‌చేసి చెప్పాడు ఆర్య. అక్కని తీసుకొని రమ్మని, కావాలంటే కపిలవర్ధ యూనివర్శిటీలో గెస్ట్‌హౌస్‌లో ఒక దానిలో ఉండవచ్చని చెప్పాడు ప్రొఫెసర్.

దాంతో అక్కని తీసుకొని కపిలవర్ధ యూనివర్శిటీకి వచ్చాడు ఆర్య. తన ప్రొఫెసర్‌కి అక్కని పరిచయం చేశాడు.

ఆమెని చూస్తూనే అంతా స్థంభించిపోయారు. చాలా అద్భుతంగా ఉంది. గుడ్డి అమ్మాయి అంటే ఏదో అనుకున్నాడు కాని ఇంత అందంగా ఉంటుందని ప్రొఫెసర్, మిగతా విద్యార్థులు అసలు అనుకోలేదు.

అక్క, తమ్ముడూ కలిసి ప్రొఫెసర్ అరెంజ్ చేసిన గెస్ట్‌హౌస్‌లో ఉండసాగారు. ఈలోగా ప్రొఫెసర్ అరెంజ్ చేసిన పార్టీ రోజు వచ్చింది.

ఆ రోజు పార్టీకి దేశంలో పేరుపొందిన ఎంపీలు, నలుగురు మంత్రులు, విద్యార్థులు, ఇతర గెస్ట్‌లు రంగ రంగ వైభవంగా విచ్చేశారు. ప్రొఫెసర్ ధన్‌రాజ్ ప్రధాని స్వంత అన్న కావడంతో దాదాపు పిల్చిన వారంతా వచ్చేశారు. పార్టీ ఘనంగా జరిగింది. ఆర్య సైతం అక్కని గెస్ట్‌హౌస్‌లో ఉంచి పార్టీలో పాల్గొన్నాడు. ఆ పార్టీలో ఆర్య అందరికి ప్లేట్లు అందించడం లాంటివి చేశాడు.

స్వదేశీ, విదేశీ వంటకాలతో, నార్త్-సౌత్ ఇండియన్ రుచులతో ఏరులై పారుతూ మద్యంతో పార్టీ చాలాగొప్పగా జరిగింది. ప్రొఫెసర్‌ని అంత అభినందించారు.

పార్టీ ముగిసింది. ఆర్య తన గెస్ట్‌హౌస్‌కు బయలుదేరాడు. పార్టీ విశేషాలన్నీ అక్కకు చెప్పాలన్న ఆత్రుతతో తలుపు కొట్టాడు. కానీ ఎవరూ తలుపు తీయలేదు.

'ఏమయ్యింది అక్కకు?' అనుకుంటూ మరోసారి కొడదామని తలుపుమీద గట్టిగా చేయి వేశాడు. లోపల గడియ పెట్టలేదేమో తలుపులు మెల్లగా తెరుచుకున్నాయి.

లోపల అక్క గిలగిలకొట్టుకుంటోంది. చావు బ్రతుకుల్లో ఉంది.

"అక్కా" ఆమెను కదుపుతూ అన్నాడు. అప్పటికే ఆమె కొనవూపిరిలో ఉంది.

"తమ్ముడూ! నన్ను పాడుచేశారు ఘోరంగా."

"అక్కా...."

"తమ్ముడూ!" ఆయాసం ఆమెలో ""నన్ను చెరిచినవాడు మినిస్టరట. తమ్ముడూ నేనూ బ్రతకలేను..."

మరుక్షణం ఆమెలో ఊపిరి ఆగిపోయింది. ఆర్య స్థంభితుడైపోయాడు. ఒక్కగానొక్క అక్క చ....ని....పో....యిం.....ది. ఈ ప్రపంచంలో తనకు మిగులున్న ఒకే ఒక అక్క పోయింది.

అంతే! తన తల గోడకేసుకొని కొట్టుకుంటూ అక్కడే కుప్పకూలిపోయాడు.

జరిగిన విషయం తెలిసిన ప్రొఫెసర్, ఇతర విద్యార్థులు అక్కడికి వచ్చారు. ప్రొఫెసర్ వెంటనే పోలీస్‌కు ఫోన్ చేశాడు.

పోలీసులు వచ్చి సంఘటన వివరాలను నోటు చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్య స్పృహలో లేడు.

అతడి కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి.

ఫార్మాలిటీస్ ముగించి పోలీసులు వెళ్ళిపోయారు. ఆర్యని ప్రొఫెసర్, మిగతా విద్యార్థులు ఓదార్చారు.

వారి సహాయంతోనే ఎలాగో అక్క అంత్యక్రియలు జరిపించాడు ఆర్య.

చాలాకాలం దాకా మామూలు మనిషి కాలేదు అతడు. తన అక్కని రేప్ చేసిందెవరో అంతు పట్టడంలేదు. చాలా సామాన్యుడు తను. తానేం చేయలేడా?

అలా రోజుల తరబడి నిర్లిప్తంగా ఆలోచిస్తూ ఉండేవాడు.

◆ ◆ ◆

అసలే షాక్ మీద ఉన్న ఆర్యకు మరికొద్ది రోజుల్లోనే మరో షాక్ తగిలింది.

*అతడు కనిపెట్టిన కాన్సర్ వాక్సిన్‌కు అమెరికాలో ఓ సైంటిస్ట్ కనిపెట్టి పేటెంట్ తీసుకున్నాడు.*

ఆ వార్త వార్తాపత్రికలలో రాగానే ఆర్య నిశ్చేష్టుడైపోయాడు. మైగాడ్! అదెలా సాధ్యం? నాలుగు నెలల క్రితం తను కనిపెట్టాడు. దానినే పిహెచ్.డీ థీసిస్‌గా సబ్‌మిట్ చేద్దామనుకున్నాడు. కాని ఈ లోపు ఈ హఠాత్మపరిమాణం సంభవించింది.

ఆ విషయమే ప్రొఫెసర్‌ని అడుగుదామని బయలుదేరిన ఆర్య షాక్ తిన్నాడు.

తన ప్రొఫెసరే ఆ అమెరికా సైంటిస్ట్‌కి తన థీసిస్‌ని రహస్యంగా అందించాడని తెలిసింది.

మరుక్షణం ఆర్య రక్తం సలసల కాగింది. ఒక ప్రక్క అక్క మరణం, మరో పక్క తన థీసిస్ కాపీ చేసి వేరే దేశం సైంటిస్ట్‌కి అమ్మేశాడన్న నిజం ఆర్య తట్టుకోలేక పోయాడు.

అంతే! ఆ ఆగ్రహంతో ప్రొఫెసర్ గొంతు పట్టుకున్నాడు. ప్రొఫెసర్ గిలగిల కొట్టుకోసాగాడు. అయినా ఆర్య వదలలేదు. అతడిని చంపేయ్యాలన్న కసితో గొంతు నులపసాగాడు.

ఇంకొక్క క్షణం! ఆ క్షణంలో ప్రొఫెసర్ ప్రాణం పోయేదే. కాని అటుగా వచ్చిన సెక్యూరిటీ గార్డులు అది చూసి ఆర్యని పట్టుకొని లాగారు.

ఆ తర్వాత లాఠీలు అతడి మీద స్వైర విహారం చేశాయి. అతడి తలంతా రక్తంతో నిండిపోయింది.

అదే సమయంలో గొంతు విడిపించుకున్న ప్రొఫెసర్ కసిగా చూశాడు ఆర్యని.

"ఏరా నీకు నా కూతురు కావాల్సి వచ్చిందా? నీ బ్రతుకెక్కడ? నా అంతస్తు ఎక్కడా? ఈ దేశపు ప్రధాని సోదరుడిని. అలాంటిది నీవు నా కూతురివే ప్రేమిస్తావా? అందుకే కక్ష కట్టి నీ పతనం చూశాను. పోరా.... ఇక్కడ నుండి, మళ్ళీ ఇక్కడకు అడుగుపెట్టడంగాని, నా కూతురు మొఖంగాని చూశావా, నీ శవం సముద్రంలో తేలుతుంది...."

ఆర్యలో నిశ్చేష్టత. కేవలం తన కూతురిని ప్రేమించమన్న కోపంతో తన బ్రతుకుని నాశనం చేశాడా? తన ప్రాజెక్టుని అమెరికన్ సైంటిస్ట్‌కు అమ్మేశాడు. తన పిహెచ్.డి. కాకుండానే తనని మోసం చేస్తాడా?

మరుక్షణం సెక్యూరిటీ గార్డులకు సంజ్ఞ చేశాడు ప్రొఫెసర్.

అంతే! మరోసారి అతడి మీద లాఠీలు స్వైర విహారం చేశాడు. ఆ దెబ్బలకు తాళలేక స్పృహ తప్పిపోయాడు ఆర్య.

స్పృహ తప్పిపోయిన అతడి జేబులోని సెల్‌ఫోన్ తీసుకొని అతడిని రైలుస్టేషన్‌లో ఎపి ఎక్స్‌ప్రెస్‌లో ఓ బోగిలో పడేసి వెళ్ళారు ఆ సెక్యూరిటీ గార్డులు.

కాసేపటికి ఎపి ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది ఆంధ్రప్రదేశ్ కేసి. స్పృహలో లేని ఆర్య శరీరం ఆ ట్రైన్‌లో ఆ రాత్రంతా ప్రయాణిస్తూనే ఉంది.

◆ ◆ ◆

## 3

'ప్రొఫెసర్ ధన్‌రాజ్ మీద పగ తీర్చుకోడం ఎలా?'

ఆర్య అంతరంగం ప్రొఫెసర్ మీద కసితో ఉడుకుతోంది.

తనను ఎలా దెబ్బకొట్టాడో అదే విధంగా ప్రొఫెసర్‌ని దెబ్బకొట్టాలి. ఇంతకూ ఇంతా తీర్చుకోవాలి.

ఏ రెక్కలతో అతడి మీద పగ తీర్చుకోవాలో అర్థం కావడం లేదు. ప్రొఫెసర్ అత్యంత అధికారం గలవాడు. అతడు స్వయాన ప్రధానికి అన్నే కాకుండా దేశంలోనే అత్యంత ప్రభావితమైన రీసెర్చి గైడ్. తన పిహెచ్.డి.ని నాశనం చేశారు. తన అక్క జీవితాన్ని కాలరాశాడు. ఆఖరికి తనను సెక్యూరిటీతో చిత్రహింసలు పెట్టించాడు. సాఫీగా సాగుతున్న తన బ్రతుకుని వీధి పాలు చేశాడు. తన సెల్‌ఫోన్‌ని బలవంతంగా

తీసేసుకున్నాడు. అందులోనే అతడి కూతురు సమీర నెంబరు ఉంది. తాను ఆమెని కాంటాక్ట్ చేయకుండా తన సెల్‌ఫోన్ తీసేసుకున్నాడు. అలాంటి వాడి మీద ఎలా పగ తీర్చుకోవాలి? మరోసారి అతడి మీదకు వెళ్తే తిరిగి పోలీసులు అరెస్ట్ చేస్తారు. దాంతో తిరిగి తను కటకటాల లోపలికి వెళ్తాడు. అందువల్ల తనకు ఎలాంటి ప్రయోజనం ఉండదు.

అందువల్ల అతడిని ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా దెబ్బకొట్టాలి. అతడి జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరి చేయాలి. అలా చేయాలంటే తాను అత్యంత ప్రతిభావంతుడిగా చెలామణి కావాలి. కాని ఎలా? ఏ రెక్కలతో అలా ఎదగాలి? ప్రతీకారం ఎలా తీర్చుకోవాలి?

రోజులు తరబడి ఆలోచిస్తూనే ఉన్నాడు అతడు. క్షణాలు నిమిషాలుగా, ఆ నిముషాలు గంటలు, ఆ గంటలు రోజులుగా పరిణామం చెందుతున్నాయ్.

అయినా అతడి సమస్యకు పరిష్కారం లభించడం లేదు. నరాలు చిట్లేలా, రక్తనాళాలు బ్రద్దలయ్యేలా ఆలోచిస్తూనే ఉన్నాడు. అయినా సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

రోజుల తరబడి అన్నపానీయాలు మరచిపోయాడు. స్నానాదికార్యక్రమాలు అసలే గుర్తుండడం లేదు. అతడి గడ్డం పెరిగి తైల సంస్కారం లేకుండా పోయింది. అతడి మస్తిష్కంలో ఒకే ఒక వాక్యం నిరంతరం కదలాడుతోంది.

*“ప్రొఫెసర్ మీద పగ తీర్చుకోవడం ఎలా?”*

ఎన్నో రోజులు అలా గమ్యం లేకుండా తిరుగుతూనే ఉన్నాడు. అతడి బట్టలు సైతం మురికిపట్టి వేలాడసాగాయ్. చెప్పులు లేకుండా తిరగడం వల్ల కాళ్ళు వాచిపోయాయి. అయినా అతడు అవేం పట్టించుకునే మూడ్‌లో లేదు.

*చివరకు నిరాశనిస్పృహతో ఒకరోజు ఆబిడ్స్ ఫుట్‌పాత్‌పైన తిరుగుతుండగా అతడి సమస్యకు పరిష్కారం దొరికింది.*

◆ ◆ ◆

ఆ రోజు...

ఎప్పటిలా నిరాశగా, నిస్పృహగా ఫుట్‌పాత్ మీద నడుస్తున్నాడు అతడు.

ఆ రోజు ఆదివారం కావడం వల్ల దుకాణాలు మూసివేయబడ్డాయ్. పాత పుస్తకాల షాపువాళ్ళు ఫుట్‌పాత్ మీద పుస్తకాలు పెట్టుకొని అమ్ముకుంటున్నారు.

ఎప్పటిలా శూన్యంలోకి చూస్తూ నడుస్తున్నాడు. మరుక్షణం కాళ్ళకు ఏదో అడ్డం పడ్డట్లుగా నిలదొక్కుకోబోయి క్రింద పడ్డాడు అతడు.

ఆ పడటం పడటం ఫుట్‌పాత్‌ల మీద పాత పుస్తకాల మధ్య పడ్డాడు.

"బాజో హఠావో..." అంటూ విసుక్కున్నాడు పాత పుస్తకాలమ్మే వ్యక్తి.

అతడికి లేవడానికి ఓపిక కూడా లేదు. సర్వశక్తులూ కూడదీసుకుంటూ లేవబోయాడు. అతికష్టం మీద శరీరం పైకి లేస్తుండగా చేతికి అంటుకున్న పుస్తకం మీద పడింది అతడి దృష్టి.

ఆ పుస్తకాన్ని మొదట్లో అతడు పట్టించుకోలేదు. ఆ తర్వాత క్రమక్రమంగా అతడి కళ్ళు దాని మీదే ప్రసరింపబడ్డాయ్.

ఆ పుస్తకం పేరు –

**"ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సైంటిస్ట్‌లు – వారి ఆవిష్కరణల వెనకాల కష్టాలు"**

నెమ్మదిగా లేచిన అతడు ఆ పుస్తకాన్ని చేతిలో తీసుకున్నాడు. దాని మీద వెల చూశాడు. వెంటనే జేబులో చేయి పెట్టాడు. అదృష్టం. ఫ్యాంటు జేబులో శిథిలావస్థలో ఉన్న వంద రూపాయల నోటు దొరికింది. దానిని తీసుకొని ఆ పుస్తకాన్ని కొన్నాడు అతడు.

ఆ పుస్తకమే అతడి జీవితాన్ని మార్చివేసింది. అసాధ్యమైన అతడి పగని తీర్చుకోవడానికి సుసాధ్యం చేసింది. ఫలితంగా ప్రపంచంలోని కనివినీ ఎరగని అద్భుత ప్రయోగానికి దారితీసింది. ప్రపంచ చరిత్రలో ఇప్పటివరకూ సంభవించిన అద్భుతానికి నాంది పలికింది.

◆ ◆ ◆

కొన్ని కొన్ని పుస్తకాలు వ్యక్తుల జీవితాలనే ప్రభావితం చేస్తాయ్. కొన్ని కొన్ని గ్రంథాలు మొత్తం సమాజం రూపురేఖలనే మార్చివేసి నూతన సమాజాన్ని పునర్నిర్మిస్తాయ్.

అదే జరిగింది అతడి విషయంలో.

ఆ పుస్తకంలో వివిధ సైంటిస్ట్‌లు తాము కనిపెట్టిన వస్తువుల ముందు పడ్డ కష్టాలు హృదయవిదారంగా వివరింపబడ్డాయ్. అవే అతడిని కదిలించాయ్. అవే అతడిని పగతీర్చుకోవడానికి నాంది పలికాయ్. అవే ప్రపంచంలో ఆధునిక ఆవిష్కరణలో ఓ అద్భుతానికి దారి తీశాయి.

అతడి కళ్లు ఆ పుస్తకంలో విమానం కనిపెట్టిన 'రైట్ బ్రదర్స్ చరిత్ర' మీద పడ్డాయ్.

*పక్షిలా ఎగిరే విమానాన్ని కనిపెట్టాలని రైట్ బ్రదర్స్ ప్రయత్నాలు చేశారు. ఎంతోమంది హేళన చేశారు. కొందరు బహిరంగంగా తిట్టారు. కాని రైట్ బ్రదర్స్ మటుకు నిరాశపడలేదు. రోజుల తరబడి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.*

*వాళ్ళు తయారుచేసిన విమానం కొంత ఎత్తు ఎగిరి పడిపోయేది. తుదకు ఎంతో మంది ఇంజనీర్లను నియమించారు. అంతా చేతులెత్తేశారు తమ వల్ల కాదంటూ. అయినా రైట్ బ్రదర్స్ పట్టుదలను కోల్పోలేదు.*

*తుదకు వారి స్వప్నం సాకారమై విమానం గాలికి ఎగిరింది. ఈ రోజు ఎంతోమంది కేవలం గంటలోనే వేల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారంటే అది నాడు రైట్ బ్రదర్స్ కనిపెట్టిన నాటి ఆవిష్కరణ ప్రభావం అని చెప్పక తప్పదు. నేడు దేశవిదేశాలకు ప్రయాణమైపోతున్న ప్రతి వ్యక్తి ఒక్కసారైనా ఆ రైట్ బ్రదర్స్‌కు ధన్యవాదాలు చెప్పక తప్పదు.*

.... అతడి దృష్టి ఈసారి మేడమ్ క్యూరీ మీద పడింది. నోబుల్ ప్రైజ్‌ని రెండుసార్లు గెలుచుకున్న గొప్ప సైంటిస్ట్ ఆమె.

*ఆమెకు చిన్నప్పుడు కనీసం తినడానికి తిండి కూడా లేదు. ఆమె ఇంటికి తలుపులు లేవు. గాలి రాదు. కరెంటు లేదు. గ్యాస్ లేదు. తనకు దొరికిన చాలా తక్కువ ఆహారాన్ని తిని ఆకలికి తాళలేక స్పృహ తప్పిపోయేది కొన్నిసార్లు. అలాంటి ఆమె ఎలాగైనా ఈ ప్రపంచంలో నెంబర్‌వన్ సైంటిస్ట్‌గా ఎదగాలనుకుంది.*

*తుదకు రేడియం కనిపెట్టి సైన్స్ రూపురేఖలనే మార్చివేసింది. అంతులేని ఆత్మవిశ్వాసంతో కృషి చేసి నోబుల్ ప్రైజ్‌ని సంపాదించింది. చీకటి గదిలో తిండిలేక స్పృహ తప్పిపోయిన ఓ బాలిక... నేడు చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించబడ్డ గొప్ప సైంటిస్ట్.*

*ఈ కథ అంతటితో అయిపోలేదు. తన భర్తతో తిరిగి ప్రయోగాలు చేసి మరోసారి నోబుల్ ప్రయిజుని గెలుచుకుంది. అయితే ఆ ప్రయోగం తాలూకూ రేడియం దుష్ఫలితాలకు తనను తానే అర్పించుకోవాల్సి వచ్చింది. ఆ రేడియం తాలూకు ప్రభావం వల్ల ఆమె చనిపోయింది. తాను కనిపెట్టిన ఆవిష్కరణ తననే కబళించేసింది.*

.... అతడి కళ్ళమ్మట రెండు నీటిచుక్కలు నిండుకున్నాయి. కళ్ళు ఈసారి సైంటిస్ట్ ఎడిషన్ మీద పడ్డాయ్.

*పదివేలసార్లు తన ప్రయోగం విఫలమైనా విసుగు చెందక తిరిగి తన ప్రయత్నాన్ని కొనసాగించి ఎట్టకేలకు ప్రపంచానికే వెలుగు (ఎలక్ట్రిసిటీ) ప్రసాదించిన గొప్ప సైంటిస్ట్ థామస్ అల్వా ఎడిసన్. నేడు చకచకా కదులుతున్న ఫ్యాక్టరీ మెషిన్‌లు, రైళ్ళు, విమానాలు, హాస్పిటల్ ఆయన ఒకప్పుడు కనిపెట్టిన విద్యుచ్ఛక్తి చలువే!*

*ఒకసారి ఆయన ప్రయోగశాల మొత్తం ధ్వంసమైపోయింది. ఇంకొకరయితే ఆ దెబ్బకు కకావికలమైపోయేవారే! కాని ఆయన మటుకు అలా కాలేదు. పైపెచ్చు ఆ ప్రయోగం ఎలా చేయకూడదో మరోసారి తెలిసిందంటూ తిరిగి ఆ ప్రయోగాన్ని మొదట్నుంచి మొదలుపెట్టాడు. అదీ స్పిరిట్ అంటే!*

.... అతడు చేతులు కదిలి మరో పేజిని తిప్పాయి.

హెన్రీఫోర్డ్! అతడు బలీయమైన కోరికతో అమెరికా స్వరూపాన్నే మార్చాడు. అతడు దేశ ప్రజలందరిని 'కదిలే గది'కి నిదర్శనమైన కారులో కూర్చుండబెట్టి తన బలీయమైన కోరికని నిజం చేసుకున్నాడు.

అంతేనా... ప్రపంచ చరిత్రలో ఇంకెందరో సైంటిస్ట్‌లు ఉన్నారు. సమాజం ధిక్కరించినా, తోటివారు వెక్కిరించినా వెరువక తమ ప్రయోగాలు దీక్షగా, ఓ తపస్సులా మానవాళికి ఉపయోగపడేటట్లుగా చేస్తున్నవారు ఉన్నారు.

"ఇంపాసిబుల్! వైర్ లేకుండా శబ్దం రావడమా?" హేళన చేశారు మిత్రులు. సంభవమేనని నిరూపించాడు మార్కోని వైర్‌లెస్ కనిపెట్టి.

"భూమి గుండ్రంగా వుండి తన చుట్టూ తాను తిరగటమా? వాడికి పిచ్చెక్కింది, కొట్టండి, తన్నండి." అన్నారు విమర్శకులు. తుదకు భూమి గుండ్రంగానే ఉంటుందని నిరూపించాడు గెలీలియో.

... అవన్నీ చదివిన అతడికి ఒక్కసారిగా ఏదో కొత్త శక్తి వచ్చినట్లయింది. ఏదో చెయ్యాలన్న తపన మొదలయ్యింది.

ఈ ప్రపంచంలో ఒక మనిషి మీద పగ తీర్చుకోవాలంటే కేవలం బలవంతుడై ఉండాల్సిన అవసరం లేదు. దానికి డబ్బు, అధికారం, మందీ మార్బల్యమే అవసరం లేదు. ఎలాగైనా పగ తీర్చుకోవచ్చు.

సైన్స్‌ను, టెక్నాలజీని రెండు రకాలుగానూ ఉపయోగించుకోవచ్చు. అటు లోక కళ్యాణానికి, ఇటు వినాశనానికి ఉపయోగించవచ్చు. ఉదాహరణకు డైనమైట్‌ని కనిపెట్టిన ఆల్‌ఫ్రెడ్ నోబుల్ దానిని కొండలు పగలగొట్టి దారులు ఏర్పాటు చేయవచ్చని నిరూపించాడు. అదే సమయంలో దాని మానవ విధ్వంసానికి ఉపయోగించవచ్చునని నిరూపించాడు. అలాగే ఆటంబాంబుని అటు అణువిద్యుత్ కోసం ఇటు మానవజాతిని సమూలంగా నిర్మూలించడానికి ఉపయోగించవచ్చు.

అలాంటి సైన్స్, టెక్నాలజీల సాయంతో తాను సైతం ఏదోక కొత్తది కనిపెట్టి దాని సహాయంతో ప్రొఫెసర్‌ని నాశనం చేయడానికి ఉపయోగిస్తే?

ఆ ఊహ అతడి మస్తిష్కంగా కదలాడిన మరుక్షణం అతడి ముఖంలో మెరుపు ప్రత్యక్షమయ్యింది. తన పగ తీర్చుకోవడానికి కావాల్సిన ఆయుధం దొరికినట్లయింది.

ఒక్కసారిగా ఆ వూహ వస్తే చాలు, తెలివితేటలతో దానిని ఎలాగైనా అభివృద్ధి చేయగలడు. ఆ తర్వాత తన జీవితం వీధిపాలు చేసిన ఈ దగాకోరులను కుక్కని కొట్టినట్లు కొట్టగలడు.

ఆ వూహ మెదడులో మెరిసిన మరుక్షణం అతడిలో ఉత్సాహం పెల్లుబికింది. తాను ఏదోకటి కనిపెట్టి వారి అంతం చూడాలన్న తపన అతడిలో కదలాడింది.

ఆ వూహ అతడిలో కదలాడిన మరుక్షణం ఓ ప్రశ్న మొలకెత్తింది.

"ఏమి కనిపెట్టాలి?"

అవును! తాను ఏది కనిపెట్టాలి? తాను కనిపెట్టేది ఈ ప్రపంచంలో అద్భుతం, అరుదైనది, అనితర సాధ్యమైనది కావాలి. దాంతో పాటు అవతల వారి మీద దారుణంగా పగ తీర్చుకునేది కావాలి. అవతల ప్రొఫెసర్ చేసే ఆకృత్యాలు, రాసలీలలు ప్రత్యక్షంగా రికార్డు చేసే పరికరం ఒకటి కనిపెట్టాలి. ఎలా? అందుకు ఏం చెయ్యాలి? తన ఆలోచన నిజం కావాలంటే ఏం చెయ్యాలి?

ఆ క్షణం నుండి మొదలయ్యింది అన్వేషణ... శోధన... పరిశోధన...! ఏది కనిపెడితే ఆ దుష్టుల అంతం జరుగుతుంది? ఏ అద్భుతం కనిపెడితే ఆ దుర్మార్గుల ఆట కట్టవుతుంది?

అంతే! ఆ క్షణం నుండి అతడి మెదడులో ఆలోచనలు మొదలయ్యాయి. రక్తనాళాలు బ్రద్దలయ్యేలా నరాలు చిట్లేలా ఆలోచించసాగాడు. ఆ ఉద్రిక్తతలోనే

క్షణాలు నిమిషాలుగా, నిముషాలు గంటలుగా, గంటలు రోజులుగా, రోజులు నెలలుగా పరిణామం చెందసాగాయ్.

*సరిగా నాలుగు నెలల తర్వాత ఓ అద్భుతం మెరిసినట్లుగా, ఓ అపూర్వం ఉద్భవించినట్లుగా, ఓ అరుదైన సృష్టి ప్రాణం పోసుకున్నట్లుగా వెలువడింది. అతడి మెదడులో ఆ ఐడియా.*

ఈ శతాబ్దపు అద్భుతాలలో ఇంటర్‌నెట్ ఒకటి. ఇంటర్నెట్ ఆవిర్భావంతో ప్రపంచమే ఓ గ్లోబల్ పల్లెగా మారిపోయింది. వేల కిలోమీటర్ల దూరంలో వున్న వారికి క్షణకాలంలో లేఖలను రాసుకునే ఇ–మెయిల్ దగ్గర నుండి, ప్రపంచంలో ఏ విషయం మీదన్నా తెలుసుకునే సెర్చి ఇంజన్‌ల దాకా విస్తరించిపోయింది. అంతేనా, చాటింగ్ పేరుతో ప్రపంచంలో ఎవరితోనైనా, ఎంతమందితోనైనా అదే సమయంలో సంభాషించడమే కాదు, వెబ్‌కెమెరాల ద్వారా అవతల వారిని చూస్తూ యోగక్షేమాలు తెలుసుకోవచ్చు. కావాల్సిన ట్రైన్‌కు, బస్సుకు, పుణ్యక్షేత్రాలలో కాటేజీలకు ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకోవడమే కాక మనకు కావాల్సిన వస్తువుని కొనుగోలు చేయవచ్చు.

*అలాంటి అద్భుత గని ఇంటర్నెట్‌ని మించింది కనిపెట్టాలి.*

ఇంటర్నెట్ కేవలం ఇతర కంప్యూటర్లలోని సమాచారాన్ని మన కంప్యూటర్‌లోకి తీసుకుంటుంది. కాని విజన్‌నెట్ ఎన్నో వేల కిలోమీటర్లు గాలిని చీల్చుకుంటూ, గోడలను చేధించుకుంటూ ప్రయాణించి అక్కడ దృశ్యాలను ఓ లైవ్‌టీవీలా మనముందు ప్రదర్శింపచేస్తోంది. ఎక్కడో దూరంగా ఉండి ఓ నెంబర్‌కి సెల్‌ఫోన్‌లో నొక్కితే సమాచారం గోడలను దాటి ఇంట్లోకి వస్తున్నప్పుడు విజన్‌నెట్ ద్వారా కన్పించని కాంతిపుంజం లోపలికి పంపించి మొత్తం దృశ్యాలను లైవ్‌గా కన్పింపజేయడంలో తప్పేముంది? ఎక్స్‌రే, వైర్‌లెస్ సాధనలు, టెలిస్కోప్‌ల కలయికతో విజన్‌నెట్‌ని కనిపెట్టవచ్చు.

అలాంటి అద్భుత పరికరాన్ని తాను కనిపెట్టాలి. కనిపెట్టి ప్రపంచంలో జరిగే చీకటి మోసాలు, ఆకృత్యాలు బయటపెట్టాలి. ముఖ్యంగా కపిలవర్ధ యూనివర్సిటీ ప్రొఫెసర్ చేసే అకృత్యాలు బయటి ప్రపంచానికి వెలుగులోకి తీసుకురావాలి.

కేవలం వస్తువులను కాక ఎక్కడో దూరతీరాల్లో ఉన్న ఇళ్ళల్లో ఉన్న మనుషులు, వస్తువులు మనకు కనిపించే పరికరం ఒకటి ఉంటే ఎలా ఉంటుంది? అద్భుతాలు జరుగుతాయి.

పూర్వకాలంలో 'మాయాదర్పణం' అనే పరికరంలో ఒకనాటి వింతలు, భూమ్మీద జరిగే విశేషాలు దేవతలు తిలకించేవారు. అలాంటి పరికరం నేడు తను కనిపెడితే ప్రపంచం తనకు జేజేలు కొడుతుంది. ఎక్కడో దూరతీరాల్లో జరిగే దృశ్యాలను తాను కంప్యూటర్‌లో చూసేటట్లుగా ఏర్పాటు చేసుకుంటే... ఓహ్... ఇటీజే వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్!

ఆ వూహ అతడిలో కదిలిన వెంటనే అతడిలో ఎక్సయిట్‌మెంట్ అణువణువూ ఆక్రమించుకుంది. అయితే అంతటి అపూర్వమైన వస్తువుని తాను కనిపెట్టగలడా? అసలు తనకు అంత సామర్థ్యం ఉందా?

ఆ క్షణం నుండి అతడి కనురెప్ప మూయకుండా కష్టపడసాగాడు. ఆకలి దప్పులు సైతం మర్చిపోయాడు. ఫిజిక్స్, ఐటీ, నెట్ తదితర సబ్జెక్టుల్ని ఆకళింపు చేసుకోసాగాడు. నెట్ ఎలా పనిచేస్తుందో, ఐ.పి. అడ్రసుని బట్టి ఎలా కంప్యూటర్‌కు డేటా చేరుతుందో క్షుణ్ణంగా పరిశీలించాడు.

సహజంగా తెలివైనవాడు, దానికి తోడు విపరీతమైన హార్డ్‌వర్క్ చేయగలడు. అంతే కాకుండా దారుణమైన పగ, ప్రతీకారంతో దహించుకుపోతున్నాడు. దాంతో అతడి పట్టుదల రెట్టింపయింది.

ఆ పగ, పట్టుదలలోనే క్షణాలు నిమిషాలుగా, నిముషాలుగా గంటలుగా, గంటలు రోజుల్లో పరిణామం చెందసాగాయి.

సరిగ్గా ఆరు నెలలు గడిచేసరికి అతడి ప్రయత్నం కొద్ది కొద్దిగా సఫలమవసాగింది. మరో రెండు నెలల్లో అతడి ప్రయోగం ఫలితాలు ఇవ్వసాగింది. ఇంకో నెలలోనే అతడి కల సాకారమయ్యింది. **ప్రపంచ చరిత్రలోనే అత్యద్భుత ప్రయోగానికి నాంది పలికింది. మానవజాతి చరిత్రలోనే కనివినీ ఎరగని అద్భుతం జరగబోతోంది.**

◆ ◆ ◆

ఆతడి అంతరంగం ఆనందంతో ఉప్పొంగిపోతోంది. తన ప్రయోగం సక్సెస్ అయిందన్న ఆనందంతో అంతరంగం ఎగిరెగిరిపడుతోంది.

తన ప్రయోగాన్ని అమలు చేయడానికి అతడు ముందుగా ఓ అడ్రసుని ఎన్నుకొని కంప్యూటర్ మీద టైప్ చెయ్యాలి. అందుకోసం ఎవరి అడ్రసు టైప్ చెయ్యాలా అని ఆలోచిస్తూ ఎదురుగా టీవీ కేసి చూశాడు.

టీవీలో ప్రముఖ నటి మౌనికరాణి సినిమా వస్తోంది. భారతీయ సినీ రంగంలోనే మకుటం లేని రాణి ఆమె. ఇప్పుడు ఆమె ఏం చేస్తుంది?

మరుక్షణం అతడి చేయి కీబోర్డు మీద కంప్యూటర్ మీద టైప్ చేశాయి.

*మౌనికరాణి - 74, రాజీవ్‌స్ట్రీట్, ముంబాయి-4*

ఆ తర్వాత తన కంప్యూటర్‌ని తన దగ్గరున్న వండర్ మిషన్‌ని ఓ యుఎస్‌బి పరికరం ద్వారా కలిపాడు. ఆ తర్వాత గూగుల్ మ్యాప్‌లో ఆ అడ్రసుని అనుసంధానించాడు.

అప్పుడు... వండర్ మిషన్‌లో నుండి కాంతిపుంజాలు గూగుల్ మ్యాప్ ద్వారా సూచించిన ఆ అడ్రసు కేసి మెరుపువేగంతో ప్రయాణించసాగాయి. కేబుల్ వైర్ల ద్వారా ఆ కాంతిపుంజాలు లోపలికి వెళ్ళి అక్కడ దృశ్యాలను సినిమా తీస్తున్నట్లుగా రికార్డు చేయసాగాయి.

మరో క్షణం కాకముందే అతడి కంప్యూటర్‌లో దృశ్యాలు కనిపించసాగాయి.

*ప్రముఖ సినీతార మౌనికరాణి బెడ్‌రూమ్‌లో విస్కీ సిప్ చేస్తోంది. అర్ధనగ్నంగా ఉన్న ఆమెని కౌగలించుకొని ఉన్నాడు అతడు.*

*అతడు ఇవతల వేపు తిరిగేసరికి అతడి మొఖం స్పష్టంగా కనిపించింది.*

*అతడు... రక్షణ శాఖామంత్రి.*

*"డార్లింగ్!" మౌనిక దేవి కంఠం స్పష్టంగా వినిపిస్తోంది. "ఇవాళ నాకు మాఫియా డాన్ రంజన్ నుండి బెదిరింపు కాల్ వచ్చింది. అతడి సహచరుడు తీసే సినిమాలో నటించాలట. నాకు ఏమాత్రం ఖాళీ లేదు. అతడి సినిమాలో నటించకపోతే చంపేస్తానని బెదిరించాడు. ఇక మీరే నన్ను కాపాడాలి..."*

*"అతడి సంగతి మా పోలీస్ వాళ్ళ ద్వారా నేను చూసుకుంటాను..."*

*ఆ తర్వాత అక్కడ మూలుగులు, నిట్టూర్పులు, కేరింతలు వినిపించసాగాయ్.*

అతడు వాటిని చూడడం లేదు. తన ప్రయోగం సక్సెస్ అయిందన్న ఉద్వేగం అతడిని నిలువెల్లా ముంచేస్తోంది.

సాధించాడు! తాను ఈ శతాబ్దంలోనే అత్యద్భుత విజయాన్ని సాధించాడు. ప్రపంచంలో కనివినీ ఎరగని విజయాన్ని సాధించాడు. ప్రపంచంలో కనివినీ ఎరగని

ప్రయోగానికి నాంది పలికాడు. ఈ వండర్ మిషన్‌తో తాను ప్రపంచంలోనే కనివినీ ఎరగని అద్భుతాలు సాధించగలడు.

ఆ ఆలోచనల్లోంచి అకస్మాత్తుగా అతడికి గుర్తొచ్చాడు ప్రొఫెసర్.

మరుక్షణం అతడి దవడ కండరం బిగుసుకుంది. అతడి గొంతులోని రక్తనాళాలు ఉబ్బాయి. ఒక్కసారిగా బిపీ హెచ్చింది.

'ప్రొఫెసర్! నన్ను, నా అక్కను కాలరాసిన నీ జీవితానికి చరమాంకం పలకబోతున్నాను. నన్ను ఎంత హేయంగా నాశనం చేశావో, అంతే హేయంగా నిన్నూ ఈ వండర్ మిషన్ సహాయంతో నామరూపాలు లేకుండా చేస్తాను. ఈ ఒక్కరాత్రే నీవు సుఖంగా నిద్రపోయేది. రేపట్నుంచి నీకు కంటినిద్ర సైతం లేకుండా నాశనం చేస్తాను. దేశం దృష్టిలో పెద్ద మనిషిగా చెలామణి అవుతున్న నిన్ను కుక్క కంటే హీనంగా దెబ్బకొట్టకపోతే నా పేరు ఆర్య కాదు..."

ప్రజ్వరిల్లుతున్న ఓ నిప్పు కణికలా ఉన్నాడు అతడు ఆ క్షణాన....

◆ ◆ ◆

సరిగ్గా అదే సమయంలో అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ క్లాసునుండి బయటకు వచ్చింది సమీర.

ఆమెతో పాటు వచ్చిన మిగతా విద్యార్థినులు తమ బాయ్‌ఫ్రెండ్ వెంట రాగా వెళ్ళిపోయారు.

ఆ యూనివర్సిటీలో పిహెచ్.డీ. చేయాలని తండ్రిని ఒప్పించి మరీ వచ్చింది. వచ్చిన నెలరోజులకే హోమ్ సిక్‌నెస్ మొదలయ్యిందామెలో. దానికి కారణం ఒకటి తండ్రి కాగా, రెండవది ప్రియుడు ఆర్య. ఎప్పుడూ తాను తండ్రిని విడిచి ఉండలేదు. కాని ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీలో రీసెర్చి ఫెలోషిప్ రావడంతో తండ్రిని పట్టుపట్టి ఇందులో చేరింది. ఈలోగా ఆర్య పిహెచ్.డి. కూడా అయిపోతుంది. ఇద్దరూ కలిసి జీవితం పంచుకోవచ్చుకున్నారు. కాని ఏమయ్యిందో ఆర్య తనతో టచ్‌లో లేడు. ఈ యూనివర్సిటీలో జాయిన్ అయిన నెల రోజుల దాకా ఆర్య తనతో ఫోన్‌లో టచ్‌లో ఉండేవాడు. ఆ తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ అయిపోయింది. ఆ తర్వాత తండ్రిని అడిగితే అతడు అర్థాంతరంగా పిహెచ్.డి. మానేసి ఎటో వెళ్ళిపోయాడని, ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదని చెప్పారు. దాంతో తాను డిజప్పాయింట్ అయింది. రోజుల తరబడి ప్రయత్నించినా ఆర్య ఆచూకీ తెలియలేదు.

దాంతో చేసేది లేక మిన్నకుండిపోయేది. కాని అప్పుడప్పుడు అతడు గుర్తొచ్చినప్పుడల్లా మనసు వికలమైపోయేది. తాను, అతడు కలిసి తిరిగిన వెన్నెల రాత్రిళ్ళు, పచ్చిక బయళ్ళు గుర్తొచ్చేది. అతడు, తాను కలిసి చేసుకున్న బాసలు, భవిష్యత్ ప్రణాళికలు జ్ఞప్తికి వచ్చి మనసు భావురుమనేది.

ఎలాగూ ఇంకో మూడు నెలల్లో తన రీసెర్చి పూర్తయి ఇండియా వెళ్తుంది. అప్పుడే తాను అతడి అంతర్ధానం గురించి ఎంక్వయిరీ చేయవచ్చు. అసలు అతడెందుకు దూరంగా తప్పుకున్నాడో, తనకెందుకు ఫోన్ చేయలేదో నిలదీసి అడగవచ్చు. ఇలా తనకు తానే సమాధానం చెప్పుకొని ఆమె చదువులో మునిగేది. అతడి జ్ఞాపకాలు తప్పించుకోవడానికి ఆమెకు రీసెర్చి ఆయుధంగా పనికి వచ్చింది.

ఇంకో మూడు నెలలు... గడిస్తే చాలు. తాను స్వేచ్ఛజీవి అయిపోతుంది. ఆ తర్వాత ఇండియాలో తాను తండ్రిని కలుసుకుంటుంది. తండ్రిని చూసి చాలా రోజులయ్యింది. తల్లి లేని తనని అపురూపంగా పెంచిన తండ్రిని చూడాలనిపించేది. అయినా మనసు నిగ్రహించుకునేది. ఎంత ఇంకో మూడు నెలలు! ఆ తర్వాత తాను ఆయన సమక్షంలో చక్కగా ఉంటుంది. అలా తనకు తానే ఆమె సమాధానం చెప్పుకునేది.

***కాని జీవితంలో కనివినీ ఎరగని సంఘటనలు జరగబోతున్నాయని ఆ క్షణంలో ఆమెకు తెలియదు.***

◆ ◆ ◆

"బాస్టర్డ్ ప్రొఫెసర్ ధన్‌రాజ్"

అతడి పెదాలు కసితో ఉచ్చరిస్తున్నాయ్ ఆ పదాలను.

తనను, తన జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరి చేసిన అతడిని దెబ్బకొట్టాలి. తన కూతురుని ప్రేమించానన్న ఒకే ఒక కారణంతో తన జీవితాన్ని కాలరాసిన ఆ కిరాతకుడి మీద పగతీర్చుకోవాలన్న కాంక్ష అతడిలో నెలకొంది. తదనుగుణంగా కంప్యూటర్ మీద అతడి చేతులు వేగంగా కదుల్తున్నాయ్.

విజన్ నెట్ ద్వారా ప్రొఫెసర్ ధన్‌రాజ్‌ని ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా దెబ్బకొట్టి దేశ ప్రజల ముందు అతడిని ఛీ కొట్టించాలి. ఎన్నో రాత్రులు తనను నిద్రపోనీయకుండా టార్చర్ చేసిన ప్రొఫెసర్ మీద ఇంతకు ఇంతా తీర్చుకోవాలి. అతడికి నిద్ర అనేదే లేకుండా చేయాలి. సమాజంలో అతడిని జీవచ్ఛవం చేయాలి.

బ్రతుకంటేనే భయం కలిగేలా చేయాలి. అందుకే అతడు తన విజన్‌నెట్‌ని ప్రొఫెసర్ ఇంటి మీద ఎక్కుపెట్టడానికి సంసిద్ధుడయ్యాడు.

అతడు కంప్యూటర్‌లో ప్రత్యేకంగా డిజైన్ చేసిన స్క్రీన్‌ని ఓపెన్ చేశాడు. ఆ తర్వాత టైప్ చేశాడు.

*ప్రొఫెసర్ ధన్‌రాజు*

*24, ఫస్ట్ లైన్,*

*కపిలవర్ధ యూనివర్సిటీ,*

*కపిలవర్ధ దీవి.*

*గోసన్-2*

మరుక్షణం ఆ విజన్ తరంగాలను గూగుల్ మ్యాప్‌కు అనుసంధానం చేశాడు.

అంతే! విజన్ తరంగాలు గాలిని చీల్చుకుంటూ మెరుపువేగంతో వేల కిలోమీటర్లు ప్రయాణించి కపిలవర్ధ నగరంలోని ఆ యూనివర్సిటీ లోపలికి ప్రవేశించాయి. అక్కడ గోడలను చీల్చుకుంటూ ఆగాయి.

ఇప్పుడు ఆ యూనివర్సిటీ బిల్డింగ్ కంప్యూటర్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. అతడి చేయి మౌస్ మీద కదిలింది. తదనుగుణంగా ఒకో గదిని ముందుకు లాగి ప్రొఫెసర్ పర్సనల్ రూమ్ దగ్గర ఫోకస్ చేశాడు.

ఇప్పుడు ఆ రూమ్‌లో ప్రతి వ్యక్తి ఆ వస్తువు అంగుళం అంగుళం క్లియర్‌గా కనిపించసాగాయ్.

అది ప్రొఫెసర్ పర్సనల్ రూమ్. ప్రొఫెసర్ వళ్ళో కూర్చొని ఉంది ఒక యువతి. ఆపిల్‌పండులా నిగనిగలాడుతూ వున్న ఆమె భుజాలను ప్రొఫెసర్ చేతులు ఆబగా తడుముతున్నాయ్. ఆ యువతి అతడి చర్యలకు పరవశిస్తున్నట్లుగా నటిస్తోంది.

"సార్! నా పిహెచ్.డి. ఎప్పుడు అవుతుంది?"

"త్వరలోనే. నీవు నాకు ఎంత బాగా సహకరిస్తే అంత త్వరగా అవుతుంది" ప్రొఫెసర్ ఆమె గుండెల్లో ముఖం దాచుకున్నాడు.

"ప్లీజ్ సార్! త్వరగా చేయండి నా పిహెచ్.డి. మీరు ఎలా కావాలంటే అలా నన్ను వాడుకోండి. కానీ నా డాక్టరేట్ త్వరలో వచ్చేటట్లుగా చూడండి..."

"అంత తొందరెందుకు? ఇప్పటికే నేను నీలాంటివాళ్ళవి దాదాపు యాభై పిహెచ్.డి.లు పూర్తి చేశాను. తెలుసా?"

"వాళ్ళంతా ఇలాగే కోపరేట్ చేసేవారా సార్?"

"ఇంకా బాగా చేసేవారు. అందుకే వాళ్ళ థీసిస్‌లు అన్నీ నేనే రాయించాను. అన్నట్లు నీకో విషయం తెలుసా? లాస్ట్ టైమ్ తనీయా అనే యూపీ అమ్మాయి వచ్చింది. ఆ అమ్మాయికి ఇంగ్లీషులో లీవ్‌లెటర్ రాయడం కూడా రాదు. అయినా ఆ అమ్మాయి థీసెస్ మొత్తం నేనే రాయించి డాక్టరేట్ ఇప్పించాను తెలుసా?"

"మైగాడ్" ఆశ్చర్యం ఆమెలో "మరీ అంత నాలెడ్జి లేని వారిని మీరెందుకు ఎంకరేజ్ చేస్తున్నారు సార్? రేపు వైవాలో ప్రశ్నలు అడిగితే ఏం జవాబులు చెపుతోంది?"

"వైవాలో అడిగే ప్రొఫెసర్లంతా నా పేరు చెబితే అటోమాటిక్‌గా మార్కులు వేసేస్తారు. అదీ గాక వైవాలో అడిగే ప్రశ్నలు నేనే వారికి ముందుగా పంపిస్తాను. అవే ప్రశ్నలు వారు అడుగుతారు. వాటి జవాబులను నేను ముందుగా నా విద్యార్థుల చేత బట్టీ పట్టిస్తాను."

"రియల్లీ! యూ ఆర్ గ్రేట్ సార్! మీలాంటి ఇన్‌ఫ్లూయన్స్ ఉన్న గైడ్ దొరకడం నా అదృష్టం. అన్నట్లూ నా పిహెచ్.డి.లో ఎన్ని ఛాప్టర్లు రాశారు సార్?"

"అవన్నీ పక్కన బెట్టు! నా దగ్గర శాంపిల్ పిహెచ్.డి.లు పాతిక రెడీగా ఉన్నాయి. ఏదోకటి చుట్టేస్తాను కదా.." ఆమె లిపిస్టిక్ పెదాల మీద పెదాలు ఆనించాయి ప్రొఫెసర్.

ఆమె అతడి మొఖాన్ని దగ్గరకు తీసుకొని గాఢంగా చుంబించింది.

"ఈ వయసులో కూడా మీకు కోరికలు తగ్గలేదు సార్! చాలా హాట్‌గా ఉన్నారు"

"నీకు తెలుసా?" గర్వంగా కదిలింది ప్రొఫెసర్ కంఠం "మా ఆవిడ పోయిన తర్వాత నేను దాదాపు రెండు వందల మందిని ఇలాగే వాడుకున్నాను. ఇప్పటికే నా పటుత్వం తగ్గలేదని అమ్మాయిలు అనుకుంటుంటారు."

"నిజం సార్... అబ్బా ఏం అదరగొడుతున్నారు సార్..." పరవశిస్తూ కదిలాయ్ ఆమె పెదాలు" మీ ముందు నా బాయ్‌ఫ్రెండ్ కూడా వేస్ట్ సార్."

ప్రొఫెసర్ కళ్లు వింతగా మెరిశాయ్. "సార్! ఆడవాళ్ళని ఇలా వాడుకుంటారు. మరి మగవాళ్ళను ఎలాసార్?"

"వెరీ సింపుల్! వాళ్ళ దగ్గర బాగా డబ్బుంటే పిహెచ్.డి.కి లక్ష తీసుకుంటాను. డబ్బు లేని వారయితే వాళ్ళ గర్ల్‌ఫ్రెండునో, ఎవరినో ఒకరిని నా దగ్గర తీసుకొచ్చి నన్ను రంజింపచేస్తారు..."

"అవునా? నా క్లాసుమేట్ ఒకతడు కోటీశ్వరుడు. బ్లాక్‌మనీ చాలా ఉంది. అతడికి పిహెచ్.డి చేసి పెట్టేవారు కావాలన్నారు. మీ దగ్గరకు తీసుకొస్తాను సార్.."

"ఒకే డన్! కాని బాగా డబ్బున్న వాడంటున్నావు కదా! ఐదు లక్షలు ఇవ్వమను. అతడు ఇక్కడకు రాకుండానే నేనే మొత్తం చేసి పెడతాను."

"అలాగే సార్..." కిలకిల నవ్వుతూ ప్రొఫెసర్ చేతిని తన నడుం మీద వేసుకుంది మరింత రెచ్చగొడుతూ "సార్! మీరు ఇన్ని పనులు చేస్తున్నారు కదా! అదే అర్హత లేని వారికి సాయపడుతున్నారు కదా! మీకేం భయం లేదా?"

"భయమా?" నవ్వాడు ప్రొఫెసర్" యూనివర్సిటీ థీసిస్‌లను కొలమానం చేసే పరికరం ఇండియాలోనే లేదు. పిహెచ్.డి. అంటే జస్ట్ గైడ్ ఒకే చేస్తే చాలు, అయిపోతుంది. అంత సింపుల్! పైగా నా జోలికి రావడానికి ఎవరికి గుండెలు లేవు. మా తమ్ముడు ప్రైమ్ మినిస్టర్. అందువల్ల నా జోలికి ఎవరూ వచ్చే అవకాశం లేదు. అందుకే యూజీసీ సైతం నాకు స్వతంత్ర స్వయంప్రతిపత్తిగల ఈ కపిలవర్ధ యూనివర్సిటీకి గుర్తింపు ఇచ్చింది."

ఆ అమ్మాయి నోరు ఆశ్చర్యంతో పెద్దదైంది. తన ఎదురుగా ఉన్న ప్రొఫెసర్ మామూలు మనిషి కాదని, దేశంలోనే అత్యంత పరపతి ఉన్న వ్యక్తిని ఆమెకు అర్థమైంది. అర్థమైన మరుక్షణం ఆమె రెచ్చిపోయింది అతడిని మరింత కవ్విస్తూ.

ఆ తర్వాత అక్కడ జరిగేదంతా స్వేచ్ఛ ప్రళయం. వాత్సాయనుడు సైతం విస్తుపోయేటట్లుగా వారిద్దరు ఒకరినొకరు కవ్వించుకున్నారు. తన్మయత్వంతో ఊగిపోయారు. వారి పెర్వర్షన్‌కి రెక్కలు వచ్చి ఇష్టం వచ్చినట్లుగా ఆడుకున్నారు.

జరిగిందంతా తన కంప్యూటర్‌లో చూస్తున్న ఆ దృశ్యాలను రికార్డు చేస్తూ కదిలింది ఆర్య చేయి. 'ప్రొఫెసర్! ఇప్పుడు నీ గుట్టు కొంతవరకూ రట్టయింది. పిహెచ్.డి. థీసెస్‌లను కాపీ చేయిస్తూ ఆడపిల్లల జీవితాలతో ఎలా ఆడుకుంటున్నాడో లైవ్ కాస్ట్‌లా దృశ్యాలు సౌండ్‌తో సహా రికార్డు చేశాను. ఇప్పటివరకూ నాటకంలో మొదటి అంకం పూర్తయ్యింది. ఇంకో రెండు అంకం కోసం తెర తెరిచి పెట్టాను.

నీవు ఎప్పటికి చిక్కుతావో అప్పటిదాకా కంటికి రెప్ప కూడా వేయకుండా ఇలాగే చూస్తాను. దట్సాల్!'

◆ ◆ ◆

తన నాటకంలో రెండవ అంకం కోసం ఎదురుచూసిన ఆర్యకు ఆ సమయం రానే వచ్చింది

కంటికి రెప్పవాల్చకుండా ప్రొఫెసర్ ఇంటి మీదే విజన్ నెట్‌ని ఎక్కుపెట్టిన ఆర్యకు ఆ క్షణం వచ్చింది.

ఆ రోజు రాత్రి కపిలవస్థ యూనివర్సిటీ క్యాంపస్‌లో అంతా నిద్రలో ఉన్నారు. ఒకే ఒక్కరు తప్ప. అతడే ప్రొఫెసర్ ధన్‌రాజ్.

సమయం రాత్రి పన్నెండవుతోంది. ప్రొఫెసర్ ధన్‌రాజ్ తన పర్సనల్ రూమ్‌లో బెడ్ క్రిందున్న నేలమాళిగపై నున్న చెక్కను తీశాడు. ఆ తర్వాత అందులో ఉన్న లక్షలాది రూపాయలను, బంగారాన్ని బయటికి తీశాడు.

చూస్తున్న ఆర్య అలర్ట్ అయ్యాడు. వెంటనే తన కంప్యూటర్‌లో ఆ దృశ్యాన్ని క్లోజప్‌లో రెండు రెట్లు పెద్దది చేశాడు.

ఆ గదిలో ప్రొఫెసర్ మొత్తం డబ్బుని కుప్పలు కుప్పలుగా పోశాడు. తర్వాత నెమ్మదిగా లెక్కపెట్టసాగాడు.

అన్నీ వెయ్యి రూపాయల నోట్లే! కనీసం అవే వెయ్యి కట్టలపైనే ఉంటాయి. అంటే దాదాపు పది కోట్లు. ఆ తర్వాత బంగారం బిస్కెట్లు. ఒకో బిస్కెట్ కిలోకు పైనే ఉంటుంది. అలాంటివి దాదాపు వంద పైనే ఉన్నాయి. ఇవి కాక వివిధ కంపెనీ షేర్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు. వీటిలో ఎక్కువగా బినామీ పేర్లలో ఉన్నాయి.

మొత్తం మీద అన్నింటి విలువ యాభై కోట్ల పై మాటే.

... చూస్తున్న ఆర్య కనుబొమ్మ ముడివడింది. మైగాడ్! ఇదంతా అక్రమ సంపద! ఇంత సొమ్ముని ఇతడు ఎంత సునాయాసంగా దాశాడు. దీని మీద ఇన్‌కంటాక్స్ కట్టలేదు. అంతా నల్లడబ్బే! యుజీసీ ఇస్తున్న ఫండ్స్ అంతా కైంకర్యం చేసుంటాడు. అదీగాక పిహెచ్.డి చేయిస్తానని డబ్బున్న విద్యార్థుల దగ్గర లక్షలు లక్షలు వసూలు చేశాడు. దీని మీద టాక్స్ కట్టి ఉండడు. అదీగాక ఇది అక్రమ సంపాదన.

... ఆ దృశ్యాలను రికార్డు చేస్తూ కదిలింది మౌస్ మీద ఆర్య చేయి. 'దొరికావు ప్రొఫెసర్! నా చేతికి రెడ్‌హ్యాండ్‌గా దొరికావు ప్రొఫెసర్! ఈ వివరాలను ఇన్‌కంటాక్స్ వారికి, యూజీసీకి, ప్రెస్‌కు లీక్ చేస్తే నీ పరువు సగం పోతుంది. కాని నన్ను, నా అక్కను పూర్తిగా పతనం చేసిన నీకీ శిక్ష చాలదు. ఇంకా సాక్ష్యాలు సంపాదించి నడిబజారులో నీ బండారం బయటపెట్టకపోతే నేను బ్రతికి ఉపయోగం లేదు. ఇంకొకసారి ఈ విజన్ నెట్‌ను నీ మీద ఫోకస్ చేస్తాను. ఈసారి ఇంకా పసందైన దృశ్యం లభిస్తుంది. అప్పుడే నీ జీవితానికి చరమాంకం పలుకుతాను దట్సాల్.

◆ ◆ ◆

ప్రొఫెసర్‌ని దెబ్బకొట్టడానికి ఆఖరి అంకం కోసం ఎదురు చూడసాగాడు ఆర్య. అప్పటిదాకా ప్రొఫెసర్ జరిపిన రాసలీలలు చిత్రీకరించాడు. ఆ తర్వాత యూజీసీని, పిహెచ్.డి. విద్యార్థుల నుండి సేకరించిన నల్లడబ్బు వివరాలు తెలుసుకున్నాడు. కాని ఈ రెండు చాలవు. ప్రొఫెసర్ పరువు పూర్తిగా తీయాలి. తీసి దేశ ప్రజల ముందు దోషిగా నిలబెట్టాలి. అందుకే ఆఖరి అంకం కోసం చూస్తున్నాడు దీక్షగా కంప్యూటర్ కేసి.

ఆ సమయం సైతం మెరుపువేగంతో రానే వచ్చింది. ప్రొఫెసర్‌కి ఆ సంవత్సరం ఐఐటీ పేపర్‌ని సెట్ చేసే అవకాశం వచ్చింది. రూల్స్ ప్రకారం ఐఐటీ పేపర్‌ని అత్యంత భద్రతాదృష్టితో చేయాలి. చీమైనా దూరని గదిలో, ఎవరికీ తెలియకుండా సెట్ చేసి కంప్యూటర్‌లో ఉంచి ఐఐటీ ఎంట్రన్స్ సెంటర్‌కి పంపాలి. ఆ పేపర్‌ని కంప్యూటరే టెక్నికల్‌గా పరిశీలించి ఒకే చేశాక, దానిని ఆన్‌లైన్‌లో ఉంచుతుంది. దానిని పరీక్ష రోజు విద్యార్థులందరికీ రిలీజ్ చేస్తాడు.

అలాంటి అత్యంత కట్టుదిట్టాల మధ్య ప్రొఫెసర్ ఐఐటి పేపర్‌ని సెట్ చేస్తున్నాడు. ఒక్కో ప్రశ్నను జాగ్రత్తగా టైప్ చేస్తున్నాడు. ఆ పేపర్‌ని చూస్తున్న ఆర్య చేతులు కదుల్తున్నాయ్ దానిని కంప్యూటర్‌లో రికార్డు చేస్తూ.

క్షణాలు కదుల్తున్నాయ్. పేపర్ సెట్ చేసిన తర్వాత ప్రొఫెసర్ వళ్లు విరుచుకున్నాడు. ఆ తర్వాత తృప్తిగా బయటకు వచ్చాడు. ఆ పేపర్‌నే చూస్తున్న ఆర్య మెదడులో చివరి అంకం రూపుదిద్దుకుంది.

మర్నాడు అన్ని టీవీ ఛానళ్ళకు రకరకాల సీడీలు అందాయి. టీవీ ఛానళ్ళు ముందు వాటిని పట్టించుకోలేదు. కాని ఒకసారి చూశాక అవి ఎంత సంచలనం సృష్టించగలదో అర్థమైంది. వెంటనే వాటిని టెలికాస్ట్ చేశారు.

## ఐఐటీ ఎంట్రన్స్ పేపర్‌ని అమ్ముకున్న ప్రొఫెసర్

ప్రతి సంవత్సరం ఐఐటీ పేపర్‌ని అత్యంత గోప్యంగా సెట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈసారి ఆ పేపర్‌ని ప్రొఫెసర్ ధన్‌రాజ్‌కి ఇచ్చారు. ఆయన ఆ పేపర్‌ని సెట్ చేస్తూ బయటికి లీక్ చేశారు. ఒక్కో విద్యార్థి దగ్గర పాతిక లక్షలు వసూలు చేస్తూ ఆ పేపర్‌ని వారికి అందించారు. ఒక్కో విద్యార్థి దగ్గర పాతిక లక్షలు వసూలు చేస్తూ ఆ పేపర్‌ని వారికి అందించారు. ఇదిగో వారు లీక్ చేసిన ఐఐటీ పేపర్...

అంటూ మొత్తం పేపర్‌ని ఆ టీవీ ఛానల్ ప్రదర్శించింది.

షాక్ మీద షాక్, దాని వెనకాల మరొకటి తగిలినట్లుగా దిగ్భ్రాంతికి లోనయ్యారు అంతా. ఓ మైగాడ్! ఇంత మోసమా! ఐఐటీ ఎంట్రన్స్ పేపర్‌నే లీక్ చేసుంటాడంటే ఇతడెంతో అవినీతిపరుడో, సమాజానికి పట్టిన చీడలాంటివాడోనని గుసగుసలు మొదలయ్యాయి.

ఆ కలకలంలోనే ఆ పేపర్‌ని కొన్న విద్యార్థులు ఏడుపు మొహంతో ప్రొఫెసర్ తమ దగ్గర ఎంతెంత డబ్బు తీసుకున్నారో టీవీ ఛానళ్ళలో చెబుతున్నారు.

ఇదలా ఉండగా ఇంకో టీవీ ఛానల్ మరో హాట్‌న్యూస్‌ని ప్రదర్శించింది.

**ప్రధాని సోదరుడి భాగోతం**

దొంగ పిహెచ్.డి.లతో ప్రధాని అన్న ప్రొఫెసర్ ఇంతకాలంగా ఆడుతున్న నాటకం బట్టబయలైంది. లక్షలకు లక్షలు డబ్బు తీసుకొని కాపీ పిహెచ్.డి.లు చేసి పడుతున్న వైనం బయటపడింది.

అంటూ దాని క్రిందే ప్రొఫెసర్ అమ్మాయిలతో రాసక్రీడలు జరుపుతున్న దృశ్యాలు వేడివాడిగా ప్రదర్శింపబడుతున్నాయి. తమ పిహెచ్.డి.ల కోసం ఆ అమ్మాయిలు ప్రొఫెసర్‌కు లొంగిపోయిన దృశ్యాలు సైతం ఒక దాని వెనకాల మరొకటి వెలువడుతున్నాయ్.

మామూలుగా అయితే ఇది చాలా చిన్న వార్త. కాకపోతే ప్రొఫెసర్ స్వయాన ప్రధాని అన్న కావడంతో ఈ వార్త సంచలనం సృష్టించింది.

అదే సమయంలో మరో టీవీ ఛానల్‌లో మరో సంచలన దృశ్యం ప్రత్యక్షమైంది.

**యూజీసీని, విద్యార్థులను మోసం చేసి కోట్ల నల్లడబ్బుని కూడగట్టుకున్న ప్రొఫెసర్.**

*ప్రొఫెసర్ మంచం క్రింది నేలమాళిగలో కోట్ల కోట్ల డబ్బులు దాయబడ్డాయి. ఈ డబ్బంతా ప్రాజెక్టుల కోసం యూజీసీని మోసం చేసి కూడగట్టుకున్న ధనం... అంటూ తన బెడ్ మీద ప్రొఫెసర్ డబ్బు లెక్కబెడుతున్న దృశ్యాలను ప్రసారం చేశాయి.*

ప్రజలలో దిగ్భ్రాంతి. వారిలోనే కాదు, ప్రధానిలో, మంత్రిమండలిలో, ఎంపీలలో సైతం దిగ్భ్రాంతి. అసమ్మతి సభ్యులైతే అప్పటికప్పుడే దీని మీద సిబిఐ దర్యాప్తు చేయించాలని పట్టుపట్టాయి. అసలు ఆయన రాసలీలలు, నల్లడబ్బు దాచుకున్న విధానం కనిపిస్తుంటే ఇంకా ప్రత్యేకంగా సిబిఐ ఎంక్వయిరీ కూడా అనవసరమని, ప్రొఫెసర్‌ని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రతిపక్షాలు, మహిళామండలులు ధర్నాలు మొదలుపెట్టాయి.

వాటినన్నింటిని చూస్తున్న యూజీసీ ఛైర్మన్‌లో దిగ్భ్రాంతి. ఆయనలోనే కాదు మానవవనరుల శాఖామంత్రిలో కూడా. ఇప్పుడు తాము చర్య తీసుకోకపోతే తమకు మచ్చని అర్థమైంది. వెంటనే చర్య కోసం పోలీస్, సిబిఐలను అభ్యర్థించాడు. ఇందుకు ప్రధాని కార్యాలయం సైతం అభ్యంతరం పెట్టలేదు. దాంతో పోలీస్, సిబిఐ, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లు కదిలాయ్... కపిలవర్ణ యూనివర్సిటీకేసి.

◆ ◆ ◆

సరిగ్గా అదే సమయంలో –

తన గదిలో రకరకాల టీవీ ఛానళ్ళు ప్రదర్శిస్తున్న దృశ్యాలు చూస్తూ కుప్పకూలిపోయాడు ప్రొఫెసర్.

మైగాడ్! ఎవరు ఈ పని చేసింది? తన యూనివర్సిటీలో అందులో తన పర్సనల్ ఛాంబర్‌లో జరిగే దృశ్యాలు ఎలా బయటికి వచ్చాయి? గాలి సైతం జొరబడని, చీమ సైతం చేరే లేని తన పర్సనల్ ఛాంబర్ దృశ్యాలను ఓ సినిమాలా ఎవరు బయటకు చేరవేసింది? ఎవరు ఈ పనిచేసింది? తనను, తన జీవితాన్ని శిథిలం చేసింది ఎవరు? ఎవరు తన మీద పగ పట్టింది?

సరిగ్గా అదే సమయంలో తన పర్సనల్ ఫోన్ నెంబర్ మ్రోగడంతో ఈ లోకంలోకి వచ్చాడు ప్రొఫెసర్.

"హల్లో ధన్‌రాజ్" వంకర నవ్వు ఫోన్‌లో.

"ఎవరు? ఎవరు మీరు?"

"ఆర్యా... గుర్తున్నానా? ఒకప్పుడు నీ స్టూడెంట్‌ని నేను. నా పిహెచ్.డి. కలని నాశనం చేశావు. నా అక్క శీలం పోవడానికి నీ యూనివర్సిటీయే కారణం. ఆనాటి ఆర్యని".

"నీవా... ఇన్నాళ్ళ తర్వాత?"

"అవునురా... నీ మీద పగ తీర్చుకోవడానికే ఇన్నాళ్ళూ ఓపిక పట్టాల్సి వచ్చింది. నీ కూతురు నన్ను ప్రేమించిందన్న ఒకే ఒక్క కారణం చేత నా కెరీర్‌ని నాశనం చేశావు. పైగా కళ్ళు లేని అమాయకురాలైన మా అక్క సైతం రేప్ కావడానికి కారణం నీవే... నీవేరా బాస్టర్డ్... అందుకే నిన్ను నాశనం చేయడానికేరా ఇన్నాళ్ళూ వేచి ఇప్పుడు అవకాశం దొరికాక టీవీ ఛానళ్ళు ద్వారా నీ బండారం బయటపెట్టాను."

"ఇది అన్యాయం.."

"ఏది అన్యాయంరా? నేను నీ కూతురిని ప్రేమిస్తే నీకు ఇష్టం లేకపోతే చెప్పాలి కాని నీ కూతురిని ఫారిన్ పంపించి ఇక్కడ నన్ను, నా కుటుంబాన్ని నాశనం చేయడం అన్యాయమా? పైగా నేను చేసింది కేవలం నీ నిజస్వరూపం బయట పెట్టడమేగా! మామూలుగా అయితే ప్రధాని తమ్ముడైన నీ మీద చర్యలు తీసుకోవడం అసంభవం. అందుకే వీడియో దృశ్యాలతో సహా వీటిని తీసి టీవీ ఛానళ్ళకు ఇచ్చాను..."

"ఇదంతా ఎలా... ఎలా చేశావు? నా రూమ్‌లో కనీసం సిసి కెమెరా కూడా లేదు. గదిలోకి ఎవరూ రాలేదు. ఎలా ఎలా చేశావు?" బేలగా కదిలింది ప్రొఫెసర్ కంఠం.

"అదంతా నీకు అనవసరం. ఇప్పుడు నీ మీద ప్రత్యక్ష ప్రసారాలు దేశంలో అన్ని ఛానళ్ళలో ప్రదర్శింపబడుతున్నాయి. ఇప్పుడు ప్రధాని కాదు కదా, ఎవరూ నిన్ను కాపాడలేడు. అంత స్పష్టంగా ఉన్నాయి దృశ్యాలు. దీనితో నీ పరువు మొత్తం పోయింది. ఇక ఈ జీవితమంతా కుళ్ళి కుళ్ళి ఏడవాల్సిందే! అన్నట్లూ నీ కోసం సిబిఐ, పోలీస్, ఐటీ డిపార్ట్‌మెంట్ బయలుదేరాయి చూసుకో..... ఇక ఈ కుంభకోణాల్లోంచి నిన్ను బయటపడేయడం ఎవరి వల్లా కాదు, ఆఖరికి నిన్ను పుట్టించిన భగవంతుడి వల్ల కూడా కాదు.... బైది బై..." మరుక్షణం ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

ప్రొఫెసర్ మొఖమంతా చెమట్లు పట్టాయి. పరువు! మొత్తంపోయింది. నిన్న మొన్నటి దాకా తాను ఓ వెలుగు వెలిగాడు. ఈ రోజు దేశమంతటా అసహ్యించుకునే పరిస్థితి తెచ్చుకున్నాడు. ఇక నుండి ఎగతాళ్ళు, హేళనలు, అవమానాలు మోయాలి.

సిబిఐ మంత్రులను పంపించినట్లే తనను జైలుకు పంపిస్తుంది. ఇంత అనుమానం జరిగాక తాను బ్రతికి ఉండి ఉపయోగం లేదు. పరువు మొత్తం పొయ్యాక ప్రాణం ఉన్నా లేకపోయినా ఒకటే.

అప్పుడు గుర్తొచ్చింది అతడికి కూతురు. ఏ కూతురు సుఖం కోసం చేశాడో ఆ కూతురి ప్రియుడే తనని ఈ నరకకూపంలోకి నెట్టాడు. తాను మరణించినా ఫర్వాలేదు. కాని తన కూతురు మటుకు ఆ ఆర్యగాడిని ప్రేమించడానికి వీల్లేదు.

మరుక్షణం ప్రొఫెసర్ కంప్యూటర్‌లో కూతురుకు ఇ–మెయిల్ టైప్ చేయసాగాడు.

క్షణాలు గడుస్తున్నాయ్ ఆ ఉద్వేగంలోనే.

టైప్ చెయ్యడం ముగిసిన తర్వాత మొఖాన పట్టిన చెమట్లు తుడుచుకుంటూ ఎదురుగా కంప్యూటర్‌లో కనిపిస్తున్న సిసి కెమెరాకేసి చూశాడు.

ఆ బిల్డింగ్ ఎంట్రన్స్ దగ్గర లోపలికి వస్తూ కనిపించాయ్ సిబిఐ, పోలీస్, ఐటీ శాఖ తాలూకు వాహనాలు.

'ఓహ్! తనని అరెస్టు చేయడానికి వచ్చేశాయ్' నిర్లిప్తంగా అనుకుంటూ డ్రాయర్‌లో నుండి ఓ సీసా తీశాడు.

అది జక్టేనియా అనే భయంకర విషం. ఒక చుక్క నోట్లో వేసుకుంటే పది క్షణాల్లోనే మనిషి ప్రాణం పోతుంది.

అతడు ఆ విషాన్ని గ్లాసులో వేసుకొని గొంతులో పోసుకున్నాడు. గొంతంతా భగ్గున మండింది.

'గుడ్‌బై సమీరా' ఆఖరిసారిగా కూతురుని తలుచుకున్నాడు. శరీరంలోని ఒక్కో భాగంలో ప్రాణం పోతున్న భావన.

*మరో రెండు క్షణాల్లో అతడి శరీరంలో ఊపిరి ఆగిపోయింది.*

◆ ◆ ◆

## 4

ఈ సంఘటన జరిగిన మరో నాలుగు గంటల తర్వాత....

న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో ఇండియా వెళ్లే ఫ్లయిట్‌లో వడివడిగా ఎక్కింది సమీర.

ఆమె ముఖంలో కన్నీళ్ళు. ఆ కళ్ళ నీళ్ళ మధ్య తండ్రి రూపం గుర్తొస్తోంది.

తల్లి చిన్నప్పుడే పోవడం... దాంతో ఆయన మరో పెళ్లి చేసుకోకుండా తనని అనుక్షణం సాకడం... తాను తల్లి కోసం ఏడ్చినప్పుడల్లా తానే తల్లీ, తండ్రై తనకు బట్టలు వేయడం, సినిమాలకు, షికార్లకు తీసుకెళ్ళడం, రాత్రిపూట తన ప్రక్కనే పడుకోవడం... ఆమెకు గుర్తొచ్చాయి... తాను ఒకరోజు హఠాత్తుగా నిద్రలేచి చూస్తే తండ్రి లేడు. ఏమయ్యారా అని తాను ఆందోళనగా చూసింది. పక్క గదిలో తల్లి ఫోటో ముందు కూర్చొని ఆయన కన్నీళ్లు పెట్టుకొని ఏడవడం కన్పించింది. భార్య పోయిందన్న బాధ నుండి తప్పించుకోవడానికి ఆయన రీసెర్చిలో మునిగి తేలడం, ఆ రీసెర్చిలో పైకి రావడం, క్రమంగా రాజ్యసభలో టీచర్ల కోటాలో ఆయనని పార్టీ ఎంపీగా ఎన్నిక చేయడం చకచకా జరిగిపొయ్యాయి.

నిజానికీ తనకు రాజకీయాలంటే పడవు. రాజకీయాలలో వున్న బాబాయ్ (ప్రధాని) పరిస్థితి చూస్తే పగవాడికి కూడా ఆ పదవి వద్దన్న అభిప్రాయం కలిగింది. అటూ ఇంట్లో వారితో గడపడానికి సమయం లేకపోవడం, పోనీ పార్టీ కోసం కష్టపడితే ఒక్కరికీ కృతజ్ఞత లేకపోవడం, ఏదో ఒకటి కావాలన్న స్వార్థంతో ప్రతివారూ ఆశించడం... ఇంత చేస్తే ఆఖరికి ప్రజలకు సైతం ప్రధాని అన్నా, పార్టీ అన్నా చక్కటి అభిప్రాయం లేకపోవడం, వీటికి తోడు టెర్రరిస్టులు, మాఫియా ముఠాలు ఎప్పుడూ దాడి చేస్తాయా అన్న భయంతో నిరంతరం బ్లాక్‌క్యాట్ కమెండోస్ నీడలా ఉండడం... వావ్ ఇటీజ్ రియల్లీ హారిబుల్!

అందుకే తండ్రి రాజ్యసభకు నామినేట్ అయినప్పుడు తనకు ఇష్టం లేకపోయినా ఆయన ఆ పదవిలో ఉండి తల్లిని కొద్దిగానైనా మరచిపోతారేమోనన్న ఆశతో తాను మిన్నకుండిపోయింది. అదే చివరకు ఆయన మరణానికి దారితీసినట్లయ్యింది.

"ఎనీథింగ్ యూ వాంట్ మిస్?" ఎయిర్ హోస్టస్ ప్రశ్నతో ఈ లోకానికి వచ్చిందామె. వద్దన్నట్లుగా తల అడ్డంగా వూపిందామె. ఎయిర్ హోస్టెస్ వింతగా చూసింది. ఫ్లయిట్ బయలుదేరి పదిహేను గంటలు గడిచాయి. ఇంకో రెండు గంటల్లో న్యూఢిల్లీ వస్తోంది. ఈ అమ్మాయి ఇప్పటివరకూ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు. పోనీ తను పర్సనల్‌గా ఏదైనా తెచ్చుకొని తిన్నదా అంటే అదీ లేదు. ఫ్లయిట్ ఎక్కిన దగ్గరనుండి కళ్ళమ్మట నీళ్ళతో కనిపిస్తోంది.

చేసేది లేక ఎయిర్‌హోస్టెస్ అక్కడ నుండి కదిలి వెళ్ళిపోయింది. అప్పుడు సమీర తన ఎయిర్ బ్యాగ్‌లో నుండి ఒక లెటర్ తీసింది. అది తండ్రి తనకు ఇ-మెయిల్

ద్వారా పంపిన ఆఖరి ఉత్తరం. దానిని తను కంప్యూటర్‌లో ప్రింట్ తీసుకుంది. అప్పటికే ఆ ఉత్తరాన్ని తాను ఎన్నోసార్లు చదివింది. అయినా తండ్రి జ్ఞాపకాలు ఆ ఉత్తరంలో తిరిగి పదిలపరిచినట్లయింది.

ఆమె చేతులు కదిలి ఆ లెటర్ ప్రింట్‌ని ఓపెన్ చేశాయి.

**డియర్ సమీరా,**

ఎన్నో ఆశలతో, ఆశయాలతో నేను రాజ్యసభకు ఎన్నికైన విషయం నీకు తెలుసు. రాజకీయాలలో అడుగుపెట్టి నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనుకున్నాను. కాని నేనంటే పడని కొన్ని శక్తులు నా మీద పగపట్టి నన్ను అధోగతికి తీసుకొచ్చాయి.

*దీని అంతటికి కారణం ఎవరో తెలుసా? నీవు కోరి వలిచిన ఆర్య!*

అతడే నా మీద పగపట్టి ఈ పంతం సాధించాడు. మీ ఇద్దరి ప్రేమకు నేనేనాడు అడ్డుపడలేదు. పైగా అంగీకారం తెలిపాను. అతడి అంతస్తులో, ఆస్థిలో, హోదాలో మనతో సరిపోకపోయినా నీవు ఇష్టపడ్డావు అన్న ఒకే ఒక సత్యంతో నేను ఇష్టపడ్డాను.

కాని అతడేం చేశాడో తెలుసా? తన అక్కని ఎవరో రేప్ చేశాడన్న కోపంతో నన్ను పతనం చేశాడు. తన అక్కని ఆ రోజు గెస్ట్ హౌస్‌లో ఎవరో ఏదో చేస్తే దానికి నన్ను బాధ్యుడిని చేసి నా మీద దారుణంగా పగ తీర్చుకోవడానికి కంకణం కట్టుకున్నాడు. కాబోయే మామగారన్న కనీస గౌరవం లేకుండా నన్ను నడిబజార్లో నిలబెట్టి అవమానించాడు. దేశ ప్రజల ముందు నన్ను దోషిగా చేశాడు. పార్టీ ముందు, ప్రధాని ముందు నన్ను ఘోరంగా అవమానించాడు.

నేను ఎవరో అమ్మాయితో ఉన్నట్లుగా ట్రిక్ ఫోటోలు తీసి వాటిని పత్రికలకు, టీవీ ఛానళ్ళకు లీక్ చేశాడు. అంతేకాదు, నేను బ్లాక్‌మనీ పోగేసుకున్నట్లుగా లేని ఆధారాలు సృష్టించాడు.

అలా నన్ను ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా ఎంతో వేదనకు గురిచేశాడు. నా పరువూ ప్రతిష్ఠలు పూర్తిగా నేలపాలు చేశాడు. ఇక నేను బ్రతకడం వృథా అనిపించాడు. ఇక నాకేం మిగిలింది ఈ ప్రపంచంలో? అందుకే నేను తనువు చాలిస్తున్నాను.

*నాకు నేనే ఆత్మహత్య చేసుకుంటున్నాను.*

ఐయాం సారీ నిన్ను వంటరిదానిని చేసి వెళ్తున్నందుకు. పరువు మొత్తం పోయిన నేను ఇంకా బ్రతికి ఉపయోగం లేదు.

తల్లీ! నేను అసహాయుడిని, వృద్ధుడిని. ఆర్యని నేను ఎదుర్కోలేక తనువు చాలిస్తున్నాను. అశక్తుడయిన ఈ తండ్రిగా ఓటమి అంగీకరిస్తూ ఈ లోకం నుండి సెలవు తీసుకుంటున్నాడు. మళ్ళీ జన్మంటూ ఉంటే నన్ను ఇంతగా పరాభవించిన అతడి అంతూ తేలుస్తాను.

అమ్మా సమీరా! నాది ఒకటే కోరిక! ఆ ఆర్యలాంటి క్రిమినల్‌ని పెళ్ళి చేసుకుంటే నీ బతుకు కూడా వీధి పాలు చేస్తాడు. అతడిది క్రిమినల్ బ్రెయిన్. అతడి అణువణువూ విషం. అతడు ఈ సమాజం మీద, ప్రజల మీద పగబెట్టిన సైకోపాత్. అలాంటి వాడిని నీవు పెళ్ళిచేసుకోవద్దు. చేసుకుంటే నీ బ్రతుకుల సైతం చింపేసిన విస్తరి అవుతుంది.

కాబట్టి నేను చనిపోయేముందు నిన్ను ఒకే ఒక కోరిక కోరుతున్నాను. అది నేను ఎలాగూ పగతీర్చుకోలేకపోయాను. కనీసం నీవన్నా అతడి మీద పగతీర్చుకో. అలాంటి క్రిమినల్స్ ఈ సమాజంలో ఉంటే మొత్తం వ్యవస్థంతా విషమైపోతుంది. అందుకే నీకు వీలైతే అతడి మీద పగ తీర్చుకో. మన కుటుంబాన్ని అధోగతికి తీసుకెళ్ళిన అతడి మీద ప్రతీకారం తీర్చుకున్న రోజే పై లోకాన ఉన్న నా ఆత్మ శాంతిస్తుందని గుర్తుంచుకో.

అంత వరకూ సెలవ్ తల్లీ! మళ్ళీ జన్మంటూ ఉంటే నీ కడుపులోనే పుట్టాలని నా కోరిక.

గుడ్‌బై శాశ్వతంగా....

**నీ తండ్రి.**

ఉత్తరం చదివిన ఆమె కళ్ళంట తిరిగి నీళ్ళు తిరిగాయ్. ఆ కన్నీళ్ళు మధ్యలోనే ఆమె ముక్కుపుటాలు అదిరాయ్ కోపంతో. ప్రతిగా గొంతులోని రక్తనాళాలు ఉబ్బాయి. పిడికిళ్ళు బిగిశాయ్ పట్టుదలగా.

'వస్తున్నాను నాన్నా! నీ మరణానికి కారకులైన వారిని ఏమాత్రం వదలను. వారిని వెతికి వెతికి పగతీర్చుకుంటాను. నన్ను ఏకాకి చేసిన ఆర్యను ఏమాత్రం ఉపేక్షించను. ఇంతకు ఇంత తీర్చుకుంటాను. నీ సంవత్సరికం లోపలే అతడిని

ఉరికంబం ఎక్కిస్తాను. ఇది నేను ఓ తనయగా మీకిచ్చే కానుక నాన్నా...” ప్రతిజ్ఞ చేసుకుందామె మనసులో.

విమానం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ని సమీపిస్తోంది. ఆమె కన్నీళ్ళు తుడుచుకొని సీటుకున్న బెల్టుని బిగించుకుంది.

విమానం ఒక్క జర్క్‌తో రన్‌వే మీదకు దిగింది. ఆ తర్వాత జెట్‌స్పీడ్‌తో రన్‌వే మీద పరిగెత్తి ఎయిర్‌పోర్టు దగ్గర ఆగింది. ప్రయాణీకులు ఒక్కొక్కరూ దిగుతున్నారు చేతుల్లోని హ్యాండ్‌బ్యాగ్‌తో.

భారంగా తన బ్యాగ్‌ని చేతిలోకి తీసుకుంది ఆమె. ఆమె కళ్ళు జ్యోతుల్లా మండుతున్నాయ్.

లాంజ్‌లోకి రాగానే ఒక్కసారిగా రిపోర్టర్ల కెమెరాలు ఆమెకేసి ఫ్లాష్‌లు తళుక్కుమన్నాయ్. ఆమె వాటినేం పట్టించుకునే మూడ్‌లో లేదు.

తన బాబాయ్ అయిన ప్రధాని అరెంజ్ చేసిన కారు కోసం కళ్ళు వెతికాయ్. సరిగ్గా అప్పుడు... త్రివర్ణ పతాకం ఉన్న ఓ అధికార వాహనం వచ్చి ఆమె ముందు నిలబడింది. సెక్యూరిటీ గార్డులు వాచ్ చేస్తుండగా ఆమె కారు కదిలింది.

కార్లో కూర్చొన్న సెక్యూరిటీ ఆఫీసర్ ఆమెకేసి తిరిగాడు.

“మేడమ్! నాన్నగారి మృతకాయాన్ని ప్రస్తుతం ప్రధాని ఇంట్లో ఉంచారు. మిమ్మల్ని అక్కడికే తీసుకొని రమ్మని ప్రధాని ఆజ్ఞాపించారు”.

ఆమె నిర్లిప్తంగా తల వూపింది. కారు వేగంగా కదులుతోంది.

ఆమెకు ఒక్కసారిగా బాబాయ్ గుర్తొచ్చారు. దేశ ప్రధాని అయిన బాబాయ్‌తో తనకు ఎప్పుడూ పెద్దగా చనువు లేదు. తనకు రాజకీయాలు, పార్టీలు అంటే పడవని ఆయనకు తెలుసు. ఎన్నోసార్లు ఆయన పార్టీలకు, ఫంక్షన్‌లకు ఆహ్వానించినా తాను సున్నితంగా తిరస్కరించేది. ప్రధాని, రాజకీయాలంటేనే బందీఖానా అన్న తన అభిప్రాయం వారికి తెలుసు. అందుకే ఎక్కువగా బలవంతంగా చేసేవారు కాదు. వారు ఎన్నోసార్లు చెప్పారు తనకు ఏ కార్పొరేషన్ పదవి కావాలన్నా, ఏ పని కావాలన్నా చేస్తామని. అయినా తాను ఎప్పుడూ ఏదీ కావాలనుకోలేదు. తనకసలు అలాంటివి ఇష్టం లేక మేనేజ్‌మెంట్ కోర్సుని ఎన్నుకుంది.

ఆమె ఆలోచనల్ని సర్రున కోస్తూ కారు ప్రధాని ఇంటి ముందు ఆగింది. ఒక్క ఉదుటున లోపలికి నడిచిందామె. తండ్రి పార్థివ దేహాన్ని హాల్లోనే ఉంచారు. ఒక్క ఉదుటున తండ్రి పార్థీవదేహాన్ని కౌగలించుకుంది.

ఆమె కళ్ళల్లోంచి ఒక్కో నీటి బిందువు జలజల రాలసాగింది.

ఎన్నో సంవత్సరాలు తనతో కష్టసుఖాలు పంచుకున్న తండ్రి... తల్లి పోయినప్పట్నుంచి అనుక్షణం అన్నీ తానై చూసుకున్న తండ్రి.... తన మాట కాదనలేక తనని స్టేట్స్ పంపి పిహెచ్.డి. చదివించిన తండ్రి.... ఇప్పుడు మరణం శయ్య మీద ఉన్నాడు. ఆకాశంలోంచి ఓ దేవుడు నిర్దయగా కొట్టినట్టుగా పడున్నాడు.

ఆమె చూపులు శూన్యంగా చూస్తూండిపోయాయ్ అలాగే.

◆ ◆ ◆

చనిపోయిన ఆయనకు అంత్యక్రియలు జరిగిపొయ్యాయ్.

నెల రోజులు గడుస్తున్నా ఆమె వాస్తవ ప్రపంచంలోకి రాలేదు. ఏదో లోటు... భావురుమంటే మనస్సు... మనస్సునిండా శూన్యం. బతుకంతా నిస్సారంగా అనిపిస్తుంది.

తిండి వంటబట్టదు. నిద్రపట్టదు. మనస్సంతా ఏదో విషాదంలో ఉన్నట్లుగా భారంగా ఉంటుంది.

అందరి తండ్రులు వేరు! తన తండ్రి వేరు! తను స్కూల్లో, కాలేజీల్లో జరిగిన ప్రతి సంఘటనని ఆయనతోనే చర్చించేది. తన ఫ్రెండ్స్, లెక్చరర్ల స్వభావాలు వారి ప్రవర్తనా విధానం అన్నీ తాను ఆయనకే చెప్పుకునేది. ఆయన కేవలం తండ్రే కాదు. ఒక స్నేహితుడు, శ్రేయోభిలాషి, గైడ్. తనకే చిన్న దెబ్బ తగిలిన ఆయన మనస్సు విలవిలలాడేది. ఆ దెబ్బ మానేదాకా అన్నపానీయాలు మరిచి అలాగే కూర్చుండి పోయేవారు. అలాంటి తండ్రి నేడు పైలోకానికెగిసి తనని వంటరిదానిని చేశాడు. దురదృష్టకరమైన విషయమేమిటంటే – తాను ప్రాణానికి ప్రాణంలా ప్రేమించిన ప్రియుడే – తండ్రి మరణానికి బాధ్యుడయ్యాడు. ఇక తాను ఈ బాధ ఎవరితో చెప్పుకోవాలి? ఇప్పుడు తన బాబాయ్ తనకు దిక్కు? ఆయనతో మాత్రం ఏమని చెప్పుకుంటుంది? తన ప్రియుడే తండ్రి మరణానికి కారకుడని చెప్తే, లోకం నవ్వుకోదా? అలాంటి వాడిని ఎలా ప్రేమించావు అని చాటుగా నవ్వుకోరా? ఎలాంటి విషయ పరిస్థితుల్లో ఇరుక్కుంది తాను. ఏది ఏమైనా ప్రస్తుతం తనకు ఏకైక దిక్కు బాబాయ్! రాజకీయాలు, పదవన్న పడని తనకు ఇప్పుడే ఆయనే దిక్కు.

పదకొండవ రోజు తండ్రి దినం పూర్తయ్యాక బాబాయ్ ఆమెని పిలిచాడు.

"అమ్మా! తలని తలంపుగా తమ్ముడు పోయాడు. ఆయన రాజ్యసభ సీటు ఖాళీగా ఉంది.న ఆయన స్థానంలో నీ పేరు రికమెండ్ చేద్దామనుకుంటున్నాను. నీ అభిప్రాయం ఏమిటి?"

ఆమె ఏం మాట్లాడలేదు. మొదటి నుండి తనకు రాజకీయాలు, పార్టీలంటే ఇష్టం లేదు.

ఆమె ఏం చెబుతుందా అని ఆయన అలాగే చూస్తున్నాడు.

"నాకు ఇష్టం లేదు బాబాయ్! ఈ రాజకీయాల్లోకి ఒకసారి వెళ్తే తిరిగి బయటకు రావడం కష్టం. అధికార దాహం నాకు లేదు. కాబట్టి ఈ పదవికి వేరే వారిని రికమెండ్ చేయడం ఉత్తమం."

ప్రధాని షాక్ తినలేదు. ఇలాంటి సమాధానం వస్తుందని ఆయనకు తెలుసు. అందుకే కదిలింది ఆయన కంఠం.

"అమ్మా! బ్రతకడానికి ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి చేయాలి కదా! ఎక్కడో ఏదో జాబ్ చేసేకంటే ప్రజాసేవ చేయడం ఉత్తమం కదా! పైగా నీవు యంబిఏ చేశావు. మేనేజ్‌మెంట్‌లో అన్ని డిపార్ట్‌మెంట్‌ల వారిని సంఘటితం చేయడం ఎలాగో తెలుసు. అలాంటి వ్యూహాలనే ఈ రాజకీయాల్లో అమలు చేయవచ్చు కదా"

తన బాబాయ్ టాపిక్‌ని ఎటువైపు నుండి ఎటు తీసుకొచ్చాడో అర్థమైంది. ఆమె ఆలోచనల్లో పడటం చూసి ప్రధాన కంఠం కదిలింది.

"అమ్మా! నాకిద్దరు మగపిల్లలు. ఆడపిల్లలు లేరు. బ్రతికి ఉన్నప్పుడు మీ నాన్న అంటుండేవాడు రాజకీయాల్లోకి తన కూతురిని తీసుకురావాలని. కాని నీకు ఇష్టం లేదని ఊరుకున్నానని అనేవాడు".

ఆమె అప్రతిభురాలైంది. తండ్రి ఆ మాటలు తనతో చాలాసార్లు అన్నారు కాని తాను విముఖత చూపించేసరికి వదిలేశారు.

ఆమె మెత్తపడటం చూసి ప్రధాని కంఠం కదిలింది.

"అమ్మా! అందరికీ చాకచక్యంగా వ్యవహరించడం రాదు. అదృష్టవశాత్తు నీకు ఆ కళ పుట్టుకతోనే వచ్చింది. పది మందిని కలుపుకునేవారు రాజకీయాల్లో చక్కగా రాణిస్తారు. ఒక్కసారి ఆలోచించు. ఏదో ప్రైవేట్ కంపెనీలో మేనేజ్‌మెంట్

ఉద్యోగం సంపాదించేకంటే రాజకీయాల్లో వుంటే అధికార దర్పం, పలుకుబడి ఉంటాయి. వీటితో ఎవరిని కావాలంటే వారిని మనం వంచుకోగలం".

సరిగ్గా.... ఆ ఆఖరి మాటలంటున్నప్పుడు ఆమె మెదడులో ఒక విద్యాఘాతం తగిలినట్లుగా 'ఆర్య' గుర్తొచ్చాడు. అవును! అతడు తన శత్రువు. తన కుటుంబ పరువుని తీసి, తండ్రిని ఆత్మహత్య చేసుకోవడానికి కారకుడయ్యాడు. అతడిని ఎదుర్కోవాలంటే తనకు ఎంతో కొంత అధికారం తన చేతిలో ఉండాలి. అప్పుడే తను ఇంతకు ఇంత తీర్చుకోగలదు.

అప్పుడు కదిలాయ్ ఆమె పెదాలు సైలెన్సర్ బిగించిన రివాల్వర్‌లోంచి వచ్చిన బుల్లెట్లలా.

*"నాకు ఇష్టమే బాబాయ్! మీరు చెప్పినట్లే నేను ఎం.పి. కాదల్చుకున్నాను".*

◆ ◆ ◆

ఆ తర్వాత సంఘటనలు చాలా వేగంగా జరిగిపోయాయి.

ప్రధాని ఆమె పేరును రికమెండ్ చేయడం, ఆమె ఎంపీగా పదవీ స్వీకారం కూడా చేయడం ఒకదాని తర్వాత మబరొకటి జరిగిపొయ్యాయి.

◆ ◆ ◆

ఎంపీ అయినా ఆమెలో పూర్తిగా విచార భయాలు తొలిగిపోలేదు. ఇంకా తండ్రి తాలూకు జ్ఞాపకాలు ఆమెను ముల్లులా గుచ్చుకుంటున్నాయి. తల్లి లేని తనని ఆయన చూసుకున్న తీరు ఆమెకు గుర్తొచ్చి మనసు వికలమైపోయింది.

అదలా ఉండగా ప్రధాని, ఆయన కుటుంబ సభ్యులకు మయన్మార్ దేశం నుండి అధికార పర్యటనకు రమ్మని ఆహ్వానం వచ్చింది.

దాంతో ప్రధాని, ఆయన భార్య, ఇద్దరు కుమారులు దానినే వినోదపర్యటనగా మార్చుకోవాలనుకున్నారు. వెంటనే బయలుదేరడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. సమీరను కూడా రమ్మని బలవంతం చేశారు. కాని తన తండ్రి అస్థికలు గంగలో కలిపే ఏర్పాట్లలో ఉన్న సమీరకు వారితో వెళ్లడానికి వీలు కాలేదు. దాంతో ఆమెను తమ ఇంట్లో ఉంచి ప్రధాని, ఆయన కుటుంబ సభ్యులు మయన్మార్ టూర్‌కి బయలుదేరివెళ్ళారు.

***ఆ వెళ్ళడమే సమీర జీవితంలో ఓ పెద్ద మలుపుకు కారణమయ్యింది.***

◆ ◆ ◆

మర్నాడు ఉదయం –

దేశమంతటా అట్టుడికిపోయింది. ప్రజలంతా నిశ్చేష్టులైపోయారు.

దానికి కారణం.

**భారత ప్రధాని, అతడి కుటుంబ సభ్యులను టెర్రరిస్టులు బాంబులతో చంపేశారు.**

టీవీ ఛానళ్ళు ఆ వార్తని క్షణక్షణానికి ప్రసారం చేస్తూనే వున్నాయ్.

***భారత ప్రధాని, కుటుంబ సభ్యుల దారుణహత్య.***

మయన్మార్ 20, జూన్ 2013 : మయన్మార్ దేశాన్ని సందర్శించిన భారత ప్రధాని అక్కడ హత్యకు గురయ్యారు. ఆయనతో పాటు ఆయన భార్య, ఇద్దరు కొడుకులూ ఆ బాంబు ఘటనలో మరణించారు.

మయన్మార్ దేశాన్ని సందర్శించాల్సిన ఆ దేశ ప్రధాని కోరిక మేరకు ప్రధాని ఆ దేశానికి బయలుదేరారు. అయితే ఆ దేశంలోనే విహారయాత్ర చేయాలన్న కోరిక మేరకు ఆయా కుటుంబ సభ్యులు మొత్తం ఆయనతో బయలుదేరారు. బయలుదేరిన రెండో రోజు టెర్రరిస్టులు ఆయన అధికార వాహనంలో పై నుండి శక్తివంతమైన బాంబులు పెట్టి మట్టుపెట్టారు. దీంతో ప్రధాని కుటుంబం మొత్తం చనిపోయారు.

ఆ కుటుంబంలో మిగిలింది ఆయన తమ్ముడు కుమార్తె సమీర. నిజానికి సమీర తండ్రి రాజ్యసభ ఎంపీ. ఆయన కొన్ని రోజుల క్రితమే చనిపోయిన విషయం తెలిసిందే. తండ్రి చనిపోయిన తర్వాత మేనేజ్‌మెంట్‌లో పిహెచ్.డి. చేస్తున్న సమీర ఇటీవలే ఇండియా వచ్చారు. తండ్రి పోయిన దుఃఖంలో ఉన్న ఆమెని కూడా మయన్మార్ రమ్మని ప్రధాని, కుటుంబ సభ్యులు అడగ్గా, ఆమె నిరాకరించారు. తను మొదట్నుంచి రాజకీయాలుంటే ఇష్టపడని ఆమె సున్నితంగా నిరాకరించారు. నిజానికీ ఆమె పేరు కూడా ఆ పర్యటన లిస్ట్‌లో ఉంది. కాకపోతే ఎంత చెప్పినా వినకపోయేసరికి ప్రధాని, కుటుంబ సభ్యులు ఆమెని తన స్వంత ఇంట్లో ఉంచి బయలుదేరారు. లేకపోతే సమీర కూడా ఆ శక్తివంతమైన బాంబు ఘటనలో మరణించేదే.

మరో ఛానల్ ఇంకో కొత్త కథనంతో ముందుకు వచ్చింది.

**దిక్కుతోచని పరిస్థితుల్లో భారత్**

భారత ప్రధాని, కుటుంబ సబ్యులు హతమవడంతో ఇప్పుడు దేశానికి ఎవరు ప్రధాని అన్న ప్రశ్న తలెత్తింది. అటు చూస్తే కొడుకులూ చనిపోయారు. పార్టీలో

ప్రస్తుతం సమర్ధులెవరూ కనిపించడం లేదు. దేశాన్ని ఇక భారతదేశానికి రాష్ట్రపతి పాలనే దిక్కన్న అనుమానం కలుగుతోంది.

మరో సంచలన టీవీ ఛానల్ కథనం ఇలా ఉంది.

**కాబోయే ప్రధానిని ఎన్నుకోవడానికి మంత్రివర్గం సమావేశం**

*ప్రస్తుతం ప్రధాని స్థానంలో నూతన ప్రధానిని ఎన్నుకోవడానికి మంత్రివర్గం ఎల్లుండి సమావేశం కానుంది. ఈ సమావేశానికి ఎంపీలంతా హాజరు కావాల్సిందిగా పార్టీ ఆదేశించింది.*

... ఫలితంగా దేశమంతటా సంచలనం. ప్రజలలో, పార్టీ సభ్యుల్లో, ఎంపీల్లో ఒకరకమైన ఉత్కంఠను నెలకొంది. పార్టీ సీనియర్ మెంబర్లు, ఎంపీలు, మంత్రులు తమ తమ ప్రయత్నాలు చేసుకోసాగారు. ఎవరికి వారు తమ మద్దతుని కూడగట్టుకోసాగారు. ఇది బంగారు అవకాశమని, ఈ సమయం పోతే మళ్ళీ తిరిగి రాదని యంపీలను మద్దతు కోసం ప్రాకులాడసాగారు. సువిశాల భారతదేశానికి ప్రధాని అయ్యే అవకాశం కోసం వేయి కళ్ళతో చూడసాగారు.

*వారు అలా ఎదురు చూస్తుండగానే వారు అనుకున్న సమయం మెరుపువేగంతో వచ్చింది.*

◆ ◆ ◆

## 5

షాక్ మీద షాక్, దాని వెనుకాల మరొకటి తగిలినట్లుగా పడుంది సమీర!

మొన్నటిదాకా తండ్రి లేదనుకుంది. నేడు బాబాయ్, పిన్నీ సైతం చనిపోయారు. ఇప్పుడు తాను ఎడారిలో ఓ చిన్న మొక్కలాగే అల్లాడిపోతుంది. విధి ఎందుకు తన మీద ఇంతగా పగబట్టింది? వరుసపెట్టి ఒక్కొక్కరిని ఎందుకు దూరంగా పంపించేస్తుంది? అదేమిటో తాను ఎక్కడ ఉంటే అక్కడ కష్టాలు ఉంటాయన్నట్లుగా తయారయ్యింది పరిస్థితి. అటు ప్రియుడు దూరమయ్యాడు. దూరమవడమే కాకుండా పగబట్టి కన్నతండ్రిని దూరం చేశాడు. అంతటితో ఆగిందా? ఇక ఈ ప్రపంచంలోనే తనకు దిక్కు అనుకున్న బాబాయ్, పిన్నీ వీధి పొట్టన బెట్టుకుంది. ఇప్పుడు తాను ఏ ఆశతో జీవితాన్ని గడపాలి? ఏ రెక్కలతో తాను ఈ ప్రపంచంలో ఎదగాలి?

మొన్నటిదాకా సందర్శకులతో కలకలలాడే ప్రధాని భవనం నేడు వెలవెల బోయింది. వచ్చిన బంధువులు సైతం వెళ్ళిపోయారు. అధికారం ఉన్నంతసేపే అశ్రిత జనాలూ, బంధువులు, సన్నిహితులు వెంట ఉంటారు. ఇప్పుడు అధికారం పోయింది. మనిషే పోయాక అధికారం ఎలా ఉంటుంది?

నిజానికీ తన ప్రధాని బాబాయ్‌ది అదో తరహా మనస్తత్వం. ఎవరికీ సహాయం చేసే వాడు కాడు. ఏదైనా సహాయం చేస్తే ఆ తర్వాత తాను స్కామ్‌లో, కుంభకోణాల్లో ఇరుక్కుపోతానని భయం ఎక్కడో ఉండేది కాబోలు ఎవరికీ సహాయం చేసేవాడు కాడు. ముక్కుసూటిగా పోయేవాడు. ఏది చేసినా తన చేతికి మట్టి అంటకుండా చేయాలనుకునే మనస్తత్వం అతడిది. ప్రజలలో అతడి మీద పాజిటివ్‌గానీ, నెగిటివ్‌గానీ ఉండేది కాదు. ఏదో దేశాన్ని పాలించడానికి ప్రధాని అంటూ ఒకరుండాలి అన్నట్లుగా ఉండేవారు.

నిజానికీ ఆయనకు–తన అన్న రాజకీయాల్లో రావడం ఇష్టం లేదు. బంధుప్రీతి వల్ల రాజకీయాల్లో తీసుకొచ్చాడన్న అభిప్రాయం ప్రజలలో రావడం ఆయనకు ఇష్టం లేదు. అయితే రాజ్యసభ సీటుకు విద్యాధికుల్లో ఎవరినో ఒకరిని ఎన్నుకోవాలి కాబట్టి పార్టీ కమాండ్ మేరకు అయిష్టంగానే అన్న సీటుకు ఒకే చేశాడు. పైగా రాజ్యసభ కాబట్టి తనకు ఎలాంటి సమస్య ఉండదన్న భరోసా ఏర్పడ్డాకే అన్నని సిఫారసు చేశాడు. ఆయన చనిపోయాక తమ్ముడి కూతురిని ఎంపీ చేశాడు. అంతే! అదీ తప్ప ఆయన బంధువులకు చేసిన సాయమంటూ వేరే లేదు.

దాంతో ఉన్న బంధువులు తక్కువ కావడం, వారికీ ప్రధాని మీద ఎక్కువ మమకారం లేకపోవడంతో ఎవరికి వారు తమకేం పట్టనట్లుగా ఉండిపోయారు. దాంతో సమీరకు పెత్తనం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎవరో ఒకరు పూనుకొని చేయకపోతే కర్మకాండలు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. మంచైనా, చెడైనా ఆయన తన బాబాయ్. అందుకే ఆమె ముందుకు పూనుకొని వేదబ్రాహ్మణులను పిలిపించి కర్మకాండలు చేయడానికి సంకల్పించింది. చకచకా తిరుగుతూ అన్ని పనులను ఒంటిచేత్తో చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కర్మకాండలయ్యాక వచ్చిన బంధువులంతా పెట్టే బేడా సర్దుకుని వెళ్ళిపోయారు. కొంతమంది అయితే పెద్ద కర్మ దాకా కూడా ఆగలేదు. ఎన్నో పనులున్నట్లుగా హడావిడిగా వెళ్ళిపోయారు.

నిజానికీ ప్రధాని తల్లిదండ్రులు చిన్నప్పుడే పోయారు. ఆయన ఒకే ఒక అన్న అంతకుముందే చనిపోయాడు. అన్న భార్య చిన్నప్పుడే గతించింది. ఇప్పుడు ప్రధాని, కుటుంబ సభ్యులంతా బాంబు బ్లాస్ట్‌లో చనిపోయారు. ఈ నేపథ్యంలో ఆ ఇల్లు బావురుమంటూ ఉంది. పైగా ఆ ఇంటిని త్వరలోనే ఖాళీ చేయాల్సి ఉంది. కాబోయే ప్రధాని కోసం మందీమార్బలం సిద్ధం చేయాలి కదా! ఇప్పటికే ప్రభుత్వం సెక్యూరిటీ మొత్తాన్ని ఉపహరించుకుంది.

సమీర నిస్తేజంగా చూస్తోంది అన్నింటిని. కొంతమంది తెలిసిన వారు, సన్నిహితులు ఆ ఇంట్లో వస్తువులను కన్వీనీయంట్‌గా తీసుకెళ్ళిపోయారు. కొంతమంది బీరువాలో ఉన్న ఖరీదైన ఆభరణాలు, నగలు ఎత్తుకుపోయారు. ఎవరినీ ఏమీ అనలేని పరిస్థితి. నిజానికి ఆమెకు మొదట్నుంచి ఆభరణాల మీద, ఆస్థి అంతస్తుల మీద మమకారం లేదు. ఏదో ఒక పని చేస్తూ బ్రతకాలన్నది ఆమె సిద్ధాంతం. డబ్బు, హోదా, అధికారం శాశ్వతం కాదు! అవి ఎప్పటికైనా పోయేవే అన్నది ఆమె అభిప్రాయం. అందుకే అలాంటి వాటిని గురించి పట్టించుకోవడం లేదు.

ఏటొచ్చి ఆమెకు బాధ కలిగింది ఒకే ఒక విషయంలో. ఆర్య మీద తాను పగ తీర్చుకోవాలంటే కొద్దిపాటి అధికారం ఉండాలి. అధికారాన్ని దుర్వినియోగం చేయడం తనకు ఇష్టం లేదు. అయినప్పటికీ అతడు చట్టవిరుద్ధంగా, దౌర్జన్యపూరితంగా తండ్రిని వంచించి ఆత్మహత్య చేసుకునేలా చేశాడు. అలాంటి వాడిని దారుణంగా దెబ్బకొట్టాలంటే అధికారాన్ని ఉపయోగించుకోవాలనుకుంది. ముల్లును ముల్లుతోనే తీయాలనుకుంది.

కాని ఏం జరిగింది? దురదృష్టం ఎక్కడుంటే అక్కడ తను ఉన్నట్లుగా ఉన్న బాబాయ్ చనిపోయాడు. ఇప్పుడు తను అనాధ. తండ్రి పోయాడు. అధికారం, హోదా లేవు. అలాంటప్పుడు ఏ రెక్కలతో తాను ఆర్య మీద పగ తీర్చుకోవాలి? ఎలా పగ తీర్చుకోవాలి.

అన్ని దారులు మూసుకుపోయిన తనకు ప్రస్తుతం గమ్యం ఏమిటి?

మెదడులోని రక్తనాళాలు బ్రద్దలయ్యేలా, నరాలు చిట్లిపోయేలా ఆలోచిస్తోం దామె. క్షణాలు కదుల్తున్నాయ్ ఆ ఉద్వేగంలోనే.

తిరిగి ఆలోచనలు ఆమె మెదడుని ఆక్రమించుకుంటున్నాయ్ తేనేతుట్టెలా.

ఇప్పుడు తన ముందున్న దారులు రెండే రెండు.

*ఒకటి... ఏమీ చెయ్యలేక ఆర్యను వదిలెయ్యడం.*

*రెండు.. ఎలాగైనా సాహసించి ఆర్య మీద పగ తీర్చుకోవడం.*

ఆర్యను వదిలెయ్యడమంటే తాను పిరికిపంద క్రింద లెక్క! అతడు ఒకప్పుడు తన ప్రియుడు కావచ్చు. కాని ప్రస్తుతం తన శత్రువు.

ఇక రెండవది – ఆర్య మీద పగ తీర్చుకోవడం. ఎలా తీర్చుకోవాలి? అతడిని ఎదుర్కోవడానికి తన ఎం.పీ హోదా సరిపోతుందా? సరిపోదు. అలాంటప్పుడు తాను అతడిని ఏ శక్తులతో ఎదుర్కోగలదు?

తీవ్రంగా ఆలోచిస్తోంది ఆమె పరిష్కారం కోసం.

కాని ఎంత ఆలోచించినా ఆమెకు దొరకడం లేదు తగిన పరిష్కారం.

ఆలోచించి ఆలోచించి ఆమె అలాగే నిద్రలోకి జారిపోయింది.

**కాని ఆ సమయంలో ఆమెకు తెలియదు మారిన దేశ పరిస్థితులే తన సమస్యకు త్వరలో పరిష్కారం చూపించబోతున్నాయని.**

◆ ◆ ◆

**పార్టీ హెడ్‌క్వార్టర్స్!**

మంత్రివర్గం సమావేశమయ్యింది. పార్టీ చీఫ్ సిన్హా ఓ వృద్ధుడు. ఆయన ముందు రకరకాల సంతకాలతో కూడిన కాగితాలు ఉన్నాయి. తనకు ఎంతమంది ఎంపీల సపోర్ట్ ఉందో తెలియజేస్తూ మంత్రుల విజ్ఞప్తుల పేపర్లు అవి. పార్టీకి తను ఎంత సేవ చేశాం కాబట్టి తదుపరి ప్రధానికి తమకు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తూ ఉన్నాయి మరికొన్ని విజ్ఞప్తులు.

సమావేశం ప్రారంభం అయింది వాడివేడిగా.

"ఆర్థిక మంత్రి సుఖదేవ్‌ని ప్రధానిగా చెయ్యాలి" ఒకరిద్దరు అధికార పక్ష సభ్యులు ప్రతిపాదించారు.

ఆర్థికమంత్రి సుఖదేవ్ వైపు చూశారంతా. అతడు అంత చురుకు కాదని, కేవలం గత ప్రధానికి అతడి మీదున్న అభిమానం వల్ల అతడు ఆ పదవిని ఆక్రమించాడని అందరికీ తెలుసు.

"ఐయాం సారీ! ఆయన నియామకాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం.. అతడికి ప్రధాని పదవికుండాల్సిన అర్హతలు లేవు." కదిలింది మరో మంత్రి కంఠం. అతడికి సపోర్ట్‌గా మిగతావారు వంత పలికారు. ఆర్థికమంత్రి మొఖం పాలిపోయింది.

"పోనీ హోమ్ మినిస్టర్ శంకర్‌దేవ్‌ని పియంగా చేస్తే?" కదిలింది మరో సభ్యుడి కంఠం. కాని అదీ సరైన ప్రతిపాదన కాదని అందరికీ తెలుసు. ఎందుకంటే శంకర్‌దేవ్‌కి పదిమందిని కలుపుకునే తెలివితేటలు లేవని అందరికీ తెలుసు. "నన్నంటుకోకు" అన్నట్లుగా ఎప్పుడూ తన పని తానే చూసుకుంటాడు. కాని ఇతరుల గురించి పట్టించుకోడు. రాజకీయాలలో పదిమందిని కలుపుకునిపోయేవాడే ప్రధాని పదవికి అర్హుడు అని అందరికీ తెలుసు.

"పోనీ విదేశాంగమంత్రి రణబీర్‌సింగ్‌ని నియమిద్దామా?" ఒకరిద్దరి పార్టీ సభ్యులు ప్రతిపాదించారు.

రణబీర్ సింగ్ ఆశగా చూశాడు మిగతావారికేసి. కాని అతడి మీద అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయని, తద్వారా కోర్టులో అతడి మీద కేసులు నడుస్తున్నాయని చాలామందికి తెలుసు.

"నో.... అవినీతి ఆరోపణలు ఉన్న వారిని ఆ పదవిలో వద్దు..." అరిచాడో సభ్యుడు.

రణబీర్‌సింగ్ మొఖం నల్లబడింది. రాత్రికి రాత్రే తన పేరు ప్రపోజ్ చెయ్యమని అతడు మిగతా వారికి వంద కోట్లు ఇస్తామని కబురంపాడు. ఇప్పుడు మిగతావారు అడ్డుపడుతున్నారు.

వెంటనే రోషంతో అతడి కంఠం కదిలింది. "అవినీతి ఆరోపణలు ఒక్క నా మీద కాదు, ఇక్కడున్న చాలామంది మీద ఉన్నాయి. కాకపోతే నన్ను కోర్టు అభిశంసించింది. కాబట్టి దానిని మీరు ఎక్కుపెడుతున్నారు".

అంతా సైలెంట్ అయిపోయారు. నిజమే! పార్టీ యావత్తూ అవినీతి, లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతంతో కుళ్ళిపోయింది. ఈ నేపథ్యంలో ఒక్కరైనా స్వచ్ఛమైన వారు దొరుకుతారా?

సిబిఐ ఛార్జిషీట్‌లో కనీసం డజనుమంది మంత్రులైనా ఉంటారు. అదీ సుప్రీంకోర్టు అభిశంసించింది కాబట్టి సిబిఐ మెరుపువేగంతో చర్యకు ఉపక్రమించింది. సుప్రీంకోర్టుకు తోడు స్వచ్ఛందవాదులు, స్వాతంత్ర్య సమరవీరులు అవినీతి మీద నిరసన ధ్వనులు వెలియబుచ్చుతున్నారు. నిరాహారదీక్ష చేస్తున్నారు. దాంతో అవినీతి ఆరోపణలు ఉన్నవారిని ఆ పదవిలో నియమిస్తే దేశంలో పెద్ద ఎత్తున దుమారం చేలరేగవచ్చు.

వారలా ఆలోచనల్లో వుండగా మరో మంత్రి కంఠం కదిలింది.

"పోనీ ఇప్పుడున్న ఎంపీలో కొత్తగా ఎవరైనా ఎన్నుకుందామా?"

"ఎలా ఎన్నుకుంటాం? ఎవరైనా ఎన్నుకుందామంటే వారికి అనుభవం లేదు. అదీగాక ఒక ప్రాంతంలోని ఎంపీకి అదే ప్రాంతంలో అసమ్మతి గొడవ ఉండనే ఉంది".

తిరిగి తర్జన భర్జనలు మొదలయ్యాయి. ఇంకా ఎంతమంది పేర్లో పరిశీలించారు. కొన్నింటిని అధికార పార్టీ సభ్యులే వ్యతిరేకించారు. ఇంకొన్నింటిని ఆ పార్టీని సపోర్ట్ చేస్తున్న ఇతర పార్టీ మంత్రులు నిరాకరించారు.

అప్పటికే మూడు గంటలు గడిచాయ్. నూతన ప్రధాని నియామకం విషయంలో ఎలాంటి నిర్ణయానికి రాలేకపోతున్నారు.

"ఇంత పెద్ద దేశానికి ప్రధానికి తగ్గ అర్హతలు ఉన్నవారే లేరా?" ఆశ్చర్యం పార్టీ చీఫ్‌లో.

"అర్హతలు లేక కాదు. ఒకరికి నచ్చినవారు ఇంకో పార్టీకి నచ్చడం లేదు. అదీగాక ప్రస్తుత మంత్రిమండలిలో ఒక్క అవినీతి ఆరోపణ అయినా లేనివారు ఎవరూ లేకపోవడం మరో కారణం..." పార్టీలో మరో వృద్ధుడు గొణిగాడు.

క్షణాలు గడుస్తున్నాయ్... ఆ ఉద్వేగంలోనే. అందరిలో టెన్షన్ ఎక్కువవుతోంది.

బయట ప్రెస్, టీవీ ఛానల్ వారు వేచి వున్నారు. ఇప్పుడు తాము బయటకు వస్తే చాలు తమ మీద ఆకలిగున్న పులిల్లా మీద పడతారు. వారికి సమాధానం చెప్పాలి. వారే కాదు. దేశం యావత్తూ ఎదురు చూస్తోంది. కాబోయే నూతన ప్రధాని ఎవరాని.

పార్టీ చీఫ్‌లో ఆలోచనలు తిరిగి చుట్టుముట్టాయి.

'పాత ప్రధానికి సన్నిహితులు సైతం ఎవరూ లేరు. పోనీ అతడికి వారసులు ఎవరైనా ఉన్నారంటే కొడుకులిద్దరూ ఆ బాంబ్‌బ్లాస్ట్‌లో చనిపోయారు. ఎం.పీ. అయిన ఆయన అన్న అంతకుముందే వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. పోనీ ఆయన భార్య రూపాదేవి చనిపోయింది. మరి అలాంటప్పుడు..."

అప్పుడు గుర్తొచ్చింది ఆయనకు ఆకస్మాత్తుగా పాత ప్రధాని అన్నకు ఒక కూతురు ఉందని.

అప్పుడు ఆ అమ్మాయి రూపం ఆయన ముందు ప్రత్యక్షమైంది. చక్కటి అందమైన మొహం... చదువు, సంధ్య ఉన్న ఉన్నత వ్యక్తిత్వం... పైగా ప్రధాని కుటుంబకురాలు. ప్రధాని చనిపోయినప్పుడు ఆమె కుటుంబంలో పూనుకొని అంత్యక్రియలు జరిపించింది. అప్పుడు ఆమె చూపిన తెగువ, తెలివితేటలు, పెద్దల పట్ల వినయ విధేయతలు ఆయనకు బాగా నచ్చాయి. వెంటనే ఆయన కంఠం కదిలింది.

"ప్రధాని పదవికి అర్హులు ఒకే ఒకరున్నారు. ఆమె ప్రధాని అన్న కూతురు సమీర. మొన్న మనం ఆయన అంత్యక్రియలకు వెళ్ళినప్పుడు ఒక యువతి అన్నింటా తానూ అయి నిర్వహించిన తీరు మీరు చూశారు. ఆమే సమీర."

అప్పుడు పడింది సమీర రూపం వారి మనోఫలకం మీద. అవును! అందం, తెలివితేటలు ఉన్న యువతి ఆమె. ఆ రెండింటితో పాటు చెట్టంత తండ్రిని, బాబాయ్‌ని కూడా పోగొట్టుకొని ఆ దుఃఖాన్ని దిగమింగి ఎంతో సంయమనంతో అంత్యక్రియలు జరిపించింది. ప్రధానికి ఎవరు లేరు కాబట్టి ఆ పరిస్థితుల్లో ఆమె ఓ దిక్కుగా నిలబడి అన్ని కర్మకాండలు జరిపించింది. నిజంగా చెప్పాలంటే ఆమెలో నాయకత్వానికి కావల్సిన అర్హతలు ఉన్నాయి.

"అవును! ఆమె ఓ అద్భుత యువతి. నేను చూశాను. ఆమెని ప్రధాని పదవికి నేనూ రికమెండ్ చేస్తున్నాయి" ఎక్సయిట్‌మెంట్‌తో కదిలింది మరో సభ్యుడు కంఠం.

"నేను సైతం ఒప్పుకుంటున్నాను. పైగా ఆమె ప్రధానికి స్వయాన బంధువు కాబట్టి చూసేవారికి సమంజసంగా కూడా ఉంటుంది." మరో సభ్యుడి అభిప్రాయం అది.

"కాని" కదిలింది అధికార పార్టీకి సపోర్ట్ చేస్తున్న పార్టీ యొక్క మంత్రి కంఠం. "ఆమెకు ఇప్పటి దాకా ఎలాంటి అనుభవం లేదు. అలాంటప్పుడు ఆమెని ఆ పదవికి అర్హత ఎలా ఉంటుంది?"

"చక్కగా ఉంది" కదిలింది పార్టీ చీఫ్ కంఠం. "ఆ అమ్మాయి తండ్రి ఓ ఎంపీ అని విషయం తెలిసిందే! ఆ అమ్మాయి తండ్రి ఎంపీగా ఉన్నప్పుడు ఆ అమ్మాయి తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేది. ఆ అనుభవం చాలదా?"

అంతా ఇంకా షాక్‌లోనే ఉన్నారు. ప్రధాని పదవికి పోయి పోయి ఓ కొత్త అమ్మాయిని ఎన్నిక చేయడమా? అసలు ఇంతవరకూ ఊహింపని ట్విస్ట్ అది. తమకే

కాదు మొత్తం దేశ ప్రజలకూ, ఎంపీలకు, ఎమ్మెల్యేలకూ కూడా అది షాకింగ్ న్యూస్! కేవలం భారతదేశానికే కాదు, ప్రపంచానికి సైతం ఇది ఊహింపని సంఘటనే!

"కాని" కదిలిందో మంత్రి కంఠం. "ఆమె ఈ పదవికి ఒప్పుకుంటుందా? రాజకీయాలు, పదవి అంటేనే పడని ఆమె ఈ ప్రధాని పదవికి ఒప్పుకుంటుందా?"

అదీ పాయింటేనన్నట్లుగా అంత పార్టీ చీఫ్ కేసి చూశారు.

"ఆ విషయం నాకు వదిలెయ్యండి. నేను చూసుకుంటాను. మీకేం అభ్యంతరం లేదు కదా?"

అంతా స్తంభితులైపోయారు. పార్టీ చీఫ్ ఎటువైపునుండి పోయి ఎటు నరుక్కుంటూ వచ్చాడో వారికి అర్థమైంది. ప్రస్తుతం చేసేదేం లేదు.

"మేము రెడీ" అధికార పక్ష పార్టీ సభ్యులు కంఠాలు కదిలాయ్.

"మేమూ రెడీ" వంత పలికాయి మద్దతు పార్టీ మంత్రులు. ఎందుకంటే అంతకంటే ఎవరికైనా వేరే గత్యంతరం లేదు.

పార్టీ చీఫ్ మొఖం విజయం సాధించినవాడిలా వెలిగింది.

**"సో... నేటి నుండి మన నూతన ప్రధాని మిస్ సమీర..."**

మెరుపువేగంతో చప్పట్లు మారుమ్రోగాయ్ అక్కడ.

ఆ తర్వాత అంతా సమీరని ప్రధానిగా నియమిస్తూ తీర్మానం చేశారు.

◆ ◆ ◆

"నో..." చెవులు గింగురెత్తేలా కదిలింది. సమీర కంఠం "ఈ ప్రధాని పదవి నాకు ఇష్టం లేదు. అసలు నా అనుమతి లేకుండా నన్ను ఎలా నియమించారు మీరు?"

"నా మాట వినండి." రిక్వెస్ట్‌గా అడిగాడు పార్టీ ఛీఫ్.

"వినను..." శివమెత్తిన సివంగిలా అరిచింది. సమీర "నాకు రాజకీయాలు, అధికారం అంటే పడదని మీకు తెలుసు. దేశంలో ఇంతమంది ఉండగా నేను దొరికానా మీకు?"

బయట టీవీ ఛానళ్ళు, రిపోర్టులు, పార్టీ సభ్యులు లోపలికి రావడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులు బారికేడ్లు కట్టి వారిని నియంత్రిస్తున్నారు.

"అమ్మా సమీరా! నేను చెప్పేది వినమ్మా! ప్రధాని పదవంటే నూటికో, కోటికో ఒకరిని వరిస్తుంది. అలాంటి నీకు..."

"కావచ్చు. కాని ఆ పదవి నాకు వద్దు" ఆవేశంగా కదిలింది సమీర కంఠం "చిన్నప్పట్నుంచి సీతాకోక చిలుకలా నాకు స్వేచ్ఛగా, ఆనందంగా తిరగాలని ఉంది. అందుకే ఎమ్‌సెట్ లాంటి రుద్దుడు చదువులకు దూరంగా, స్వేచ్ఛగా మేనేజ్‌మెంట్ కోర్సుని తీసుకున్నాను. ఇదంతా ఎందుకు చేశాను? ఈ రోటీన్ అనే బందీఖానా నుండి దూరంగా వెళ్ళడానికే".

"కాని సమీరా... పార్టీలో ప్రధాని మీ బాబాయ్ కావడం వల్ల మీకు ఈ పదవి.."

"గోటు హెల్ విత్ రిలేషన్స్! అదే నాకు శాపంలా పరిణమించింది. అందరికీ అది వరమేమో కాని అదో యమకూపంలా అనిపిస్తుంది. అనుక్షణం జెడ్ సెక్యూరిటీతో బందీఖానా. ... ఒక్క క్షణం స్వేచ్ఛలేదు. ఎక్కడికెళ్ళినా సెక్యూరిటీ వేయి కళ్ళతో వాచ్ చేస్తుంటుంది. మనం బయటికి వెళ్ళినా, ఇంటికి వెళ్ళినా, ఆఖరికి అన్నం తింటున్నా సెక్యూరిటీ ఎప్పుడూ కాపలా కాస్తుంటుంది. ఆఖరికి బాత్‌రూమ్ కెళ్ళిన వారు బయటే ఉంటారు. దీనికంటే తీహారు జైలు నయం. తోటి ఖైదులతో స్వేచ్ఛగా ఉంటారు. అయినా నాకర్థం కాదు. దేశంలో ఎంతోమంది ఆ పదవి కోసం ఎదురుచూస్తుండగా, నాలాంటి వారి జోలికే మీరు వస్తారేమిటి? ఇప్పుడే చెప్పేస్తాను ప్రెస్‌కు, టీవీ ఛానళ్ళుకు నా అనుమతి లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారని, ప్రధాని పదవిని నేను నిరాకరిస్తున్నానని"

"అది కాదమ్మా" పార్టీ చీఫ్ కంఠం కదిలింది అనునయంగా "సరైన అభ్యర్థి దొరకలేదు కాబట్టే అంత మీ అభ్యర్థికి ఓటు వేశారు. మీ స్థానంలో ఎవరిని ఎన్నుకున్న దేశం ముక్కలు చెక్కలయ్యే పరిస్థితి కనిపిస్తుందమ్మా! అందుకే గత్యంతరం లేని పరిస్థితుల్లో నిన్ను ఎన్నుకోక తప్పలేదమ్మా".

సమీరలో ఉద్వేగం కొద్దిగా తగ్గింది. ఆలోచనలు మొదలయ్యాయి. అసలు తాను ప్రధాని కావడానికి బాబాయ్ కారణం? ఖర్మ కాలి ఏ ముహూర్తాన ఆయన రాజకీయాల్లో అడుగుపెట్టాడో అది కాస్తా తన గొంతుకు చుట్టుకుంది.

ఆమె అలా మెత్తపడడంతో పార్టీ చీఫ్ కంఠం కదిలింది.

"అమ్మా సమీరా! ఒక్కసారి నేను చెప్పేది వినమ్మా! ఎలాగూ నాన్నగారు, బాబాయ్ చనిపోయారు. నీకంటూ ఎవరూ లేరు. వంటరితనం నిన్ను తినేస్తుంది. ఈ నేపథ్యంలో ఏదొక వ్యాపకం కావాలి కదా! అది ఓ ఉద్యోగం కావచ్చు, స్వయం ఉపాధి కావచ్చు. అలాంటప్పుడు ఈ ప్రధాని పదవినే ఓ ఉద్యోగంలానో, ఓ స్వయం ఉపాధిలా అనుకొని ఒప్పుకోవచ్చు కదా?"

సమీర నిస్తేజంగా వింటోంది. తిరిగి ఆయన కంఠం కదిలింది.

"చూడమ్మా? ఎందరో కావాలనుకున్న లభించని పదవి ఇది. భగవంతుడి దయవల్ల నీకు లభించింది. అలాంటప్పుడు దేశంలో నూట ఇరవై కోట్లు ప్రజలను జనరంజకంగా పాలించే అవకాశం ఇది భగవంతుడు నీకు ప్రసాదించిన వరం. ఈ నూట ఇరవై కోట్ల ప్రజలను నీ కన్నబిడ్డల్లా పాలించవచ్చు కదా!"

సమీర ఆవేశం పూర్తిగా తగ్గిపోయింది. అది చూసి ఆయన కంఠం మరింత వేగంగా కదిలింది.

"అమ్మా! దేశంలో ఇప్పటికే అవినీతి హెచ్చుస్థాయిలో ఉంది. ఎక్కడ చూసినా కుంభకోణాలు, ఏ ఫైలు కదిల్చిన అవినీతితో కంపు కొడుతోంది. ప్రజలు ఇలాంటి వాటితో విసిగిపోయి ఉన్నారు. ఈ దేశానికి నీలాంటి యంగ్‌బ్లడ్ కావాలి. నీలాంటి వాళ్ళే... అంటే రాజకీయాలు పడనివాళ్ళే... కావాలి... అలాంటి వారే వేయి వేణువులతో ఈ అవినీతి దాస్యశృంఖలాలను తెగనరుకుతారు. నీలాంటి వారే కుంభకోణాల ఊబిలో ఉన్న దేశాన్ని ఒడ్డుకు చేర్చగలరు. ఇదిగో ఒకసారి అటు చూడు..." అంటూ టీవీలో ప్రసారం అవుతున్న వాటికేసి చూపించాడు.

ఉండడానికి గూడు లేక ఫుట్‌పాత్ మీద పడుకున్న పేద జనాలు, పాలు లేక ఏడుస్తున్న పిల్లలు, చూసే దిక్కు లేకుండా పడున్న అనాథలు, వికలాంగులు, వృద్ధులు అక్కడ కనిపిస్తున్నారు.

"అమ్మా! విశాల భారతదేశంలో ఇంతమంది ఆకలితో నకనకలాడుతుంటే, రాజకీయ నాయకులు, ఎంపీలు, మంత్రులు కోట్ల కోట్ల ధనాన్ని కొల్లగొడుతున్నారు. ప్రతి వేలంలోనూ వారే పాడుకొని ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. అధికారులకు లంచాలిచ్చి పది తరాల పాటు తమ డబ్బుని పెంచుకుంటున్నారు. వేయి గొడ్లను తిన్న ఈ రాబందుల్లాంటి వారిని అరికట్టే నాయకుల కోసమే ఈ దేశం ఎదురుచూస్తోంది. అలాంటి వారిని ఎన్నిక చేయాలనే నేను నిన్నటి సమావేశంలో ఇప్పుడు ఉన్నవారూ ఎవరూ పనికి రారని తిరస్కరించాను.

నీలాంటి కొత్తతరం యువకులకు, యువతులకు అవకాశం ఇవ్వాలనే ప్రధాని పదవిని అధిష్ఠించడానికి కనీస వయస్సు ఇరవై ఐదు సంవత్సరాలని చట్టం ఇంతకు ముందే చేసింది పార్లమెంట్. ఇది నీకు బంగారు అవకాశం!

ఒక్కసారి ఆలోచించు తల్లీ! నవ భారత నిర్మాణానికి కంకణం కట్టుకునే నాయకురాలుగా చెలామణి అవుతాయో, పదవి వద్దని మరో అవినీతిపరుడి చేతికి దీనికి అందిస్తావో నీవే ఆలోచించు...”

సమీర హృదయంలో ఎక్కడో ఓ పొర కదిలినట్లయింది. అవును! ఎవరో ఒకరు ఈ దుర్గంధపు వ్యవస్థని మార్చాలి. లేకపోతే ఈ వ్యవస్థ మరింత మురికి కూపంలోకి జారిపోతోంది. ఆ ఎవరో ఒకరు తానే ఎందుకు కాకూడదు? నిజమే! ప్రతివారు ఈ రొచ్చు రాజకీయాలు నాకెందుకనుకుంటే ఈ దేశం ఏమయిపోతోంది? ఈ ప్రజలను ఎవరు రక్షిస్తారు? తనకు ఎలాగూ ఎవరూ లేరు. అలాంటి భవబంధాలేమీ లేనప్పుడు తను ఈ దేశ ప్రజల కోసం పాటు పడితే పోయిందేమీ లేదు. అంతేకాదు, తన పగ తీర్చుకోవాలంటే ఇలాంటి పదవి చేతిలో ఉంటేనే సులభమవుతుంది. తన తండ్రిని ఆత్మహత్య చేసుకునేటట్లుగా ప్రేరేపించిన ఆర్యకు మనశ్శాంతి లేకుండా చేయాలి. అలా చేయాలంటే ఈ పదవిని తాను స్వీకరించాల్సిందే!

మరుక్షణం ఆమె నోటంత బుల్లెట్‌లా పదాలు దూసుకొచ్చాయ్.

**“ఈ ప్రధాని పదవిని చేపట్టడానికి నేను అంగీకరిస్తున్నాను...”**

మొదలైంది సంచలనం. ఫలితంగా దేశమంతటా కలకలం మొదలైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కనివినీ ఎరగని స్థాయిలో ఈ విధంగా పార్టీతో సంబంధం లేని ఓ డైనమిక్ లేడీ ప్రధాని అవబోతోంది.

◆ ◆ ◆

**“నూతన ప్రధాని సమీర”**

టీవీలు ఆ వార్తని క్షణక్షణానికి ఫ్లైకార్డులు మీద ప్రదర్శిస్తూనే ఉన్నాయ్. దేశం యావత్తూ షాక్‌కు లోనయ్యింది. ప్రజలు సైతం ఆశ్చర్యాలకు లోనయ్యారు. దేశమంతటా టీవీల ముందే గుమిగూడారు.

‘భారతదేశ అందాల ప్రధాని సమీర’ అంటూనే ఆమె ఫోటోలు ఫ్లాష్ చేశాయి టీవీ ఛానళ్ళు. గుండ్రటి అందమైన మొహం, రాజసం ఉట్టిపడే దర్పం, హుందాగా ఉండే ఆమెని గురించి పదే పదే టీవీ ఛానళ్ళు ఊదరగొట్టేస్తున్నాయ్.

ప్రజలు, రాజకీయ నాయకలు, అధికార వర్గాల్లో సంచలనం, కలకలం. నిన్నటివరకూ ఆమె ఎవరో అనామకురాలు! నేడు ప్రధాని. తన బాబాయ్ చని పోవడంతో వారసురాలిగా ఆమెకు ప్రధాని పదవి దక్కింది. అతి చిన్న వయసులో ప్రధాని అయిన క్రెడిట్ ఆమెకు లభించింది. రాజకీయాలలో హేమాహేమీల్లాంటి ఉద్దండ పండితులుండగా పదవి ఆమెకే దొరికింది.

ఇంకొన్ని టీవీ ఛానళ్ళయితే మరింత ముందుకు వెళ్ళి సమీర కంటే గొప్ప ప్రధాని దేశానికి ఎవరూ లేరు అంటూ కథనాలు ప్రసరించాయి. చదువుకు చదువు, అందానికి అందం, తెలివితేటలకు తెలివితేటలు, క్లిష్టపరిస్థితులలో చకచకా నిర్ణయాలు తీసుకునే ఆమె డైనమిజాన్ని కొనియాడుతూ మాజీ ప్రధాని అంత్యక్రియాలలో ఆమె చాకచక్యాన్ని ప్రశంసిస్తూ ఫోటోలు ప్రసరింపజేశాయి.

ఫలితంగా దేశంలో యువకుల్లో ఆమెకేసి ఆరాధన భావం పెరిగింది. యువతులలో ఆమె పట్ల జెలసీ మొదలయ్యింది. రాత్రికి రాత్రే వార్తల్లో ఎక్కిన ఆమెకేసి సంభ్రమంగా చూస్తూండిపోయారు మహిళలు. ఇల్లు అలకగానే పండుగ కాదు కదా, ముందుంది ముసళ్ల పండగ అన్నట్లుగా మెటికలు విరుచుకున్నారు తోటి రాజకీయ నేతలు.

మొత్తం మీద దేశ, విదేశాలలో సమీర సంచలనానికి మారుపేరుగా నిలిచింది.

అంతా అలా చూస్తుండగానే సమీర పదవీ స్వీకారం చేయాల్సిన రోజు వచ్చేసింది.

◆ ◆ ◆

*“భారతదేశం నా మాతృభూమి. ఈ దేశం సర్వసౌఖ్యం కోసం, అభివృద్ధి కోసం నేను నిరంతరం పాటుపడతాను...”*

విశాలమైన రాష్ట్రపతి భవనంలో భారత అధ్యక్షుడి కంఠం గంభీరంగా ధ్వనిస్తోంది. ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఆమె పెదాలు కదులుతున్నాయి ఆ మాటలను అనుకరిస్తూ. రంగ రంగ వైభవంగా జరుగుతున్న ఆ వేడుకమీద రెపోర్టర్ల కలాలు వేగంగా కదుల్తున్నాయి. టీవీ కెమెరాలు ఆమె మీద ఫ్లాష్‌లు కురిపిస్తూనే ఉన్నాయి నిరంతరంగా.

ప్రపంచంలోనే అతి చిన్న వయసులో దేశప్రధాని బాధ్యతలను చేపట్టిన ఆమెకేసి అబ్బురంగా చూస్తున్నారు ఎంపీలు.

ఆమె నిల్చున్న తీరు ఓ పట్టపు రాణీ ఠీవిగా నిలబడినట్లుంది. ఆకాశంలో నుండి ఇంద్రధనస్సు అనే వారధి ద్వారా భూమ్మీదకు అడుగుపెట్టిన అప్సరసలా ఉందామె.

ఆమె ముఖంమీద కెమెరా ఫ్లాష్‌లు విరామం లేకండా మెరుస్తున్నాయి. టీవీ కెమెరాలు ఆమెను రకరకాలు చిత్రీకరిస్తున్నాయి.

గులాబీరంగు చీర ఆమె అందాన్ని ఇనుమడింపజేస్తోంది. మెడలో ఒకే ఒక సన్నటి బంగారు గొలుసు మెరుస్తోంది. ఎంతసేపైనా చూడాలన్పించే అందమైన మోముతో, రాజసం ఉట్టిపడే దర్పంతో ఠీవిగా, హుందాగా ఉంది.

ప్రమాణస్వీకారం ముగియడంతో అంతా బిలబిలమంటూ బయటికి నడిచారు.

చుట్టూ బ్లాక్‌కాట్ కమాండోస్ గుమిగూడగా ఆమె రాజభవన్ మెట్లు దిగింది. ఆఖరి మెట్టు దిగుతుండగా సైనిక కవాతు మొదలయ్యింది.

ఆమె సైనిక వందనం స్వీకరించింది చిరునవ్వుతో. ఆ తర్వాత ఆమె తిరిగి రాష్ట్రపతితో సమావేశమైంది.

ఆమె తన కొత్త మంత్రి మండలి జాబితాను ఆయనకు సమర్పించింది. ఆ లిస్ట్‌ని చూస్తూనే ఆయన భృకుటి కొద్దిగా ముడివడింది. అయితే అనుభవజ్ఞుడు కావడంతో తమాయించుకొని ఒక్కొక్కరి పేర్లు పిలవసాగాడు.

ఆ లిస్ట్‌లో వున్నవారిలో నలభై శాతం కొత్తవారే. అవినీతి చరిత్ర లేని వారిని ఆమె ప్రత్యేకంగా ఎన్నుకొంది. కేవలం ఎంపీలనే కాదు సమాజానికి సేవలందిస్తున్న వారు, స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలను అందిస్తున్న నిస్వార్థ పరులను, ఐయ్యేయస్‌లు, ఐఐటీలలో మెరిట్ వచ్చిన వారిని ఆమె ఎన్నుకొని మంత్రులుగా, సహాయక మంత్రులుగా నియమించింది.

ఆ లిస్ట్ చూస్తున్న ఎంపీల మొహాలు వెలవెలబోయాయి. కొందరి మొహాలు కందగడ్డల్లా మారిపోయాయి. ఇంకొందరు విసురుగా లేచి అక్కడ నుంచి వెళ్ళిపోయారు.

పదవీ స్వీకారం తంతు పూర్తయ్యాక ఆమె ప్రెస్ హాలుకు బయలుదేరింది. ప్రధాని అయ్యాక ప్రెస్‌ను కలుసుకోవడం ఆనవాయితీ.

ప్రెస్ హాల్లో అడుగుపెట్టగానే ఆమె మొహం మీద కెమెరా ఫ్లాష్‌లు వదరల్లా

కురిశాయ్. ఆమెలో ఏమాత్రం జంకు, బెదురు కనిపించడం లేదు. పూర్తి ఆత్మ విశ్వాసంతో మొహం వెలిగిపోతోంది.

ఆమె వేదిక మీదకు రాగానే అంతా లేచి నిలబడ్డారు గౌరవ సూచకంగా. ఆమె వెనుకాల ఇద్దరు అంగరక్షకులు నిలబడి ఎదురుగా ఉన్నవారిని ఎక్స్‌రే కళ్ళతో చూస్తున్నారు.

ఆమె కూర్చోగానే అంతా తమ తమ సీట్లలో ఆసీనులయ్యారు. ఇక అక్కడ నుండి ప్రశ్నలు వరదల్లా ఆమె మీదకు దూసుకురాసాగాయి. అన్ని ఛానళ్ళ వారు తమ మైకులను ఆమె ముందు ఉంచారు వినడం కోసం.

"వెల్‌కమ్ మైడియర్ యంగ్ ప్రైమ్ మినిస్టర్! భారత ప్రధానిగా ఎన్నికైన సందర్భంలో మీరెలా ఫీల్ అవుతున్నారు?"

మెరుపువేగంతో దూసుకొచ్చింది సమాధానం ఆమె నోటి వెంట.

"ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి చిన్న వయసులో ప్రధాని అవడం నా అదృష్టంగా భావిస్తున్నాను..."

"మీకు ఈ పదవి అనుభవం రీత్యా కాకుండా అయాచితంగా లభించిందని అనుకుంటున్నారు చాలామంది. మీ సమాధానం?"

ఆమె ముఖంలో చిరునవ్వు ఏ మాత్రం తగ్గలేదు.

"పూర్వం కాశీమజిలీ కథల్లో తమ తర్వాత రాజుని ఎన్నుకోవడానికి ఏనుగు తొండంతో పూలదండ పట్టుకొని బయలుదేరి తనకు నచ్చినవారిపై దండ వేసేది. అతడే రాజుగా చెలామణీ అయ్యేవారు. కాని నేడు అందుకు భిన్నంగా పరిస్థితి ఏమీ లేదు. చరిత్రలో చాలామంది ప్రధానులు అనుభవం రీత్యా, పాలనరీత్యా కాకుండా ఆకస్మాత్తుగా ప్రధాని అయినవారే. మరి వాళ్ళంతా చక్కటి ప్రధానులుగా పేరు గాంచలేదా? దేశాన్ని ముందుకు తీసుకుపోలేదా?"

"కాని వారంతా ప్రధాని కాకముందు ఎన్నో సంవత్సరాలు పార్టీకి సేవ చేయడమే కాక మంత్రిగా కూడా పరిపాలనా బాధ్యతలు చేపట్టారు కదా! మీ విషయంలో అలా కాదు కదా! మీరు ఎలాంటి అనుభవం లేకుండా నేరుగా నియమితులయ్యారు కదా?"

"ఏదైనా కొత్త వారికి అవకాశం ఇస్తేనే కదా అనుభవం వచ్చేది. ఇదే ప్రశ్నను

ఆరు నెలల తర్వాత ప్రధానిగా నేను విఫలమైతే మీరు అడగవచ్చు. ఒకవేళ నేను విఫలమైతే రాజీనామా చేస్తాను...”

ఏ మాత్రం తడబడకుండా జవాబు ఇస్తున్న ఆమెను సంభ్రమంగా చూస్తున్నారు. కెమెరా ఫ్లాష్‌లు నిరంతరంగా వెలుగుతున్నాయి ఆమె మీద.

“మీ తండ్రి గారి మీద అవినీతి ఆరోపణలు ఉన్నాయి. దానికి మీ సమాధానం?”

“అవి ఎవరో గిట్టనివారు పుట్టించిన పుకార్లు. అయినా నా సచ్ఛీలతను నిరూపించుకోవడానికి ఆయన ఆస్తిపాస్తులను జాతీయం చేస్తున్నాను. ఐమీన్ దేశ ప్రయోజనాలకే ధారపోస్తున్నాను. అందులో ఒక్కపైసా కూడా నేను ముట్టుకోవడం లేదు”.

విభ్రమం జర్నలిస్టులలో. ప్రశ్నకు జవాబు ఎంత ధీటుగా తిప్పి కొట్టింది?

తిరిగి మరో ప్రశ్న సూటిగా దూసుకొచ్చిందామెమీదకు.

“భారత నూతన ప్రధానిగా మీరు చేపట్టానుకునే ఆశయం ఏమిటి?”

మెరుపువేగంతో కదిలిందామె కంఠం.

“అవినీతి రహిత సమాజాన్ని నెలకొల్పడం. ప్రస్తుతం ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలుతోంది. దాంతో రాజకీయవేత్తలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు మరింత సంపద వంతులవుతున్నారు. పేదవారు ఇంకా పేదవారు అవుతున్నారు. ఈ జాఢ్యం పోవాలి”.

“ఆ అవినీతిని ఎలా రూపుమాపాలనుకుంటున్నారు?”

“అవినీతికి పాల్పడ్డవారి ఆస్థిని జాతీయం చేయడం ద్వారా. అంతేకాదు ఇక నుండి ప్రభుత్వానికి సంబంధించిన అన్ని టెండర్లు ఇంటర్‌నెట్‌లో ఉంచుతాం. అందులోనే కొటేషన్‌లు కోరుతాం. ఎవరు తక్కువ ధరకు, నాణ్యమైన సరుకు లేదా సేవలు అందిస్తారు వారికే ఆ టెండర్ దక్కుతుంది. ఒకసారి ఆ ప్రాజెక్టు చేపట్టాక కనీసం 20 సంవత్సరాలు అది మన్నికగా ఉంటుందో, లేదో పరీక్ష కోసం కార్పొరేట్‌లు, కాంట్రాక్టర్లు ఆస్తులు ప్రభుత్వ తాకట్టులో ఉంటాయి. కాలపరీక్షలు అవి నాణ్యమైనవని తేలితే వారి ఆస్తులు వారికి తిరిగి ఇవ్వబడతాయి. అన్నింటికంటే ముఖ్యంగా అవినీతి నిరోధక శాఖ ఒకదానిని కొత్తగా ఏర్పాటు చేసి, దానిని సిబిఐకు అనుబంధంగా

ఉంచుతున్నాం. ఈ శాఖకు ఓ అధిపతి, అతడి క్రింద రాష్ట్రాల వారీగా అధిపతులు, సిబ్బంది ఉంటారు. ఇవి కేవలం కొన్ని చర్యలు మాత్రమే".

"మీరు ఎన్నుకున్న మంత్రుల్లో చాలామంది కొత్తవారు కదా! వారు ఎంపీలు కాదు కదా! మరి భవిష్యత్‌లో వారి పరిస్థితి ఏమిటి?"

"వారిని ఏదొక నియోజకవర్గం నుండి ఆరు నెలల్లోపు నిలబెడతాం. ఈ ఆరునెలల్లో వారు తీసుకున్న చర్యల వల్ల ఆయా నియోజకవర్గాల్లో గెలుస్తారో లేదో వీరి చర్యలు నచ్చకపోతే ప్రజలే తిరస్కరిస్తారు. అలా తిరస్కరించిన వారి స్థానాల్లో కొత్త వారిని నియమిస్తాం".

"చాలా సాహసోపేతమైన చర్యలు తీసుకుంటున్నారు. అందువల్ల మీరు ఈ పదవిలో ఎక్కువకాలం ఉండగలననుకుంటున్నారా?"

"నా దృష్టిలో" మెరుపువేగంతో కదిలిందామె కంఠం" వీలున్నంత తక్కువ కాలంలో వేగవంతమైన సంస్కరణలు ప్రవేశపెట్టి మార్పు తేవాలనుకుంటున్నాను. అంతే కాని రేపు పదవి ఉంటుందో, లేదో అన్న చింత అనవసరం. పదవి తీసుకుంటే సమర్థవంతంగా, పరిపూర్ణంగా, చిత్తశుద్ధిగా చేయాలని నా కోరిక. అంతేకాని భయపడుతూ పదవి ఎక్కడ ఊడిపోతుందో, ఏ టెర్రరిస్ట్ లేదా నక్సలైట్ కాల్చేస్తాడోనన్న భయంతో కాదు."

"అన్నట్లు నక్సలైట్లను, టెర్రరిస్టులను ఎలా డీల్ చేద్దామనుకుంటున్నారు?"

"ముందుగా మన కోర్టు చట్టాలు మార్చాలి. ఒక టెర్రరిస్ట్ దొరికితే విచారణ పేరున నెలలు, సంవత్సరాలు గడవకుండా అప్పటికప్పుడే సాక్ష్యాధారాలను చుట్టి అతన్ని శిక్షించాలి. అరబ్ దేశాలలో ఒక వ్యక్తి నేరం చేస్తే అప్పటికప్పుడే కాలో, చేయే తీసేస్తారు. అలాంటి బలమైన చట్టం పార్లమెంట్ ద్వారా ప్రవేశపెట్టాలనుకుంటున్నాం."

కొందరు వ్యక్తులు ఎందుకంత గొప్పవారిగా పరిగణింపబడతారో అప్పుడు అర్థమయ్యిందా విలేఖరులకు. సన్నగా, సుతారంగా, పుత్తడి బొమ్మలా స్వచ్ఛంగా మెరిసిపోతున్న ఆమెకేసి టీవీ కెమెరాలు వేగంగా కదలుతున్నాయి.

ఆఖరి ప్రశ్న 'టైమ్ ఆఫ్ ఇండియా' జర్నలిస్ట్ నుండి వెలువడింది.

"ప్రజాప్రతినిధులకు మీరిచ్చే నిర్వచనం ఏమిటి?"

సఁ్రున దూసుకొచ్చిందామె నోట్లంచి సమాధానం.

"భగవంతుడు అన్ని చోట్లా వుండలేడు కాబట్టి తన తరఫున ప్రజల సమస్యల్ని తీర్చడానికి సృష్టించిన సముదాయమే ప్రతినిధులు".

అబ్బురపడిపోయారు ఆ సమాధానానికి. కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

ఆ కరతాళ ధ్వనులు మధ్యే ప్రెస్ కాన్ఫరెన్స్ ముగిసింది. అంతా లేచారు. చుట్టూ బ్యాక్‌క్యాట్ కమాండోస్ చుట్టుముట్టగా ఆమె కదిలింది.

ఆమె కోసం బయట కారు దగ్గరున్న మరో సెక్యూరిటీ ఆఫీసర్ వినయంగా డోర్ తెరిచాడు. ఆమె హుందాగా ఎక్కి కూర్చుంది.

మరుక్షణం ఆ కారు ముందు మూడు కార్లు, వెనకాల మరో రెండు కార్లు బ్యాక్‌క్యాట్ కమాండోస్ అనుసరిస్తుండగా ఆమె కారు కదిలింది.

ఆమె వెళ్ళాక విలేఖర్లు మాట్లాడుకుంటూ కారిడార్ వైపు కదిలారు.

"ఆమె నిజంగా ఓ అద్భుతం. అన్ని సబ్జెక్టులో ఇంత అథారిటీని నేను ఇంతవరకూ ఏ ప్రధానిలోనూ చూడలేదు".

"ఆమె మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ కదా! అందుకే అన్ని విషయాలపై అంతో ఇంతో పరిజ్ఞానం ఉంది!"

"ఏది ఏమైనా ఇప్పటివరకూ ఆమెంత డైనమిక్ ప్రధానిని తారసపడలేదు. ఆమె తప్పకుండా భారతీయ చరిత్రలో రికార్డును సృష్టిస్తుంది. ఆమె సమక్షంలో భారతదేశం సుభిక్షమైన దేశంగా మారిపోతుంది. అందులో సందేహం లేదు."

◆ ◆ ◆

పార్లమెంట్!

ఆమె తన సీట్లో ఆసీనురాలై ఉంది. స్పీకర్ అంతా వచ్చారా అన్నట్లుగా ఎదురుగా చూశారు.

సగం పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయి.

ఒక్కొక్కరూ నెమ్మదిగా, పీతల్లా దిగుతున్నారు. కొందరి సీట్లోనే అప్పుడే కునుకుపాట్లు పడుతున్నారు. ఇంకొందరు చెవులకు ఇయర్‌ఫోన్ తగిలించుకొని పాటలు వింటున్నారు. ఇంకొందరు సెల్‌ఫోన్ తీసి మాట్లాడుకుంటున్నారు.

ఆమెకు కంపరంగా ఉంది. ప్రజాప్రతినిధుల సభలో చాలామంది బాధ్యతా యుతంగా ప్రవర్తించడం లేదు. చేపల మార్కెట్‌లా కలకలంగా ఉంది. ప్రతిపక్షాల సంగతి అలా ఉంచినా, తమ పార్టీ సభ్యుల్లోనే క్రమశిక్షణ కనిపించడం లేదు.

పదకొండు అయింది. స్పీకర్ అనుమతి తీసుకొని ఆమె లేచింది మాట్లాడడానికి.

“డియర్ మెంబర్స్! కొన్ని లక్షల మంది ప్రతినిధులుగా మనం ఇక్కడ సమావేశమయ్యాం. కాని ఏమాత్రం బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదు. మీ స్వంత ఇంట్లో, వ్యాపారాలలో ప్రవర్తించడం వేరు. ఇక్కడ ప్రవర్తించే విధానం వేరు. ఇక్కడ మనం లక్షలమంది సమస్యలకు, బాధలకు, సంతోషాలకు ప్రతినిధులం. మనం తీసుకునే నిర్ణయాలు కొన్ని కోట్లమందిని ప్రభావితం చేస్తాయి. అలాంటప్పుడు మనం బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉంది. అంతేకాని సభలో లేకీగా ప్రవర్తించడం సమయాన్ని వృథా చేయడం లాంటి పనులకై కాదు”.

ఓ క్షణం ఆగి తిరిగి కదిలిందామె కంఠం.

“ఇప్పుడు సభాపతి అనుమతి తీసుకొని కొన్ని చర్యలు ఇక నుండి తీసుకోదలిచాను.

ప్రతి ఎంపీ శాసనసభకు తప్పకుండా హాజరవ్వాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ లేటుగా రాకూడదు. వచ్చిన తర్వాత తిండి, తిప్పలంటూ సమయం వృథా చేయకూడదు. శాసనసభలోకి సెల్‌ఫోన్‌లు బంద్. ఈ విషయాలన్నింటినీ స్పీకర్ అనుమతి తీసుకొని నేను ప్రకటిస్తున్నాను.”

మరుక్షణం కొంతమంది సభ్యులు చప్పట్లు కొట్టారు. మరికొంతమంది పెదవి విరిచారు.

సరిగ్గా అదే సమయంలో లోపలికి వచ్చారు ఇద్దరు ఎంపీలు.

ఆమె ముఖం కోపంతో ఎరుపెక్కింది. వెంటనే వారిని చూస్తూ కదిలింది ఆమె కంఠం.

“సభ ప్రారంభమై ఇప్పటికే రెండు గంటలు కావస్తోంది. ఎందుకు లేటుగా వచ్చారో తెలుసుకోవచ్చా?”

అందరి మొహాలు వారికేసి తిరిగాయి. ఆ ఎంపీలు బిత్తరపోయారు. ఇప్పటిదాకా తమను అలా అడిగినవారే లేరు.

"ఆరోగ్యం బాగోలేదు. బీపీ, సుగర్ ఎక్కువయ్యాయి"

అది అబద్ధమని అందరికీ తెలుసు. వాళ్ళు ఎప్పుడూ లేట్‌గా వస్తారని అందరికీ తెలుసు.

అంతా ఉద్వేగంగా ఆమెకేసే చూస్తున్నారు.

"ఆరోగ్యం బాగోకపోతే..." తడుముకోకుండా కదిలిందామె కంఠం. "మీ పదవులకు రాజీనామా చేయండి. మీ స్థానాల్లో ఆరోగ్యం బాగున్నవారు ప్రజాసేవ చేస్తారు."

షాక్ తగిలినట్లుగా అలాగే నిల్చుండిపోయారా ఎంపీలు. ఇప్పటివరకూ ఏ ప్రధాని తమని అలా నిలదీయలేదు. వారి మొఖలు జేవురించుకుపోయాయి.

"నీవెవరు రిజైన్ చెయ్యమని చెప్పడానికి.."

"పార్టీ అధినేతగా ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే అధికారం నాకుంది. సభకు లేటు వచ్చిన మీరు – మీ రాష్ట్రంలోని సెక్రటేరియట్‌లో సరైన టైమ్‌కు రావడం లేదని వందమందిని ఎందుకు సస్పెండ్ చేశారు?"

అదిరిపోయారా ఎంపీలు. తమ చరిత్ర మొత్తం ఆమె కంప్యూటర్‌లో నిక్షిప్తంగా ఉందని వారికి అప్పుడు అర్థమైంది. తిరిగి కదిలిందామె కంఠం.

"ఉద్యోగులకు ఆదర్శంగా ఉండలేని మీరు వారిపైన చర్య తీసుకునే హక్కు ఉందా?"

ఆ ఎంపీల రక్తం సలసలకాగింది.

"సరే నీ సంగతి చూస్తాను. రాజకీయాల్లో ఇరవై సంవత్సరాల చరిత్ర మాకుంది. అలాంటిది ఊరూ పేరూ లేని నీవు మమ్మల్ని బెదిరిస్తావా? అసలు నీకు దమ్ముంటే మా నియోజకవర్గంలో మాతో పోటీ చేసి ఎంపీగా గెలువు"

అంతా దిగ్భ్రాంతిగా చూస్తున్నారామెవేపే. ఈ గొడవ ఎటు పోయి ఎటు వెళ్తుందో వారికి అర్థం కావడం లేదు.

వారంతా అలా డీప్‌షాక్‌లో ఉండగానే కదిలిందామె కంఠం.

"సరే మీ ఛాలెంజ్‌ని నేను అంగీకరిస్తున్నాను. ఎలాగూ నేను రాజ్యసభ సభ్యురాలిని. అది ప్రత్యక్ష ఎన్నిక కాదు. కాబట్టి లోక్‌సభకు ఎన్నిక కావాలనుకుంటు న్నాను. ఆ అవకాశం మీ ఛాలెంజ్ రూపంలో వచ్చింది. నేను ప్రజల చేత ప్రత్యక్షంగా

ఎన్నిక కావడానికి మీ నియోజకవర్గంలో లోక్‌సభకు పోటీ చేస్తున్నాను. అందులో గెలుస్తే రాజ్యసభ సీటుకు రాజీనామా చేస్తాను. సరేనా?"

పిచ్చెక్కిపోయింది వారికి. వెంటనే రోషంతో ఆ ఎంపీలో ఒకరు తమ పదవికి అప్పటికప్పుడే రాజీనామా చేశారు.

ఆ తర్వాత నెల రోజుల్లోనే ఆ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగాయి.

*భారతీయ రాజకీయ చరిత్రలోనే ఎన్నడూ లేనంత మెజారిటీతో ఆమె ఆ నియోజకవర్గం నుండి ఎంపీగా గెలిచింది. ఆమెతోపాటు పోటీ చేసిన అసమ్మతి ఎంపీకి కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు.*

◆ ◆ ◆

# 6

ఆర్య మనసు ఆ రోజు అసంతృప్తిగా ఉంది. ప్రపంచంలోని వంటరితనం అతడి మనసుని నిలువునా కోసేస్తోంది.

ఒక ఆశయం కోసం బ్రతుకుతున్న అతడిని అశాంతి అప్పుడప్పుడూ తినేస్తోంది. ఎవరి కోసం బ్రతకాలన్న నిరాశ అతడిని నిలువెల్లా దహించి వేస్తోంది.

మనిషికి 'రేపు' అన్న ఆశ లేకపోతే బ్రతుకు నిస్సారంగా అన్పిస్తోంది. అతడికి ఎలాంటి ఆశలేదు. ఒక్క పగ తప్ప. పగ అనేది 'ఆశ' కాదు. ఒక ధ్యేయం మాత్రమే అందుకే అతడిలో నిరాశ, చీరకులు పడగ విప్పుకొని కనిపిస్తున్నాయి.

కంప్యూటర్ ముందు కూర్చున్న అతడి మెదడు గజిబిజిగా ఉంది. నిద్ర వస్తున్నట్లుగా మైకం కమ్మేస్తోంది. దాంతో నీరసంగా టేబుల్ మీద అలాగే తల పెట్టుకున్నాడు. అతడి చేయి విసురుగా కీబోర్డు మీద పడింది. విసురుకు చేయి కొన్ని అక్షరాలు, నెంబర్ల మీద పడింది. ఫలితంగా ఆ అక్షరాలు, నెంబర్లు ఒక క్రమబద్ధమైన లైన్‌గా మారిపోయాయి. మరుక్షణం కాంతి తరంగాలు ఆ అడ్రసుకేసి వేగంగా ప్రయాణించసాగాయి.

ఆకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటన అతడిలోని సిక్త్ సెన్స్ మేలుకొలిపింది. వాటిని ఆపుదామని ఎస్కేప్ బటన్ ప్రెస్ చేయడానికి ప్రయత్నించాడు.

కాని ఈలోపే..... ఓ అద్భుతం జరిగినట్లుగా, ఓ అరుదైన వింత

సంభవించినట్లుగా కంప్యూటర్‌లో దృశ్యాలు కనిపించసాగాయి. అతడు అలాగే కళ్ళప్పగించి చూస్తూండిపోయాడు.

కంప్యూటర్ స్క్రీన్ మీద ఓ అందమైన అమ్మాయి కనిపిస్తోంది. ఆకస్మాత్తుగా ప్రెస్ చేయబడ్డ అక్షరాలు ఓ ఆకృతిగా మరి ఆ అమ్మాయి ఇంటిని గమ్యస్థానంగా చూపించాయి.

తన జీవితంలో ఎంతోమంది అమ్మాయిల్ని చూశాడు కాని అంత సహజ అందాన్ని మటుకు చూడలేదు.

ఈ కాలం అమ్మాయిల్లోని గడుసుతనం ఆమెలో కనిపించడం లేదు. కల్మషం తెలియని అమ్మాయిగా కనిపిస్తోంది.

జీవితంలో బ్యూటీక్లినిక్ జోలికే వెళ్ళలేదన్నంత నిర్మలంగా ఉందామె మొఖం.

పర్ణశాల లాంటి చిన్న ఇల్లు. ఎక్కడా వస్తువులక్కడ నీట్‌గా, పొందిగ్గా కనిపిస్తున్నాయి. ఓ ఇంటికి మూలంగా ఓ మొక్క లోపలికి తొంగిచూస్తోంది. ఇవతల వేపు హుండీల్లో రకరకాల గులాబీ పూల చెట్లు కనిపిస్తున్నాయి.

తలస్నానం చేసిన ఒత్తయిన జుట్టు, పైకి దువ్విన ఫాలభాగం మీద తొలి పొద్దులాంటి ఎర్రటి తిలకంతో, ప్రపంచ కావ్యాల్లోని లాలిత్యాన్నంతా ప్రోవి చేసి పొదిగినట్లు కళ్ళు, దానిమ్మ పూవులాంటి పెదాలతో అద్భుతంగా ఉందా అమ్మాయి.

మొత్తం మీద ఆ చిన్న ఇంట్లో ఆమె అపురూప సౌందర్యరాశిలా భాసిస్తోంది.

ఆ సహజ సౌందర్యం ఎదుటివారి మతిని పోగొట్టేలాగా ఉంది. నిత్య వీణాబిపాణి శారదని చూస్తూ బ్రహ్మ పట్టుదలతో తీర్చిదిద్దిన బొమ్మలా ఉంది.

ఒక్కసారిగా అతడికి సమీర గుర్తొచ్చింది. వేగంగా ఎగిసిపడే జలపాతంలా ఉంటుంది సమీర. నెమ్మదిగా ప్రవహించే సెలయేరులా కనిపిస్తోంది ఈ అమ్మాయి.

అతడి కళ్ళు అక్కడ ఉన్న నోటు పుస్తకం పైనున్న పేరుని వెతికాయి.

"దాక్షాయణీ"

అన్న అక్షరాలు అందంగా కనిపించాయ్.

ఓహ్! కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా ఏ అమ్మాయిలో కనిపించని ఈ అందం పేరు దాక్షాయణీ? బాగుంది పేరు. పైగా తెలుగు అమ్మాయి.

చాలామంది అమ్మాయిలు ఒకే కోణంలో బాగుంటారు. పక్క నుండి బాగుంటే

ఎదురుగా బాగోరు. ఈ రెండు వైపులా బాగుంటే వెనక వైపు నుండి బాగోరు. కాని ఈ అమ్మాయి ఎటువైపు నుండి చూసినా మనోహరంగా కనిపిస్తోంది. అలా అన్ని వైపుల నుండి అద్భుతంగా కనిపించేవారు చాలా తక్కువ. అలాంటి అరుదైన అందాన్ని స్వాధీనం చేసుకోవడం ఆ అమ్మాయి అదృష్టం.

ఆ అమ్మాయిలో కనిపించే మరో గొప్పతనం ఎంత సేపైనా చూడాలనిపించడం. చాలామంది అమ్మాయిలు చూడడానికి అందంగా ఉంటారు. కాని కాసేపూ చేసిన తర్వాత ఏదొక అవకరం బయటపడుతుంది. పరీక్షగా చూస్తే ఎక్కడో ఓ లోపం కనిపిస్తుంది. పైగా కాసేపూ చూస్తే బోర్ కొడుతుంది. కాని ఈ అమ్మాయిని ఎంతసేపు చూసినా తనివి తీరదు. దానికి తోడు సహజమైన అందం కావడంతో ఇంకా ఇంకా చూడాలనిపిస్తోంది.

అతడా అలౌకిక స్థితిలో ఉండగానే ఆ అమ్మాయి కదిలింది. ఫలితంగా ఆమె గాజులు, కాళ్ళ మువ్వలు మనోహరంగా శబ్దం చేశాయి. ఆ శబ్దానికే అతడు ఈ లోకంలోకి వచ్చి స్క్రీన్ మీద దృష్టిని నిలిపాడు.

ఆ అమ్మాయి డ్రాయింగ్ వేస్తోంది. కాన్వాస్ మీద ఆమె చేతులు కదులుతున్నాయ్. రాధాకృష్ణుల బొమ్మ అపురూపంతో చిత్రీకరిస్తోంది. ఆ చిత్రీకరణలోనే పాట హమ్ చేస్తోంది.

*ఆకులో ఆకునై కొమ్మలో కొమ్మనై*
*ఇచటనే ఎటులైనా ఆగిపోనా*

అతడికి ముచ్చటేసింది. ఈ కాలం అమ్మాయిలు సమయం దొరికితే మొబైల్ లేదా కంప్యూటర్ తెరిచి చాటింగో, ఫేస్‌బుక్కో ఓపెన్ చేస్తారు. కాని ఈ అమ్మాయి లలితకళలను ఎన్నుకుంది. దానిని ఓ హాబీగా మార్చుకుంది.

అతడలా ఆలోచిస్తుండగా ఆమె చేతిలో ఆ బొమ్మ పూర్తి రూపం సంతరించుకుంది. అతడు ఆ చిత్రాన్ని చూసి అప్రతిభుడయ్యాడు.

మైగాడ్! ఎంత అద్భుతంగా ఉంది! దేశంలో పేరు పొందిన ఆర్టిస్ట్‌లు సైతం వేయలేనంత అద్భుతంగా చిత్రీకరించింది. ఇవాళ, రేపు చేతిలో కొంత కళ ఉంటే దానిని వ్యాపారమయంగా ఎలా మార్చుకుందామా అని ఆలోచించేవారు. కాని ఈ అమ్మాయిలో అలాంటి భావనే కనిపించడం లేదు.

పేరుకు రెండు గదులే! కాని ఆ రెండు గదులనే కళాత్మకంగా మార్చుకుంది. ఆ రెండు గదుల్లోనే విజన్ నెట్‌లోని కాంతి తరంగాలు లోపలికి ప్రవేశించే అక్కడ దృశ్యాలను ఫోటోలు తీస్తోంది.

ఇవాళా, రేపూ ఒక గంట ఇంట్లో కూర్చోమంటే బోర్‌గా ఫీలయ్యే అమ్మాయిలున్న ఈ రోజుల్లో, ఈ అమ్మాయి కళాత్మకంగా ఎంత చక్కగా తనను తను తీర్చిదిద్దుకుంది.

... పెయింటింగ్ పూర్తి చేసిన ఆ అమ్మాయి దానిని ఓ ప్రక్కన ఉంచింది. తర్వాత కాన్వాస్ స్టాండ్‌ని దింపి, ఎక్కడ వస్తువులను అక్కడ పొందిగ్గా సర్దింది.

ఆ తర్వాత తలుపులు వేసింది తన డ్రెస్ మార్చుకోవడానికి.

ఆర్యలో సభ్యత మేలుకుంది. క్షణం కూడా ఆలస్యం కాకుండా తన విజన్ నెట్‌ని ఆఫ్ చేసేశాడు. ఎంత దొంగతనంగానైనా ఆడవారు డ్రస్సు మార్చుకుంటుంటే చూసే కుసంస్కారం అతడిలో లేదు. అందుకే వెంటనే తన వండర్ మిషన్‌ని మూసేశాడు.

◆ ◆ ◆

మరో ఐదు గంటలు గడిచాయి.

కంప్యూటర్‌లో కన్పించిన ఆ అమ్మాయిని మర్చిపోలేకపోతున్నాడు ఆర్య. ఎంత కంట్రోలు చేసుకుందామన్నా మనసు ఆమె వేపే తిరుగుతోంది.

ఇక ఆగలేక కంప్యూటర్‌లో తిరిగి ఆమె అడ్రసు టైప్ చేశాడు ఆర్య. మరుక్షణం కంప్యూటర్ స్క్రీన్‌లో ఆ అమ్మాయి కన్పించింది.

"తరలి రాదా తానే వసంతం

తన దరికి రాని వనాలకోసం"

సిరివెన్నెల సీతారామశాస్త్రి విరచించిన ఆ పాటకు తగ్గట్లుగా ఆమె పెదాలు కదులుతున్నాయి.

భావుకత్వానికి మారు ప్రేమ దాక్షాయణి. ఈ కాలపు అమ్మాయిలకు విరుద్ధం ఆమె. కంప్యూటర్, ఇంటర్‌నెట్, సెల్‌ఫోన్‌లకు ఆమడ దూరం. ఆ కాలనీ మొత్తంలో సెల్‌ఫోన్ లేనిది ఆమె ఒక్కరికే. ఆఖరికి ఆమె ఇంట్లో పనిచేసే అమ్మాయికి సైతం పదివేలు ఖరీదు చేసే సెల్‌ఫోన్ ఉంది. కాని దాక్షాయణీకి మటుకు సెల్‌ఫోన్ లేదు. కాకపోతే ఆమె ఇంట్లో బిఎస్ఎన్ఎల్ వారి పాతకాలపు ఫోన్ మాత్రం ఉంది. అందులో పదిరోజులకొక కాల్ వస్తే గొప్ప. ఆమె ఫ్రెండ్సందరికీ ఛాటింగ్ దగ్గర నుండి ఇంటర్‌నెట్ దాకా రకరకాల అలవాట్లు ఉన్నాయి. ఆమెకు ఆ వాసన పడదు. అసలు చాటింగ్ అంటే ఏమిటో తెలుసుకోవలన్న ఆసక్తి కూడా లేదు.

బ్యూటీక్లీనిక్‌కి ఆమె ఆమడదూరం. ఆమె ప్రక్కింట్లో ఉండే బామ్మగారు సైతం ఫేషియల్, థ్రెడ్డింగ్‌కు బ్యూటీక్లీనిక్‌లకు తరచూ వెళ్తుండేది. కాని దాక్షాయణీకి ఫేషియల్‌కి అర్థం తెలియదు. థ్రెడ్డింగ్‌లో ఏమి చేస్తారో తెలియదు. అసలు తెలుసుకోవాలన్న ఆశ కూడా లేదు.

ఆ మాటకొస్తే ఆమె ఇంట్లో టీవీ కూడా లేదు. ఓ పాతకాలం రేడియో మాత్రం ఉంది. అందులో ప్రభుత్వం నిర్వహించే వివిధ భారతి మాత్రం వస్తుంది. ఆ పాటలు అప్పుడప్పుడు వింటుంది.

మరి ఆధునిక అమ్మాయిల్లా ఆ దాక్షాయణికీ టైంపాస్ ఎలా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. అసరా అమ్మాయికి టైమ్‌పాస్ గొడవే లేదు. ఎప్పుడూ చూసిన ముగ్గులు వేస్తూ కూనిరాగాలు తీస్తుంటుంది. రామాయణం, భగవద్గీత పట్టుకుంటుంది. లేదా వేదాలు పఠిస్తుంటుంది. నిజానికీ ఆ అమ్మాయికి ఇంట్లో పనే సరిపోతుంది. కాస్తా తీరిక దొరికితే ఇల్లు సర్దుతూ, తన లంగాలు, ఓణీలు కుట్టుకుంటూ ఉంటుంది.

ఆమె తండ్రి రామశర్మ ఓ ప్రభుత్వాఫీసులో గుమాస్తా. ఆయన భావాలే కూతురికి వచ్చాయి. రామశర్మ భార్య చాలాకాలం క్రితమే ఏదో జబ్బు చేసి పోయింది. అప్పట్నుంచి రామశర్మకి కూతురే దిక్కు. ఈ కాలంలో ఆధునిక పరికరాలన్నీ చెడుపు చేసేవే అని ఆయన అభిప్రాయం. ఆ పరికరాల నుండి వెలువడే రేడియేషన్ వల్ల మనిషి మెదడు, శరీరం శుష్కించిపోతుందని ఆయన అభిప్రాయం.

తండ్రీ భావాలనే దాక్షాయణీ తూచా పుణికి పుచ్చుకుంది. పేరుకు పాత భావాలే ఉన్న దాక్షాయణీ అద్భుత అందగత్తె. పాతకాలం సినిమాలో బి.సరోజాదేవిలా పెద్దకళ్ళతో, కొటేరుముక్కుతో యాక్టివ్‌గా ఉంటుంది.

కొంతమందిని చూస్తే ఎలాంటి భావం ఏర్పడదు. సాదాసీదాగా ఉంటారు. ఇంకొంతమంది అందంగా ఉంటారు కాని చూసిన గంట తర్వాత ఏమీ లేదనిపిస్తుంది. కానీ దాక్షాయణీని చూసిన ప్రతివారికి ఆ అమ్మాయికి దగ్గరైతే బాగుండునన్పిస్తోంది. ఆ అమ్మాయిని ఒకసారి చూసిన తర్వాత మళ్ళీ చూడకపోతే బ్రతకలేమనిపిస్తోంది. అలాంటి అరుదైన దగ్గరతనం ఆ అమ్మాయిలో ఉంది.

ఆమెని చూడగానే పెద్దవారికి ఇలాంటి కూతురు ఒకటుంటే ఎంత బాగుంటుందో అనిపిస్తుంది. అదే వయసులో ఉన్న మగవారికైతే ఆమెలాంటి భార్య ఉంటే ఈ జీవితానికి ఇంకేమీ వద్దనిపిస్తోంది.

అలాంటి దాక్షాయణీకి ఆ రోజు ఉదయం నుండి కుడికన్ను అదురుతోంది. అదే ఆమెకు కొద్దిగా చికాకుగా ఉంది. ఇవాళ ఏమీ జరగబోతుందోనన్న ఆదుర్దా ఆమెను వెంటాడుతోంది.

ఆ ఆదుర్దాలోనే మధ్యాహ్నం మూడు గంటలు గడిచింది. 'అమ్మయ్యా! ఇవాళ సగం రోజు గడిచింది. మిగతా సగం కూడా గడిస్తే ఏ గొడవ ఉండదు' అని గుండె మీద చేయి వేసుకొని అటు తిరిగిన మరుక్షణం వినిపించింది.

టప్‌మన్న తలుపు శబ్దం.

ఆమె కుడికన్ను మరోసారి కొట్టుకుంది. ప్రతిగా మరోసారి తలుపు టప్‌మన్న శబ్దం వినిపించింది.

'ఎవరు? ఎవరొచ్చారు ఈ వేళ?' గుండెల్లో ఆదుర్దా మొఖం మీద ప్రస్ఫుటమవుతుండగా తలుపు దగ్గరకు వెళ్లి గడియ తీసింది.

ఎదురుగా ఇద్దరు వ్యక్తులు నిలబడున్నారు. ఒకడు మొరటుగా ఇన్‌షర్ట్ చేసుకొని ఉన్నాడు. రెండోవాడు ఏవో కాగితాలు చేతిలో పట్టుకొని ఉన్నాడు.

ఆమెని చూస్తూనే మొరటుగా ఉన్నవాడి కళ్ళు ఆశ్చర్యంగా, తన్మయంగా చూశాయి. నిజానికీ ఇంత అందమైన అమ్మాయి ఎప్పుడూ చూడలేనట్లుగా చూస్తుండి పోయారు.

"ఎవరు – మీరు?" ఆమె ప్రశ్నతో ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చాడు.

"మేము డైనమిక్ క్రెడిట్ కార్డు కంపెనీ వారం...."

"క్రెడిట్ కార్డు వారా... అంటే..." ఆశ్చర్యం ఆమెలో.

అతడికి పిచ్చెక్కింది. క్రెడిట్ కార్డు అంటే తెలియదా? అలాంటివారు ఈ కాలంలో ఇంకా ఉన్నారా? ఈమె వాలకం చూస్తుంటే జోక్ చేస్తున్నట్లు కనిపించడం లేదు.

ఇక తప్పదన్నట్లుగా కదిలిందతడి కంఠం.

"మీ నాన్న సహాధ్యాయి అప్పు తీసుకున్నాడు. వాటి మీద మీ నాన్న గ్యారంటీ సంతకం చేశాడు. అప్పు తీసుకున్నవాడు ఎగ్గొట్టాడు. మీ నాన్న కోసం వెతుకుతూ ఇంటికి వచ్చాం..."

"మైగాడ్! వారెవరో అప్పు తీసుకుంటే దానికి మా నాన్నేం చేస్తారు?"

"మరి గ్యారంటీ సంతకం పెట్టాడుగా?"

"అవును! ఇప్పుడు గుర్తొచ్చింది. ఆ సహోధ్యాయి రావుగారి అమ్మాయి పెళ్ళి ఖర్చుల కోసం డబ్బు కావాలని వచ్చాడు. తన దగ్గరేం డబ్బు లేదని నాన్న చెప్పారు. దాంతో మా నాన్న ప్రభుత్వోద్యోగి కాబట్టి సంతకం పెడితే అప్పు ఇస్తారని వాళ్ళ ఆఫీసువారు చెప్పారట. డబ్బు లేకపోతే తన కూతురు పెళ్ళి ఆగిపోతుందని వాళ్ళు కాళ్ళా వేళ్లా పడితే గత్యంతరం లేక కరిగి నాన్న సంతకం పెట్టారు. దానికి ఇదా ఫలితం?"

"అదంతా మాకు తెల్వదు... ముందు పైసలు కట్టండి. మీ నాన్న గ్యారంటీ ఇచ్చిన యాభై వేలు మూడు సంవత్సరాలలో వడ్డీ మీద వడ్డీ పెరిగి ఐదు లక్షలు అయ్యాయి. అందుకే కంపెనీవారు ఈ డ్యూటీని మాలాంటి రికరింగ్ ఏజంట్లకు అప్పజెప్పింది..."

"అదంతా మాకు తెలియదు. అయినా యాభై వేలు అసలు ఐదు లక్షలు ఎక్కడైనా అవుతుందా? అసలు మేము కట్టం...."

"కట్టకపోతే ఇంట్లో సామానులు బయట పడేస్తాం. అదీ గాక బజారులో నానా అల్లరి చేస్తాం... ఆఖరికి పోలీసులు కూడా ఏం చేయలేరు.."

ఆమె భయవిహ్వలగా చూసింది. వీళ్ళెవరో రౌడీల్లా ఉన్నారు. డబ్బు కట్టకపోతే నిజంగానే నానా అల్లరి చేసేటట్లున్నారు. సమయానికి నాన్న కూడా లేరు. వేరే ఊరికి వెళ్ళాడు.

ఆమె బయటకు చూసింది ఎవరైనా తనకు సహాయపడతారేమోనని. బయట రెండు జీపుల్లో ఆ రౌడీగారి మనుషులే ఉన్నారు. వారికి భయపడి చుట్టూప్రక్కల వారు ప్రక్కకు తప్పుకున్నారు.

"నాన్న ఉన్నప్పుడు రండి.."

"ఇప్పటికీ నాలుగుసార్లు మీ నాన్న ఆఫీసుకు వెళ్ళాం.... మీ నాన్న వచ్చే వారం, వచ్చే వారం అంటూ ఇప్పటికే నాలుగుసార్లు తిప్పారు. ఇవాళ అటో, ఇటో తేలిపోవాలి" అందమైన ఆమె శరీరం వంక ఆకలిగా చూస్తూ నాలిక చప్పరించాడు.

ఆమె ఒకడుగు వెనక్కి వేసింది. అతడు ఒకడుగు ముందుకేశాడు.

"ఏయ్! ఆగు అక్కడే! ఇంట్లోకి వస్తున్నవేమిటి? మర్యాదగా ఉండదు"

"ఏం చేస్తావే నువ్వు?" ఆమె వెంటే నడుస్తూ కదిలాడు.

ఆమెలో భయం నరనరాన పాకిపోయింది. చెమటతో ఒళ్ళంతా తడిసి పోయింది. మైగాడ్! ఈ పశువు ఇంట్లోకి వస్తున్నాడు. తననేం చేస్తాడో?

అతడు ముందుకు వస్తూనే ఉన్నాడు. అదే సమయంలో అతడి అసిస్టెంట్లు కూడా జీప్ దిగి ఇంట్లో అడుగుపెట్టారు.

అతడు ఆమె వంటి మీద చేయి వేయబోయాడు. ఆమె లోపలికి పరిగెత్తింది. లోపల తలుపు లాక్ చేసుకుందామని ప్రయత్నించింది. కాని అతడు కాలు తలుపుకు అడ్డం పెట్టాడు.

"దేవుడా! రక్షించు నన్ను ఈ పశువు నుండి" ఆమె భయంతోనే ప్రార్థిస్తోంది.

అతడి చేయి ఆమె పైట మీద పడబోయింది. ఆమె తప్పుకుంటూ ఆఖరిసారి భగవంతుడిని ప్రార్థించింది.

అలనాడు నిండుసభలో ద్రౌపది తన మానసంరక్షణకు శ్రీకృష్ణుడిని ప్రార్థించినట్లే ఆమె భగవంతుడిని వేడుకొంది.

ఆమె ప్రార్థనకు ఎవరూ రాలేదు కాని ఎదురుగా వున్న రౌడి సెల్ మ్రోగింది. అతడు ఆగాడు. ఆమెను అనుమానాస్పదంగా చూస్తూ సెల్ ఎత్తాడు. ఆ తొందరలో స్పీకర్ బటన్ నొక్కాడు. అందులో నుండి మాటలు దూసుకొచ్చాయి.

"ఒరే శంకర్! ఆ అమ్మాయిని వదిలెయ్‌రా"

"ఎవడ్రా నీవు?"

"అదంతా నీకెందుకు! ముందా అమ్మాయిని వదిలెయ్"

"ఏందీ బే! నా సెల్ నెంబరు తెలుసుకొని నాటకాలు ఆడుతున్నావు... దీని గొడవ నీకెందుకురా"

"కాస్త సంస్కారయుతమైన భాష ఉపయోగించు.... అదే మీ అమ్మను, నీ చెల్లినో నేను అది, ఇది, దాని అంటే ఎలా ఉంటుంది?"

"అరె బాడ్‌కోవ్... దమ్ముంటే నా దగ్గరకు రారా నీ సంగతి తేలుస్తా... నిన్ను ఖైమా కొట్టి హుస్సేన్‌సాగర్‌లో పడెయ్యకపోతే నా పేరు శంకర్ కాదురా..."

"మర్యాద... మర్యాద... నాగరిక ప్రపంచం హర్షించదు"

"పో బే! ఆ పోరిని అంటే నీకెందుకురా నీలుగుడు"

"అరె ఎన్నిసార్లు చెప్పాలి? మర్యాద.... మర్యాద అని. ముందు భాషని సంస్కరించుకో..."

ఈ గొడవేం అర్థం కాని దాక్షాయణి వింతగా చూస్తోంది.

మరో క్షణం కూడా కాకముందే శంకర్ చేతిలో కత్తి ప్రత్యక్షమైంది. అతడి చేతిలో కత్తి కనిపించగానే అనుచరుల చేతుల్లో సైతం తళతళలాడే కత్తులు మెరుపు వేగంతో కనిపించాయ్.

అదే సమయంలో సెల్‌ఫోన్‌లో అవతల నుండి మాటలు విన్పించాయ్.

"శభాష్ శంకర్! కత్తి బాగా తీశావు. అంత వేగంగా కత్తి తీయడమంటే మాటలు కాదు. సినిమాలో హీరో రజనీకాంత్ కూడా అంత వేగంగా తీయలేడు. అది సరే కానీ ఆ కత్తిని ఇక్కడ ఉపయోగించకు. నీ గ్యాంగ్ పోరాటాల్లో ఉపయోగించు..."

శంకర్ అనుమానంగా చుట్టూ చూశాడు. ఎక్కడైనా కెమెరాలు ఉన్నాయేమోనని. అలాంటివేమీ కనుచూపు మేరలో కనిపించలేదు. మరి వాడికి తాను కత్తి తీసిన విషయం ఎలా తెలిసింది? అసలు ఇక్కడ విషయాలన్నీ ఓ సినిమా రీలులా వాడు ఎలా చెప్పగలుగుతున్నాడు? సర్లే! వాడి సంగతి తర్వాత, ముందు దీని సంగతి చూద్దాం. పిట్ట ఫ్రెష్‌గా, వాటంలా, కుదురుగా ఉంది.

మరుక్షణం ఆ కత్తిని తిరిగి  లోపల పెట్టేశాడు. అన్న కాస్తా లోపల పెట్టేసరికి అనుచరులు సైతం ఆ ఆయుధాలను తమ జేబుల్లోకి సర్దేసుకున్నారు.

ఆ తర్వాత ఆమె వైపు కదలబోయాడు శేఖర్. అప్పుడు సెల్‌ఫోన్‌లోంచి తిరిగి పదాలు మెరుపువేగంతో దూసుకొచ్చాయ్.

"ఒరే బచ్చా! ఎన్నిసార్లు చెప్పాలిరా ఆ అమ్మాయిని వదిలెయ్యమని? అసలు నీవు ఓ మనిషికి పుట్టిన వాడివైతే ఇన్నిసార్లు చెప్పించుకోవే..."

"ఏం కూశావురా వెధవా! ఇది నీ ప్రియురాలా? ఇప్పుడు నీ ప్రియురాలినేం చేస్తానో చూడరా" అంటూ శంకర్ వేగంగా దాక్షాయణి పైట మీద చేయి వేయ బోయాడు.

అప్పుడు సెల్‌ఫోన్‌లోంచి స్టీరియో ఫోనిక్ సౌండ్‌తో శబ్దాలు వెలువడ్డాయి. ఆ శబ్దానికి ఒక్క క్షణం శంకర్ ఆగిపోయాడు.

"ఫైనల్ వార్నింగ్ ఇస్తున్నాను. ఆ అమ్మాయినేం చేయకు. చేశావా నీ కుక్క బ్రతుకు బయట పెడతాను..."

"ఏం చేస్తావురా బేవకూఫ్..." అరిచాడు శంకర్.

"ముందు నీ సెల్‌ఫోన్‌కు చిన్నపాటి ప్రొజెక్టర్ ఉంది కదా! దానిని అక్కడున్న గోడ మీదకు ఒక్కసారి ప్రసరింజచేయ్..."

శంకర్ అనుమానంగా సెల్‌లోని ప్రాజెక్టర్ అక్కడే ఉన్న గోడ మీదకు ప్రసరింపజేశాడు. అప్పుడు ఆ ప్రాజెక్టర్ నుండి గోడ మీద రకరకాల దృశ్యాలు కనిపించాయ్.

"శంకర్! ఇది నీవు ఫలానా బంద్‌లో షాపులు పగలగొడుతున్న దృశ్యం... ఇది నీవు ఓ షట్టర్‌లోంచి చొరబడి ఓ అమ్మాయిని రేప్ చేస్తున్న దృశ్యం. ఇది నీ మాట వినని కాంట్రాక్టర్‌ని చంపుతున్న దృశ్యం... ఇవి చాలా, ఇంకేమైనా కావాలా?"

శంకర్ నిశ్చేష్టుడైపోయాడు.

తిరిగి సెల్‌లో పదాలు వినిపించసాగాయ్.

"ఒరే శంకర్! ఇప్పుడు నీ సెల్‌ఫోన్ స్పీకర్ ఆఫ్ చేసి, సెల్‌ని నీ చెవుల దగ్గర పెట్టుకో. ఇంకా చక్కటి వార్తలు వినిపిస్తాను."

శంకర్ అనుమానంగా స్పీకర్ ఆపేసి, సెల్‌ని చెవి దగ్గర పెట్టుకున్నాడు.

"శంకర్! ఇంకా నా దగ్గర మంచి మంచి దృశ్యాలున్నాయి. అవి నాగరిక ప్రపంచం చూడకూడనివి, హర్షింపలేనివి. అందులో నీ చెల్లి పెళ్ళి కాకముందే ఎవరితో ఉందో, నీ కూతురు ఏ హాస్పిటల్లో అబార్షన్ చేయించుకుందో లాంటి దృశ్యాలు ఉన్నాయి. అవి బయట ప్రపంచానికి తెలియకూడదు కదా! అందుకే స్పీకర్ ఆఫ్ చేయమని చెప్పాను..."

శంకర్ వళ్ళంతా చెమట్లు పట్టాయ్. హోం మినిస్టర్ ముందు కూడా రఫ్‌గా నిలబడి ఉండే అతడు పూర్తిగా నీరసబడిపోయాడు.

"చెప్పండి... నేనేం చేయాలి?"

"గుడ్! ఈ పరిజ్ఞానం ముందే ఉంటే బాగుండేది. అనవసరంగా ఇంతవరకూ

తెచ్చుకొని అందరికీ నీ చరిత్రని కొంత సినిమా చూపించావు. ఫర్వాలేదులే! అది పబ్లిక్ షో! నీ ప్రైవేట్ షో ఎవరికీ చూపించలేదు కదా! ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు..”

“చెప్పండి సార్! నేనేం చెయ్యాలి?”

“ఇంకెప్పుడూ ఆ అమ్మాయి జోలికి వెళ్ళకూడదు”

“ఒట్టున్నా! ఈ అమ్మాయి పవిత్ర దేవత. పొరబాటున కూడా ఈ పవిత్ర దేవతని కన్నెత్తి చూడను...”

“అంతేకాదు! ఇంకెవరు ఈ ఏరియాలో ఆమె జోలికి వెళ్ళకుండా చూడాలి.”

“అన్నా! ఈ పవిత్ర దేవత ఇంటి ముందు కుక్క కాపలా కాస్తాను. ఎవడైనా ఈ దేవతని కన్నెత్తి చూస్తే వారి రెండు కళ్ళు పెకిలించి నీకు గిఫ్ట్‌గా పంపిస్తాను”.

“అంతొద్దులే” స్వరం రెట్టిస్తూ కదలింది అవతలి కంఠం. “ఇంకెప్పుడూ ఈ జీవితంలో సమాజం హర్షించని పనులు చేయనని మాట ఇవ్వు చాలు”

“నీ మీద ఒట్టున్నా! అన్నట్లు సెల్‌లోని నా ఫోటోలు...”

“నాగరిక పౌరుడిగా నీ బాధ్యతలు నీవు సక్రమంగా నిర్వహిస్తున్నంతసేపు ఇవి బయటికి రావు. చీకట్లోనే ఉంటాయి. ఎప్పుడైనా సమాజానికి హాని కలిగించే పనులు చేస్తే అప్పుడు ఇవి గోడలకెక్కుతాయి. టీవీలో పేపర్లో కనిపిస్తాయి. ఇంటర్నెట్ వెబ్‌సైట్‌లలో అందరినీ పలకరిస్తాయి జాగ్రత్త...”

ఫోన్ డిస్‌కనెక్టయింది.

దాక్షాయణికి అయోమయంగా ఉంది. తన వంటి మీద చేయి వేయబోయిన ఇతగాడికి ఏదో ఫోన్ రావడమేమిటి? ఆ ఫోన్‌లో తనని వదిలెయ్యమని ఎవరో హెచ్చరించడమేమిటి? అంత పెద్ద రౌడి ఆ దెబ్బకు తనని వదిలేసి వంగీ వంగీ దండాలు పెట్టడమేమిటి? ఇంతకూ ఆ యువకుడు ఎవరు? తనకు, అతడికి సంబంధం లేదు. అలాంటిది అతడు తనకు సహాయం చేయడమేమిటి? ఇదంతా కలయా? వైష్ణవ మాయనా? ఆమె అలా ఆలోచిస్తూ వుండిపోయింది.

***కాని ఆ మర్నాడు మరో సంచలన సంఘటన జరగబోతుందని ఆమెకు ఆ క్షణంలో తెలియదు.***

◆ ◆ ◆

డిగ్రీ ఎగ్జామినేషన్ హాల్!

దాక్షాయణీ పరీక్ష హాల్లో తన హాల్‌టికెట్ నెంబర్‌ని వెతికి కూర్చుంది.

ఆమెకు కుడివేపు ఎవరో యువకుడు కూర్చున్నాడు. మాటిమాటికి ఆ యువకుడు దాక్షాయణికేసి చూస్తున్నాడు. దాక్షాయణి దృష్టి అతడి మీద లేదు. రాబోయే ప్రశ్నపత్రం మీదే ఉంది.

బెల్ కొట్టారు. ఇన్విజిలేటర్ ప్రశ్నాపత్రం ఇచ్చింది. దానిని చూస్తూనే ఆ యువకుడి మొఖం నల్లబడింది. దాక్షాయణి మొఖం వికసించింది. వెంటనే పెన్ తీసి గబగబా రాయసాగింది.

ఆ యువకుడు దిక్కులు తోచక అటూ ఇటూ చూస్తున్నాడు. దాక్షాయణీ కేసి చూస్తున్నాడు కాని ఆమె నుండి రెస్పాన్స్ రావడం లేదు.

దాంతో గాడిదలా సకిలించాడు. దాక్షాయణి విచిత్రంగా చూసింది అతడి వేపు.

"నాకేం రాదు! కొంచెం చూపిస్తావా?" అడిగాడు.

దాక్షాయణికీ మండిపోయింది. తనని డిస్టర్బ్ చేసింది కాక ఏకవచనంతో మాట్లాడుతాడా? తానెవరో? అతడెవరో? అతడు తన కాలేజీ కాదు, పరీక్ష హాల్లో ప్రక్కప్రక్కనే ఒకే కాలేజీ వారిని కూర్చొబెట్టరు. వేరు వేరు కాలేజీల వారిని కూర్చోబెడతారు.

అందుకే అతడిని లెక్క చేయకుండా తన పేపర్ తాను రాసుకోసాగింది.

ఆ యువకుడి మొఖం నల్లబడింది మరోసారి. కసిగా పళ్ళు నూరాడు. ఇన్విజిలేటర్‌ని మేనేజ్ చేద్దామని ప్రయత్నించాడు. కాని ఆ ఇన్విజిలేటర్‌కు ఆ సబ్జెక్టు రాదని అర్థమైంది.

సమయం గడుస్తూనే ఉంది ఆ ఉద్రిక్తతలోనే.

ఆ యువకుడు తిరిగి దాక్షాయణిని కన్విన్స్ చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. 'హలో' అని నెమ్మదిగా పిలిచాడు. ఆమె వినిపించుకోలేదు. దాంతో దగ్గాడు. కళ్ళలో శబ్దం చేశాడు. తల చేత్తో బాధగా రుద్దుకున్నాడు. కర్చీఫ్ తీసుకొని మొఖం తుడుచుకున్నాడు. అయినా దాక్షాయణి నుండి వీసమెత్తు కూడా చలనం రాలేదు. దాంతో తనకు తోచిందేదో రాయసాగాడు.

పరీక్ష సమయం ముగిసినట్లుగా బెల్ కొట్టారు. ఇన్విజిలేటర్ అందరి దగ్గర పేపర్లు కలెక్ట్ చేసుకుంది.

దాక్షాయణీ సంతృప్తికరంగా కదిలింది బయటికి. ఆ యువకుడు పళ్ళు నూరుకుంటూ ఆమె వెంటే కదిలాడు.

గేటు బయటకు వచ్చింది దాక్షాయణీ. అతడు కూడా ఆమె వెంట నడిచాడు. గేటు బయట ఒక పోలీసు జీపు సిద్ధంగా ఉంది.

దాక్షాయణి రోడ్డు క్రాస్ చేయబోయింది. అప్పుడు పిలిచాడు అతడు.

“ఏయ్” అంటూ.

దాక్షాయణి ఆగింది. వెనక్కి చూసింది. పరీక్ష హాల్లో తన పక్కనే సీటు వేయబడ్డ యువకుడు.

“ఏయ్! నేను అడిగితే నాకు ఏం చూపించవా? అసలు ఏమనుకుంటున్నావు నీవు?”

దాక్షాయణి విస్తుపోయింది. తర్వాత తేరుకుంటూ కదిలిందామె కంఠం.

“అసలు నేనెందుకు చూపించాలి? అలా చూపించటం తప్పని మీకు తెలియదా?”

“మహా పతివ్రత బయలుదేరింది. నేను ఎవరో తెలుసా? హెూమ్ మినిస్టర్ కొడుకుని. ఇప్పటిదాకా నేను టెన్త్ క్లాసులో ఇన్విజిలేటర్‌లకు డబ్బులు ఇచ్చి పాసయ్యాను. ఇంటర్మీడియట్‌లో ఎగ్జామ్ సెంటర్ వాళ్ళే నాకు ఆన్సర్లు చూపించారు. కాని ఈ దరిద్రపు సెంట్రల్ గవర్నమెంట్ ఎగ్జామ్ సెంటర్ నాకు పడిద్దనుకోలేదు. ఈ సెంటర్ మహా స్ట్రిక్ట్. కాబట్టే నా వల్ల కాలేదు. ఇవాళ పేపరు సంస్కృతం కాబట్టి ఎలాగో రాశాను. ప్యాస్ మార్కులు వస్తాయి. కాని రేపటి సబ్జెక్టు పేపర్ నాకు అసలు రాదు. ఇవాళ నాకు నీవు కోపరేట్ చేయకపోయినా నో ప్రాబ్లెం! కాని రేపటి పేపర్‌లో నీవు నాకు కోపరేట్ చేయాలి. లేదా...”

దాక్షాయణికి కోపం వచ్చింది. ముక్కుపుటాలు అదిరాయి. దాంతో ఆమె ముక్కుపుడక మరింత ప్రస్ఫుటంగా అందం పెరిగింది.

“అసలు నేనేందుకు నీకు చూపించాలి? నేను చూపించను...”

“నేను ఎవరో తెలుసా నీకు? హెూమ్ మినిస్టర్ కొడుకుని.”

"ఏం మాట్లాడుతున్నారు మీరు? మీరు హోమ్ మినిస్టర్ కొడుకయితే నాకేమిటి? ఇంకా ఎవరో అయితే నాకేమిటి? నా పరీక్ష నేను రాస్తాను. ఇంకొకరి గురించి ఆలోచించాల్సిన అవసరం నాకు లేదు".

"ఇదిగో గొప్ప పతివ్రతలాగా ఫోజులు కొట్టకు. నీ మొఖాన ఎంత డబ్బు కావాలన్నా పడేస్తాను. ఎందుకంటే నేను ఎలాగైనా డిగ్రీ ప్యాసవ్వాలని మా అమ్మ హెచ్చరించింది."

"అయితే కష్టపడి పాసవ్వు. అంతేకాని ఇలాంటి కాపీ అక్రమ పద్ధతులు.."

"ఏంటే బాగా నీలుగుతున్నావు? మా నాన్న హోమ్ మినిస్టర్! ఈ రాష్ట్రానికే హోం మినిస్టర్! ఈ రాష్ట్రం మొత్తం నా చేతిలో ఉంది. నేను చెప్పినట్లుగా జరగకపోతే నిన్ను ఏం చేస్తానో నాకే తెలియదు..."

దాక్షాయణికి కోపం వచ్చింది.

"చూడండి! బాధ్యతాయుతమైన హోమ్ మినిస్టర్ అబ్బాయి కాబట్టి ఇలాంటి మాటలు మాట్లాడకూడదు. ఈ రాత్రయినా సరిగ్గా చదివి..."

"నోర్మూయ్! ఎక్కువ నసపెట్టకు! రేపు నాకు పరీక్షలో చూపించకపోతే నీ మొఖాన యాసిడ్ పోయిస్తాను. అందమైన నీ మొఖం కురూపీగా మార్చేస్తాను. ఈ స్టేట్‌లో నన్ను ఎదిరించే మొనగాడే లేడు. ఆలోచించుకో... బై" అంటూ పోలీస్ వ్యాను ఎక్కి వెళ్ళిపోయాడు.

దాక్షాయణి స్థాణువులా నిలబడిపోయింది. వళ్ళంతా నిస్సత్తువగా, తలంతా భారంగా అనిపిస్తోంది.

ఎలాగోలా ఇంటికొచ్చి పడింది ఆమె. వచ్చిన దగ్గర నుండి ఆమె మొఖం అంత స్వేదంతో తడిచిపోయింది. మనసంతా వికారంగా అనిపిస్తోంది. రేపటి పరీక్షకు చదవాలనిపించలేదు.

అలాగే మంచం మీద భారంగా పడుకొని తల రుద్దుకుంటూ కూర్చొంది.

ఆ స్థితిలోనే సాయంకాలం ఆరు గంటల దాకా ఉంది. తలుపు చప్పుడైతే నిస్సత్తువుగా లేచి నిలబడింది. వళ్ళంతా తూలిపోతున్నట్లుగా ఉంది. ఎలాగో తమాయించుకొని తలుపు తీసింది.

ఆమె తండ్రి లోపలికి వచ్చాడు. లోపలికి వెళ్ళి కాళ్ళు కడుక్కుని వచ్చాడాయన.

"ఏరా! ఇవ్వాళ ఎగ్జామ్ ఎలా రాశావురా?" ప్రేమగా అడిగాడు.

"బాగానే రాశాను" ముక్తసరిగా చెప్పింది. ఆయన ఆశ్చర్యంగా చూశాడు కూతురు వేపు. ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే కూతురు నీరసంగా ఉందేమిటి? ఏం జరిగింది?

"టీ తీసుకొస్తాను నాన్న" అంటూ లోపలికి వెళ్ళింది.

ఆయన బట్టలు మార్చుకొని వచ్చాడు.

దాక్షాయణి టీ తీసుకొచ్చి ఆయనకు ఇచ్చి తిరిగి లోపలికి వెళ్ళిపోయింది. ఆయన భృకుటి ముడివడింది.

'ఏం జరిగింది?' ప్రశ్న ఆయనలో.

వెంటనే ఆయన కూడా లోపలికి వెళ్ళాడు. దాక్షాయణీ మంచం మీద కూర్చొని తల చేత్తో పట్టుకొని ఉంది.

"ఏమయిందిరా?" ఆమె భుజం మీద చేయి వేస్తూ అడిగాడు.

"నాన్న" ఒక్కసారిగా బరస్ట్ అయిందామె. ఆ తర్వాత ఆ రోజు కాలేజీలో జరిగిన విషయం చెప్పుకు వచ్చింది.

"రేపు నాకు పరీక్ష రాయాలని లేదు నాన్నా! తనకు చూపించకపోతే ఆ హోమ్ మినిస్టర్ కొడుకు నన్ను పోలీస్ కేస్‌లో ఇరికిస్తానన్నాడు. నాకు అలాంటి పనులు చేత కావు. పోనీ మనసు చంపుకొని చూపిస్తే ఇన్విజిలేటర్ నన్ను పట్టుకొని డిబార్ చేస్తాడని మరొకవైపు భయం... ఈ రెండింటి మధ్య రేపటి పరీక్ష రాయలేదు నాన్న".

ఆయన సైతం స్తంభితుడైపోయాడు. కూతురు చెప్పింది అన్ని విధాలా సమంజసంగానే అన్పించింది. మరి రేపటి పరీక్ష సంగతి?

ఆ ఆలోచనల మధ్యలోనే దాక్షాయణి కంఠం కదిలింది.

"అందుకే రేపటి పరీక్షకు ఏం చదవలేదు నాన్నా! నాకు రేపు పరీక్ష రాయాలని లేదు నాన్నా"

ఆయన వెంటనే కూతురు భుజం మీద చేయి వేసి "అలాగేరా! నీకెలా ఇష్టం అయితే అలాగే చెయ్... జీవితం కంటే పరీక్ష ముఖ్యం కాదు. ఆ హోమ్ మినిస్టర్ కొడుకుని వాళ్ళ తండ్రి అచ్చొసిన ఆంబోతులా రోడ్డు మీద పడేశాడు. దాంతో వీడు

దేశం మీద పడి రెచ్చిపోతున్నాడు.... అలాంటి నికృష్టుడి కోసం మన జీవితాన్ని పాడుచేసుకోకూడదు. పరీక్షదేముంది? రేపు కాకపోతే మళ్ళీ సెప్టెంబర్‌లో రాసుకోవచ్చు...”

ఆయన మాటలు దాక్షాయణికీ కొద్దిగా స్వాంతన కూర్చాయి. అయినప్పటికీ రేపటి పరీక్ష రాయలేకపోతున్నానన్న బాధ ఆమె నరనరాన కాల్చేస్తున్నట్లుంది. ఆ పరీక్ష రాయకపోతే తాను యూనివర్సిటీ ఫస్ట్ వచ్చే అవకాశం లేదు. గోల్డ్ మెడల్ రాదు. అయినా ఈ దరిద్రపు హోమ్ మినిస్టర్ కొడుకు నా ప్రాణానికి ఎలా దాపరించాడో? అతగాడు పడక పడక నా సెంటర్లలోనే పడాలా? పడితే పడ్డాడు కాని ఏకంగా నా హాల్లోనే పడాలా? పడితే పడ్డాడు కాని ఏకంగా నా పక్కసీట్లోనే తగలబడాలా? ఛ... తన దురదృష్టం ఇలా తగలడాలా...

ఆమెలా తిట్టుకుంటుండగా తండ్రి లేచాడు.

“అమ్మా! నేను పక్కింటి భాస్కరరావు దగ్గరకు వెళ్ళి అద్దె ఇచ్చి వస్తాను...”

“అలాగే నాన్నా! ఇప్పుడే వస్తారు కదా”

“లేదమ్మా! భాస్కరరావు సంగతి నీకు తెలుసు కదా! పట్టుకుంటే వదలడు. అరగంటైనా కబుర్లు చెప్పి పంపుతాడు.”

“సరే నాన్నా.”

ఆయన అటు వెళ్ళగానే తిరిగి తలుపేసుకుంది దాక్షాయణి.

ఆమె తల పగిలిపోతోంది. తన జీవితంలో పరిస్థితులు తనకు ఎందుకిలా ఎదురు తిరుగుతున్నాయో అర్థం కావడం లేదు. ఎన్నో ఆశలతో పరీక్ష రాయాలనుకుంది. ఇప్పుడు ఇలాంటి వాడి వల్ల పరీక్షనే పోగొట్టుకోవాల్సిన అవసరం వచ్చింది.

ఆమె ఆలోచనల మధ్యలో ‘థ్రింగ్, థ్రింగ్ మంటూ మ్రోగింది ఫోన్.

ఆమె పట్టించుకోలేదు. ఫోన్ పదే పదే మ్రోగటంతో విసుగ్గా రిసీవర్ తీసింది.

“హాయ్ దాక్షాయణీ! ఎలా ఉన్నారు?” ఫోన్‌లో ఓ యువకుడి కంఠం నుండి పదాలు తీసుకొచ్చాయ్.

“మీరు... మీరు” ఆమె కన్‌ఫ్యూజ్ అయింది.

“నేను నీ శ్రేయోభిలాషిని. రేపటి ఎగ్జామ్‌కు బాగా ప్రిపేర్ అవుతున్నావా?”

ఆమెకు తిరిగి దుఃఖం వచ్చింది. ఆ దుఃఖంలోనే కదిలిందామె కంఠం.

"ఎవరు మీరు? ఏం కావాలి మీకు?"

"నీ శ్రేయోభిలాషినని చెప్పాను కదా! మొన్న క్రెడిట్ కార్డు కంపెనీ వాడు వచ్చినప్పుడు వాడి స్పీకర్ నుండి నా వాయిస్ విన్నావు కదా! గుర్తుపట్టలేదా?"

అప్పుడు ఆమెకు లీలగా స్ఫురించింది అవును అదే గొంతు! ఆ గొంతే ఆ రోజు తనని వాడి బారి నుండి రక్షించింది. మళ్ళీ ఆ గొంతు తనని సూటిగా పలకరిస్తోంది. అప్పటి నుండి ఎన్నోసార్లు అనుకుంది ఎవరు అతడు, తనని ఎందుకు రక్షించాడోనని.

"చెప్పు దాక్షాయణి! ఇవాళ ఎగ్జామ్ బాగా రాశావా? రేపు ఎగ్జామ్‌కు బాగా ప్రిపేర్ అవుతున్నావా?"

దాక్షాయణీకి దుఃఖం వచ్చింది. నిజానికి ప్రొద్దున జరిగిన పరీక్ష తాలూకు షాక్ నుండి ఆమె దుఃఖంలోనే ఉంది. తన కష్టం ఎవరికైనా చెప్పుకోవాలనిపించింది. పైగా అవతల మనిషి తన శ్రేయోభిలాషి అంటున్నాడు.

వెంటనే ఆమె కంఠం కదిలింది ఆ దుఃఖసాగరం మధ్యనే.

"రేపు ఎగ్జామ్ రాయడంలేదు"

ఆమె వెక్కిళ్లు అవతల వ్యక్తిని కదిలించాయ్.

"ఏమయ్యింది దాక్షాయణీ! ప్లీజ్ జరిగిందేమిటో చెప్పు"

అప్పుడు బరస్ట్ అయిందామె. హెూంమినిస్టర్ కొడుకు తనని చూపించమని అడగడం, తాను పట్టించుకోకపోవడం, ఫలితంగా రేపటి ఎగ్జామ్‌లో తనకు చూపించక పోతే తన మీద యాసిడ్ పోస్తాననడం, తనని పోలీస్ కేసులో ఇరికిస్తానని బెదిరించడం... అన్నీ చెప్పేసింది.

అవతల నుండి నిశ్శబ్దం.. కొద్దిసేపు. ఆ తర్వాత ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా అవతల వ్యక్తి కంఠం కదిలింది.

"రేపు ఎగ్జామ్‌కు మీరు వెళ్తున్నారు. అక్కడ హెూమ్ మినిస్టర్ కొడుకు బెడద మీకు ఉండదు".

"మైగాడ్! అదెలా సంభవం? ఆ హెూమ్ మినిస్టర్‌ని ఎదిరించే స్థాయి మీకు ఉందా?"

"అదలా ఉంచు! రేపు ఎగ్జామ్‌కు మీరు వెళ్తున్నారు. దట్సాల్"

"నేను వెళ్ళలేను. అసలు ఇప్పటిదాకా నేనేం చదవలేదు కూడా"

"దాక్షాయణి" కదిలింది అవతల గొంతు "ఒక్కసారి చదివితే గుర్తుంచుకోవడం మీకు దేవుడు ఇచ్చిన వరం. రేపటి ఎగ్జామ్ పాఠాలన్నీ మీరు ఈ సంవత్సరం ఇంతకుముందే చదివి ఉండవచ్చు. ఎటొచ్చి మీరు చేయాల్సిందల్లా రివిజన్ మాత్రమే..."

దాక్షాయణీ ఆశ్చర్యపోయింది. తన ఫోటోగ్రాఫిక్ మెమరీ గురించి అతడికి ఎలా తెలుసు? ఏది ఏమైనా రేపు ఆ హోమ్ మినిస్టర్ గాడి బెడిద వల్ల తాను పరీక్ష రాయదు, అంతే!

"నో... నేను పరీక్ష రాయను. వాడు నన్ను పోలీస్ కేసులో ఇరికిస్తాడు."

"దాక్షాయణీ! ఈ శ్రేయోభిలాషి ఆ హోమ్ మినిస్టర్ కంటే గొప్పవాడు. రేపటి ఎగ్జామ్ మామూలుగానే రాయి..."

"వాడు నా మీద యాసిడ్ పోస్తే?"

అప్పుడు వచ్చాయి మెరుపువేగంతో పదాలు రిసీవర్‌లో నుండి.

"ఆ హోమ్‌మినిస్టర్ కొడుకు రేపు పరీక్షకే రాడు. సరేనా?"

షాక్ తగిలినట్లుగా దిగ్భ్రాంతి ఆమెలో. మైగాడ్! ఈ శ్రేయోభిలాషి అంత శక్తివంతుడా? అసలు అతడు తనకు ఎందుకు సాయం చేయాలనుకుంటున్నాడు?

ఆమెలా ఆలోచనల్లో ఉండగానే అతడి కంఠం నుండి పదాలు రిసీవర్‌లోంచి మెరుపువేగంతో దూసుకొచ్చాయ్.

"అనవసర విషయాల గురించి ఎక్కువ ఆలోచించకు. నా మీద నమ్మకం ఉంచి రేపు పరీక్షకు వెళ్ళు. అనవసరంగా ఒక విద్యాసంవత్సరం వృథా చేసుకోకు. ఇలాంటి దృష్టిలు, నీచులు ఎక్కడైనా ఉంటారు. వారి సంగతి నాకు వదిలిపెట్టు. నేను చూసుకుంటాను..."

"అదెలా సంభవం...?" దాక్షాయణి కంఠం కదలబోయింది కాని అవతల నుండి అతడి కంఠం కదిలింది వేగంగా.

"నా మీద మీకు నమ్మకం ఉంటే రేపు పరీక్షకు వెళ్ళు. అక్కడ ఎలాంటి సంఘటనా జరగదు. నన్ను నమ్ము ప్లీజ్..."

దాక్షాయణీ కదిలిపోయింది. ఎవరితను? ప్రతిసారి తనకెందుకు సహాయం చేస్తున్నాడు? అతడికేమైనా అతీతశక్తులు ఉన్నాయా?

“ఎక్కువ ఆలోచించకు దాక్షాయణీ! రేపటి ఎగ్జామ్ చదువుకో! బైది బై! ఆల్ ది బెస్ట్ ఫర్ టుమారో ఎగ్జామ్...” అంటూ రిసీవర్ క్లిక్‌మంది.

దాక్షాయణీలో ఉద్రిక్తత. రేపటి ఎగ్జామ్‌కు తను వెళ్ళాలా? లేదా?

మరో పదినిముషాల తర్వాత ఆమె కదిలింది మర్నాడు జరగబోయే ఎగ్జామ్ తాలూకు టెక్స్ట్‌బుక్ కోసం వెతుకుతూ.

◆ ◆ ◆

ఆ మర్నాడు–

బిక్కుబిక్కుమంటూ ఎగ్జామ్ సెంటర్‌కి బయలుదేరి వెళ్ళింది.

ఎంట్రన్స్‌లో హాలుటికెట్ చూపించి అదిరిపడే గుండెలతో లోపలికి నడిచింది.

ఎగ్జామ్ హాల్లో తన సీట్లో కూర్చుంటూ ఓరగా పక్కకు చూసింది. అతడు రాలేదు.

బెల్ అయింది. పరీక్ష పేపర్ ఇచ్చారు. ఆమె పేపర్ చూసింది. అన్ని తెలిసిన ప్రశ్నలే!

ఆమె టైమ్ చూసుకుంది. పరీక్ష ప్రారంభమై ఇరవై నిముషాలు గడిచాయ్. అతడు ఎప్పుడైనా రావచ్చు. ప్రారంభమైన అర్ధగంట వరకూ అభ్యర్థులు లోపలకు రావచ్చు.

‘భగవంతుడా! అతడు రాకూడదు’ అంటూ మనసులో అనుకుంది. అనుకొని తన జవాబులు తాను రాయసాగింది.

అర్ధగంట గడిచినట్లుగా మొదటి బెల్ వినిపించింది. ఆమె అమ్మయ్య అనుకుంది. ఆమెలో టెన్షన్ పూర్తిగా తగ్గిపోయాయి. ఎప్పుడైతే టెన్షన్ తగ్గిపోయిందో ఆమె కలం మెరుపు వేగంతో కదిలింది. ఒక్కో జవాబుని అధిగమిస్తూ కాలం కదులుతోంది.

ఆ పరీక్ష మధ్యలో నిన్న తనకు ఫోన్ చేసిన వ్యక్తి కంఠం గుర్తొచ్చింది.

“రేపు హెూమ్ మినిస్టర్ కొడుకు పరీక్ష రాయడు”

అప్పుడు అనుకుందామె తనలో తాను.

"థాంక్స్ మిత్రమా! నన్ను ఈ మృగాల బారి నిండి తప్పించినందుకు".

ఎగ్జామ్ పూర్తయినట్లుగా బెల్ కొట్టారు. దాక్షాయణీ తృప్తిగా పేపర్‌ని ఎగ్జామినర్‌కు ఇచ్చింది. ఆ తర్వాత రోడ్డు మీదకు వడివడిగా వచ్చింది.

అక్కడ పోలీస్ వ్యాను గానీ, హెూమ్ మినిస్టర్ కొడుకుగాని లేరు.

గుండెలనిండా గాలి పీల్చుకుంటూ బస్టాండ్‌కు నడిచి బస్సు ఎక్కింది. ఆమె మనస్సు ఆనందంగా ఉంది. ఎంతో కష్టం వచ్చిందనుకుంది. తాను అసలు పరీక్ష రాయదనుకుంది. కాని ఆకాశంలో నీలిమబ్బులు కరిగిపోయినట్లుగా ఒక్క దెబ్బతో తన కష్టాలన్నీ అతడు చలువల్లా మాయమయ్యాయి.

బస్సు ఆగటంతో ఆమె వడివడిగా దిగింది. తాళం తీసుకొని ఇంట్లోకి అడుగుపెట్టింది.

ఆమె దృష్టి తర్వాత పరీక్ష మీద లేదు. నిన్న తనకు ఫోన్ చేసిన వ్యక్తి మీదే ఉంది.

ఎవరితడు? ప్రతిసారి కష్టం వచ్చినప్పుడల్లా భగవంతుడిలా కాపాడుతున్నాడు. అసలు అతడికి తన కష్టం ఎలా తెలుస్తుంది? సరిగ్గా కష్టం వచ్చినప్పుడే అభయహస్తం అందిస్తున్నాడు? అతడికేమైనా అతీంద్రియ శక్తులు ఉన్నాయా? మరి అతడికి తన గురించి ప్రతిసారి ఎలా తెలుస్తుంది? ప్రపంచంలో కొన్ని వేలమంది అభాగ్యులున్నారు. వారందరిని పట్టించుకొని అతడు తన మీద దృష్టిని ఎలా ఎక్కుపెడుతున్నాడు? ఇప్పుడు అతను ఫోన్ చేస్తే బాగుండు. అతడికి ధన్యవాదాలు చెప్పవచ్చు.

అలా మాటిమాటికి ఆమె ఫోన్ కేసే చూడసాగింది. కాని ఆ ల్యాండ్ లైన్ ఫోన్ మోగడం లేదు. ఆమె ఫోన్ రిసీవర్ సరిగ్గా పెట్టి ఉందో లేదోనని చెక్ చేసింది. అంతా సవ్యంగానే ఉంది. అయినా ఫోన్ మ్రోగడం లేదు.

ఆమెలో ఉవ్వెత్తున నిరాశ మొదలెత్తింది. తన ఇరవై రెండు సంవత్సరాలలో ఆమెకు ఆ రకమైనా భావాలు రావడం అదే మొదటిసారి. ఏ అబ్బాయిని చూసిన చలించేది కాదు మనసు. కాని ఆ ఫోన్ వాయిస్ మటుకు ఆమెను మెస్మరైజింగ్‌కు గురి చేస్తోంది.

క్షణాలు నిముషాలుగా, నిముషాలు గంటలుగా మారిపోతున్నాయి. సాయంత్రం ఐదు గంటలైంది. అయినా ఫోన్ రాలేదు.

ఆ రోజే కాదు, ఆమె ఎగ్జామ్ ఉన్నన్నాళ్ళు అతడి దగ్గర నుండి ఫోన్ రాలేదు.

◆ ◆ ◆

ఆఖరి ఎగ్జామ్ రాశాక –

నిరాశగా ఇంటికి వచ్చిందామె. ఆ రోజుతో పరీక్షలు అయిపోయాయి. రేపట్నుంచి ఖాళీ. కాలేజీ అయిపోయింది. ఇక పూర్తి సమయం ఇంట్లోనే ఉండాలి.

ఆమె బట్టలు మార్చుకొని అన్నం ముందు పెట్టుకుంది. ప్లేట్‌లో అన్నం మీద ఆమె చేతులు కదులుతున్నాయి. కాని నోట్లోకి మాత్రం వెళ్ళడం లేదు. అన్యమనస్కంగా ఉంది. సరిగ్గా అప్పుడు –

థ్రింగ్ థ్రింగ్ మంటూ మోగింది ఫోన్. ఆమె చెంగున దూకి ఫోన్‌ని అందుకుంది.

"హాల్లో..." అవతల నుండి అతడి కంఠం.

ఆమె హృదయం మానస సరోవరంలో విహరించినట్లయింది.

"హల్లో..." అంటూ కదిలాయ్ పెదాలు.

"ఎగ్జామ్స్ బాగా రాశారా?" అతడి కంఠంలో ఆర్తి.

"బాగా రాశాను... మీ దయవల్ల"

"ఇందులో నా దయేం ఉంది. మీ ప్రతిభ తప్ప..."

"అదేం కాదు..." బుంగమూతి పెట్టి అందామె" ఇన్నాళ్ళూ ఫోన్ చేయలేదేం?"

"ఎగ్జామ్స్ కదా డిస్టర్బ్ చేయకూడదని"

"కాని నా మనసెంతో ఎదురుచూసిందో తెలుసా?" పైకి అనలేదామె. మనసులో అనుకుందామె. మీరు ఫోన్ చేయకపోతే మనసంతా అదోలా ఉంది.

అవతల నుండి అతడి కంఠం గాభరాగా.

"హల్లో... హల్లో" అంటూ

"హల్లో..."

"ఏమిటి మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు?"

"అబ్బే ఏం లేదు!" ఆమెలో మొహమాటం. అతడు ఫోన్ చేయనంత సేపూ ఫోన్ చేస్తే బాగుండనిన్పిస్తోంది. ఫోన్ చేస్తే గాభరాగా అనిపిస్తోంది.

మొగవాళ్ళతో మాట్లాడడం ఆమెకు చిన్నప్పట్నుంచి అలవాటు లేదు. కాని అతడితో మాట్లాడుతుంటే స్త్రీ తాలూకు సహజసిగ్గు ముంచుకొస్తోంది.

"ఏమిటి ఉన్నట్లుండి ఆలోచనల్లోకి వెళ్ళిపోతుంటారు? అన్నట్లు మీ ముక్కు తిమ్మన ఏమంటున్నాడు?"

'ముక్కు తిమ్మనా? ఆయన ప్రసక్తి ఇప్పుడెందుకు వచ్చిందబ్బా' అని ఆలోచిస్తుండగా అతడి కంఠం కదిలింది.

"తెలుగు పరీక్షలో ఆ సుందరి ఏడుపుకు గొంతు బొంగురుపోయిందని రాశారు. అది తప్పు. ఆమె ఏడుస్తూంటే కళ్ళలోని కాటుక అంతా చెదిరి ముక్కుపుడక మీద అంటుకొని అపర కాళికాదేవిలా ఉందని కవి వర్ణించారు కదా!"

దాక్షాయణి దిగ్భ్రాంతికి లోనయ్యింది. అవును! తెలుగు పరీక్షలో తాను ఇతడి గురించే ఆలోచిస్తు ఉంది. ఆ తర్వాత ఇంటికొచ్చాక గుర్తొచ్చింది. తాను చేసిన తప్పు అది సరే, తాను ఎగ్జామ్‌లో తప్పు రాసిన విషయం తనకు తప్ప మానవ మాత్రుడికి తెలిసే అవకాశం ఉంది.

'మైగాడ్! ఇతడు మామూలు మనిషి కాదు. తానేం రాసిందీ తెలుసుకున్నాడు. తెలుసుకుంటే తెలుసుకున్నాడు కాని తాను రాసింది తప్పు అని తెలుసుకున్నాడంటే అతడికి తెలుగు ప్రబంధాలతో అంతో ఇంతో ప్రావీణ్యం ఉందన్న మాట. వామ్మో! ఇతడితో చాలా జాగ్రత్తగా ఉండాలి.

ఆలోచనల్లోంచి తేరుకుంటూ కదిలిందామె కంఠం.

"అసలు ఎవరు మీరు? ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కంటే హోమ్ మినిస్టర్ చాలా పవర్‌ఫుల్. అలాంటి వాడిని కూడా పరీక్ష రాయనీయకుండా చేశారంటే మీరు అంతకంటే శక్తివంతులై ఉండాలి. ఎవరు మీరు, చెప్పండి?"

"నేనూ నీలాంటి మామూలు వ్యక్తినే. కాకపోతే కాస్త సిక్త్‌సెన్స్ కలవాడిని. అంతేకాని నాకు ఎలాంటి శక్తులూ లేవు"

ఆమెకు మొదటిసారిగా భయం వేసింది. తాను మాట్లాడుతున్నది మానవాతీతశక్తులున్నా వ్యక్తితోనేమోనని. లేకపోతే ప్రతి విషయాన్ని కళ్ళకు కట్టినట్లుగా చూసినట్లు ఎలా చెబుతున్నాడు?

అందుకే ఓ నిశ్చయానికి వచ్చినట్లుగా కదిలిందామె కంఠం.

"మర్యాదగా చెప్పండి. మీరు ఎందుకు నా జోలికి వస్తున్నారు? ప్రతిసారీ నన్నే ఎలా రక్షిస్తున్నారు? నేనేం చేస్తున్నా మీకు ఎలా తెలుస్తుంది?"

"చెప్పానుగా! నేను మామూలు వ్యక్తినేనని"

"అదే వద్దన్నాను. మీతో ఇలా వంకర టింకరగా మాట్లాడితే నాకు అసలు మీతో మాట్లాడాలని ఉండదు. బై...." ఫోన్ పెట్టెయ్యబోయింది రోషంగా.

"ఆగు దాక్షాయణీ! ఇన్నాళ్ళూ ఫోన్ ఎప్పుడొస్తదా అని పుస్తకాలు పట్టుకొని ఇదే గదిలో కూర్చొని ఎదురుచూశావు. ఇప్పుడు నా మాటలు వినకుండా ఫోన్ పెట్టేస్తావా?"

ఆమె స్తంభితురాలైపోయింది. మైగాడ్! ఇన్నాళ్ళు పరీక్ష మధ్య రోజుల్లో పుస్తకం చదువుతూ మధ్య మధ్యలో ఫోన్ తాను ఎదురుచూసిన విషయం కూడా అతడికి తెలిసింది. అంటే తన ప్రతి కదలిక, మాట అతడికి తెలిసిపోతోంది. అంటే ఎక్కడో ఏదో జరుగుతోంది. అంటే ఇతడు మామూలు వ్యక్తి కాదు! తన ఇంట్లో జరుగుతున్నాయన్నీ సినిమాలా చూస్తూనే ఉన్నాడు. కొంపతీసి ఇతడు కలియుగ కల్కి కాదు కదా!

ఆమె మొఖం స్వేదంతో తడిసిపోయింది. తానేదో పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లుగా అనిపిస్తోంది. ఏదో తెలియని ఆగాథంలో పడుతున్నట్లుగా అన్పిస్తోంది. ఎంత అడిగినా అతడు నిజం చెప్పడు. ఇక ఫోన్ చేతిలో పట్టుకొని ఉపయోగం లేదు.

అంతే మరుక్షణం ఆమె కోపంగా తన చేతిలోని ఫోన్ రిసీవర్ మీద పెద్ద శబ్దంతో పెట్టేసింది.

ఇక అతడిని జీవితంలో కలవకూడదు. అలాంటి మాయావితో తనకు సన్నిహితం పనికిరాదు. అలాంటి వ్యక్తితో తాను ఎప్పటికైనా ప్రమాదంలో పడుతుంది. అందుకే అతడితో ఈ రోజు నుండి అన్ని సంబంధాలు కట్ చేసుకోవాలి.

*ఆ నిర్ణయం తీసుకున్న తర్వాత ఆమె మనసు కొద్దిగా కుదుట పడింది. కాని అదంత తేలిక కాదని, త్వరలో మరింత పెద్ద ఆగాధంలో చిక్కుకోపోతున్న తనని అతడే తిరిగి కాపాడుతాడని ఆ క్షణంలో ఆమెకు తెలియదు.*

◆ ◆ ◆

## 7

రతన్‌లాల్!

రియల్ ఎస్టేట్ కింగ్! స్టాక్ మార్కెట్‌లో షేర్లను రిగ్గింగ్ చేసి ఎలా పెంచుతారో అలా రియల్ ఎస్టేట్‌ని ఆకాశానికి తీసుకెళ్ళగలిగే సమర్థుడు. స్టాక్ మార్కెట్ కింగ్‌గా హర్షద్ మెహతాని ఎలా పేర్కొంటారో, అలా రియల్ ఎస్టేట్ కింగ్‌గా రతన్‌లాల్ పేరు చెప్పుకుంటారు.

రతన్‌లాల్!

ఎలాంటి బంజరుభూమినైనా రాత్రికి రాత్రే బంగారుగనిగా మార్చే సమర్థుడు. రాత్రికి రాత్రే భూమి ధరలను రిగ్గింగ్ చేస్తాడు. అతడు ఎక్కడ భూమి కొంటే అక్కడ రేట్లకు రెక్కలు వస్తాయని తెలిసి మిగతా వారు ఆ చుట్టుపక్కలా కొంటాడు. అలా కొనగలిగే వాళ్ళలో రాజకీయ నాయకులు, సినీతారలు, పారిశ్రామిక వేత్తలు ఉంటారు.

ఎన్నో పత్రికలు అతడిని రియల్ ఎస్టేట్ మాఫియా కింగ్‌గా వర్ణించినా అతడిని అరెస్ట్ చేయడానికి ఏ ప్రభుత్వమూ పూనుకోలేదు. దీనికి కారణం... అతడు తను కొనబోయే భూముల వివరాలను రాజకీయ నాయకులకు కూడా చెప్పి కొనిపిస్తాడు. అవి ఆకాశంలో విహరిస్తాయి. అలా తమకు ప్రయోజనం చేకూర్చే వాడి మీద ఈగ కూడా వాలకుండా జాగ్రత్తగా చూసుకుంటాయి రాజకీయ గద్దలు.

అతడు భూములను పెంచే పద్ధతులు కూడా అనూహ్యరీతిలో ఉంటాయి. అతడు భూములను కొని ఆ విషయం రోడ్డు శాఖకు లోపాయికారిగా తెలియజేస్తాడు. వాళ్లు రాత్రికి రాత్రే ముడుపులు అందుకొని ఎటో వెళ్తున్న బైపాస్‌రోడ్డుని కాస్తా అతడు కొన్న పొలాల వేపు మళ్ళిస్తారు. దాంతో అక్కడ ఏదో జరుగుతుందన్న భావంతో రేట్లు తారాస్థాయినందుకుంటాయి.

అదీ లేకపోతే ప్రభుత్వం అక్కడ ఏదో పరిశ్రమలను తేనున్నదన్న పుకారు పుట్టిస్తాడు. అందుకు తగ్గట్టే కొంతమంది ప్రభుత్వాధికారులు ఫైళ్లు పట్టుకొని జీపు ఎక్కి వస్తారు. కాసేపు సర్వే చేసినట్లు నటించి వెళ్ళిపోతారు. ఆ విషయం ఆ నోటా ఈ నోటా పాకి భూమి రేట్లు తారాస్థాయినందుకుంటాయి. ఈ లోగా సమయం

చూసుకొని అతడు, అతడి దన్ను వున్న రాజకీయ నాయకులు ఆ భూమిని హెచ్చురేట్లలో వేరేవారికి అమ్మేస్తారు.

ఇలాంటివేవీ వీలు కాకపోతే అతడు స్థలాలు కొన్న చోట ఏ దేవుడి విగ్రహాలో బయటపడతాయి. అంతే అక్కడ ఫలానా దేవుడి గుడి రానున్నదన్న వార్త వస్తుంది. వెంటనే అతడి మనుషులు ఓ చిన్నగుడి కట్టేస్తారు. ఆ వూరి చుట్టూ నాలుగైదు షాపులు, బందోబస్తు ఏర్పాటు చేస్తాడు. దాంతో అక్కడ హడావిడి మొదలై భూమి రేట్లు ఒక్కసారిగా ముందుకు దూకుతాయి.

రతన్‌లాల్ ఎవరికీ భయపడడు. దానికి కారణం అతడికి ముంబాయి మాఫియాతో సంబంధాలు ఉండటమే. ఆ ముంబాయి మాఫియాకి దుబాయ్‌లో ఉన్న బాస్‌తో కనెక్షన్ ఉంటుంది. రతన్‌లాల్‌కి డైరెక్ట్‌గా దుబాయ్‌కింగ్‌తోనే మాట్లాడే సామర్థ్యం ఉంది. రతన్‌లాల్ ఒక సైగ చేస్తే చాలు ఆ రాజకీయ నాయకుడి తల తెగిపడుతుంది. ఎప్పుడు వస్తారో తెలియదు, ఎలా వస్తారో తెలియదు ముంబాయ్ మాఫియా బాంబుల్తో ఫలానా వ్యక్తిని చంపేసి కామ్‌గా వెళ్తుంటారు. అందుకే అతడి జోలికి వెళ్ళడానికి ఏ రాజకీయ నాయకుడూ సాహసించరు. ఫలానా వ్యక్తులను చంపిన వారిని త్వరలోనే పట్టుకుంటామని పోలీస్ కమీషనర్, ఐజీలు కన్వినెంట్‌గా స్టేట్‌మెంట్‌లు ఇస్తుంటారు. ఆ తర్వాత వాటి వూసే ఉండదు.

అతడి తల మీద పదికోట్లు ప్రైజ్ మనీ ఉంది. అతడిని పట్టిచ్చిన లేదా చంపిన వారికి పదికోట్లు ఇస్తామని సిబిఐ ఎప్పుడో ప్రకటించింది. అయినా అతడిని ఇప్పటిదాకా పట్టుకున్నవారు లేరు. దానికి కారణం అతడెప్పుడూ బయటకు రాడు. తెర వెనకాల ఉండి తమ మనుషులకు వ్యవహారాలు నడిపిస్తాడు. నిజానికి అతడెక్కడుంటాడో అనుచరులకే సరిగ్గా తెలియదు. అంతా ఫోన్‌లోనే ఆజ్ఞలు జారీచేస్తుంటాడు. అంత పకడ్బందీగా ఉంటాడు. కాబట్టే అతడి ఆచూకీ తెలియదు.

అలా రారాజుగా వెలుగొందుతున్న రతన్‌లాల్‌కు ఓ బంగారు అవకాశం వచ్చింది. ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ తనకు వంద ఎకరాలు కావాలని రతన్‌లాల్‌ని అడిగింది. దాంతో రతన్‌లాల్ భూమిని చౌకగా సేకరించడం మొదలుపెట్టాడు. అతడికి మొత్తం తొంభై తొమ్మిది ఎకరాలు చౌకగా లభించాయి. ఆ తొంభై తొమ్మిది ఎకరాలు మధ్యలో ఒక ఎకరం భూమి ఉంది. అంటే ఆ ఎకరానికి ఒకవైపు నలభై తొమ్మిది ఎకరాలు, మరో వైపు యాభై ఎకరాలు ఉంది. మధ్యలో ఉన్న ఆ ఎకరాన్ని

కొందామని చూశాడు. దానిని ఆ ఓనర్ అమ్మడానికి ఇష్టపడలేదు. రెట్టింపు డబ్బిస్తామన్న ఒప్పుకోలేదు. దాంతో చేసేది లేక రతన్‌లాల్‌కి కబురంపారు అసిస్టెంట్‌లు.

దాంతో రతన్‌లాల్ రంగంలోకి దిగాడు. ఆ ఓనర్ పేరును రిజిష్టర్డ్ ఆఫీసులో చూశాడు.

'దాక్షాయణీ' అని కనిపించింది. ఓస్! ఇంత చేసి ఆ స్థలం ఓ అమ్మాయిదా అనుకుంటూ అడ్రస్ తీసుకొని బయలుదేరాడు.

నిజానికీ ఆ స్థలం దాక్షాయణీ బామ్మకు చెందింది. ఆవిడకు పుట్టింటి పసుపు కుంకుమగా వచ్చింది. దానిని తన మనుమరాలికి కానుకగా ఇస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మకూడదని వెంకటేశ్వరస్వామి మీద ఒట్టేసుకుని మరీ మరణించింది. అలా ఆ స్థలం దాక్షాయణికి సంక్రమించింది.

అలాంటి దాక్షాయణీని వెతుక్కుంటూ బయలుదేరాడు రతన్‌లాల్.

◆ ◆ ◆

ఎప్పుడూ బయటకు రాని రతన్‌లాల్ తనే స్వయంగా బయటకు వచ్చాడంటే కారణం.... దాక్షాయణీ. ఆ అమ్మాయి చాలా సాధారణ అమ్మాయిని, ఆమె వెనకాల ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేదని అసిస్టెంట్‌లు తెలపడంతో అతడే స్వయంగా బయలుదేరాడు.

***కాని... ఆ అమ్మాయి వెనకాల ఓ అజ్ఞాతశక్తి ఉందని, ఆ శక్తి వల్లే ఆ అమ్మాయి ఇంతకాలం క్షేమంగా ఉందని అతడికి తెలియదు. తెలియదు కాబట్టే అతడే స్వయంగా బయలుదేరాడు.***

అతడికే కాదు, దాక్షాయణీకి తెలియదు తన వెనకాలున్న అజ్ఞాతశక్తి బలమెంతో.

◆ ◆ ◆

సరిగ్గా అదే సమయంలో–

తన కంప్యూటర్ ముందు అలసి సొలసి ఉన్నాడు ఆర్య. అతడికి కాస్త రిలీఫ్ కావాలనిపిస్తోంది. అందుకే దాక్షాయణీ అడ్రసు టైప్ చేశాడు. మరుక్షణం దాక్షాయణీ ఇంట్లో జరుగుతున్న ఇమేజెస్ కంప్యూటర్‌లో ప్రత్యక్షం అయ్యాయి.

దాక్షాయణీ వీణ వాయిస్తోంది. అపర సరస్వతీదేవి వీణ వాయిస్తున్న ఆమెను చూసి ముచ్చటేసింది ఆర్యకు. ఈ పిల్ల ఎప్పుడూ చూసినా అసలు వంటరితనం ఫీలవదేమిటి? కాస్త సమయం దొరికితే చాలు బోర్, బోర్ అంటుంటారు. ఈ కాలపు పిల్లలు. అలాంటిది ఈ పిల్ల ఆ నాలుగు గదుల్లోనే ఎంత కళాత్మకంగా జీవిస్తుందో! ఉదయం లేచి యోగా, ప్రాణాయామం, ధ్యానం, మొత్తం మూడు గంటలు చేస్తుంది. ఆ తర్వాత మెరుపువేగంతో గాస్ స్టవ్‌లోని మూడు బర్నర్‌లోనూ గిన్నెలు పెట్టి ఒకే ఒక గంటలో వంట ముగించేస్తుంది. స్నానం అయ్యాక ఒక గంట పూజ చేస్తుంది. ఆ తర్వాత పాటలు పాడుతోంది లేదా వీణ వాయిస్తుంది. ఇంట్లో టీవీ లేదు. కంప్యూటర్ అసలే లేదు. ఇక సెల్‌ఫోన్ మొఖం చూసిందో, లేదో తెలియదు. అయినా ప్రతిక్షణం జీవితాన్ని అర్థవంతం చేసుకుంటుంది. ఈ కాలపు అమ్మాయిలకు భిన్నంగా బాయ్‌ఫ్రండ్స్, సినిమాలు, షికార్లు ఉండవు. తాను చేసే ప్రతి పనిలోనూ ఆనందాన్ని పొందటం ఎలాగో ఆమెకు తెలుసు.

ఆమెకే మైమరుపుతో చూస్తున్నాడు ఆర్య. వీణ వాయిస్తున్న ఆమె తలుపు చప్పుడవడంతో వీణని ఆపింది. నెమ్మదిగా వీణని పక్కకు తీసిపెట్టి తలుపు తీయడానికి లేచింది.

ఆర్య ఆమెనే చూస్తున్నాడు.

తలుపు తీసిన మరుక్షణం దాక్షాయణీ ఒక్క క్షణం వణికింది. ఒక మేఘం ఉరిమింది.

"ఎవరు మీరు?"

"దాక్షాయణీ నీవే కదా" లోపలికి కదులుతూ అన్నాడు రతన్‌లాల్.

"అవును నేనే.." ప్రశ్నార్థకంగా కదిలింది" అదేమిటి అనుమతి లేకుండా లోపలికి వస్తున్నారు?"

"నా పేరు రతన్‌లాల్..." అతడు చెబుతుండగా బయట పిడుగు పడ్డ శబ్దం.

"అయితే..."

"గంగాపురంలో నీకొక ఎకరం ఉంది కదా! అది నాకు కావాలి..."

"నో... అది నేను అమ్మను, మా నాయనమ్మ ఎవరికీ అమ్మవద్దని ఒట్టు వేసుకొని...."

రతన్‌లాల్‌కి నవ్వొచ్చింది. ఇంత చాదస్తపు అమ్మాయితో డీల్ చాలా తేలికగా ముగించవచ్చు.

"ఒట్లు గిట్లు పక్కకు పెట్టు. అది నాకు కావాలి. నీకు రెట్టింపు రేటు ఇస్తాను."

"మీరు పది రెట్లు ఇచ్చినా నేను అమ్మను..." స్థిరంగా కదిలింది దాక్షాయణీ కంఠం.

రతన్‌లాల్ ఒక్క క్షణం షాక్ తిన్నాడు. పిట్ట తాను అనుకున్నంత తేలిక రకం కాదు! సామదాన దండోపాయాలు ఉపయోగించి పరిస్థితి తెచ్చుకోవాలి.

"చూడు నా పేరు రతన్‌లాల్! నా పేరు చెబితే ఇండియాలో ఒక్క మాఫియా వాడు కూడా కదలడు. ఒక్క పోలీస్ కూడా రాడు. మినిస్టర్లు కూడా పక్క తడిపేసుకుంటారు తెలుసా? మర్యాదగా ఆ ఎకరం నాకు అమ్మేసెయ్..."

"మీరు ఎంత పెద్దవారైతే నాకేమిటి? ఇంతకుముందు కూడా ఇద్దరు, ముగ్గురు మీ మనుషులే అనుకుంటా అడిగారు దానిని అమ్మమని. నా ఆస్థి నా ఇష్టం. నేను ఎవరికీ అమ్మను."

"ఒహో! అలాగా! నీకు ప్రాణాల మీద తీపి ఉంటే దానిని ఇచ్చేయ్. లేదా నీ అడ్రసు కాస్తా గల్లంతవుతుంది"

"చెప్పానుగా..." దాక్షాయణీకి ఏడుపు వచ్చేసింది" నేను దేవుడి మీద ఒట్టేసు..."

"చాదస్తపు కబుర్లు ఆపు..." రతన్‌లాల్ విసుక్కున్నాడు. "ఆ ఎకరం నాకు కావాలి అంతే"

"నేను అమ్మను... " అంతే నిక్కచ్చిగా కదిలిందామె కంఠం.

మరుక్షణం రతన్‌లాల్ చేతిలో కత్తి మెరిసింది. అంత లాఘవంగా కత్తి ఎలా తీశాడో దాక్షాయణీకి అర్ధం కాలేదు.

"చూడు!ఈ కత్తి నీ వంట్లో పొడిచాననుకో! నీ రక్తం బుసబుస పొంగుతోంది. ఆ రక్తంతో సూపు తాగితే ఎలా ఉంటుందో తెలుసా?"

తన ముందున్న వ్యక్తి ఎంత దుర్మార్గుడో అర్థమైంది ఆమెకు. వెంటనే ఒక అడుగు వెనకేసింది.

"చూడు నేను నీకు మూడు రోజులు టైమిస్తున్నాను. శుక్రవారం సాయంకాలం 6 గంటలకు సరిగ్గా వస్తాను. అప్పటిదాకా ఆలోచించుకో! ఇండియాలోనే అత్యంత శక్తివంతుడితో గొడవ తెచ్చుకొని నీ జీవితాన్ని గల్లంతు చేసుకుంటావో, లేదా ఆ ఎకరం నాకు అమ్మేసి నీకు ఎంత డబ్బు కావాలో తీసుకుంటావో తేల్చుకో. నీవు పోలీస్, కోర్టు, మినిస్టర్స్ ఎవరికి దగ్గరకు పోయినా నా వెంట్రుక కూడా పీకలేరు. ఈ డీల్ వెనకాల ఉన్నది నేను కూడా కాదు. దుబాయ్‌లో మాఫియా సామ్రాజ్యానికి అధిపతైన మా బాస్ అహ్మద్ షరీఫ్. అతడి గురించి నీవు వినే ఉంటావు. అక్కడ నుండే ఇండియాలో ఎవరినైనా నిమిషంలో లేపేస్తాడు. కాబట్టి మాఫియాతో పెట్టుకోవాలని ఎవరూ అనుకోరు. నీవు చూస్తే పెళ్ళీ, గిళ్ళీ లేకుండా చక్కగా, కుదురుగా ఉన్నావు. అనవసరంగా నూరేళ్ళ జీవితాన్ని నాశనం చేసుకోకు. వస్తాను. బై.. బై..."

రతన్‌లాల్ వేగంగా బయటికి కదిలాడు. దాక్షాయణీ వళ్ళంతా చెమట్లు పట్టేశాయ్.

'మైగాడ్! తన పొలం మీదే కన్ను పడింది. ఇప్పుడేం చేయాలి తను? పైగా నాన్నగారు ఇంట్లో లేరు. ఆఫీసు క్యాంపు మీద వారం రోజులు దాకా రారు. దానిని తాను అమ్మకపోతే తనను ఏదోకటి చేసేటట్లున్నారు. పోనీ వాడికి భయపడి ఇచ్చేద్దామా అనుకుంటే శ్రీ వేంకటేశ్వరస్వామి మీద మరీ ఒట్టేసి దానిని ఎవరికీ అమ్మనని బామ్మకు మాట ఇచ్చేసింది. అదేమిటో ఒక కష్టం పోతే మరో కష్టం వెంటాడుతుంది. అలా పైకే అనేసింది ఆమె.

సరిగ్గా అప్పుడు గుర్తొచ్చాడు. 'అతడు' ఆమెకు. అవును! ఒకప్పుడు క్రెడిట్ కార్డు వాడి బారి నుండి తనను రక్షించాడు 'అతడు'. ఆ తర్వాత హోమ్ మినిస్టర్ కొడుకు బారి నుండి తనను కాపాడాడు. అతడి మీద కోపంతో ఆ రోజు తనే ఫోన్ పెట్టేసింది. అయినా అతడు మాత్రం ఏం చెయ్యగలడు? ఈ రతన్‌లాల్ దేశంలోనే అత్యంత శక్తివంతమైన మాఫియా లీడర్. ఇతగాడి బాస్ దుబాయ్‌లో ఉంటాడట. అంతపెద్ద ఇంటర్నేషనల్ బాస్‌ని 'అతడు' ఏం చేయగలడు? ఎవరూ ఏం చేయలేరు. అయినా అతడు ఈ మధ్య తనతో 'టచ్‌లో లేడు. అవును! తనే అతడిని విసుక్కుంది. తన వివరాలు చెప్పలేదని ఫోన్ పెట్టేసింది. పాపం! హర్టయి ఉంటాడు. ఆ రోజు నుండి ఫోన్ చేయడం మానేశాడు.

అలా అనుకుంటూ ఆమె దృష్టి తిరిగి ఫోన్ కేసి కదిలింది.

తన కష్టం ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదు. పోలీస్‌కి చెబితే వెంటనే ఆ విషయం రతన్‌లాల్‌కు వెళ్ళిపోయింది. ప్రెస్‌కు చెబితే రతన్‌లాల్ తన మీద కత్తి దూస్తాడు. ఇంకా ఎవరికి చెప్పుకోవాలి?

అప్పుడే గుర్తొచ్చిందామెకు జయశ్రీ. ఆమె సైకాలజీ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తుంది. సైకాలజీలో తనంతట దిట్ట ఇంకొకరు లేరని జయశ్రీ నమ్మకం. ఆమె తనకు మిగిలిన ఫ్రెండ్. ఆమెని సలహా అడిగితే సరి. ఆమేదో తన సమస్యని పరిష్కరిస్తుందని కాదు. కేవలం తన సమస్యకు ఇలా చెయ్, అలా చెయ్ అని కనీసం సలహా ఇస్తుందన్న ఆశ.

వెంటనే జయశ్రీ ఇంటికి బయలుదేరింది.

“జయశ్రీ! నాకొక సమస్య వచ్చింది”

“చెప్పు. చిటికెలో పరిష్కరిస్తాను” సిగ్మండ్‌ఫ్రాయిడ్ పుస్తకాన్ని మూసేస్తూ ఉత్సాహంగా అంది జయశ్రీ. తన సలహా కోసం ఓ స్నేహితురాలు అలా క్లయింట్‌గా రావడం ఆమెకు గర్వంగా ఉంది.

అప్పుడు కదిలిందామె కంఠం. రతన్‌లాల్ తన ఇంటికి రావడం, పొలం అమ్మమని బెదిరించడం చెప్పింది, అంతేకాదు, అంతకుముందు సమస్య వచ్చినప్పుడు ‘అతడు’ ఫోన్ చేయడం, తనను క్రెడిట్ కార్డు వారి బారి నిండి కాపాడడం, ఆ తర్వాత తనను హెూమ్ మినిస్టర్ బారి నిండి కాపడడం అన్నీ వివరంగా చెప్పింది.

అంతా చెప్పాక “ఆ రోజు నుండి ‘అతడు’ ఏమయ్యాడో తెలియదు. నేను ఫోన్ పెట్టేశాక అసలు అతడి నుండి ఫోన్ రాలేదు. పైగా నేను పరీక్షలో ఎక్కడ తప్పు రాశానో కూడా పట్టేశాడు. నా ఇంట్లో, పరీక్ష హాల్లో జరుగుతున్న విషయాలు అతడికి ఎలా తెలుస్తున్నాయో అర్థం కాలేదు. అలాంటి ‘అతడు’ ఇంత పెద్ద కష్టం వచ్చాక కూడా ఫోన్ చేయలేదు. అంతా మాయగా ఉంది” అని అంది.

అంతే! జయశ్రీకి ఉత్సాహమొచ్చింది. ఆమె సమస్య ఏమిటో తనకు అర్థం అయినట్లుగా కేరింతలు కొట్టింది.

ఆ తర్వాత కదిలింది జయశ్రీ కంఠం ఉత్సాహంగా.

“అసలు నీకు ఫోన్‌లో మాట్లాడే ‘అతడే’ లేడు. అదంతా నీ భ్రమ. నీకు కష్టం వచ్చినప్పుడు ఫలానా ‘అతడు’ వచ్చి రక్షిస్తే అన్న భావం బలంగా ఉండేది. అందుకే

నీ వూహల్లో నుండి అతడు ఓ హీరోగా ఉద్భవించాడు తప్ప నిజానికి 'అతడు' లేడు. అతడే నిజంగా వుంటే నీకు ఎందుకు కనిపించాడు? నీ కళ్ళముందుకు ఎందుకు రాడు?

కాబట్టి 'అతడు' అనేవాడే లేడు. నీ అభద్రతా భావం నుండి ఊడిపడిన పదమే 'అతడు'. నిజానికీ ఆ రోజు క్రెడిట్‌కార్డు వారికి ఫోన్ చేసింది ఎవరో ఆకతాయి వ్యక్తి అయ్యింటాడు. ఆ తర్వాత పరీక్షలో హోమ్ మినిస్టర్ కొడుకు పరీక్ష రాయకపోవడానికి కారణం ఆ రోజు హోమ్‌మినిస్టర్ కొడుక్కి ఆరోగ్యం బాగుండి ఉండదు. అంతే తప్ప అందుకు నీ వూహల్లోని 'హీరో' కారణం కాదు. అందువల్ల అలాంటి వ్యక్తే లేనపుడు ఎవరో వస్తాడు, ఏదో చేస్తాడనుకోవడం భ్రమ".

దాక్షాయణి నిర్ఘాంతపోయింది. నిజంగా 'అతడు' అనేదే భ్రమా? 'అతడు' ఉనికే లేదా? ఆమెకు జయశ్రీ లాజిక్ వింటుంటే మతిపోయినట్లుంది. ఆ స్థితిలో ఉండగా జయశ్రీ కంఠం కదిలింది.

"దాక్షాయణీ! ఒక పని చేద్దాం. నీ పరీక్ష రోజు హోమ్‌మినిస్టర్ కొడుకు ఎందుకు పరీక్ష రాయలేదో ఆ ఆఫీసులో పనిచేస్తున్న గూర్ఖాని కనుక్కుందాం. ఆ గూర్ఖా మా నాన్నకు ఫ్రెండ్" అంటూ మరుక్షణం ఒక ఫోన్ నెంబర్ వెతికి చేసింది.

మరో నిమిషం తర్వాత అవతల గూర్ఖా లైనులోకి వచ్చాడు.

"నేను జయశ్రీని అంకుల్! బాగున్నారా? ఏం లేదు మన హోమ్ మినిస్టర్‌గారి అబ్బాయి ఆఖరి పరీక్ష ఎందుకు రాయలేదో చెప్పగలరా?"

మరో క్షణం కూడా కాకముందే గూర్ఖా కంఠం జయశ్రీ ఫోన్‌లోని స్పీకర్‌లోంచి వినిపించింది.

"అదా! ఆ రోజు అబ్బాయిగారికి వాంతులు, విరోచనాలు పట్టుకున్నాయి. దాంతో హాస్పిటల్‌లో ఉంచి సెలైన్ ఎక్కించారు. అందుకే పరీక్ష రాయలేకపోయాడు..."

దాక్షాయణికి తలగిర్రున తిరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. మైగాడ్! నిజమా? హోమ్ మినిస్టర్‌కొడుకుని 'అతడు' ఆపలేదా? అలాగే క్రెడిట్ కార్డు కంపెనీది కూడా మోసమా?

ఆమె జయశ్రీ దగ్గర సెలవు తీసుకొని గబగబా క్రెడిట్ కార్డు కంపెనీ అడ్రసు వెతుక్కుని వెళ్ళింది. తన తండ్రి పేరు చెప్పి, ఆ రోజు ఎంత బాలన్స్ ఉందో అకౌంట్

ఓపెన్ చెయ్యమని అడిగింది. ఆ ఎగ్జిక్యూటివ్ కంప్యూటర్‌లో ఆమె తండ్రి గ్యారంటీ ఇచ్చిన పేరు టైప్ చేశాడు.

మరుక్షణం కూడా కాకముందే ఆ అకౌంట్ కంప్యూటర్‌లో కనిపించింది. ఒక్క పైసా కూడా బాలన్స్ లేదు.

“ఎవరు చెల్లించారు?” దిగ్భ్రాంతిగా కదిలిందామె కంఠం.

ఆ ఎగ్జిక్యూటివ్ మొత్తం బ్యాంకు రసీదులు బయటకు తీశాడు.

“ఇదిగో మీ తండ్రి రామశర్మగారే ఆఖరి రోజున మొత్తం డబ్బు చెల్లించారు” అంటూ కాగితం చేతికి ఇచ్చాడు.

నిజమే! అది తన తండ్రి హ్యాండ్ రైటింగ్! మొత్తం డబ్బు చెల్లించిన రసీదే! ఆమె తల గిర్రున తిరుగుతున్నట్లనిపిస్తోంది.

‘మైగాడ్! అదంతా నిజంగా మోసమా? అదంతా జయశ్రీ చెప్పినట్లు తన వూహాగానమా? తన తలలో ఏ కేంద్రమైనా వక్రంగా పని చేస్తుందా? తాను అంత వూహల్లో తేలిపోయిందా? నో... తాను అలా కలల్లో తేలిపోయే రకం కాదు. ‘అతడు’ అనేది వూహ అనుకునేంత భ్రమల్లో తేలిపోయేది కాదు. కాని పరిస్థితులన్నీ ‘అతడు’ నిజం కాదని తెలుపుతున్నాయి.

ఆమెకు తల పగిలిపోతుననట్లన్పిస్తుంది. తూలిపడబోయి పక్కనే ఉన్న టేబుల్‌ని సపోర్ట్‌గా పట్టుకుంది.

ఎలాగో నిలదొక్కుకుని బయటకు వచ్చింది. నో! ఎక్కడో ఏదో జరుగుతోంది? ‘అతడు’ అనేది ఊహా? తన మదిలో వెలిసిన రూపమా? నిజం కాదా?

అప్పుడు అకస్మాత్తుగా గుర్తొచ్చింది. ఆమెకు తాను పరీక్షలో తప్పు రాసిన జవాబు. అవును! ఆ జవాబు తప్పు రాసినట్లు తనకు తప్ప వేరే వారు కనిపెట్టే అవకాశమే లేదు. అలాంటిది అతడు కనిపెట్టాడంటే ‘అతడు’ అనేది నిజం. వూహ కానే కాదు.

మరుక్షణం ఆమె శరీరంలోకి కొత్త వూపిరి వచ్చినట్లయింది. వెంటనే వడివడిగా ఇల్లు చేరుకుంది. ఆమె తండ్రి రామశర్మ ఇంట్లోనే ఉన్నాడు. ఆమెని చూసి “ఎక్కడికి వెళ్ళవమ్మా?” అని ప్రేమగా అడిగాడు.

“ఫ్రెండ్ ఇంటికి నాన్న”

“అలిసిపోయినట్లున్నావు. అన్నం తినమ్మా”

“అలాగే! అన్నట్లు నాన్న ఆ రోజు మీరు క్రెడిట్ కార్డు కంపెనీకి చెల్లింపులు చేశారా?”

“అవునమ్మా! ఎవరో చేసిన మోసానికి ఆ కంపెనీ వారు ఎందుకు నష్టపోవాలి అంటూ నాకొచ్చిన ఎరియర్స్ తాలూకు డబ్బుతో కట్టేశాను...”

దాక్షాయణిని తిరిగి అయోమయం ఆవరించింది. అదేమీ గమనించకుండా ఆమె తండ్రి చెప్పుకుపోయాడు.

“అయితే ఆ క్రెడిట్‌కార్డు కంపెనీ ఏజంట్ కలిసి అసలు పేమెంట్స్ అవసరం లేదన్నాడు. అలా చెల్లింపులు చేస్తే తనకు మూడుతున్నదని చెప్పాడు. నా చెల్లింపుకు ఎవరిదో వత్తాసు ఎందుకని చెల్లించాను. కాని మరుసటి రోజే ఆ ఏజంట్ వచ్చి నా డబ్బు నాకిచ్చేశాడు. నేనూ తీసుకోనని చెబితే నా కాళ్ళా వేళ్ళా పడ్డాడు. నేను తీసుకోకపోతే తన బ్రతుకు రచ్చకెక్కుతుందని, తనని నడిబజార్లోకి లాగి మరీ కొడతాడని ఏదేదో మాట్లాడాడు. నేనెంత చెప్పినా వినకుండా ఇంటికి వచ్చి, ‘దాక్షాయణీ పవిత్ర దేవత లాంటిది. నా చెల్లిలాంటిది. నేను మీ కొడుకులాంటివాడిని’ అని ఏదేదో చెప్పి డబ్బు టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు. నాకు విచిత్రమనిపించింది.

దాక్షాయణి మెదడులో ఒక్కొక్క పొర విడిపోతున్నట్లనిపిస్తోంది. సో! ‘అతడు’ అన్నది నిజమే! భ్రమ కాదు తన వూహ కాదు. ఆ క్రెడిట్‌కార్డు కంపెనీ ఏజంట్ తన ఇంటికి వచ్చి బెదిరించాడు అతడు చివరకు తన తండ్రికి డబ్బుని తిరిగి ఇచ్చేశాడు. పైగా పరీక్ష హాల్లో తను ముక్కు తిమ్మన గురించి తప్పు రాసిన విషయం వేరే వారికి తెలిసి అవకాశమే లేదు. అతడికి తప్ప.

అతడు నిజంగానే ఉన్నాడు. కాకపోతే గత కొద్దిరోజుల నుండి అతడు తనతో టచ్‌లో లేడు. అంతే!

మరుక్షణం ఆమెలో ఉత్సాహం ఉరకలెత్తింది. ‘అతడు’ నిజంగా వున్నాడన్న వూహ ఆమెలో ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేసింది.

కాని అతడు తనకు కనిపించడం లేదు. అజ్ఞాతంగా ఉన్నాడు. కనీసం తాను అతడికి కనిపిస్తే చాలు. రాబోయే శుక్రవారం రతన్‌లాల్ సమస్య నుండి తనని బయటపడేది అతడే.

క్షణాలు గడుస్తున్నాయి ఆ ఉద్రిక్తతలోనే.

ఆమె మాటిమాటికి ఫోన్ వేపే చూడసాగింది. అతడు ఒక్కసారి ఫోన్ చేస్తే బాగుండు. అయినా ఇంత పెద్ద సమస్యను అతడేం డీల్ చేయగలడు? అంత పెద్ద మాఫియాను ఎదుర్కోవడానికి అతడి శక్తి సామర్థ్యాలు సరిపోతాయా?

ఆమె మరోసారి ఫోన్‌కేసి చూసింది. మిత్రమా! నా మీద కోపం వచ్చిందా? స్నేహితుల మధ్య కోపతాపాలు మామూలే కదా! ఒక్కసారి....

ఆమెలా అనుకుంటుండగానే అప్పుడు మ్రోగింది ఫోన్ రింగ్ రింగ్‌మంటూ.

ఒక్కదుటన లేచి పరిగెత్తిందామె. ఆ వేగానికి కాళ్ళకున్న వెండిపట్టాలు, చేతులకున్న బంగారు గాజులు మనోహరంగా శబ్దం చేశాయి.

"హలో..." అందామె పరవశంగా.

"హలో బాగున్నారా?"

"ఇంతకాలం ఫోన్ చేయలేదేం?" బుంగమూతి పెట్టిందామె.

"నా మీద కోపం వచ్చి ఫోన్ పెట్టేశారు కదా ఆ రోజు...."

"అయితే మటుకు ఇంతకాలం పాటు ఫోన్ చేయకుండా ఏడిపిస్తారా?" ఆ మాటలన్నాక ఆమె నాలుక కరుచుకుంది ఎందుకన్నానా అంటూ.

"ఇక నుండి చేస్తా కదా! ఇంతకూ ఏం కష్టం వచ్చిందో అమ్మాయిగారికి?"

ఆమెకు ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. వెంటనే మాఫియా డాన్ తన పొలం మీద కన్నేసిన విధానం, అతడు ఇంటికి వచ్చి బెదిరించడం, రేపటిదాకా టైమ్ ఇచ్చానని హెచ్చరించి వెళ్ళడం.... మొత్తం చెప్పేసింది.

చాలాసేపటిదాకా అతడేం మాట్లాడలేదు.

దాక్షాయణీలో ఉద్వేగం. అదేమిటి అతడెందుకు నిశ్శబ్దంగా ఉన్నాడు.

"హలో..." కదిలాయ్ ఆమె పెదాలు.

"హలో..."

"ఏమిటి సైలెన్స్ అయిపోయారు?"

"ఆలోచిస్తున్నాను. నీ కష్టం గురించే... ఆ మాఫియాని ఎలా ఎదుర్కోవాలో"

దాక్షాయణీకి కోపం వచ్చేసింది "అయినా అంత పెద్ద మాఫియా వాడిని మీరు ఎలా ఎదుర్కొంటార్లే! మీ శక్తి చాలదు. పైగా వాడు ఇంటర్నేషనల్ డాన్

అహ్మద్ షరీఫ్ మనిషి. ఇండియాలోనే కాదు, ప్రపంచంలో సైతం వాడిని ఎదిరించేవాడు లేడట. మీరేం చెయ్యగలరు? మీ సామర్థ్యం ఎంత?"

మరుక్షణం ఆర్య నోట వెంట కదిలాయ్ పదాలు.

"అయితే ఇంకేం ఆ పొలం వాడికే ఇచ్చేయ్యండి"

"అమ్మో" గుండెల మీద చేతులేసుకొని అంది "శ్రీ వేంకటేశ్వరస్వామి మీద ఒట్టేశాను కదా! పాపం తగలదూ"

"పోనీ ఉంచేసుకో...."

"ఉంచేసుకుంటే ఈ మాఫియావాడు చంపుతాడు. ఇస్తే దేవుడు శపిస్తాడు. ఈ రెండింటి మధ్య నా పరిస్థితి శ్లేష్మంలో పడ్డ ఈగలా తయారయ్యింది"

"కాసేపు వాడి టాపిక్ వదిలేసి వీణ వాయించుకో..."

దాక్షాయణీకి కోపం వచ్చేసింది "అసలే టెన్షన్‌తో చస్తుంటే తీరిగ్గా వీణ వాయించుకోవాలా? అవునులే సమస్య మీది కాదు కాబట్టి ఎన్ని కబుర్లయినా చెబుతారు".

ఆమెకు ఒక్కసారిగా దుఃఖం వచ్చేసింది. కళ్లమ్మట నీరు తిరిగాయి. బేలగా ఏడుస్తున్న ఆమెను చూసి కదిలింది ఆర్య కంఠం.

"ఆ కలకంఠ కన్నీళ్ళు జలజల.... అవును! ఇది రాసిన నంది తిమ్మన? లేక ముక్కు తిమ్మనా?"

ఆమె బరస్ట్ అయింది ఒక్కసారిగా.

"ఏం తమాషాగా ఉందా? ఓ ప్రక్కన నా సమస్యతో నేను సతమతమవుతుంటే మీకు నా కన్నీళ్ళు నంది తిమ్మన లేదా ముక్కుతిమ్మనలా అంటూ ఎగతాళి చేస్తారా? అవునులే మీ జీవితం వడ్డించిన విస్తరి కాబట్టే అలా దూరం నుండి చూసి నవ్వుతున్నారు"

ఒక్కసారిగా ఆర్య శరీరంలో ఐస్‌గడ్డ కట్టిన ఫీలింగ్. పొరబడ్డావు దాక్షాయణి! నేను ఏదో ఇక్కడ చాలా ఆనందంగా ఉన్నాననుకున్నావు. పగ, ప్రతీకారంతో ఒంటరిగా, నా అనేవారు లేకుండా, క్షణమైనా విశ్రాంతి తీసుకోకుండా, ఎన్నో రాత్రులు ఆహారం, నిద్ర లేక అలమటిస్తున్నాను. నా బతుకు పగవాడికి కూడా రాకూడదు. ఈ దుర్భల పరిస్థితుల్లో నిన్ను చూస్తుంటే ఏదో రిలీఫ్ అనిపిస్తోంది. అంతే!

పైకి అనలేదు ఆర్య. తనలో తానే అనుకున్నాడు.

అతడలా నిశ్శబ్దంగా ఉండేసరికి దాక్షాయణికి మరింత కోపం వచ్చేసింది. విసురుగా ఫోన్ పెట్టేయ్యబోయింది.

"దాక్షాయణీ ఆగండి! రేపు మీకేం కాదు. మీ పొలం మీ దగ్గరే ఉంటుంది. మీరు నిశ్చింతగా ఉండండి".

"అంటే మాఫియాడాన్ మా ఇంటికే రాడా?"

"వస్తాడో, రాడో తర్వాత విషయం. నేను ఇంకా ప్లాన్ చేయలేదు. ఏది ఏమైనా రేపు ఈ సమస్య నుండి బయటపడేసే బాధ్యత నాది. సరేనా?"

"నిజమా? థాంక్స్! కాని అందుకే మీ శక్తిసామర్థ్యాలు సరిపోకపోతే..."

"దాక్షాయణీ! పదే పదే శక్తిసామర్థ్యాలు, బలం లాంటి పెద్ద పెద్ద మాటలు వదిలెయ్యండి. అవన్నీ నేను చూసుకుంటాను. మీరు నిశ్చింతగా నిద్రపోండి..."

మరుక్షణం ఫోన్ పెట్టేసినట్లుగా అవతల వేపు రిసీవర్ క్లిక్‌మంది.

దాక్షాయణి స్థాణువైంది. అతడికి కొద్దిగా కోపం వచ్చిందని అర్థం అయింది. క్షమాపణ చెబుదామన్నా అతడి ఫోన్ నెంబర్ లేదు, అతడి ఆచూకీ తెలియదు.

చేసేది లేక అలాగే ఆలోచిస్తూ కూర్చుంది.

◆ ◆ ◆

రాత్రి ఏడవుతుంది.

దాక్షాయణికి టెన్షన్‌గా ఉంది. ఆ మాఫియావాడు వచ్చే సమయం అయింది. వాడు వస్తాడా? రాడా? ఒకవేళ వస్తే తాను పొలం ఇచ్చేయ్యాలా? లేదా? అయినా 'అతడు' చూసుకుంటానన్నాడు కదా! అసలు అంత పెద్ద మాఫియావాడిని 'అతడు' ఎలా చూసుకుంటాడు? అతడేమైనా జేమ్స్‌బాండ్ జీరో జీరో సెవనా?

అప్పుడు మ్రోగింది ఫోన్ ఆ ఉద్రిక్తతలో ఆమె చేతులు వణుకుతున్నాయ్. ఎలాగో ఫోన్ చేతిలోకి తీసుకోంది.

"హల్లో" ఉద్వేగం ఆమె కంఠంలో.

"హాయ్" అతడి కంఠం.

"అదేమిటి ఇప్పుడు ఫోన్ చేశారు? ఆ మాఫియా వాడు వచ్చే సమయం అయింది"

"ఫర్వాలేదు! వాడింకా రాలేదు కదా"

"అంటే.. వాడు ఇప్పుడు వస్తాడా?"

"వస్తాడు..."

"మైగాడ్" ఆమెకు ఏడుపు ఒకటే తక్కువ. "నిజం చెప్పండి! వాడు నిజంగా వస్తాడా?"

"తప్పకుండా వస్తాడు. మీ పొలం వల్ల వాడికి పది కోట్లు మిగుల్తాయి"

"అంటే నా పొలం వాడికి ఇవ్వాల్సిందేనా? మీరేం చెయ్యలేకపోయారా?" ఏడుపు తన్నుకొస్తోంది ఆమెకు.

"పొలం కాగితాలు లాకర్‌లో ఉన్నాయని చెప్పండి. వాడేమైనా అడ్వాన్స్ ఇస్తే తీసుకోండి..."

"మీకేమైనా పిచ్చా?" అరిచిందామె" అడ్వాన్స్ తీసుకుంటే వాడు రేపు వచ్చి నన్ను లాకర్‌లో ఆ డాక్యుమెంట్ ఎక్కడుందా అని ఎత్తుకెళ్ళి మరీ చంపుతాడు. అయినా నా పరిస్థితి మీకు ఆటగా ఉందా?"

"ఆటా లేదు, పాటా లేదు. ముందు నేను చెప్పినట్లు చెయి. అన్నట్లు నీకు ఓ ఇంగ్లీషు థ్రిల్లింగ్ సినిమా చూడాలని ఉందా?"

"మీకేమైనా మతి చెడిందా? అసలే నా వళ్ళంతా టెన్షన్‌తో వణికి చస్తుంటే ఇంగ్లీషు థ్రిల్లింగ్ సినిమా చూస్తావా అని అడుగుతారా?"

"సినిమా అంటే సినిమా కాదు. మీ కళ్ళముందే ఇంగ్లీషు జేమ్స్‌బాండ్ దృశ్యాలు చూపిస్తాను. చూసి తరిస్తావా?" అతడు ఇంకా ఏదో అంటుండగా తలుపు కొట్టిన శబ్దం అయింది.

"మైగాడ్! వాడొచ్చాడు.." అదిరిపడే గుండెలతో ఫోన్ పెట్టేసి వణికే శరీరంతో తలుపు తీసింది.

ఎదురుగా రతన్‌లాల్ క్రూరంగా నవ్వుతూ ఉన్నాడు.

ఆమెలో ఒక్కసారిగా కుప్పకూలిన ఫీలింగ్. శరీరంలోని నరాలన్నీ కుంచించుకుపోయిన భావన.

"ఏం పిల్లా! పొలం అమ్ముతున్నావా? లేదా?"

"అదీ... అదీ..."

మరో సెకండ్ కాకముందు అతడి చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమైంది.

అది చూసిన దాక్షాయణి నోట్లో తడారిపోయింది.

"అమ్ముతాను... కాని డాక్యుమెంట్ బ్యాంక్ లాకర్లో ఉంది".

"ఎప్పుడు తెస్తావ్?"

"రే...రే.. రేపు"

"సర్లే! ఇప్పుడు ఆ పొలం అమ్ముతున్నట్లుగా అడ్వాన్స్ తీసుకో... డాక్యుమెంట్ రేపు ఇద్దువు కానీ..."

"అడ్వాన్స్ ఎందుకు?... ఒకేసారి రేపు తీసు..." వంట్లో వణుకు వల్ల నోట్లో మాట రావడం లేదు.

"సర్లే! ముందు అగ్రిమెంట్ మీద సంతకం చెయ్" పిస్తల్‌ని ఎడమ చేత్తో మార్చుకుంటూ అగ్రిమెంట్‌ని ముందుకు తోశాడు.

దాక్షాయణీకేం చేయాలో తోచలేదు. ఆమెలా దిగ్భ్రాంతిలో ఉండగా రతన్‌లాల్ పిస్తల్‌ని ఆమె కణితకు ఆనించాడు.

"సంతకం పెట్టు ముందు..."

దాక్షాయణీకి పిచ్చెక్కింది. ఏదైతే అదే అవుతుందని గబగబ సంతకం పెట్టింది.

"గుడ్! ఓ రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేయిస్తాను. రెడీగా ఉండు.." అంటూ అగ్రిమెంట్ కాగితం జేబులో దోపుకుంటూ ముందుకు కదిలాడు.

దాక్షాయణీకి మతిపోతోంది. వచ్చాడు, సంతకం తీసుకున్నాడు, వెళ్తున్నాడు. తాను మాత్రం బుక్కయిపోయింది. అంటే ఆ పొలం అతడికి అమ్మాల్సిందేనా?" ఆమెకు ఏడుపు ఒకటే తక్కువ.

వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ ఉండగా అప్పుడు వినిపించింది డైనమైట్ పేలిన శబ్దం.

ప్రతిగా పిస్తళ్ళ శబ్దాలు మారోమ్రోగుతున్నాయి.

ఏం జరుగుతుందో అర్థం కాక కిటికీ దగ్గరకు వెళ్ళింది దాక్షాయణీ.

రతన్‌లాల్ కార్ల మీద పై నుండి బుల్లెట్ల వర్షం కురుస్తోంది. రతన్‌లాల్ అనుచరులు తిరిగి పిస్తళ్ళతో సమాధానం ఇస్తున్నారు.

రతన్‌లాల్ కారు దిగి పరిగెడుతున్నారు. అతడికి దడి కడుతూ అనుచరులు చుట్టూ తిరుగుతూ రివాల్వర్లు పేలుస్తూ కదుల్తున్నారు.

పై నుండి డైనమైట్లు పడిన శబ్దం.

చుట్టూ చీకటి... ప్రతిగా పిస్తళ్ళు పేలుతున్న శబ్దాలు. వీధి లైట్లు పిస్తల్‌తో కాల్చేయడం వల్ల మనుషులెక్కడున్నారో కనిపించడం లేదు. దాంతో రతన్‌లాల్‌ని ట్రేస్ చెయ్యడం కష్టంగా ఉందని తెలుస్తోంది.

ఆమెలా ఉద్రిక్తతగా చూస్తూండగానే ఓ డైనమైట్ వచ్చి కారు మీద పడింది. మరుక్షణం నిప్పులు కక్కుతూ డైనమైట్ ప్రేలింది. ఆ ప్రేలుడుకు కారు పది అడుగులు పైకి ఎగిరి తునాతునకలైపోయింది. అందులో ఉన్న రతన్‌లాల్ మనుషులు శవాల్లా మాడి మసైపోయారు.

దాక్షాయణీలో షాక్! తన ఇంటి వీధిలోనే జేమ్స్‌బాండ్ సినిమాల్లా జరుగుతున్న యుద్ధ దృశ్యాలు ఆమెను దిగ్భ్రాంతిలోకి నెట్టాయి.

అప్పుడు గుర్తొచ్చాయి 'అతడి' మాటలు ఆమెకు "నీకు చక్కటి జేమ్స్‌బాండ్ సినిమా చూడాలని ఉందా?" అని. మైగాడ్! అంత అతడు చెప్పినట్లే జరుగుతోంది. ఎవరతడు? పోలీస్ మనిషా? ఈసారి ఆమెలా ఆలోచిస్తుండగా ఈసారి బాంబుల శబ్దం వినిపించింది. రతన్‌లాల్ మనుషులు వెర్రిగా బాంబులు విసురుతున్నారు. అయితే అవతల సైనికుల్లా ఉన్నవారు లాఘవంగా వాటి బారి నుంచి తప్పించుకుంటూ తిరిగి రైఫిళ్ళతో కాలుస్తున్నారు.

మొత్తం మీద రతన్‌లాల్ మనుషుల మీద అటాక్ జరుగుతుందని తెలుస్తుంది. అయితే ఆ అటాక్ చేసింది ప్రత్యర్థులో, పోలీసులో అర్థం కావడం లేదు.

ఆమెలా ఉద్వేగంలో చూస్తుండగానే మరో డైనమైట్ వచ్చి ఇంకో కారు మీద పడింది. సరిగ్గా అది కార్లో పెట్రోలుట్యాంకు మీద పడింది కాబోయే పెద్ద ఎత్తున ప్రేలింది. మెరుపు వేగంతో మంటలు ఆకాశంలో ఎగబ్రాకాయి. ఆ ప్రేలుడుకు రతన్‌లాల్ అనుచరుల శరీరాలు ఆకాశంలో పల్టీలు కొట్టి క్రిందపడ్డాయి.

ఇక మిగిలింది రతన్‌లాల్, అతడి నలుగురు అనుచరులు. దాంతో చుట్టూ అనుచరులు దడికట్టగా చేతిలో ఏకే47తో రతన్‌లాల్ బిల్డింగ్‌పైకి పేలుస్తూ అక్కడ నుండి పారిపోవడానికి ముందుకు కదలసాగాడు. అనుచరులు వేయికళ్ళతో కాపలాకాస్తూ అతడిని బయటికి తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు.

సరిగ్గా అప్పుడు...

పడిందో డైనమైట్ మెరుపువేగంతో రతన్‌లాల్ బృందం దగ్గర. తమ దగ్గర పడిందేమిటో అర్థమైన మరుక్షణం వేగంగా పరిగెత్తారు అనుచరులు పక్కకు. అంతే! ఆ డైనమైట్ పెద్ద శబ్దంతో ప్రేలడం, ఆ డైనమైట్ వెలుగులో రతన్‌లాల్ ఎక్కడున్నాడో అవతలవారికి తెలిసిపోవడం, వెంటనే పై నుండి అతడి శరీరంలో బుల్లెట్లు వచ్చి తూట్లు పొడవడం చకచకా జరిగిపొయ్యాయ్.

ఒక్కో బుల్లెట్ ఒక్కో ప్రాణాన్ని తీసుకెళ్తుండగా రతన్‌లాల్ కుప్పకూలిపోయాడు. కుప్పకూలిన తర్వాత కూడా మరో బుల్లెట్ అతడి నుదురుని బ్రద్దలు కొట్టుకుంటూ లోపలికి ప్రవేశించింది.

అంతే! పుర్రెలోని మెదడు బయటికి రాగా రతన్‌లాల్ గిలగిలకొట్టుకుంటూ చనిపోయాడు.

అదే క్షణంలో అతడి అనుచరులలో ఒక్కరంటే ఒక్కరు కూడా మిగలకుండా బుల్లెట్ల తాకిడికి హతమైపోయారు.

జరిగిందంతా ఓ ఇంగ్లీషు సినిమాలా కళ్ళప్పగించి చూస్తోంది దాక్షాయణి.

ఆపరేషన్ ముగిసినట్లుగా అక్కడ లైట్లు వెలిగాయ్. జనులంతా రోడ్డు మీదకు వచ్చారు. పోలీసులు, న్యూస్ పేపర్ విలేఖరులు, టీవీ ఛానళ్ళవారు ఆ దృశ్యాలను వీడియో తీసుకుంటున్నారు.

జరిగిందేమిటంటే మిలటరీ ఇంటలిజెన్స్ ఆ ఆపరేషన్ నిర్వహించింది. మామూలు పోలీసులు వల్ల కాదు కాబట్టే ఆ ఆపరేషన్‌ని మిలటరీ ఇంటలిజెన్స్ విజయవంతగా ముగించింది. అయితే ఎవరికీ దాక్షాయణీ మీద అనుమానం రాలేదు అందుకే ఆమె మీద ఎవరి దృష్టి పడలేదు.

అంతా అయ్యేసరికి మరో రెండు గంటలు పట్టాయి. ఆ తర్వాత ఆ వీధిలో మామూలుగానే సందడి మొదలైంది.

జరిగిందంతా విభ్రాంతిగా కిటికీలోంచి చూస్తున్న దాక్షాయణీ ఫోన్ మోగడంతో ఈ లోకంలోకి వచ్చింది.

"హల్లో"

"హల్లో! జేమ్స్‌బాండ్ సినిమా ముగిసిందా? బాగుందా?" కదిలింది అతడి కంఠం.

దాక్షాయణిలో దిగ్భ్రాంతి. అసలు ఇక్కడ జరుగుతున్న విషయాలు అతడికి ఎలా తెలుస్తున్నాయి? అన్నీ అతడు అనుకున్నట్లే జరుగుతున్నాయి. కొంపతీసి ఇతడు ఆ ఆపరేషన్ ఇన్‌ఛార్జా?

"చెప్పండి! అసలు ఎవరు మీరు? ఆ ఆపరేషన్‌ని జరిపించింది మీరేనా?"

"కాదు! మిలటరీ ఇంటలిజెన్స్ ఆధ్వర్యంలో జరిగిందా ఆపరేషన్. నేను అందులో లేను. కాకపోతే రతన్‌లాల్ తల మీద పది కోట్ల బహుమతి ఉంది. అతడు బయటకు రాడు. కలుగులోంచి ఎలుక ఎప్పుడు బయటకు వస్తుందా అని మిలటరీ ఇంటలిజెన్స్ ఎదురుచూస్తోంది. అదే సమయంలో రేపు ఫలానా సమయంలో రతన్‌లాల్ ఫలానా వీధికి వస్తున్నాడని సమాచారం రహస్యంగా ఫోన్‌లో మిలటరీ ఇంటలిజెన్స్ హెడ్‌క్వార్టర్స్‌కు అందజేశాను. వారు వలవేశారు. పిట్ట దొరికింది. దొరికింది దొరికినట్లే కాల్చేశారు. దాంతో రతన్‌లాల్ పీడ నీకు విరగడ అయినట్లే!"

గుండెల నిండా ఊపిరి పీల్చుకుంది దాక్షాయణీ. అమ్మయ్య! అనవసరంగా తాను హైరానా పడింది. ఆ పొలం ఆ మాఫియా వాడికి వెళ్తుందేమోనని. కాని అతడు పతనమైపోయాడు.

అప్పుడొచ్చిందామెకు ఆ సందేహం.

"మరి నేను సంతకం చేసిన అగ్రిమెంట్ పేపర్ల సంగతి ఏమిటి?"

"వాటిని రతన్‌లాల్ కారులో ఉంచాడు. డైనమైట్ ధాటికి కారు మొత్తం దహనమైపోయింది. దాంతో పాటు నీ అగ్రిమెంట్ కాగితాలూ కాలిపోయాయి. ఇక నీవు నిశ్చింతగా ఉండవచ్చు".

"థాంక్స్! నా జీవితాన్ని మరోసారి రక్షించారు. మీకు ఏమిచ్చినా ఋణం తీరదు."

"స్నేహితులు మధ్య ఋణాల ప్రసక్తి ఎందుకు మిత్రమా"

"ప్రతిసారీ ఆపద వచ్చినప్పుడల్లా ఆ భగవంతుడు నన్ను రక్షిస్తున్నట్లుగా మీరు నన్ను కాపాడుతున్నారు. ఎవరు మీరు? నిజం చెప్పండి. ప్రతి విషయం మీకు ఎలా తెలుస్తుంది? దయచేసి నాకు మీ వివరాలు చెప్పండి.

"నాది రహస్య జీవితం. ఎవరికీ చెప్పుకోలేని అజ్ఞాత జీవితం నాది. ఈ విషయం వదిలెయ్యండి..."

"ప్లీజ్! ప్రతిసారీ మీరు ఆ విషయాన్ని దాట వేస్తున్నారు. నిజంగా ఎవరు మీరు? మీ పేరేమిటి? ఏం చేస్తుంటారు? ఈ అజ్ఞాతశక్తులు మీకు ఎలా లభించాయి? ఏమైనా మంత్రశక్తులు ఉన్నాయా? ప్లీజ్... ఈ స్నేహితురాలిని నమ్మండి. నేను ఎవరికీ చెప్పను. ఆ వెంకటేశ్వరస్వామి మీద ఒట్టు..."

ఇక తప్పదన్నట్లుగా అతడి కంఠం కదిలింది.

"నా పేరు ఆర్య... మీరనుకున్నట్లుగా నాకు మంత్రశక్తులు లేవు. అజ్ఞాతశక్తులు లేవు. కేవలం సైన్స్ ప్లస్ టెక్నాలజీ సహాయంతో నేను విజన్‌నెట్‌ని కనిపెట్టాను. దానినే వండర్ మిషన్ అంటారు" అంటూ తనని ప్రొఫెసర్ ఎలా మోసం చేసింది, తద్వారా తానెంత డిప్రెషన్‌కు లోనయ్యింది, ఆ పగతో, కసితో తాను ఎంతో కష్టపడి వండర్‌మిషన్‌ని కనిపెట్టింది మొత్తం ప్లాష్‌బ్యాక్ చెప్పాడు.

దాక్షాయణీ నోరెళ్ళబెట్టి వింటోంది. అతడు కొనసాగించాడు.

"ఈ వండర్ మిషన్ ద్వారా మనం ఏదైనా ఇంటి అడ్రస్ టైప్ చేసి, కీబోర్డు మీద ఎంటర్ ప్రెస్ చేస్తే, కాంతికిరణాలు శాటిలైట్ ద్వారా ప్రయాణిస్తాయి. ఇందుకు గూగుల్ సహాయం తీసుకుంటాయి. తద్వారా ఆ కిరణాలు ఆ ఇంటి గోడల ద్వారా ప్రవేశించి అక్కడున్న దృశ్యాలను సినిమాలా సౌండ్‌తో సహా తిరిగి మనం కంప్యూటర్‌లోకి చేరవేస్తాయి..."

స్థాణువైపోయింది దాక్షాయణి. మైగాడ్! సైన్స్, టెక్నాలజీలు ఎంతగా పురోగమించాయ్! ఒకప్పుడు దేవతలు మాయాదర్పణంలో వేరొకచోట వింతలు, విడ్డూరాలూ కాంచినట్లే ఎక్కడో ఉండి ఇతడు, తను కనిపెట్టిన వండర్‌మిషన్ ద్వారా ప్రపంచంలో ఏం జరుగుతున్నా తెలుసుకోవచ్చు. రికార్డు చేయవచ్చు. తిరిగి చూసుకోవచ్చు. నిజంగా అద్భుతమైన ప్రయోగం అది. ఇప్పటివరకూ ప్రపంచంలో కనిపెట్టిన ఆవిష్కరణలు అన్నీ ఈ వండర్ మిషన్ ముందు దిగదిడుపే. సైన్స్, టెక్నాలజీ పుస్తకాలలో ఈ వ్యక్తి పేరు సువర్ణాక్షరాలతో రాయాల్సిన తరుణం వచ్చింది.

"దాక్షాయణీ! ఏమిటలా ఆలోచనల్లో ఉండిపోయారు?" అవతల నుండి అతడి కంఠం కదిలింది.

"ఒక లక్ష్యం కోసం పాటుపడుతున్న మీకు నిజంగా చేతులెత్తి నమస్కరిస్తున్నాను..."

అతడు కదిలిపోయాడు.

"థాంక్స్ దాక్షాయణీ! అజ్ఞాతంగా ఉన్న నాకు నీ మాటలు శక్తిని ఇస్తున్నాయి. నా చిన్న జీవితంలో నేను కొంతైనా రిలీఫ్ పొందుతున్నానంటే అది నీ వల్లనే సుమా!"

అప్పుడొచ్చింది దాక్షాయణికి ఓ సందేహం. అవును! వండర్ మిషన్ ద్వారా అతడు అన్నింటిని చూస్తున్నాడు. మరి తాను బట్టలు మార్చుకునేటప్పుడు... ఛ్ఛ... అది గుర్తుకురాగానే ఆమె మొఖం కందగడ్డలా మారిపోయింది. వెంటనే అతడిని అదే అడిగేసింది.

"మరి ఆడవారు బట్టలు మార్చుకునేటప్పుడు మీరు... మీరు... అలాగే చూస్తూ...రా? అది సంస్కారం కాదు కదా"

అతడు షాక్ తిన్నట్లుగా పది క్షణాలు మాట్లాడలేదు. ఆ తర్వాత అతడి గొంతు గాద్గిదమైపోయింది.

"దాక్షాయణీ! కళ్లు లేకపోయినా నా అక్క నాకు సంస్కారం నేర్పించింది. మంచీ, చెడూ అనే విచక్షణాజ్ఞానం నాకు ఉన్నాయి. మీరెప్పుడైనా బట్టలు మార్చేసుకుంటుంటే నేను వెంటనే నా వండర్ మిషన్‌ని ఆపేస్తాను. అలా చూసే కుసంస్కారం నాకు లేదు. చనిపోయిన మా అక్క మీద ఒట్టేసి చెబుతున్నాను. ఇప్పటివరకూ నేను నా వండర్ మిషన్ ద్వారా ఆడవారిని ఎప్పుడూ అలా చూడలేదు. కేవలం వండర్‌మిషన్‌లోనే కాదు, మామూలుగా నేనెప్పుడూ నెట్ ద్వారా కానీ, ఇతరత్రాగానీ జీవితంలో ఇంతవరకూ అశ్లీలదృశ్యాలు చూడడం గాని, మసాలా సినిమాలు చూడడం కాని చేయలేదు. నేను వండర్ మిషన్‌ని కనిపెట్టింది కేవలం నా పగ తీర్చుకోవడానికి మాత్రమే. అంతే తప్ప సమాజ విద్రోహానికి, తాత్కాలిక ప్రయోజనాలకి కాదు. మీరు నమ్మినా నమ్మకపోయినా నాకు చదువు, విజ్ఞానం అందించిన ఆ సరస్వతీదేవి మీద ఒట్టేసి మరోసారి చెబుతున్నాను..."

ఆమె కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. ఇవాళా, రేపు ఆడది కనిపిస్తే ఆబగా చూసే మగవాళ్ళున్న ఈ సమాజంలో ఆర్యలాంటి వారు ఉండడమే అరుదు. అమ్మ, అక్క చెల్లెళ్ళను తప్ప ఇతరులను కామదృష్టితో చూసే మగవాళ్ళున్న ఈ దేశంలో ఆర్యలాంటి సంస్కారం వున్న వ్యక్తి జన్మించడమే ఓ అపూర్వం.

ఉన్నట్లుండి హిమాలయ శిఖరం గుర్తొచ్చింది ఆమెకు. ఆ శిఖరం ఎంతో ఎత్తుగా, గంభీరంగా, ఆటుపోటులకు అతీతంగా ఉంటుంది. అలాగే ఆర్య కూడా

ఎంతో గంభీరంగా, ఎలాంటి కష్టాలకు లొంగకుండా, ఆటుపోటులకు అతీతంగా ఎదిగిపోయాడు.

ఎగిసిపడుతున్న భావోద్వేగాలను ఆపుకొని కదిలిందామె కంఠం.

"ఐయాం సారీ! మీ మనస్సుని నొప్పించినందుకు"

"ఇట్స్ ఆల్ రైట్! మీకు ఆ సందేహం రావడం సహజమే! బైది బై! నిన్నటి నుండి ఆ రతన్‌లాల్ విషయంలో నేను చాలా అలిసిపోయాను. మిలటరీ ఇంటలిజెన్స్‌కు రతన్‌లాల్ వస్తున్నాడని చెపితే ఓ పట్టాన నమ్మలేదు. నేను ఏదో అనామకుడిలా ఫోన్ చేయాల్సి రావడంతో వారు నమ్మలేదు. ఆఖరికి ఆ రతన్‌లాల్ ఇంటినుండి బయలుదేరిన ఫోటోలు తీసి నెట్ ద్వారా వారి కంప్యూటర్‌కి చేరవేస్తే నమ్మి వచ్చారు. అలా చాలా శ్రమపడాల్సి వచ్చింది బైదిబై"

"ఐయామ్ సారీ! నా వల్లనే మీకు చాలా కష్టం వచ్చింది"

"అలా ఎందుకు అనుకుంటున్నారు? మిమ్మల్ని కాకపోతే వేరే వారి జోలికి వెళ్ళేవాడు. ఈ దుర్మార్గులను, దుష్టుల పీచమణచడానికి ఎవరో ఒకరు ముందుకు రావాలి. ఈ రతన్‌లాల్ లాంటి నీచులు ఈ నాగరిక ప్రపంచంలో ఉండడానికి వీల్లేదు. అందుకే తగిన సమాచారం ఇచ్చి అతడిని అంతమొందించాల్సి వచ్చింది. కేవలం ఒక రతన్‌లాల్ కాదు, ఈ సమాజంలో దుష్టులను, దుర్మార్గులను, అవినీతిపరులను ఏరిపారెయ్యడానికి ఈ వండర్ మిషన్‌ని ఉపయోగిస్తాను. సమసమాజ స్థాపనకు నా ప్రయోగం ఉపయోగపడితే చాలు."

విభ్రాంతిగా చూస్తూండిపోయింది దాక్షాయణి. ఎంతమంది ఉంటారు ఈ లోకంలో ఇలా? తాను కనిపెట్టిన పరికరాన్ని పేటెంట్ చేసి కోట్లకు కోట్లు సంపాదించుకునేవారు ఉన్నారు. దాని ఆధారంతో నోబుల్‌ప్రైజ్‌ని సాధించేవారూ ఉన్నారు. కాని ఇలా అజ్ఞాతంగా, పగే జీవితంగా, ప్రతీకారమే ధ్యేయంగా బ్రతికేవారు ఎంతమంది ఉంటారు? తన పగ, ప్రతీకారాలతో పాటు సమాజంలో కుళ్ళు, కుతంత్రాలతో పాటు అవినీతిని సైతం ఎండగట్టడమే ధ్యేయంగా పెట్టుకున్న ఇతగాడు మానవుడా? దైవాంశ సంభూతుడా?

ఆమెలా ఆలోచనల్లో ఉండగానే అతడి కంఠం మ్రోగింది.

"బై దాక్షాయణీ! ఆ రతన్‌లాల్ గొడవ పోయింది కదా... ఇక నుండి కంటినిండా నిద్రపో! బై"

మరుక్షణం ఫోన్ పెట్టేసినట్లుగా రిసీవర్ క్లిక్‌మంది.

## 8

కాలం గడుస్తూనే ఉంది.

సమీర ప్రధానిగా పదవి స్వీకరించి నెలరోజులు అవుతోంది.

ఆ నెల రోజుల్లోనే ఆమె చాలా సంస్కరణలను ప్రవేశపెట్టింది. లంచాలకు, అవినీతికి పాల్పడ్డ వారిని డిస్మిస్ చేసి, వారి ఆస్తులను జాతీయం చేసే అధికారం ప్రభుత్వానికి కల్పించింది. దేశంలో పూర్తి మద్యపాన నిషేధం విధించింది. క్లబ్బులు, బార్‌లను నిషేధించింది. అవే సమాజంలో అనైతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నాయని ఆమె భావన. వాటితో పాటు గుర్రపు పందాలు, జూదం, వ్యభిచారాన్ని నిషేధించింది. మతకలహాలు వ్యాపించే వారిని అప్పటికప్పుడు అందరి ముందు శిక్షించే అధికారం పోలీస్ ఎస్పీలకు కట్టబెట్టమని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

***అలా ఆమె పాలనలో సమర్ధవంతంగా దేశం రెక్కలు విప్పుకొని వేగంగా కదుల్తోంది.***

◆ ◆ ◆

పార్టీ సమావేశం.

అత్యంత రహస్యమైన సమావేశం అది. అక్కడ ప్రధాని, కొంతమంది మంత్రులు, ఎంపీలు మాత్రమే ఉన్నారు. మంత్రులు, ఎంపీలు అభ్యర్ధన మేరకు ఆ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు పార్టీ చీఫ్.

సభ్యులందరి మొహాలు వాడిపోయి ఉన్నాయి. రౌండ్ టేబుల్ ముందు కూర్చున్న అందరి వంకా చూశాడు పార్టీ చీఫ్.

“నాకు తెలుసు మీలో ఏర్పడిన అసంతృప్తికి కారణం. ప్రధాని మారిన తర్వాత మీ జీవన పరిమాణంలో వచ్చిన మార్పులే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయమని కోరారు సభ్యులు...”

“అవును” కోరస్‌గా కదిలాయ్ కొన్ని కంఠాలు.

“మా మీద అవినీతి ఆరోపణలు సిబిఐ కోర్టులో ఉన్నాయి” ఆవేశంగా కదిలింది ఓ మంత్రి కంఠం “మన పార్టీ కదా అని ప్రధాని మమ్మల్ని కాపాడే ప్రతయ్నమే చేయడం లేదు”.

ఇంకో సభ్యుడు అందుకున్నాడు.

"అంతెందుకు! నా నియోజకవర్గంలో ఎంపీ ఫండ్స్ దుర్వినియోగం అయ్యాయని ప్రతిపక్షం గోల పెడితే విచారణ జరిపించి ఛార్జిషీట్ దాఖలు చేయించిందీ ప్రైమ్ మినిస్టర్! నా నియోజకవర్గంలో ఫండ్స్ నా ఇష్టం. అన్నింట్లో వేలు పెట్టడం తగదు"

"ఇలా అయితే మన పార్టీకే నష్టం" మరో ఎంపీ కంఠం కదిలింది. "మా బామ్మర్ది వ్యభిచార గృహం నడిపిస్తున్నాడని అరెస్ట్ చేశారు పోలీస్. దానిని ఈవిడ దృష్టికి ఎవరో తెస్తే దర్యాప్తుని ఒకరోజులో పూర్తి చేసి మా బామ్మర్దిని జైల్లో పడేసింది".

"అంతేనా" లబోలబోమన్నాడు సభ్యుడు. "మొన్న ఓ ఫ్యాక్షనిస్ట్‌ని మర్డర్ చేశానన్న అభియోగం నాపైన మోపబడితే ఏకంగా పార్టీ నుండే నన్ను సస్పెండ్ చేసింది".

అంతా ప్రధానికేసి చూశారు. ఆమె మొఖం భావరహితంగా ఉంది.

"ఇంతకుముందున్న ప్రధాని అన్నీ చూసీచూడనట్లుగా వెళ్ళేవారు. కానీ ఈ ప్రధాని ప్రతిదాంట్లో వేలు పెడుతోంది. రాజకీయాలన్నాక కొన్నింటిని చూసీ చూడనట్లుగా వదిలెయ్యాలి" అన్నాడో సభ్యుడు.

ఈసారి ఓ మిత్రపక్ష సభ్యుడి కంఠం కదిలింది" మా పార్టీ మీ పార్టీకి ఎంతో కాలం నుండి సపోర్ట్ చేస్తోంది. అలాంటి మా పార్టీ మంత్రి మా హైకమాండ్ మాట వినకపోతే అతడిని దింపెయ్యమని చెప్పాం. ఈ ప్రధాని వినడం లేదు. అతడు స్వచ్ఛరితుడని అలాగే మంత్రిగా కొనసాగిస్తోంది..."

పార్టీ హైకమాండ్ చీఫ్ ఆమెకేసి చూశాడు. ఆమె మొఖం అలాగే భావరహితంగా ఉంది.

క్షణాలు కదుల్తున్నాయ్ ఆ ఉద్రిక్తతోనే.

అప్పుడు కదిలిందామె కంఠం "అంతా అయిపోయిందా? ఇంకా ఎవరైనా ఉన్నారా వారి అభిప్రాయం చెప్పడానికి?"

ఎవరు మాట్లాడలేదు. దాంతో ఆమె కంఠం అక్కడ వేగంగా కదిలింది.

"ఏ పని చేసినా పరిపూర్ణంగా చేయాలన్నదే నా అభిమతం. భగవంతుడి దయవలన తలవని తలంపుగా ఈ పదవి నాకు లభించింది. అలాంటప్పుడు చేసే

పనిని పరిపూర్ణంగా చేయాలన్నదే నా ఉద్దేశం. లేకపోతే పదవి తీసుకోకూడదు. తీసుకుంటే ఎవరికీ తలవంచకూడదు. ఈ రాజకీయాల్లో కుళ్ళుని కడిగేసి ప్రజలకు కొద్దిగానైనా నీతి, నిజాయితీ ఉన్న పరిపాలనని అందజేయాలన్నదే నా అభిమతం".

నిశ్శబ్దం ఏర్పడిందక్కడ. ఆ నిశ్శబ్దాన్ని బ్రద్దలు కొడుతూ కదిలిందామె కంఠం.

"వ్యభిచారాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. అయినా దానిని కొనసాగించాడో సభ్యుడు. తెలియక తప్పు చేస్తే క్షమించవచ్చు. కాని తెలిసీ తప్పు చేసే వాడిని ఎవరూ క్షమించలేరు. అలాగే ఎంపీ ఫండ్స్ అనేవి మీకిచ్చే జీతభత్యాలు కావు. అవి మీ నియోజకవర్గంలోని ప్రజల అభివృద్ధిని కాంక్షించి ఇచ్చినవి. అలాంటి వాటిని దుర్వినియోగపరచడం తప్పు కాదా? ప్రజల సొమ్ముని ప్రజల కోసం వెచ్చించక వాటిని స్వప్రయోజనాలకు మళ్ళించడం తప్పు..."

ఆమె మాటలకు అడ్డు వస్తూ కదిలింది ఓ మిత్రపక్షపార్టీ చీఫ్ కంఠం.

"ఇంతకాలం మీ పార్టీని సపోర్ట్ చేస్తున్న మా మంత్రినే జైల్లో పెట్టిస్తారా?"

సర్రున కదిలిందామె కంఠం.

"ఎంతసేపూ మా పార్టీని సపోర్ట్ చేస్తున్నాం చేస్తున్నాం అంటున్నారు. ఎవరి కోసం సపోర్ట్ చేస్తున్నారు మీరు? మీ స్వార్థం కోసం, మీ స్వలాభం కోసం, మీ ఎంపీలకు మంత్రి పదవులు పొందడానికి, ఆ పదవులు ద్వారా అడ్డదారుల్లో కోట్లు వెనకేసుకోవడానికి సపోర్ట్ చేస్తున్నారు. అంతేకాని మమ్మల్ని ఉద్ధరించడానికి కాదు..."

ఖంగుతిన్నారా పార్టీ చీఫ్. ఆవేశంగా కదిలిందాయన కంఠం.

"అయితే మీ పార్టీకి మా పార్టీ మద్దతు విరమించుకుంటాం."

"నిరభ్యంతరంగా విరమించుకోవచ్చు" కత్తి కంటే పదునుగా కదిలిందామె కంఠం. "అలా విరమించుకుంటే మీకే నష్టం. మీ మీద కుంభకోణాలు ఇంకా కొండ చిలువల్లా చిక్కుకుంటాయి. పదవులు పోయాక మీరు ఎందుకూ పనికిరాని వాళ్ళలా ఉంటారు. ఈలోపు ప్రతిపక్షం వారు మీ మీద మరిన్ని ఆయుధాలు సంధిస్తాయి. దాంతో రేపు ఎన్నికల్లో మీ పార్టీకి ఈ మాత్రం సీట్లు వస్తాయని నాకు నమ్మకం లేదు..."

ఓ క్షణం ఆగి తిరిగి కదిలిందామె కంఠం.

"మీ పార్టీ సభ్యులు 30మంది. ఇప్పటికిప్పుడే ఎన్నికలు వస్తే అందులో 20

మందికి డిపాజిట్లు కూడా రావు. కారణం పీకల్లోతు కుంభకోణాల్లో ఇరుక్కుపోవడమే. మిగతా 10 మందికి మా పార్టీ నుండే పదునైన పోటీ ఏర్పడుతుంది. దాంతో మీ పార్టీకి రాబోయే ఎన్నికల్లో రెండు, మూడు సీట్ల కంటే ఎక్కువ వస్తే గొప్ప... ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని తెలిసే నేను సర్వే చేయించి ఉంచాను.”

స్తంభించిపోయాడా పార్టీ నాయకుడు. ఆమె దగ్గర తన పప్పులు ఉడకవని అతడికి అర్థమైంది. చేసేది లేక మౌనంగా తలవంచుకు కూర్చున్నాడు.

అప్పుడు కదిలిందామె కంఠం మెరుపు వేగంతో.

“నాకు తెలుసు మీలో అసంతృప్తికి కారణం. రాజకీయాలంటే మనకు ఎంత లాభం మిగుల్తుందన్నదే మీ ధ్యేయం. అంతే కాని ప్రజలకు ఎంతో కొంత సేవ చేద్దామన్నది మీ ఆశయం కాదు. సరే కోట్లు కోట్లు డబ్బు కూడబెట్టుకుంటారు. దానితో న్యూస్ పేపర్లు, టీవీ ఛానళ్ళు, పరిశ్రమలు, లైసెన్స్‌లు సంపాదిస్తారు. అవి తిరిగి కోట్లు కూడబెడతాయి. అంటే రాజకీయాలనేవి స్టేటస్ సింబలే కాని సేవ చేయడానికి కాదు. సరే కోట్లు కోట్లు సంపాదించుకుంటారు. కాని వాటితో మీరు సుఖంగా ఉంటారా? ఊహూ! ఎప్పుడూ సిబిఐ, ఇన్‌కంటాక్స్ ప్రత్యర్థులు దాడి చేస్తారో నన్న భయంతో అలమటిస్తారు. ఆ టెన్షన్‌కు బీపీ, సుగర్, హార్ట్ ప్రాబ్లమ్స్ సంప్రాప్తిస్తాయి. కోట్లు సంపాదించినా మీరు ఒక స్వీటు తినలేరు. ఒక మిరపకాయ బజ్జీ తినలేరు. ఆ డబ్బంతా మీ కూతుళ్ళకు, కొడుకులకు ధారపోస్తారు. వారు ఆ డబ్బుల్తో తాగి తందనాలాడతారు. క్లబ్బుల్లో, ఫాస్ట్‌ఫుడ్‌లకు, విస్కీలకు, మత్తు పదార్థాలకు అలవాటు పడతారు. కొన్నాళ్ళకు పనీపాటా లేకుండా జీవచ్ఛవాల్లా తయారవుతారు. ఆ తర్వాత రోగాలతో చనిపోతారు. ఇవన్నీ అధిక డబ్బు ఉండడం వల్ల వచ్చే సమస్యలు. నాకు మీలాగా ఇన్ని సమస్యలు లేవు. రేపు పదవి ఉంటుందో, పోతుందోనన్న భయం లేదు. పదవి పోతే ఎలా బ్రతకాలన్న టెన్షనూ లేదు. ఏదోక కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌లాగా పనిచేసి నెగ్గుకు వస్తాను. ఇంకో విషయం – నాకు నా అన్నవాళ్ళు ఎవరూ లేరు. అందువల్ల అవినీతి, బంధుప్రీతి, అధికార దర్పం లాంటి గొడవలు లేకుండా లేవు. పదవిలో ఉన్నన్నాళ్ళూ స్వేచ్ఛగా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాను. ప్రజలకు ఎంతో కొంత మంచి చేయాలనుకుంటాను. అలా వీలు కాని పక్షంలో పదవి నుండి స్వేచ్ఛగా తప్పుకుంటాను. అంతే కాని మీలాంటి అవినీతిపరులకు తల వంచి మాత్రం ఈ పదవి నుండి తప్పుకోను”.

అందరిలో నిశ్చేష్టత ఆమె ధైర్యానికి.

ఒక సభ్యుడు ఆవేశంగా లేచాడు.

"సరే మేమంతా సమావేశమై ప్రధాని పదవి నుండి నిన్ను తొలగిస్తే?"

"చెప్పానుగా" సర్రున కదలింది "మీలాంటి అవినీతిపరులకు తలదించి ఈ పదవి నుండి తప్పుకోను. ప్రజలకు సేవ చేయలేని పరిస్థితుల్లో మాత్రమే దిగిపోతాను. ఒకవేళ పార్టీలో మెజారిటీ సభ్యులు ఏకమై నన్ను తీసెయ్యాలనుకుంటే వారందరి చరిత్రలు బయటపెట్టి కాని నేను పదవిలో నుండి దిగిపోను. అన్నట్లు నా కంప్యూటర్‌లో ప్రతి ఒక్కరి జీవిత చరిత్ర నిక్షిప్తమై ఉంది. ఎవరెవరు ఎంతెంత వెనకేశారో, ఎన్ని అవినీతి పనులకు ఒడిగట్టారో అన్ని వివరాలు నా దగ్గర ఉన్నాయి. ముల్లును ముళ్ళతోనే తీయాలంటారు. నా ఉనికికి భంగం కలిగిననాడు అవన్నీ న్యూస్ పేపర్లకు, టీవీ ఛానళ్ళతోపాటు సిబిఐ, ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చేరుకుంటాయి. దట్సాల్."

అప్పుడు ఆమె ప్రజర్విల్లుతున్న ఓ నిప్పు కణికలా ఉంది. సభ్యులంతా నిర్ఘాంతపోయారు. తమ జోలికి రావద్దని ఆమెకు వార్నింగ్ ఇద్దామనుకున్నారు కాని ఆమె తమకు హెచ్చరిక జారీచేసింది. చేసేది లేక అక్కడ నుండి నిష్క్రమించారు నీరసంగా.

వారంతా వెళ్ళిపోయాక పార్టీ చీఫ్ ఆమెతో అన్నాడు.

"శభాష్ సమీరా! ఈ అవినీతిపరులను బాగా తరిమికొట్టావు. ఇప్పటివరకూ నా హయాంలో ఎంతోమంది ప్రధానులను చూశాను. వాళ్లు బెదిరించగానే కాళ్ళ బేరానికి వచ్చేవారినే చూశాను. రణతంత్రపు ఎత్తులతో, రాచరికపు తెలివితేటలతో నీలా ధీటుగా సమాధానం చెప్పేవారిని నేను చూడలేదు. ఏది ఏమైనా నా సెలక్షన్ ఉత్తమమైనదేనని నిరూపించావు. శభాష్ సమీరా..."అంటూ అభినందించి వెళ్లిపోయాడాయన.

ఆయన వెళ్ళిపోయాక సమీర తన చేతిలోని లాప్‌ట్యాప్ వేపు చూసింది.

అందులో ప్రతి ఒక్క ఎం.పీ., మంత్రుల చరిత్రలు నిక్షిప్తమై ఉన్నాయి. ఆమె అందుకోసం ఆమె ఓ పదిమంది చురుకైన ఇంటలిజెన్స్ ఆఫీసర్లను నియమించింది. ప్రతి నియోజకవర్గంలోను ఎం.పీ. చరిత్ర దగ్గర నుండి, అతడు లేదా ఆమె చేసిన పనులు, చేస్తున్న పనులు అన్నీ ఆమెకు ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు వారు.

వీలైతే ఫోటోలు, వీడియో క్లిప్పింగ్ జతచేసి ఆమెకు పంపుతున్నారు. ఆమె ఎప్పటికప్పుడు వాటిని సమీక్షిస్తోంది. అలా మొత్తం 552 మంది ఎంపీల చరిత్ర ఆమె దగ్గర ఉంది.

వాటిని చూస్తున్న ఆమె దవడ కండరం హఠాత్తుగా బిగుసుకుంది. అందరి చరిత్రలు తన దగ్గర ఉన్నాయి. ఒకే ఒక వ్యక్తి చరిత్ర తప్ప. ఆ వ్యక్తి తనకు ఈ ప్రపంచంలోనే బద్ధశత్రువు. అతడి అంతం చూడాలి.

**ఆ వ్యక్తే... ఆర్య.**

తన తండ్రి ఆత్మహత్యకు కారకుడు, తన కుటుంబ పరువు ప్రతిష్టను రోడ్డు మీద పడేసిన ఆర్య మీద పగ తీర్చుకోవాలి.

ప్రస్తుతం అతడెక్కడున్నాడో తాను కనిపెట్టాలి. కనిపెట్టి అతడి మీద ఇంతకు ఇంతా తీర్చుకోవాలి. అప్పుడే తాను ప్రధాని గద్దె ఎక్కిన ఆశయం సిద్ధిస్తుంది.

ఆ సమయంలో ఆమె బుసకొట్టే పాములా ఉంది. కాటేసే ముందు పాము అలాగే బుసకొడుతుంది.

*కానీ ఆ సమయంలో ఆమెకు తెలియదు త్వరలో ఆర్యే తనని కలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని, ఫలితంగా రెండు శక్తులూ ఒకదానికొకటి ఢీకొని దేశం కకావికలమై పోనున్నదని.*

◆ ◆ ◆

ఆ రోజు... ఏదో తెలియని వెలితి ఆర్య గుండెల్లో పెనవేసుకొని బాధిస్తోంది. ఆర్యకు అస్పష్టంగా ఉంది అతడికి.

తన జీవితంలో తనకు తెలియని లోటేదో చోటు చేసుకుంది. తన గుండెల్లో శూన్యం ఏర్పడింది. అవును! తాను ఏకాకి! ఈ ప్రపంచంలో తనకెవరూ లేరు. తానేదో కోల్పోయాడు.

విసురుగా తలరుద్దుకున్నాడు ఆర్య. తనకు ఇప్పుడు ఏదో కావాలి. అమ్మ వడి వెచ్చదనం, అమ్మ చేతి చల్లదనం తనకు తెలియవు. మమత, అనురాగం, ఆప్యాయత తనకు అపరిచితం. ఈ ప్రపంచంలో తనకు ఎవరూ లేరా?

అప్పుడు గుర్తొచ్చిందతడికి దాక్షాయణి.

వెంటనే కంప్యూటర్‌లో ఆమె అడ్రసు టైప్ చేశాడు. వెంటనే విజన్‌నెట్‌లో ఆమె కనిపించింది.

ఆమెతో మాట్లాడాలన్పించింది. వెంటనే ఆమె నెంబరుకు ఫోన్ చేశాడు.

"హలో..."

"హలో.." ఉత్సాహం దాక్షాయణిలో.

"ఎలా ఉన్నారు?"

"బాగున్నాను. అదేమిటి మీరు చాలా డల్‌గా వున్నారు?"

"ఏం లేదు. వంటరితనం బాధిస్తోంది. వంటరిగా విసుగ్గా ఉంది."

దాక్షాయణి విస్తుపోయింది. పాపం! అతడు తనను ఎన్నోసార్లు రక్షించాడు. ప్రతిగా తాను అతడికేం ఇవ్వలేకపోయింది.

ఓ నిర్ణయానికి వచ్చిన ఆమె కంఠం కదిలింది.

"మీకు నేను ఏమైనా రిలాక్స్ ఇవ్వగలనా?"

"అంటే?" అర్థం కాలేదతడికి.

"నాకు పాటలు పాడటం వచ్చు. ఆ పాటలు మీకేమైనా రిలాక్స్‌ని ఇవ్వగలవేమోనని..."

"నిజమా? పాడండి.."

అప్పుడు వినిపించిందతనికి.

శిలలను సైతం కరిగించే గానం! అలసిపోయిన మనస్సుకు సేదతీర్చే అమృతగానం!

దాక్షాయణి పాడుతోంది.

అతడు నిటారుగా కూర్చున్నాడు. ఏదో లోకం నుండి దిగొచ్చిన ఓ అద్భుతశక్తి వడిలో సేదతీరుతున్న ఫీలింగ్.

ఆమె పాట ఎంతో అద్భుతంగా ఉంది. హాయిగా, తీయగా అతని గుండెలోతుల్ని స్పృశిస్తోంది. ఓప్! ఓ అద్భుతాన్ని తనింతవరకూ అనుభవించని అనుభూతిని కలిగిస్తోంది. ఒక వనదేవత పాటల పెట్టెలో చేరి అద్భుత రాగాలు విన్పిస్తున్న అనుభూతి.

పాట అయిపోయినా ఆమె ఆపలేదు. మరో పాట అందుకుంది. అలా అర్థగంట దాకా ఆపకుండా పాడుతూనే ఉంది.

వసంతరాత్రి మల్లెతోటల మీద నుంచి మధురంగా వీచే ఏటిగాలి తుమ్మెదలా పాట అయిపోయిన పది నిమిషాల దాకా అలాగే చూస్తుండిపోయాడు. తన బ్రతుకు తీగపై ప్రణయరాగాన్ని ఆలపించినట్లన్పించింది ఆమె.

అతడిలో అంతర్మథనం మొదలైంది. తనకు ఓ తోడు కావాలి. తన హృదయాన్ని సేదతీర్చే ఓ హస్తం కావాలి. ఓ అమృతపు చల్లటి మాట కావాలి.

ఒక్క క్షణం హఠాత్తుగా తన ప్రపంచంలో ఎంత వంటరిగా బ్రతుకుతున్నాడో అర్థమైందతడికి. ఈ ప్రపంచమంతా హాయిగా ఉంది. తనకు ద్రోహం చేసిన ప్రియురాలు ప్రధానిగా దేశాన్ని పాలిస్తోంది. ఎటొచ్చి తాను మాత్రం వంటరిగా మిగిలిపోయాడు.

వెంటనే ఫోన్ తీసుకొని దాక్షాయణికి చెప్పాడు.

"నేను ఇప్పుడు మీ ఇంటికి వస్తున్నాను. నాకు మిమ్మల్ని చూడాలని ఉంది"

ఓ ఆనంద తరంగం ఉప్పెనలా తాకిందామెను

"నిజమా? తప్పకుండా రండి. యూ ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్..."

అతడు ఫోన్ పెట్టేసి కలలో నడుస్తున్నవాడిలా లేచాడు. కారు తాళాలు తీసుకొని క్రిందికి వచ్చాడు.

కారు స్టార్ట్ చేసి ఫస్ట్‌గేర్‌లో ఉంచాడు. కారు చెంగున ముందుకు దూకింది. యాక్సిలేటర్ బలంగా నొక్కాడు. అర్థగంటలో అతడు గమ్యస్థానం చేరుకున్నాడు. అంతకుముందే విజన్‌నెట్‌లో ఆమె ఇంటిని చూడడం వల్ల రూట్‌ని గుర్తుపెట్టుకున్నాడు.

ఇంటి ముందు కారు ఆగిన శబ్దానికి దాక్షాయణి బయటికి వచ్చింది. ఆమె వెనకాల తండ్రి వచ్చాడు.

ఓ ఆనంద తరంగం ఉప్పెనలాగా దాక్షాయణిని కదిపేసింది.

గ్రీకువీరుడిలా అందంగా, మగసిరి ఉట్టిపడేలా ఉన్నాడతడు. అతనిని అలాగే చూస్తుండిపోయిందామె. తను ఊహించిన దానికంటే అందంగా ఉన్నాడు. ఓ క్షణం తర్వాత తేరుకొని అంది.

"రండి లోపలికి"

ఆమె తండ్రి ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"నాన్న! ఈయనే నన్ను మూడుసార్లు రక్షించింది"

ఆమె తండ్రి కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

"రా బాబూ! అలా నిలబడిపోయావేం?"

అతడు హుందాగా లోపలికి నడిచాడు.

అతడు కూర్చున్నాక ఆమె తండ్రి కంఠం కదిలింది.

"బాబూ! మా జీవితంలో ఎన్నిసార్లు కష్టాలు వచ్చినా ఆ భగవంతుడిలా నీవు మమ్మల్ని కాపాడావు. ఆ దేవుడి తర్వాత ప్రతిరోజూ తలుచుకునేది నిన్నే."

అతడు చిన్నగా నవ్వాడు. దాక్షాయణి వేపు చూస్తూ కదిలిందతడి కంఠం.

"పాట చాలా బాగా పాడావు. దక్షాయణీ! కంగ్రాట్స్"

ఓ ఉద్వేగపు అల ఆమె హృదయాన్ని నిలువెల్లా ఊపేసింది.

"థాంక్స్" తనను తాను కంట్రోలు చేసుకుంటూ అందామె.

"అవునూ" కదిలిందతడి కంఠం" సినిమాల్లో, టీవీల్లో ఎందుకు పాడవు నీవు? నీ కంఠం ముందు నెంబర్ వన్ గాయని కూడా దిగవిడుపే".

"పదిమంది కోసం పాడే పాటగా దానిని నాకు కమర్షియలైజ్ చేసుకోవడం ఇష్టం లేదు. ఈ ప్రపంచంలో ప్రతిదీ కమర్షియలైజ్ చేసుకోవాలన్న ఆశ నాకు లేదు. నా పాట నా కోసం ... ఆ తర్వాత నా కాబోయే భర్తా, పిల్లలకు కాస్త ఆహ్లాదాన్ని ఇస్తే చాలు."

అప్రతిభుడయ్యాడు అతడు. ఈ రోజుల్లో ఏ కళైనా కొద్దిగా వస్తే దాని ద్వారా ప్రపంచంలో ఎంత పైకి ఎగబాకాలా అని చూస్తారు కాని తన కోసం, తనకు ఆహ్లాదం ఇవ్వడం కోసం లలిత కళలు నేర్చుకునేవారిని చూడడం అరుదు. ఆమె వ్యక్తిత్వానికి అతడికి ముచ్చటేసింది.

అదే మాటని తిరిగి ఆమె తండ్రితో అన్నాడు.

"అరుదైన వ్యక్తిత్వం మీ అమ్మాయిది. ఈమెని చేసుకునేవారెవరో కాని అదృష్ట వంతుడు. జీవితాన్ని ఓ మధుర భావనగా మలిచే తెలివితేటలు ఉన్నాయి. భర్తను ఎలా ఆనందపెట్టాలో తెలిసిన భార్య స్వర్గంతో కంటే ఉన్నతం".

ఓ సంతోష తరంగం దాక్షాయణిని నిలువెల్లా ఊపేసింది. రోజుకు ఎన్నిసార్లు గుర్తొచ్చి తనని కలవరపరిచే అతడు తన ఎదురుగా ఉన్నాడు. అతడు తన వ్యక్తిత్వాన్ని అభినందిస్తున్నాడు. ఆమాట కొస్తే తనకంటే అతడి వ్యక్తిత్వమే ఉన్నతమైనది.

ప్రపంచంలోనే అత్యద్భుత పరికరం చేతిలో ఉండి ఆడవారిని నీచంగా చూసే అవకాశం ఉన్నా అలాంటి వూహే లేకుండా తాను నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడుతున్నాడు. తన చేతిలోని ఆయుధాన్ని కొన్ని కోట్లకు అమ్మే అవకాశం ఉండీ, దానిని కేవలం ఒకే ఒక ఆశయమైన పగ తీర్చుకోవడానికి ఉపయోగిస్తున్నాడు. ఇలాంటి వ్యక్తులు చాలా తక్కువగా ఉంటారు.

అతడి మాటతో ఆలోచన తెగింది.

"ఇక వస్తాను దాక్షాయణి"

"అదేమిటా త్వరగా వెళ్ళిపోతున్నారు? కాఫీ, టీ, కూల్‌డ్రింక్... ఏదీ కావాలి?"

"కాఫీ, టీ, కూల్‌డ్రింక్ నాకు అలవాటు లేదు దాక్షాయణీ! నిన్ను ప్రత్యక్షంగా చూడడానికే వచ్చాను."

"అయితే ఒక్క నిమిషం" మెరుపువేగంతో మాయమై మరో నిమిషంలో ప్రత్యక్షమైంది.

"ఇది గ్రీన్ టీ. ఒకసారి తాగి చూడండి. మనసు రిఫ్రెష్ అవుతుంది".

అతడు ఒక సిప్ చేశాడు. నిజంగా అద్భుతంగా ఉంది. ఆ అమ్మాయి ఏ పని చేసినా అద్భుతంగా చేస్తుంది.

"ఇక వస్తాను దాక్షాయణీ.."

"అన్నట్లూ రేపు నాకు పెళ్ళిచూపులు..." తలవంచుకొని అందమె.

ఆ కెరటంలా విరుచుకుపడ్డ నిరాశ రేఖను అణగదొక్కుతూ కదిలిందతడి కంఠం.

"ఈజిట్... కంగ్రాట్స్... అయితే ఈ కాలంలో ఇంకా పెళ్ళిచూపులు ఉంటాయా?"

"సంప్రదాయక కుటుంబంలో పుట్టిన ప్రతి అమ్మాయికి ఇది తప్పదు. నిజానికీ అప్పుడే పెళ్ళి చేసుకోవడం నాకూ ఇష్టం లేదు. కాని నాన్నగారికి అతడెవరో గవర్నమెంట్ ఉద్యోగస్థుడట. బాగా నచ్చాడు. ఆయన మనసుని నొప్పించడం ఇష్టం లేక సరేనన్నాను."

"అలాగా"

"అన్నట్లు నాకో సహాయం చేస్తారా?"

"ఏమిటిది?"

"పెళ్ళి చూపులకు వచ్చే ఆయన పేరు సుందర్రావు. నీటిపారుదల శాఖలో సెక్షన్ ఆఫీసరట. కాస్త మీ వండర్ మిషన్ ద్వారా అతడెలాంటి వారో కొద్దిగా చూడరూ? ఎందుకంటే నాన్నగారు బాగా ఇష్టపడుతున్నారు. అసలు ఆయన ఎలాంటివారో తెలుస్తుంది కదా.... నాకయితే పెద్దగా ఇష్టం లేదు..."

ఆ ఆఖరి మాట వినగానే ఆర్య మనసు మానస సరోవరంలో విహరించి నట్లయింది. దాక్షాయణీకి ఆ సంబంధం ఇష్టం లేదు. అది చాలు తనకు.

"అలాగే దాక్షాయణీ... బై"

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?" చిరునవ్వుతో కదిలిందామె కంఠం.

అందంగా మెరుస్తున్న ఆమె పలువరుసను అలాగే చూస్తూ "నీవు నన్ను ఎప్పుడు తలుచుకుంటే అప్పుడు కలుస్తాను. సరేనా?" అన్నాడు.

"అలాగే" నవ్విందామె. ముత్యాలు రాలి పడ్డట్లన్పించాయి.

అతడి బై చెప్పి కారు ముందుకు కదిలించాడు.

కాని ఆ సమయంలో ఓ రెండు కళ్ళు వారిద్దరిని గమనించిన విషయం వారికి తెలియదు.

◆ ◆ ◆

రంగరంగ వైభవంగా దిగారు పెళ్ళికొడుకువాళ్ళు. ముందుగా వారి కళ్లు ఆ ఇంటిని ఎక్స్‌రే తీశాయి. అవతల వారి ఆర్థిక స్థోమతని అంచనా వేసే ప్రయత్నం అది.

"రండి....రండి" వినయంగా లోపలికి ఆహ్వానించాడు వారిని దాక్షాయణి తండ్రి.

దర్పంగా లోపలికి నడిచారంతా. పెళ్ళికొడుకు, తండ్రి, తల్లితోపాటు పెళ్ళికొడుకు అక్క, చెల్లెలు కూడా వచ్చారు.

పెళ్లి కొడుకు ఠీవిగా సోఫాలో కూర్చున్నాడు. ప్రభుత్వ ఉద్యోగినన్న అహం అతడి అణువణువూ కనిపిస్తోంది. కాలు మీద కాలు వేసుకొని కూర్చున్నాడు.

పెళ్ళికొడుకు తండ్రి తమ వంశప్రతిష్ఠల గురించి చెబుతున్నాడు.

"మా అమ్మాయిని పాయసంపేట జమిందారి కుటుంబానికి ఇచ్చాం. వారు అమ్మాయిని కాలు క్రింద కూడా పెట్టనీయరు. ఇంటి నిండా నౌఖర్లు, పనివారు... వాళ్ళని చూసుకోవడానికే అమ్మాయికి టైమ్ సరిపోదు..."

ఆ అమ్మాయి దర్పంగా మెడలోని ఆరు పేట్ల గొలుసుని సర్దుకొని కూర్చుంది.

పెళ్లికొడుకు తండ్రి మళ్ళీ మొదలుపెట్టాడు.

"మా అబ్బాయికి ఎంతోమంది పిల్లని ఇస్తామని వచ్చారు. ఆఖరికి డాక్టర్లు, ఇంజనీర్లు కూడా వచ్చారు. కాని నేనే సంప్రదాయ కుటుంబంగల పిల్ల కావాలని మీ సంబంధం చూడడానికి వచ్చాం."

పెళ్ళి కొడుకు తల్లి అందుకుంది.

"అసలు మా వాడు ఈ కాలంలో పుట్టాల్సినవాడు కాడు. ఒక్క చెడ్డ అలవాటు కూడా లేదు. నేను ఎంత చెబితే అంతే... నేను లేకపోతే టిఫిన్ కూడా చేయడు. అలాగే అర్ధాకలితో  ఉంటాడు..."

ఆవిడ వాక్ప్రవాహానికి అడ్డుపెడుతూ ఇద్దరు ముత్తయిదువలు దాక్షాయణిని తీసుకొచ్చారు. అమ్మాయిని చూస్తూనే కళ్లు మెరిశాయి పెళ్లి కొడుకు సుందర్రావుకు. అలాగే మిడిగుడ్లేసుకుని చూస్తున్నాడు. ఈలోగా తండ్రి ఉరిమి చూడడంలో ఆపేశాడు. అమ్మాయి నచ్చిందని వెంటనే చెబితే కట్నంలో కోత పెడతారని ఆయన భయం.

"అమ్మాయ్! వంటావార్పులు వచ్చా?" అడిగింది కాబోయే అత్తగారు.

"మా అమ్మాయికి వంటే కాదండి" అందుకున్నాడు దాక్షాయణి తండ్రి "సంగీతం, పెయింటింగ్... అన్నీ వచ్చు..."

"సంగీతం, పెయింటింగ్‌లా! అని నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావు" ఈసడించింది పెళ్ళికొడుకు చెల్లెలు. ఆ అమ్మాయి ఇంజనీరింగ్ చదువుతుందట. అందుకే అతిశయంగా కూర్చొని ఉంది.

దాక్షాయణీ దెబ్బతిన్నట్లుగా చూసింది. తండ్రి కళ్ళతోనే ఊరుకోమన్నట్లుగా చూశాడు.

"కట్నం ఎంతిస్తారు?" అడిగాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అమ్మాయి పేరున ఒక ఎకరం ఉంది. అది మార్కెట్‌లో పది లక్షలు ఉంటుంది.."

“బోడి... పది లక్షలా... హైదరాబాద్‌లో కనీసం వంద గజాల స్థలం కూడా రాదు” ఈసడించుకున్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

దాక్షాయణీ తండ్రి నీరుకారిపోయాడు.

“దాంతో పాటు లక్ష రూపాయలు క్యాష్, బంగారం కూడా ఇద్దామనుకుంటున్నాను.”

“సర్లే... ఆలోచిస్తాం...” దర్పంగా అన్నాడు. ఈలోగా పండ్లు, ఫలహారాలు, స్వీట్లు తెచ్చిపెట్టారు. ఆకలిగున్న పులుల్లా వాటి మీదే పడ్డారు. ఎప్పుడూ అలాంటివి చూడలేదన్నట్లుగా గబగబ తినసాగారు.

కాసేపయ్యాక మధ్యవర్తి అన్నాడు.

“అమ్మాయి, అబ్బాయి ఏదైనా మాట్లాడుకుంటారేమో చూడండి.”

అబ్బాయి పెద్దగా ఆసక్తి చూపలేదు. కాని దాక్షాయణీ ఆసక్తి చూపేసరికి ఇద్దరినీ వదిలేసి అంతా వేరే గదిలోకి వెళ్ళారు.

దాక్షాయణీ, అతడే మిగిలారు ఆ గదిలో.

“చెప్పండి! పెళ్ళి తర్వాత మీకు జాబ్ చెయ్యాలని ఉందా?” అడిగాడు పెళ్ళికొడుకు.

“లేదు”

“అదేమిటి యమ్మే చదివి....”

“నా దృష్టిలో అన్నింటికంటే ఉత్తమమైన పోస్ట్ గృహిణి ఐ మీన్ హౌస్‌కీపర్ భర్త, పిల్లల్ని చూసుకుంటే ఇల్లు నీట్‌గా ఉంచుకోవాలని నా ఆశ”

“ఛీ... హౌస్‌కీపరా?” ఛీత్కారంగా అన్నాడు అతడు.

“ఏం మీ అమ్మ హౌస్‌కీపర్? మీ అక్క గృహిణీ కాదా?”

అతడు గతుక్కుమన్నాడు.

“అది కాదు నా ఉద్దేశం! ఇద్దరం కలిసి జాబ్ చేసుకుంటే....”

“ఎందుకు మీరు తెచ్చే జీతం సరిపోదా? ఆడది బయటా, ఇంటా రెండు చోట్ల కష్టపడాలా?”

“అది కాదు నా ఉద్దేశం. మగవాడొక్కడే కష్టపడి సంపాదించాలంటే కష్టం...”

"కష్టం ఎందుకు? మీ జాబ్‌లో లంచాలు బాగా వస్తాయి కదా"

"లంచాలా? ఛ....అలాంటివి నేను తీసుకోను..."

"అవునా" నవ్వింది దాక్షాయణీ" మీరు నిన్న ఆఫీసులో కాంట్రాక్టర్ చెక్కు రెడీ చేయడానికి ఐదొందలు బల్లక్రింది చేతులు పెట్టి తీసుకున్నారే?"

తన కాళ్ళ క్రింది నేల కదిలినట్లన్పించింది అతడికి. అసలు నిన్న తాను లంచం తీసుకుంది తనకు, ఆ కాంట్రాక్టర్‌కే తెలుసు. మరి ఈమెకెలా తెలిసింది?

అతడు ఆమె వేపు అనుమానంగా చూశాడు. కొంపతీసి ఈమే ఏదైనా అవినీతి నిరోధకశాఖకు చెందినదా? మరి మూడోకంటివాడికి తెలియని ఆ విషయం ఈమెకెలా తెలిసింది?

"సరే ఆ విషయం పక్కన పెట్టండి. ఆడవారి మీద మీ అభిప్రాయం ఏమిటి?"

"ఆడవారంటే నా దృష్టిలో పవిత్రమూర్తులు. నిజం చెప్పాలంటే నేను అమ్మను, అక్కాచెల్లెళ్ళను తప్ప ఇప్పటివరకు జీవితంలో ఎవరిని ఆ దృష్టిలో చూడలేదు..."

"అవునా" తన చేతిలో ఫోటోలు బయటికి తీసిందామె. "ఇవిగో నిన్న- మీ కోలీగ్ సత్యవతి పనిలో ఉన్నప్పుడు పైట క్రిందకు జారగానే మీ చూపులు ఎక్కడున్నాయో చూపిస్తున్నాయి. ఇదిగో, మీ ఆఫీసులో లంచ్‌టైమ్‌లో ఆడవారు బయటకు వెళ్ళగానే మీ మగ కోలిగ్స్‌లతో మీరు "అదా! దాని మొగుడు దుబాయ్‌లో ఉన్నాడట. పిట్ట వాటంగా, కుదురుగా ఉంది. నన్ను ఒక్క రాత్రికి పిలిస్తే దుమ్ము రేపేస్తాను" అని కామెంట్ చేసిన మాటలు..."

అతడు బిక్క చచ్చిపోయాడు. మైగాడ్! ఇది మామూలుది కాదు. అజ్ఞాతశక్తి గల ఆడది. తన జీవితం మొత్తం శోధించింది. తానేం చేసిందీ అన్ని తెలుసు. తన శరీరం మొత్తం స్కాన్ చేసి ఎక్స్‌రే తీసినట్లుంది. వామ్మో! పెళ్ళి కాకముందే దీనికి ఇన్ని కళలున్నాయి. పెళ్ళయ్యాక ఇంకెన్ని...

అతడి ఆలోచనల్ని సర్రున కట్ చేస్తూ కదిలిందామె.

"చూడండి! మీరంటే నాకు ఇష్టమని పర్సనల్‌గా మాట్లాడలేదు. ఇవన్నీ మీ అక్కాచెల్లెళ్ళ ముందు మాట్లాడితే సంస్కారమనిపించుకోదు. కాబట్టి ఇలా పర్సనల్‌గా మాట్లాడాల్సి వచ్చింది. ఇదిగో ఇంకో దృశ్యం చూపిస్తాను. పెళ్ళిచూపులకు వచ్చే ముందు రాత్రి... అంటే నిన్న మీ తల్లిదండ్రులతో మీరు ఏమన్నారో చెప్పనా? "నాన్నా!

రేపు పెళ్ళి చూపులు కదా! దాని కారెక్టర్ కనుక్కున్నారా? అది ఎవడితో తిరుగుతుందో అబార్షన్ చేయించుకుందో? అసలే ఈ కాలపు అమ్మాయిలను నమ్మకూడదు" అన్నారు. దానికి నీ తండ్రి "అంతా ఎంక్వయిరీ చేసే వచ్చాం. అయినా నీ చెడు తిరుగుళ్లు తెలిసినవారు నీకు పిల్లనివ్వకపోతే, ఆఖరికి హౌస్‌కీపర్ సంబంధానికి వెళ్ళాల్సి వచ్చింది. అయినా రేపు పెళ్ళిచూపులు కదా! కాస్త ఈ ఒక్కరోజుకైనా ఆ పేకాట, తాగుడు ఆపేసి బుద్ధిగా ఇంట్లో కూర్చోరా" అన్నాడు. కాబోయే పెళ్ళాన్ని 'అది' ఇది అనే మీ సంస్కారం నాకు అర్థమైంది..."

అప్పటికే చెమట్లు పట్టేశాయి అతడికి. అయినా దాక్షాయణీ ఆపలేదు.

"ఇందాకా మీ చెల్లెలు అన్నదే చిత్రలేఖనం, సంగీతం నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావు అని. అసలు ఆ అమ్మాయికు ఇంజనీరింగ్‌లో ఇప్పటికే పది సబ్జెక్టులు బ్యాక్‌లాగ్ ఉన్నాయి. ఇంకో నాలుగేళ్ళు ఎక్కువ చదివినా ఆ ఇంజనీరింగ్ పూర్తవుతుందన్న నమ్మకం లేదు. పైగా రోజూ కాలేజీకి లోకల్ ట్రైన్‌లో ఆ అమ్మాయి అబ్బాయిలతో జరిపే ప్రణయదృశ్యాలు కోకొల్లలు. ఆమెకు వారానికో కొత్త బాయ్‌ఫ్రెండ్ కావాలి. అలాంటి అమ్మాయికి చిత్రలేఖనం, సంగీతం లాంటివి ఎందుకు పనికిరాని విద్యలు. అవునా?"

అతడు కనీసం తల కూడా ఎత్తడం లేదు. దాక్షాయణీని సూటిగా చూసే సాహసం చేయడం లేదు. ఈ లోగా దాక్షాయణీ కొనసాగించింది.

"ఐయాం సారీ! మీ సంబంధం నచ్చలేదంటే నాన్నగారు బాధపడతారు. అందుకే మీతో చెబుతున్నాను. మీకు నేను నచ్చలేదని కబురంపండి. అందువల్ల నాకే మిమ్మల్ని చేసుకునే అవసరం ఉండదు" అంటూ లేచింది.

ఆమె లేవడం చూసి లోపలున్న మిగతావారు బయటికి వచ్చారు. పెళ్ళికొడుకు మొహంలో నెత్తురు చుక్కలేదు. పెళ్ళికొడుకు తండ్రి, తల్లి, అక్కడ చెల్లెళ్ళకు ఏం జరిగిందో అర్థం కాలేదు.

"ఒకే! అసలు విషయం తర్వాత తెలియజేస్తాం" అని పెళ్ళికొడుకు తండ్రి తన పరివారంతో బయటికి నడిచాడు.

◆ ◆ ◆

# 9

ప్రధాని సమీరను కలుసుకోవడానికి ఆర్యచంద్ర చేయని ప్రయత్నం లేదు. ఒకసారి ఏదో బహిరంగసభకు ఆమె వస్తుంటే సెక్యూరిటీని దాటి ముందుకు వెళ్ళాలని ప్రయత్నించాడు. కాని సెక్యూరిటీవారు అతడిని పక్కకు తోసేశారు.

మరోసారి పార్టీ సమావేశం ఉన్నప్పుడు అతడు అందులో 'టీ' సప్లయి చేసే వాడిగా వేషం వేసుకున్నాడు. కాని సెక్యూరిటీవారు అతడిని వారించి, ఆ టీని తాము సప్లయి చేస్తామని చెప్పి బయటికి పంపించారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రధాని వస్తున్నారన్న వార్త వినగానే అతడు ఆమె కారు ముందు కనిపించడానికి ప్రయత్నం చేశాడు. కాని ఆమె ముందు ఆరు కార్లు ఉన్నాయి. అసలామె ఏ కారులో ఉందో అంతు తెలియలేదు.

ఎంతయినా ఆమె ఒకప్పటి ప్రేయసి. ఆమె తండ్రి చేసిన అన్యాయాన్ని ఆమెకు మనసు విప్పి చెపితే ఆమె కరిగిపోతుందని అతడి ఆశ. ఎంత ప్రధాని అయినా ఒకప్పటి చెలికాడైన తనని మర్చిపోదని అతడి ఆరాటం. అందుకే ఆమెను కలుసుకొని తన మంచి చెడ్డలు చెప్పుకోవాలని అతడి ఆశ.

నిజానికి ఆమెనుండి ఏదో ఆశించాలని అతడికి లేదు. ఎంత కాదన్నా ఆమె ఒకప్పుడు తన ప్రేయసి. ఎంత పెద్ద పదవిలో ఉన్నా ఆమె తనని ఆదరిస్తుందని అతడి ఆశ.

కాని ఆమెకు తనంటే అసహ్యమని, తన పొడంటేనే గిట్టదని అతడికి తెలియదు. ఆమె తండ్రి చనిపోతూ తన గురించి ఆమెకు తెలియజేశాడని అతడికి తెలియదు. తెలియదు కాబట్టే అతడు తన ప్రయత్నాలు తాను చేస్తున్నాడు.

అలా ఎన్ని ప్రయత్నాలు చేసినా అన్ని విఫలమవుతున్నాయి. దాంతో అతడు ఆమెను కలుసుకోవడానికి ఏ దారిలోనైనా వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు.

ఆ దారి ఏది అని చాలా రోజులు అతడు రీసెర్చి చేశాడు. తన దగ్గరున్న విజన్‌నెట్‌ని ఉపయోగించి ఆమెని కలుసుకోవడం అతడికి ఇష్టం లేదు. తనని తానుగా ఆమెను కలుసుకోవాలని అతడి కోరిక. నిజానికీ తన విజన్‌నెట్ అంటే వండర్‌మిషన్ గురించి అప్పుడే ఎవరికీ తెలియడం అతడికి ఇష్టం లేదు.

అప్పుడు కనిపించిందో కన్పించిందోదారి. ఆ దారి ప్రెస్ రిపోర్టర్‌గా అవతారం ఎత్తడం.

ఆ రోజు ప్రధానితో ప్రెస్ కాన్ఫరెన్స్ ఉంది. ఆ ప్రెస్ కాన్ఫరెన్స్‌కు దేశంలో ప్రముఖ న్యూస్‌పేపర్లు, టీవీ ఛానల్స్‌కు ఆహ్వానం వెళుతుంది.

సరిగ్గా ఇదే అవకాశాన్ని తనకు అనువుగా మార్చుకున్నాడు అతడు. దాంతో అతడు కూడా భారత్‌టైమ్స్ వీక్లీ జర్నలిస్ట్‌గా అవతారం ఎత్తడానికి నిర్ణయించుకున్నాడు. ఆ పత్రిక జర్నలిస్టుగా అతడు సైతం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అడుగుపెడతాడు. అడుగు పెట్టి ఆమెను కన్నులారా చూడవచ్చు.

అయితే అలా జర్నలిస్టు కావాలంటే తన విజిటింగ్ కార్డు కావాలి. అందుకే అతడే ఒక నకిలీ విజిటింగ్ కార్డుని తయారుచేసుకున్నాడు. ఆ నకిలీ కార్డు ద్వారా లోపలికి అడుగుపెట్టి, ఆమె కళ్ళలో పడవచ్చు. ఒకసారి ఆమె కళ్ళల్లో పడితే చాలు, ఆమె తనని పిలుస్తుంది.

అంతే! ఆ వూహ వచ్చిన మరుక్షణం అతడు తన పాస్‌పోర్ట్ సైజ్‌తో గల ప్రెస్ విజిటింగ్ కార్డుని తయారుచేసుకున్నాడు. అందులో కొద్దిపాటి రిస్క్ ఉంది. కాని తన ప్రియురాలు కోసం ఆ మాత్రం రిస్క్ తీసుకోగల సాహసం తనకు ఉంది.

ఎప్పుడైతే నకిలీ విజిటింగ్ కార్డుని తయారుచేసుకున్నాడో, అతడు ప్రెస్ కాన్ఫరెన్స్ కోసం ఎదురుచూడసాగాడు.

ఆ ప్రెస్ కాన్ఫరెన్స్ సమయం సైతం వేగంగా దూసుకువచ్చింది.

◆ ◆ ◆

ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్.

దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని పరిష్కార మార్గాల గురించి ఆమె వివరిస్తోంది.

“భారతదేశం సంప్రదాయక దేశం. ఈ దేశంలో... “స్పీచ్ ఇస్తున్న ఆమె కళ్లు అందరికేసి తిరిగాయి.

అప్పుడు... ఓ మూల ఉన్న ఆర్య కనిపించాడు. మరుక్షణం ఆమె కళ్లు ఎరుపురంగు సంతరించుకున్నాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి ఆవేశంతో. ఎలాగో నిగ్రహించుకుంటూ తన ఉపన్యాసాన్ని ముగించింది.

కెమెరా ఫ్లాష్‌లు నిరంతరాయంగా ఆమెకేసి కురుస్తున్నాయి వెలుగులు.

ప్రెస్ కాన్ఫరెన్స్ అయిపోయింది. జర్నలిస్ట్‌లంతా తమ కిట్‌లు సర్దుకొని బయటకు బయలుదేరారు.

ఆర్య ఇంకా అక్కడే ఉన్నారు. ఆమె తన ప్రక్కనే ఉన్న సెక్యూరిటీ ఛీఫ్‌కేసి తిరిగి అతడికి ఏదో చెప్పింది.

మరుక్షణం కదిలాడు సెక్యూరిటీ చీఫ్ ఆర్య దగ్గరకు వచ్చాడు వేగంగా.

"యువర్ ఐడెంటిటీ కార్డు ప్లీజ్?"

ఆర్య లోపల నుండి తన ఐడీ కార్డు తీశాడు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దానిని చూశాడు. అటూ ఇటూ తిప్పాడు అనుమానంగా. ఆ తర్వాత ఫోన్ తీసి కొన్ని నెంబర్లు ప్రెస్ చేశాడు.

"హలో! ఈజీట్ భారత్ టైమ్స్?"

"మీ పత్రికలో ఆర్య అనే జర్నలిస్ట్ ఉన్నారా?"

"ప్రధాని ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చాడే మరి?"

మరుక్షణం సెక్యూరిటీ ఆఫీసర్ ఆర్య చొక్కా పట్టుకున్నాడు.

"హూ ఆర్ యూ?"

"ఆర్య..."

"దొంగ వెధవ... దొంగ ఐడీకార్డుతో లోపలికి వస్తావా?" అంటూ అతడిని గట్టిగా పట్టుకున్నాడు.

అదే సమయంలో ప్రెస్ కాన్ఫరెన్స్ ముగిసి సమీర అక్కడ నుండి వెళ్ళిపోతోంది.

"సమీరా! నేను ఆర్యను."

సమీర ఛీత్కారంగా చూసింది. ఆ తర్వాత ఆగింది.

"అతడిని తగిన విధంగా డీల్ చేయండి" అని అక్కడ నుండి వెళ్ళిపోయింది.

అంతే! ఆర్య మొహం మీద పడింది లాఠీ. మరో సెక్యూరిటీ గార్డు బూట్‌కాలితో అతడి కాలు మీద కొట్టాడు. ఎముక విరిగినంత బాధ ఆర్యలో.

"ఏరా! దొంగ సర్టిఫికెట్‌తో ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వస్తావా? ప్రధానిని ఏం చేద్దామని వచ్చావురా?"

ఆర్యలో షాక్. ఆ షాక్ వారు అలా రఫ్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నందుకు కాదు. సమీర తనని తగిన విధంగా డీల్ చేయమని సెక్యూరిటీకి ఆదేశాలు ఇచ్చినందుకు.

"ఏరా ఏం మాట్లాడవు? ఎవడ్రా నీవు టెర్రరిస్టువా, అసలు ఇక్కడికెందుకు వచ్చావురా? నీ వెనకాల ఎవరు ఉన్నార్రా?" అంటూనే అతడిని పక్కనే ఉన్న గదిలోకి తీసుకున్నారు.

ఆర్య ఇంకా దిగ్భ్రాంతిలోనే ఉన్నారు. చాలాకాలం తర్వాత తన అనురాగ దేవతను కలుసుకోవాలని వస్తే, ఆమె తనని గుర్తుపెట్టనట్లుగా నటించి, చిత్రహింసలు పెట్టమని తన సిబ్బందికి సూచనలు ఇవ్వడం అతను కలలో కూడా వూహించలేదు. కనీసం తనతో మాట్లాడకపోయినా ఫర్వాలేదు, ఆమెని చూసినట్లు ఉంటుందని వస్తే, ఆమె తనని విషవలయంలో ఇరికిస్తుందని అతడు అనుకోలేదు.

ఈ సంఘటనకి సరిగ్గా గంట తర్వాత –

రెండు పెదాలు చిట్లి, నాలుగు పళ్ళు రాలి, నోరంత ముద్దముద్దగా ఉబుకుతున్న రక్తం, తల పగిలి నేలను తడుపుతూ రక్తం, కుడికన్ను పూర్తిగా వాచిపోయి పడి ఉన్నాడు.

నిజానికీ అతడిని ఆ రోజు అసలు వదిలేవారు కాదు. కాని అతడు నిజంగా టెర్రరిస్టు కాదని, అతడు ఐఐటీ చేశాడని, పిహెచ్.డి.ని మధ్యలోనే వదిలేశాడని అతడు చెప్పగానే ఆయా కాలేజీలకు, యూనివర్సిటీకి కాంటాక్ట్ చేసి, అతడు చెప్పింది నిజమేనని నిర్ధారించుకున్నాక వదిలేశారు.

మళ్ళీ పొరబాటున కూడా ప్రధాని ఆఫీసు చుట్టుప్రక్కల కనిపించకూడదని వార్నింగ్ ఇచ్చి జీప్‌లో అతడిని తెచ్చి అతడు చదివిన ఐఐటీ కాలేజీ ముందు బస్తాని విసిరేసినట్లుగా విసిరేసి వెళ్లిపోయారు.

వర్షం పెద్దదవుతోంది. ఆ వర్షంలో తడుస్తూ వున్న అతడికి ఎదురుగా ఎత్తుగా కాలేజీ బిల్డింగ్ కనిపిస్తోంది.

ఒంటి మీదున్న రక్తం ఆ వర్షపు చినుకుల్తో కలిసిపోయి భయంకరంగా ఉన్నాడు. అతడి కళ్ళలోకి నీళ్ళు వర్షపు చినుకుల్తో కలిసిపోతున్నాయి. నీరసంతో స్పృహ తప్పిపోయాడు ఆ రాత్రంతా.

ఉదయం ఎవరో చూసి అతడిని హాస్పిటల్‌లో జాయిన్ చేసి వెళ్ళిపోయారు.

◆ ◆ ◆

ఆ దెబ్బలు తగ్గుముఖం పట్టడానికి రెండు నెలలు పట్టాయి. ఆ రెండు నెలలు అతడిలో చాలా మార్పుని తీసుకొచ్చాయి.

అతడిలో కసి.. అంతులేని కసి. ఈ రాచరిక వ్యవస్థని పునాదులతో పెకలించి పరిపాలనా వ్యవస్థని స్తంభింపచేయాలన్న ప్రతీకారం అతడి నరనరాన బుస బుస పొంగిపోతోంది.

◆ ◆ ◆

ఆ రాత్రి –

పరిపాలనా వ్యవహారాలు పూర్తి చేసుకున్న సమీర రిలాక్సింగ్‌గా కూర్చుంది.

అప్పుడు మ్రోగిందామె ఫోన్. అన్‌లిస్టెడ్ నెంబరది. భారత రాష్ట్రపతి, పార్టీ చీఫ్‌లాంటి ఓ పది మంది ప్రముఖుల దగ్గరే ఉంటుందా నెంబర్.

ఆమె కనుబొమ్మలు ముడివడ్డాయి. ఏదో కొత్త నెంబరది.

అనుమానంగా ఎత్తిందా ఫోన్.

"హలో...." వికటపు నవ్వు.

"హలో... ఎవరూ?"

"గుర్తు పట్టు చూద్దాం" వ్యంగ్యం ఆ కంఠంలో.

"ఎవరు మీరు?"

"చెప్పుకో చూద్దాం..." తిరిగి వ్యంగ్యం ఆ కంఠంలో.

ఆమెకు ఒక్కసారి చిరాకు వచ్చింది. ఎవరో చెప్పడు. పైగా తనని ఏకసంబోధనతో మాట్లాడడం.

అంతే! మరుక్షణం ఆమె కంఠం కదిలింది ఆగ్రహంగా.

"ఏం పిచ్చి పిచ్చిగా ఉందా? అసలీ నెంబర్ ఎక్కడిది? ఎవరు మీరు?"

కత్తితో కోసినంత పదునుతో ధ్వనించింది అప్పుడు కంఠం.

"ఆర్యా... ఆర్యచంద్ర"

ఒక్కసారిగా శరీరం తూలిపడ్డట్లయింది. మైగాడ్! అతడు తిరిగి మళ్ళీ రంగంలోకి వచ్చాడు.

"హలో... ఏం షాక్ తిన్నావా?" వ్యంగ్యంగా కదిలిందతడి కంఠం" చాలా

కాలం అయింది కదు మనం కలిసి. ఆ రోజు నీ సెక్యూరిటీతో కొట్టించిన దెబ్బలు ఇప్పటికీ నా శరీరం మీద మచ్చల్లా మిగులున్నాయి..."

"సిగ్గు లేదు" మెరుపువేగంతో కదిలిందామె కంఠం. "ఆ రోజు వాళ్ళు కొట్టిన దెబ్బలు చాల్లేదూ... మళ్ళీ వచ్చావు."

"దెబ్బలదేం ఉందిలే! మానిపోతాయి. కాని మానసికంగా నీవు కొట్టిన దెబ్బలే నా గుండెల్లో ఇప్పటికీ అగ్నిజ్వాలలు రేకెత్తిస్తున్నాయి..."

"మరెందుకు వచ్చావు? నీ పని నీవు చేసుకోకుండా"

"నీ పని డిస్టర్బ్ చేయడానికి..." పదును ఆర్య కంఠంలో.

"ఏం తిక్కతిక్కగా ఉందా? దేశానికే ప్రధానిని నేను... ఆఫ్టరాల్ ఓ సామాన్యుడివి. నీవు నా పనిని అంతరాయం కలిగించడానికి ఇలా వస్తే ఏమాత్రం సహించేది లేదు."

"ఎంత ప్రధాని అయినా నీవు ఒకప్పుడు నా ప్రేమికురాలివే అన్న విషయం మర్చిపోకు".

"అది గతం! నీలాంటి దుర్మార్గుడిని ప్రేమించినందుకు నేను బాధపడు తున్నాను.."

"ఎందుకు నీ పొజిషన్ పెద్దదైనందుకా, నా పొజిషన్ చిన్నగా అయినందుకా?"

"మా నాన్నని నిర్దాక్షిణ్యంగా దేశ ప్రజల ముందు అవమానించి ఆత్మహత్య చేసేటట్లుగా చేశావు. అలాంటి నీతో నాకు మాటలేమిటి?"

"నిజం చెప్పాలంటే చితికింది మీ నాన్న బ్రతుకు కాదు. నిన్ను ప్రేమించిన నేరానికి నాబ్రతుకే కాదు, ఒక్కగానొక్క నా అక్క జీవితం సైతం నేలరాలింది."

"దానికి నేనేం చేస్తాను? స్వయంకృతాపరాథం."

"స....మీ....రా..." ఆ అరుపుకు ఆమె కర్ణభేరి పగిలినంతగా నొప్పి.

"ఎందుకు అలా అరుస్తావు? ఇలాంటి తిక్కవేషాలంటే తిరిగి నిన్ను లోపలి వేసి అసలు బ్రతకకుండా జీవచ్ఛవంలా చేసి..."

ఆమె మాటలు పూర్తికాకుండానే అతడి కంఠం కదిలింది వేగంగా.

"ఓహో అధికారం చేతిలో ఉందనికదా ఇలా చులకనగా మాట్లాడుతున్నావు. నీ అధికారాన్ని మించినది నేను పొందగలను తలుచుకుంటే..."

"ఆఫ్టరాల్! ఓ సాధారణ వ్యక్తిని. నీవేం చేయగలవు నన్ను...." అతిశయం ఆమె కంఠంలో.

"ఏదైనా చేయగలను. నేను సైంటిస్ట్‌కి. నేను తలుచుకుంటే ఈ దేశపు పునాదులు కదిలిస్తాను. జాగ్రత్త..."

"ఓహో కలకన్నావా? బాగా కను. ఈ ప్రధాని పీఠం వెనకాల రాష్ట్రపతి, మంత్రిమండలి, ఎంపీలు, సుప్రీంకోర్టు, ఇంకా లక్షలాది సైనికులు ఉన్నారు. ఇలాంటి పటిష్టమైన సింహాసనాన్ని లేపడం నీ వల్ల కాదు. నిన్ను పుట్టించిన అబ్బ..."

"ఆపు నీ రణతంత్రపు జిత్తులు. నేను తలుచుకుంటే ఈ సింహాసనాన్ని పునాదులతో సహా పెకలిస్తాను. కాని నేను నీలాంటి ప్రతికూల ధోరణులు ఉన్న వాడిని కాను. జీవితం పట్లా, సమాజం పట్లా, చుట్టూ వున్న ప్రజల పట్లా సున్నితమైన భావాలు ఉన్నవాడిని. సమాజం నన్ను ఎంత దెబ్బకొట్టినా నాలో రాక్షసభావాలు ఇంకా రాలేదు. నేను పుట్టిన వాతావరణం, పెంచిన సంస్కారం నాలో ఇంకా మానవతను ఉంచాయి."

"హీరో డైలాగులు మానెయ్యి. నీలాంటి ప్రతివాడు ఇలాగే మాట్లాడతాడు"

"నేను సైంటిస్ట్‌ని. సైంటిస్ట్‌ని ఎప్పుడూ చులకన చేయకు. సైంటిస్ట్‌లు లేకపోతే ఈ ప్రపంచం..."

"చాల్లే శుష్క ప్రవచనాలు. అసలు విషయంకురా. ఫోన్ ఎందుకు చేశావు? ఇంకోసారి ఫోన్ చేస్తే నీ శవం కూడా యమునానదిలో దొరకదు..."

"ఎంత కండకావరం నీకు. ఆ ఎర్రచీరలో, నల్ల జాకెట్‌తో, మెడలో లాకెట్‌తో రూపం అద్భుతంగా ఉంది. కాని మనసే కఠినం..."

"మైగాడ్" అదిరిపడింది సమీర. తాను వేసుకున్న డ్రెస్, లాకట్ గురించి అతడికెలా తెలుసు?

"అదే కాదు, ఇందాకే జడలో పెట్టుకున్న మల్లెపూలు సైతం మత్తెక్కిస్తున్నాయి."

అప్పుడు ఎగిరిపడింది సమీర. మైగాడ్! ఈ గదిలో జరుగుతున్న ప్రతిదీ అతడెలా చెబుతున్నాడు?

సరిగ్గా అప్పుడే సమీర పెంపుడుకుక్క వచ్చింది అక్కడ పాక్కుంటూ. సమీర ప్రేమగా 'కమాన్ జూలీ' అంది.

"ఒహెూ కుక్కని కూడా పెంచుతున్నావన్న మాట. బాగుంది జూలీ... హాయ్ జూలీ..." గొంతు పెద్దది చేశాడు.

అది ఫోన్‌లో లీలగా వినిపిస్తున్న 'జూలీ' అన్న పిలుపు విని అది రిసీవర్ వేపు ఎగరసాగింది.

"చూశావా! నీ కుక్క జూలీ సైతం నా కోసం ఎగబడుతోంది. కుక్కలకు ఉన్న మమకారం మనుషులకు ఉండడం లేదు.."

సమీరకు మతిపోతోంది. అనుమానంగా తన గది చుట్టూ చూసింది ఎక్కడన్నా సిసి కెమెరా ఉందేమోనని. ఊహూ! అలాంటివేమీ లేవు.

"సమీర! కెమెరాల కంటే శక్తివంతమైనది నేను కనిపెట్టిన విజన్‌నెట్. ఐమీన్ వండర్ మిషన్. అందువల్ల నీవేం చేసేది నా కళ్ళ ముందు కనిపిస్తోంది.."

దిగ్భ్రాంతికి లోనయ్యింది సమీర. మైగాడ్! అతడు చెప్పేది నిజమా? అదేదో పురాణాలలో విన్నది మాయాదర్పణం గురించి, దాని ద్వారా ఇతర లోకాలలో మనుషులేం చేస్తారో తెలుసుకోవచ్చని. కానీ ఈ ఆర్య అలాంటి దానిని ఎలా కనిపెట్టగలిగాడు? అదసలు సాధ్యమేనా? అంతా మాయమాటలేనా?

ఆమె మనసులోని భావాలు చదివినట్లుగా కదిలిందతడి కంఠం.

"సైన్స్... టెక్నాలజీ... రెండూ కలిపితే జరిగేది సంచలనమే. అదే నేనిప్పుడు చేసింది"

ఆమెకు మండిపోయింది అతడి అతిశయానికి.

"అయితే ఏమిటి? దాని వల్ల నీవు సాధించేది ఏమిటి?"

"ఎక్కడ బంగారం, పెట్రోలు దొరుకుతాయో తెలుస్తుంది. ఎక్కడ మాఫియా సంచరిస్తుందో తెలుస్తుంది. ఎక్కడ సంఘవిద్రోహకశక్తులు చెలరేగిపోతారో కనిపెట్టవచ్చు. ఎక్కడ ఇన్‌కంటాక్స్ డబ్బు ఎగ్గొట్టి దాచారో కనిపెట్టవచ్చు."

"దానితోపాటు ఆడవారిని నగ్నంగా, కోరుకున్న విధంగా చూడవచ్చు" వ్యంగ్యంగా కదిలింది ఆమె కంఠం "ఇలా ఎన్నాళ్ళనుండి చేస్తున్నావు?"

"నేనేమీ మీ తండ్రిగారిలా ఒకేసారి రాసక్రీడలు నడిపించలేదులే. అయినా ఆడవారిని అలా నగ్నంగా చూసే సంప్రదాయం నాకు లేదు..."

"అది లేదు. కాని ఇలా బహిరంగంగా చూసే అలవాటు ఉంది.." వ్యంగ్యం ఆమెలో.

"అలా చేసింది నీలాంటి ఒకళ్ళిద్దరి విషయంలోనే. ఇతరుల విషయంలో నేనెప్పుడూ అలా చేయను. చేయలేదు కూడా! నన్ను కుక్కను కొట్టినట్లుగా మీ సెక్యూరిటీ వాళ్ళు కొట్టారే! అందుకే తిరిగి నిన్ను దెబ్బకొట్టడానికే ఇలా చేశాను..."

"దేశ ప్రధానిని నేను..." అతిశయం సమీరలో "నన్ను నీవేం చేయగలవు?"

"ఏం చేయగలనో చూపిస్తాను. నా సైన్స్+టెక్నాలజీ సహాయంతో దేశాన్ని ఎలా గడగడలాడిస్తానో ఇక నుండి చూపిస్తాను. ఈ సామాన్య పౌరుడు దేశ ప్రధానిని ఎలా వణికిస్తాడో నిరూపిస్తాను. నీ కంప్యూటర్ ఆన్ చేయ్. నా దగ్గర నుండి వచ్చిన ఈ మెయిల్‌ని చదువు. అప్పుడే నా తడాఖా నీకు అర్థమవుతుంది. ఖబడ్దార్."

మరుక్షణం ఫోన్ పెట్టేసినట్లుగా క్లిక్‌మంది.

◆ ◆ ◆

మర్నాడు ఉదయం – సమీర తన లాప్‌ట్యాప్ కంప్యూటర్‌ని తెరిచింది. ఇ–మెయిళ్ళలో ఆర్య చెప్పిన లెటర్ కన్పించింది. వెంటనే మౌస్‌ని దాని మీద క్లిక్ చేసింది.

**మిస్ ప్రైమ్ మినిస్టర్,**

స్వతంత్ర భారతావనికి నూతన ప్రధానిగా వచ్చిన మీకు నా అభినందనలు. చాలా చిన్నవయసులో అంత పెద్ద అధికారం చేపట్టిన మీకు నా హాట్సాఫ్.

ఒకనాడు మీ కపిలవర్ధ యూనివర్సిటీలో పిహెచ్.డీ చేస్తున్న మీ తండ్రిగారు మిమ్మల్ని ప్రేమించిన నేరానికి నాకు తీవ్రమైన శిక్ష విధించారు. నా పిహెచ్.డి. కలని నాశనం చేశారు. ఎయిడ్స్‌కు మందు కనిపెడితే దానిని తస్కరించి ఎవరికో అమ్మేశారు. ఆఖరికి ఒక్కగా నొక్క నా అక్క మానభంగానికి గురవడానికి కారణం మీ తండ్రే.

అందుకే ప్రతీన పూని నీ తండ్రిని నాశనం చేశాను. అయిన నా పగ ఇంకా తీరలేదు. నా అక్కని రేప్ చేసిన వాడు మీ మినిస్టర్లలో ఒకరట. కొనవూపిరిలో ఉన్న నా అక్క ఈ ఒక్కమాట చెప్పి ప్రాణం విడిచింది. వాడిని పట్టుకొని ఉరికంబం ఎక్కించాలి. లేదా దేశం మొత్తం సంచలనం సృష్టిస్తాను. నీకు ఊపిరి ఆగకుండా చేస్తాను. నీ కంటికి కునికే లేకుండా చేస్తాను.

నేను కనిపెట్టిన వండర్ మిషన్‌తో దేశం మొత్తం సంచలనం సృష్టిస్తాను. ఇంతవకూ వండర్ మిషన్ అంటే ఏమిటో తెలుసా? ఎక్కడో దూరాన జరిగే

సంఘటనల్ని యధాతథంగా ఫోటో తీసి మన కంప్యూటర్‌కి పంపే సాధనం పేరే విజన్‌నెట్. దానినే నేను ముద్దుగా వండర్ మిషన్‌గా పిలుచుకుంటున్నాను.

ఆ వండర్ మిషన్‌ని మంచి ఉద్దేశాలకు వాడవచ్చు. చెడు ఉద్దేశాలకు వాడవచ్చు. డైనమైట్‌ని ఎలా మానవ విధ్వంసానికి వాడవచ్చో, అలాగే మానవ సౌభాగ్యానికీ వాడవచ్చు. ముందుగా నా అక్కని మానభంగం చేసిన మినిస్టర్‌ని నీ సైనిక పటారంతో పట్టుకో లేదా దేశంలో ఒక్కో రంగాన్ని నాశనం చేసుకుంటూ వస్తాను.

అప్పుడు నీ పదవి, రాజకీయాలు, పరువు, ప్రఖ్యాతులు మొత్తం గోవిందా!

ఆ రోజు రాత్రి... మీ తండ్రిగారి పార్టీకి చాలామంది రాజకీయవేత్తలు, మంత్రులు వచ్చారు. అందులో ఒక మంత్రి వెళుతూ, వెళుతూ గెస్ట్‌హౌస్‌లో ఉన్న అక్కని చూసి ఘోరాతిఘోరంగా రేప్ చేశారు. ఆ మంత్రి ఎవరో నీ సిబిఐ, రా, మిలటరీ ఇంటిలిజెన్స్‌తో కనిపెట్టి ఉరికంబం ఎక్కించు. లేదా దేశం మొత్తం సంచలనం సృష్టిస్తాను. మీరు, మీ ప్రభుత్వం, సైన్యం ఎంత మంది వచ్చినా నన్ను పట్టుకోలేరు. ఇది ఓ రాచరిక వ్యవస్థకు...ఓ సామాన్యుడికి మధ్య జరుగుతున్న ఛాలెంజ్.

నీ తండ్రి బండారం బయటపెట్టినట్లే దేశంలో ఒక్కో రంగాన్ని నా వండర్ మిషన్ ద్వారా బయటపెడతాను. బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, విమాన, సైనిక రంగాలను నరుక్కుంటూ వస్తాను. అలా అన్ని రంగాలను నాశనం చేస్తాను.

నీకు పదవి ఉంది. అధికారం ఉంది. మందీ మార్బలం ఉన్నాయి. సైన్యం ఉన్నాయి. దేశంలో గూఢచారి శాఖలైన సిబిఐ, రా, మిలటరీ, ఐబి, పోలీస్ లాంటి వన్నీ నీ చేతిలో ఉన్నాయి. అలాంటి అపరిమితమైన అధికారాలు బలం కలిగి ఉన్న నీవు నా అక్కని రేప్ చేసిన వాడిని తేలికగా పట్టివ్వగలవని అనుకుంటున్నాను.

వీడు సామాన్యుడు, ఒక సగటు వ్యక్తి అని నన్ను తక్కువ అంచనా వేయకు. ఆ సగటు వ్యక్తే నేడు సైంటిస్ట్ అయి వండర్‌మిషన్‌ని కనిపెట్టాడు. దానిని ప్రపంచానికి అంకితం చేస్తే నోబుల్ ప్రైజ్ వస్తుంది. దానికి పేటెంట్ తీసుకుంటే కొన్ని వందల కోట్లు ధారపోయడానికి అంతర్జాతీయ వేదికలు సిద్ధంగా ఉన్నాయి. అయినా నేను దానిని అమ్మను. ఎందుకో తెలుసా? నాకు నీలా కీర్తికండూతి అవసరం లేదు. పదవి, అధికారం, అవసరం లేదు. డబ్బు అసలే వద్దు. కేవలం నా ప్రాణాతిప్రాణమైన అక్కని నాశనం చేసినవాడు చిత్రహింసలు అనుభవించేలా చేయాలి. అదే నాకున్న ఏకైక ధ్యేయం.

నేను చాలా పేదవాడినని, స్కాలర్‌షిప్‌తో చదివి పైకి వచ్చినవాడినని నీ తండ్రి నన్ను చిన్నచూపు చూశాడు. చూడడమే కాక నీవు నన్ను ప్రేమించిన నేరానికి నా జీవితాన్ని నాశనం చేశాడు. నా ఒక్కగానొక్క అక్కని నాకు కాకుండా చేశాడు.

ఈ ప్రపంచంలో ఎంత అన్యాయం జరిగినా సహిస్తాను. కాని పుట్టుకతోనే కళ్ళు లేని అక్కని అమానుషంగా రేప్ చేశారో.. అదే నా కళ్ళకు రక్తాన్ని తెప్పించింది. అందుకే నా ప్రియురాలు తండ్రి అని కూడా చూడకుండా ఆయనని సర్వనాశనం చేశాను. నాకంటే వయసులో ఎంతో పెద్దవాడయిన నీ తండ్రి చేసిన దురాగతానికి నేను విధించిన శిక్ష చాలా చిన్నది. ఇంకొకరయితే బ్రతికినన్నాళ్ళూ రోజూ చిత్రహింసలు పెడుతూ శాడిస్టిక్ ఆట ఆటుకునేవాడు.

అయినా నీ తండ్రిని నేను వేలు కూడా ముట్టుకోలేదు. తాను చేసిన పాపాలను నా వండర్ మిషన్ ద్వారా పదిమందికి చూపించాను. తాను చేసిన ఘోరాలు, అకృత్యాలు పామై మెడకు చుట్టుకోగా ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు.

సమీరా! నీ కోసం నా జీవితం మొత్తం నాశనమైంది. అసలు నేనెప్పుడైనా నిన్ను ప్రేమించానని చెప్పానా? నీవే నా వెంటపడి వలచావు. వలపించుకున్నావు.

ఆఖరికి నీ తండ్రిని ఒప్పిస్తానని నువ్వు స్టేట్స్ వెళ్ళిపోయావు. నీవు నన్ను ప్రేమించిన నేరం ఖరీదెంతో తెలుసా? నా భవిష్యత్ మొత్తం అంధకారం. నా పిహెచ్.డి. డిగ్రీ పోయింది. నేను కనిపెట్టిన కాన్సర్ వాక్సిన్ ఫార్ములాని మీ తండ్రి తస్కరించాడు. ఆఖరికి నా ప్రియాతిప్రియమైన అక్క దారుణంగా రేప్ చెయ్యబడింది.

అందుకే... అందుకే నా పగను తీర్చుకోవడానికి మీ తండ్రి పరువు, ప్రతిష్ఠలను మంటగలిపాల్సి వచ్చింది. అంతటితో నా పగ తీరిపోయిందనుకుంటే నీవు పొరబడినట్లే!

ఆ రోజు నీ తండ్రి గారి పార్టీకి నలుగురు మంత్రులు హాజరయ్యాడు. అందులో ఒకడు నా అక్కని శాడిస్టిక్‌గా రేప్ చేసి నరకయాతనకు గురిచేసి చంపి ఉంటాడు. కొనవూపిరిలో ఉన్న అక్కకు నేను మాట ఇచ్చాను. అతడిని ఎలాగైనా చంపేస్తానని.

అందుకే నీకు నేను సవాల్ చేస్తున్నాను నీవు ప్రధానివి. నీకు మందీమార్బలం ఉన్నాయి. వాటి సహాయంలో ఆ రోజు నా అక్కని రేప్ చేసిన వారిని గుర్తించి నాకు పట్టించు. అతడిని నేను చిత్రహింసలు పెట్టి చంపాలి. అదే నా కోరిక.

అందుకు చట్టం, న్యాయం, ధర్మదేవతలాంటి కోర్టులున్నాయి కదాని నాకు పిచ్చి కబుర్లు చెప్పవద్దు. కోర్టుకు వెళ్ళిన కేసుల్లో ఎంతోమంది ముద్దాయిలు ఎలా తప్పించుకుపోతున్నారో నాకు తెలుసు. విచారణ పేరిట సంవత్సరాలు గడుస్తాయి. బెయిల్ మీద ముద్దాయి బయటకు వస్తాడు. ఇక శిక్ష అనుభవించేది ఎప్పుడు? పోనీ పొరబాటున శిక్ష వేశారనుకో! అది మరణశిక్ష మాత్రం ఉండదు. ఏ యావజ్జీవ కారాగాశిక్ష ఉంటుంది. అందుకే నేను ఈ కోర్టులు, పోలీసులను విశ్వసించను. నా అక్కని రేప్ చేసిన వాడిని ఈ చేతుల్తో పట్టి చిత్రహింసలు పెట్టాలి. అదే నా ఆఖరి కోరిక.

ఈ కోరికను సిద్ధించే ప్రయత్నం నీ మీద పెడుతున్నాను. నీ మంత్రిమండలిలో ఉన్న ఆ నలుగురిలో అసలు దొంగ ఎవరో కనిపెట్టి నాకు అప్పగించు లేదా దేశాన్ని అధోగతికి చేరుస్తాను. ఒక్కో రంగాన్ని నిర్వీర్యం చేస్తాను. నేను కనిపెట్టిన ఫార్ములాలోని కాంతి కిరణాలు ఒక్కో రంగాన్ని పని చేయకుండా నిర్వీర్యం చేస్తాయి. ముందుగా ఓ శాంపిల్ చూపిస్తాను.

అందుకు శాంపిల్‌గా మీ ఢిల్లీ నగరాన్నే ఎన్నుకుంటున్నాను. ఢిల్లీ నగరంలో రెండు రోజులు మొత్తం విద్యుచ్ఛక్తిని నిలిపేస్తున్నారు. ఈ నెల 18 మరియు 19వ తేది ఢిల్లీకి చీకటిరోజులు. ఆ రెండు రోజులూ ఎలాంటి కరెంటూ ఉండదు. ఏసీలు పనిచేయవు. ఫ్యాక్టరీలు పనిచేయవు. విమానాలు ఎగరవు.

నేను కనిపెట్టిన వండర్‌మిషన్ గోడల్ని చీల్చుకుంటూ, గాలిని తోసుకుంటూ అక్కడ దృశ్యాలను ఫోటో తీయడమే కాదు, అక్కడ విద్యుచ్ఛక్తి సప్లయి చేసే ఎలక్ట్రిక్ గ్రిడ్‌లను పనిచేయకుండా ఓ రకమైన కాంతి పుంజాన్ని వెదజల్లుతుంది. దాని ప్రభావం కొన్ని గంటలు ఉంటుంది. తిరిగి మళ్ళీ నేను ఆ కాంతిపుంజాన్ని వెనక్కి తీసుకునేదాకా దాని ప్రభావం అలాగే ఉంటుంది.

ఇది కేవలం చిన్న శాంపిల్ మాత్రమే. నా వండర్‌మిషన్ పనితనాన్ని పరీక్షించడం కోసమే సుమా! అంతే కాదు భారత్‌లోని ఓ ప్రధానిగా నీవు ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోంటావో ఓ పరీక్ష సుమా! ఈ సామాన్యుడు నన్ను ఏం చేస్తాడులే అన్న నీ అహంకారాన్ని పటాపంచలు చేయడానికే సుమా! ప్రతిపక్షాల్ని, అసమ్మతిని నేను సమర్ధవంతంగా ఎదుర్కోగలనన్న నీ నమ్మకాన్ని పరీక్ష చేయడానికే సుమా! అంతేకాదు, నా అక్క జీవితాన్ని నాశనం చేసిన మినిస్టర్‌ని నాకు అప్పజెప్పకపోతే భవిష్యత్‌లో

జరిగే పరిణామాలకు నేను బాధ్యుడిని కాను సుమా! ఆ మినిస్టర్‌ని నాకు అప్పజెప్పకపోతే ఏం జరుగుతుందో తెలుసా? దేశం మొత్తం అంధకారం చేస్తాయి సుమా! సైన్స్ ధాటికి ఏదైనా సాధ్యమే అని నీకు తెలియజేయడం కోసమే ప్రస్తుతానికి ఈ ఢిల్లీ ప్రయోగాన్ని నేను ఎన్నుకున్నాను.

ఇది ఓ ప్రధాని – సామాన్యుడి మధ్య జరిగే పోరాటం మాత్రమే సుమా! ఓ ఇద్దరు ప్రేమికులు ఒకరినొకరు పోటీపడే యుద్ధ వేదిక కూడా సుమా! ఇన్నాళ్ళూ వంటరిగా... అంతులేని వేదనలో... కసిలో... ఆగ్రహంతో ఈ ప్రపంచాన్నే భస్మీపటలం చేయాలన్న తలంపుతో వెలువడిన నా ఫార్ములా పనితీరు ఈ నెల 18వ తేదీన తెలుస్తుంది. ఒక మహానగరంలో విద్యుచ్ఛక్తిని నిలిపేసే నన్ను ప్రజాద్రోహిగా భావిస్తారు. అయినా నేనేం పట్టించుకోను. నా పగ, ప్రతీకారమే నాకు ముఖ్యం.

దట్సాల్ ప్రైమ్ మినిస్టర్! నా ప్రతీకారానికి వెలువడిన ఈ ఫార్ములా బారి నుండి న్యూఢిల్లీ నగరాన్ని ఎలా ఎదుర్కొంటారో తెలుసుకోవాలని నాకూ సరదాగా ఉంది. ఓ గొప్ప ప్రధానిగా పేరు తెచ్చుకుంటున్న నీకు నా సవాల్ ఇది. దీనిని ఎలా ఎదుర్కోంటావో నేను సైతం చూసి తరిస్తాను.

ఈ ప్రపంచం కసితో కొట్టిన బాధలో నుండి వెలువడిన ఫార్ములా ఇది.

ఇట్లు

*నీ మాజీ ప్రేమికుడు*

**ఆర్యచంద్ర**

సమీరలో షాక్!

'వండర్ మిషన్'

ప్రధాని సమీర భృకుటి ముడివడింది. అసలది సాధ్యమేనా? లేక తన దృష్టిని మీదకు మళ్లించేందుకు ఆర్య చంద్ర ఆడిన నాటకమా? ఆ ఫార్ములా సమయంతో ఎక్కడ దృశ్యమైన తాను చూడగలననుకుంటున్నాడు. అది సాధ్యమేనా?

ఏది ఏమైనా అతడు నెంబర్‌వన్ జీనియస్! అతడిని తక్కువగా అంచనా వేయడానికి వీలు లేదు. ముందుగా విజన్‌నెట్ అంటే ఏమిటి? అవి ఎలా పనిచేస్తాయో కనుక్కోవాలి. తర్వాత మిగతా విషయాలు ఆలోచించవచ్చు.

తనలో కదుల్తున్న ఆలోచనకు ఫుల్‌స్టాప్ పెడుతూ ఆమె ఇంటర్‌కమ్ చేతిలో తీసుకుంది. అవతల పర్సనల్ సెక్రటరీ ముకుందం ఫోన్ ఎత్తాడు.

"మిస్టర్ ముకుందం!" ఫిజిక్స్‌లో, టెక్నాలజీలో రెండింటిలో పేరుబడ్డ సైంటిస్ట్‌లు ఎవరైనా న్యూఢిల్లీ సైంటిఫిక్ రీసెర్చి లాబ్‌లో ఉంటే వారిని నన్ను వెంటనే కాంటాక్ట్ చేసేటట్లుగా చూడండి"

"అలాగే మేడమ్"

మరుక్షణం ఫోన్ క్లిక్‌మంది.

◆ ◆ ◆

మరో గంట తర్వాత –

ఆ గదిలో అడుగుపెట్టారు ప్రొఫెసర్ సతీష్‌చంద్ర, రాజాజీలు.

"వెల్‌కమ్.... కమ్ ఇన్‌సైడ్" వారిని చూస్తూనే కదిలింది ప్రధాని కంటం.

ప్రొఫెసర్ సతీష్‌చంద్ర ఫిజిక్స్‌లోనే డాక్టరేట్ కాగా, ప్రొఫెసర్ రాజాజీ టెక్నాలజీలో ఉద్దండుడు.

ఇద్దరూ కలిసి ఆమె ఎదురుగా కూర్చున్నారు.

అప్పుడు కదిలింది ప్రధాని సమీర కంఠం.

"అసలు విజన్‌నెట్ – ఐ మీన్ కాంతిపుంజాలను మనకు కావాల్సిన ప్రదేశానికి తీసుకెళ్ళి ప్రసరింపజేసి, తిరిగి ఆ దృశ్యాలను మన కంప్యూటర్‌లోకి తీసుకురాగలిగే సామర్థ్యం గల అద్భుతం సాధ్యమా?"

"సాధ్యమే! ఈ శతాబ్దంలోనే అద్భుత ఆవిష్కరణ కూడా" ప్రొఫెసర్ సతీష్‌చంద్ర కంఠం కదిలింది.

"ఈజిట్?" సమీర కనుబొమ్మల పైకి లేచాయి.

"అవును! ఐన్‌స్టీన్ కనిపెట్టిన సిద్ధాంతాన్ని విస్తరించి ఒక విచిత్రమైన కాంతి పుంజం మనకు కావాల్సిన రూపంలో ఒక నిర్దేశిత ప్రాంతానికి పంపిస్తాం. ఆ కాంతిపుంజం ఎలాంటి అడ్డుగోడనైనా అధిగమించుకుంటూ వెళ్ళి అక్కడ సంఘటనల్ని ఫోటో తీస్తుంది. జస్ట్ లైక్ రిమోట్‌లాగా అక్కడ సంఘటనలను కాపీ చేసి మనకు పంపిస్తుంది. నిజానికీ దీనిని భవిష్యత్‌లో ఏ సైంటిస్ట్ అయినా అభివృద్ధి చేయవచ్చు".

"మైగాడ్" దేనికీ చలించని ఆమెలో షాక్. అయితే ఆర్యచంద్ర చెప్పింది నిజమేనన్నమాట.

"నిజానికీ భవిష్యత్‌లో అభివృద్ధి అయ్యే నానోటెక్నాలజీ మరో రూపం ఇదే" కదిలింది టెక్నాలజీ ప్రొఫెసర్ రాజాజీ కంఠం. "ఇది ఇంటర్‌నెట్ కంటే కొన్ని లక్షల రెట్లు శక్తివంతమైనది. ఇంటర్‌నెట్‌లో కేవలం సమాచారాన్ని చూడగలం, ఈ మెయిళ్ళను పంపగలం. ఛాటింగ్ చేయగలం. ఆఖరికి అవతల వారి మొఖాలను చూడగలం. అంతకుమించి ముందుకుపోలేం. కాని ఈ విజన్‌నెట్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి..."

ఒక క్షణం ఆగి కదిలిందతడి కంఠం.

"నేరస్తులు ఎక్కడున్నారో తెలుసుకోవచ్చు. టెర్రరిస్టుల ఆచూకీ పట్టుకోవచ్చు. బంగారం, పెట్రోలు, సిల్వర్, ప్లాటినం భూమిలోపల ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఇన్‌కంటాక్స్ కళ్ళు కప్పి దాచిన నల్లడబ్బు ఆచూకీ బయటపెట్టవచ్చు. బ్యాంకు లాకర్లలో దాచిన ఆభరణాలు, నల్లడబ్బు వివరాలు వెలికి తీయవచ్చు. అంతేనా సముద్రం లోపల, భూమ్మీద రాబోయే భూకంపాలు, సునామీలను పసిగట్టవచ్చు. అంతెందుకు, ఫలానా దేశం అణుబాంబులు ఎన్ని తయారుచేసిందో, రసాయన బాంబులు ఎక్కడ దాచిందో తెలుసుకోవచ్చు.."

సమీర నివ్వెరపోయి వింటోంది. తాను చదివింది మేనేజ్‌మెంట్ కాని ఈ సైన్స్ గురించి తనకు ఏమాత్రం తెలియదు. సైన్స్‌తో ఇన్ని అద్భుతాలు చేయవచ్చని ఇప్పుడు అర్థమవుతోంది. అంటే ఆర్యచంద్ర చాలా జీనియస్. ఆ సైన్స్ ద్వారా అద్భుత మెషిన్‌ని కనిపెట్టి తనని, దేశాన్ని గుప్పిట్లో పెట్టుకోబోతున్నాడన్న మాట. ఆ సైన్స్ సహాయంతో తన అక్కని చెరిచిన వారిని కనిపెట్టి పగ తీర్చుకోవాలనుకుంటున్నాడు.

"అయితే?" ఆమె ఆలోచనల్ని సర్రున కట్ చేస్తూ కదిలింది రాజాజీ కంఠం "ఈ వండర్ మిషన్ అవతల వేపు చూస్తే ఎన్నో నష్టాలు ఉన్నాయి. ఆడా మగా మైథునాన్ని అందులో చూడవచ్చు. మనిషి జీవితానికి ప్రైవేసీ అనేది ఉండదు. ప్రతిదీ ఎవరో చూస్తున్నారన్న అభద్రతా భావం మనిషిని వెంటాడుతుంది. ఇది సంఘవిద్రోహులకు చేతిలో పడితే సర్వనాశనం. పరీక్ష పేపర్లు లీక్ అవుతావు. ఎటీయం పాస్‌వర్డ్‌లు తెలిసిపోతాయి. ఆడవారి అంగంగాలు ఫోటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తారు. ప్రభుత్వం తీసుకునే రహస్య నిర్ణయాలు ముందే తెలిసిపోతాయి. ఇంకా ఎన్నో దుష్ఫలితాలు జరుగుతాయి.

ఇప్పటికే సిసి కెమెరాల వల్ల తమ ప్రైవసీ దెబ్బతిందని ఉద్యోగులు నెత్తీ నోరూ బాదుకుంటున్నారు. అలాంటి ఈ వండర్ మిషన్ మనిషి అంగుళం అంగుళం శోధిస్తుంది. దాంతో మనిషి స్వేచ్ఛను కోల్పోయి దుర్బలుడవుతాడు.”

దిగ్భ్రాంతిగా వింటోంది సమీర. అసలు ప్రమాదం ఇప్పుడే వచ్చిందని అర్థమైంది ఆమెకు.

“టైమ్ మిషన్‌కు, దీనికి గల తేడా ఏమిటి?”

“టైమ్ మిషన్–భూత, వర్తమాన, భవిష్యత్ కాలంలో జరిగే సంఘటనలను మనకు చూపే యంత్రం. అది కల్పితమైన మిషన్. అది కథల్లోనే సాధ్యం. వాస్తవ జీవితంలో అది సాధ్యం కాదు. వండర్ మిషన్ సైన్స్ ఆధారంతో రూపుదిద్దుకున్న టెకాల్నజీ వండర్.”

క్షణాలు కదుల్తున్నాయ్ ఆ దిగ్భ్రాంతిలోనే.

అప్పుడు గుర్తొచ్చింది ఆమెకు ఆర్య రాజధాని నగరమైనా ఢిల్లీలో కరెంట్‌ని ఆపుతానని శపథం చేసిన విషయం.

మరుక్షణం ఆమె కంఠం కదిలింది ఆందోళనగా.

“ఈ వండర్ మిషన్ ద్వారా ఎలక్ట్రిసిటీని కొన్నాళ్ళపాటు పాస్‌కాకుండా ఆపేయ్యవచ్చా?”

“చక్కగా ఆపేయ్యవచ్చు” సర్రున కదిలింది సతీష్‌చంద్ర కంఠం”. అతడు అభివృద్ధి చేసిన కాంతిపుంజానికి విద్యుచ్ఛక్తి గ్రిడ్‌లో శక్తిని కాకతాళీయంగా ఆపేశక్తి ఉంటుంది. అందువల్ల విద్యుచ్ఛక్తి సరఫరా ఆగే శక్తి ఉంటుంది. తిరిగి ఆ కాంతిపుంజాన్ని అక్కడ నుండి దూరంగా తరలిస్తే విద్యుచ్ఛక్తి మామూలుగా సరఫరా అవుతుంది.”

“మరి ఆ కాంతి పుంజం విద్యుచ్ఛక్తిని ఆపకుండా చేసే ప్రక్రియ ఏదీ లేదా?”

“ప్రస్తుతానికి లేదు” నవ్వాడు నవీన్‌చంద్ర. “భవిష్యత్తులో ఎవరైనా ఫిజిక్స్ సైంటిస్ట్ ఏదైనా కనిపెడితే తప్ప”.

“కాని... విజన్‌నెట్ అనేది చాలామంది మూఢనమ్మకంగా భావిస్తున్నారు.”

మెరుపువేగంతో కదిలింది రాజాజీ కంఠం.

“ఒకరి నమ్మకం ఇంకొకరికి మూఢనమ్మకంగా అన్పించవచ్చు. ఎడిసిన్ బల్బు

కనిపెడుతున్నప్పుడు అంతా మూఢనమ్మకంగా కొట్టేశారు. అలాగే ఇరవై సంవత్సరాల క్రితం సెల్‌ఫోన్ ద్వారా మాట్లాడుకోవడం లేదా మెసెజీలు పంపుకోవచ్చు అనేది మూఢనమ్మకంగా చెలామణీ అయ్యేది. ఇప్పుడది నిజం అయింది. అలాగే ఇంటర్‌నెట్ నిజమైనప్పుడు విజన్‌నెట్ కూడా నిజం అవుతుంది. సైంటిస్ట్స్ ఆర్ క్రేజీ! వారు తలుచుకుంటే ఏదైనా సాధ్యమే".

ఆమె అచేతనురాలై కూర్చుండిపోయింది అక్కడ. ఇక తామిద్దరూ అక్కడా వుండి చేసేదేం లేక ప్రధానితో కరచాలనం చేసి వెళ్ళిపోయారు నవీన్‌చంద్ర, రాజాజీలు.

స్తబ్దుగా కూర్చుండిపోయింది సమీర. శుక్రవారం అంటే ఇంకా రెండు రోజులే ఉంది. ఈ రెండు రోజుల్లో తాను ఆ రేప్ చేసిన మినిస్టర్‌ని కనిపెట్టగలదా? ఇంపాజిబుల్! అలాంటప్పుడు ఆర్యచంద్ర నిజంగానే న్యూఢిల్లీలో విద్యుచ్ఛక్తిని ఆపేస్తాడా? కాలమే జవాబు చెప్పాలి దానికి.

ఆమె చేయి కదిలి ఇంటర్‌కమ్ నొక్కింది. పిఎస్ ఫోన్ ఎత్తాడు.

"మరో గంట తర్వాత అత్యవసర సమావేశం ఉందని దానికి అటెండ్ కావాలని సిబిఐ, రా, ఐబి డైరెక్టర్లకు ఫోన్ చేయండి."

"అలాగే మేడమ్"

◆ ◆ ◆

ఆ హాల్లో నిశ్శబ్దం ఘనీభవించిన మంచులా ఉంది. సిబిఐ, రా, ఐబీ డైరెక్టర్లు ఆమెకేసే చూస్తున్నారు ఉద్వేగంగా. ఆ నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ కదిలిందామె కంఠం.

"డియర్ డైరెక్టర్స్! మీరంతా నా నమ్మిన భటులు. ఇప్పుడు దేశానికి ఒక సమస్య ముంచుకు వచ్చింది. ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో తెలుసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశాను" అంటూ ఆర్యచంద్ర అక్కను ఆ రోజు గెస్ట్ హౌస్‌లో రేప్ జరిగిన విషయం వివరించింది.

"తన అక్కను రేప్ చేసిన వాడు ఆ నలుగురు మినిస్టర్లలో ఉన్నారని ఆర్య అభిప్రాయం. ఆ నలుగురిలో అసలు వ్యక్తిని పట్టి ఇవ్వాలని, లేని పక్షంలో దేశంలోని ఒకో వ్యవస్థని నాశనం చేస్తానని అతడు హెచ్చరించాడు. అందుకు శాంపిల్‌గా ఢిల్లీ నగరంలో ఎల్లుండు కరెంట్ సరఫరా కాకుండా నిలిపేస్తున్నానని అతడు హెచ్చరించాడు."

"అతడు చెప్పగానే నిజంగానే కరెంట్ ఆగిపోతుందా?" వ్యంగ్యం ఐబి డైరెక్టర్‌లో.

"అతడు సైంటిస్ట్! అతడు ఒక మిషన్ కనిపెట్టాడు. ఆ మిషన్ మామూలు మెషిన్ కాదు. ఒక ప్రత్యేక కాంతి పుంజం పవర్‌గ్రిడ్ మీద పడి విద్యుచ్ఛక్తిని సరఫరా కాకుండా ఆపేస్తుందని సైంటిఫిక్‌గా ప్రూవ్ అయింది".

"సో..... ఎల్లుండి న్యూఢిల్లీ అంధకారంలో ఉండడం ఖచ్చితంగా నిజమేనన్న మాట". కదిలింది సిబిఐ చీఫ్ కంఠం.

"నూటికి తొంభై శాతం నిజం!"

"ఈ లోగా అతడిని పట్టుకుంటే?" కదిలింది సిబిఐ చీఫ్ కంఠం.

"అతడు దొరకడు. అడ్రస్ కూడా లేదు. ఏ కంప్యూటర్ నుండి ఆపరేట్ చేస్తాడో తెలియదు. పైగా మనకున్న తక్కువ సమయంలో అతడిని దొరకబుచ్చుకోవడం కష్టం".

"నిజమే. సమయం రెండు రోజులే ఉంది" ఒప్పుకున్నాడు రా చీఫ్.

"అతడి సంగతి అలా ఉంచుదాం. ముందు ఎల్లుండి జరగబోయే విపత్తుని ఎదుర్కోవడం ఎలాగో ఆలోచించండి"

"ఇందులో ఆలోచించేదేమీ లేదు. జరగబోయే విపత్తును ఎదుర్కోవడమే".

"మరి దీని గురించి ప్రజలకేం చెబుతాం?"

"ఏముంది సింపుల్! ఉత్తరం గ్రిడ్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది కాబట్టి ఒకటి రెండు రోజుల పాటు పవర్ ఉండదని చెబుదాం".

"కాని తర్వాత నిజం తెలిస్తే?"

"తర్వాత సంగతి తర్వాత చూద్దాం. ముందు రాబోయే విపత్తు గురించి ఇలాగే చెబుదాం"

"సరే అలాగే చేయండి ప్రధాని కంఠం కదిలింది. ఈ సమస్యని ప్రస్తుతానికి ఎలాగో అధిగమిస్తాం. కాని ఈ సమస్యని శాశ్వతంగా పరిష్కరించాలి."

"అవును" కోరస్‌గా కదిలాయ్ ఐబి, సిబిఐ డైరెక్టర్ల కంఠాలు.

"ఈ సమస్యకు రెండు పరిష్కారాలున్నాయి. ఒకటి – ఆర్యచంద్రని పట్టుకొని భవిష్యత్‌లో ఇలాంటి వాటిని పాల్పడకుండా ఆపడం, రెండు – ఆ నలుగురు మినిస్టర్లలో అసలు దోషి ఎవరో పట్టుకొని శిక్షించడం"

నిజమేనన్నట్లుగా తలలూపారు మిగతావారు.

తిరిగి కదిలింది ప్రధాని కంఠం.

"సో... ఆర్యచంద్రని పట్టుకోవడానికి 'రా' డైరెక్టర్ దేశ్‌పాండేని అప్పాయింట్ చేస్తున్నాను. అలాగే నలుగురు మినిస్టర్లలో అసలు దోషిని పట్టుకొనే బాధ్యతను సిబిఐ డైరెక్టర్ అనంతరామన్‌కు అప్పజెపుతున్నాను."

"మీరు నాకిచ్చిన బాధ్యతని పూర్తిగా నిర్వర్తిస్తానని నేను మాట ఇస్తున్నాను" కదిలింది దేశపాండే కంఠం.

"నేను సైతం ఆర్యని పట్టుకోవడానికి ఇవాళ్టి నుండి పాటుపడతానని మాట ఇస్తున్నాను మేడమ్" అన్నాడు సిబిఐ డైరెక్టర్ అనంతరామన్.

"గుడ్! ఇక మీటింగ్ ముగిద్దాం పదండి" కదిలింది ప్రధాని కంఠం.

మరుక్షణం అంతా లేచారు వెళ్ళడానికి.

◆ ◆ ◆

మర్నాడు ఉదయం –

న్యూఢిల్లీ నగరంలో ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన అన్ని టీవీ ఛానళ్ళలో, న్యూస్ పేపర్లలో వెలువడింది.

*రేపు శుక్రవారం న్యూఢిల్లీలో ఎలక్ట్రిక్ సిటీ పూర్తిగా బంద్ అవుతుంది. ఉత్తర పవర్‌గ్రిడ్‌లో సంభవించిన టెక్నికల్ సమస్య వల్ల ఈ అంతరాయం సంభవించ బోతోంది. ఈ అంతరాయం ఒకరోజా, రెండు రోజులా అన్నది ఇప్పుడే తేల్చి చెప్పలేం. కాబట్టి ప్రజలంతా అప్రమత్తులై ఉండాల్సిందిగా కోరుతున్నాం.*

ఈ ప్రకటన వచ్చిన గంటలోనే జనాలలో కలకలం బయలుదేరింది. అంతా తమ తమ సెల్‌ఫోన్‌లకు, ఇన్వర్టర్లకు ఛార్జింగ్ చేయడం మొదలుపెట్టారు.

◆ ◆ ◆

# 10

న్యూఢిల్లీ!

సరిగ్గా శుక్రవారం ఉదయం –

ఆరు గంటలకే పవర్ పోయింది. ఇంకా తెల్లవారకపోవడం వల్ల న్యూఢిల్లీ నగరమంతా అంధకారం అలుముకుంది. నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్న ఫ్యాక్టరీ మెషిన్‌లు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. కొన్ని జనరేటర్లు మాత్రం పనిచేస్తున్నాయి.

షాపుల్లో బ్యాటరీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. జనాలంతా బారులు తీరి కొనుక్కుంటున్నారు. ఇదే సమయమని వాటికి రెట్టింపు రేట్లు పెంచేశారు.

మధ్యాహ్నమయింది. ఎండాకాలం వల్ల జనాలు చెమట్లు పడుతున్నారు. ఎసీలు పనిచేయడం లేదు.  చాలామంది కంప్యూటర్లు మూతపడ్డాయి. యూపీఎస్ బ్యాటరీ రెండు మూడు గంటల కంటే ఎక్కువ ఛార్జింగ్ ఇవ్వడం లేదు.

సాయంకాలమైంది. జనాలలో అసహనం మొదలైంది. కొంతమంది సెల్‌ఫోన్‌లలో బ్యాటరీ అయిపోయింది. దాంతో అసహనంగా చూస్తున్నారు. రేడియోలు, టీవీలు ఎప్పుడో బంద్ అయిపోయాయి.

రాత్రయింది. బయటగాలి లేదు. ఇంట్లో ఫ్యాన్‌లు, ఏసీలు లేవు. ఎక్కడో దూరంగా ఒకటారెండు ఇళ్ళల్లో ఇన్వర్టర్ల మీద లైట్లు వెలుగుతున్నాయి. అవి తప్ప మిగతాదంతా చీకటిగా ఉంది.

జనాలకు పిచ్చెక్కుతోంది. ఇంకా ఎంతకాలం ఈ శిక్ష అని వాపోతున్నారు. పవర్ సరిగ్గా సప్లయి చేయలేని ప్రభుత్వాన్ని బండబూతులు తిట్టుకుంటున్నారు. చాలామందికి ఫ్యానులు, ఏసీలు లేకపోవడం వల్ల ఆ రాత్రంతా నిద్రపట్టలేదు.

మర్నాడు సైతం కరెంట్ రాలేదు. ఛార్జింగ్ లేకపోవడంతో సెల్‌ఫోన్‌లు, ఇన్వర్టర్లు, జనరేటర్లు మూతబడ్డాయి. పరిస్థితి మరింత విషమించింది.

హాస్పిటళ్ళలో పేషెంట్ల పరిస్థితి మరీ దారుణం. చేయాల్సిన ముఖ్యమైన ఆపరేషన్లన్నీ ఆగిపోయాయి. ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి ఎప్పుడో ఆగిపోయాయి.

ఆ రోజు పాలు రాలేదు. పేపర్ రాలేదు. జనాలంతా పెట్రోలు బంకులు దగ్గర వాహనాలతో బారులు తీరారు. విద్యుచ్ఛక్తితో  నడిచే ఆ బంకులు సైతం

చేతులెత్తేశాయి. దాంతో ఎక్కడ వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. కేవలం అంతకుముందే ట్యాంకునిండా పెట్రోలు కొట్టించుకున్న వాహనాలు అక్కడక్కడ తిరుగుతున్నాయి.

వీటినన్నింటికంటే టీనేజ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పరిస్థితి వర్ణనాతీతం. మాట్లాడడానికి సెల్‌ఫోన్ పనిచేయడం లేదు. ఫేస్‌బుక్ తెరుద్దామంటే కంప్యూటర్ ఆన్ కాదు. సెల్, కంప్యూటర్, ఇంటర్నెట్ ఓ వ్యసనంలా వున్న యువతకు పిచ్చి పట్టినట్లయింది. ఇంట్లో కూర్చుందామంటే నరకం. బయటకు వెళ్ళినా నరకమే. వాహనాల్లో పెట్రోలు లేదు.

సాయంకాలానికి పరిస్థితి మరింత విషమించింది. అపార్ట్‌మెంట్‌లలో కరెంటు లేకపోవడంతో ట్యాంక్‌లో నీరు చేరలేదు. వాటర్ సప్లయి పూర్తిగా ఆగిపోయింది. ప్రజలకు నీళ్లు లేవు. కరెంట్ లేదు. ఫాను లేదు. సెల్ కంప్యూటర్లు లేవు. నరకం అంటే ఎక్కడో లేదు భూలోకంలోనే ఉంది అనిపించేట్లుగా తయారయ్యింది పరిస్థితి. ఆ రోజు జరగాల్సిన పరీక్షలన్నీ వాయిదాపడ్డాయి.

రెండు రోజుల నుండి కరెంట్ లేకపోవడంతో ప్రజలంతా ఊరేగింపుగా ప్రధాని, మేయర్ల ఆఫీసులకు బయలుదేరారు. ప్రతిపక్షాలు ధర్నాలు, ఊరేగింపులు చేశాయి. వారే కాదు, అధికార పక్షంలో కొందరు సభ్యులు సైతం ఊరేగింపులో పాల్గొన్నారు.

పరిస్థితినంతా గమనిస్తున్న ప్రధానిలో దిగ్భ్రాంతి. ఆర్య నిజంగానే అన్నంత పనిచేశాడు. సిటీ మొత్తాన్ని స్తంభింపచేశాడు. ఫ్యాక్టరీలు మూయించేశాడు. ఆఖరికి పెట్రోలు లేకపోవడం వల్ల కూరగాయలు సప్లయి చేసే వ్యక్తులు రాలేదు. దాంతో ప్రజలకు పాలు, బియ్యం, కూరగాయలు లేవు. క్యాండీళ్ళు, కిరోసిన్‌లు ఎప్పుడో అయిపోయాయి. ఆఖరికి ఇంట్లో ఉండడానికి గాలి లేదు. చిమ్మచీకటి.

ఇదే సమయంలో సంఘవిద్రోహక శక్తులు చెలరేగిపోయాయి. ఢిల్లీ నగరం పూర్తి అంధకారంలో ఉండడం వల్ల దొరికినది దొరికినట్లుగా దోచుకుపోయారు. పోలీస్ చేష్టలుడిగి చూస్తూండిపోయింది.

దాంతో మేయర్ కొన్నిచోట్ల కర్ఫ్యూని విధించారు. ఇంకొన్ని చోట్ల 144 సెక్షన్ విధించారు. పోలీసులను అలర్ట్ చేశారు.

ఇంకొక్క రోజు గడిస్తే న్యూఢిల్లీ నగరం అతలాకుతలం అయ్యేదే. చరిత్రలో మాయనిమచ్చగా మిగులుతుంది.

ఆమె గుండెల్లో రాయిపడింది. రేపు, ఎల్లుండు కూడా కరెంట్ రాకపోతే ఢిల్లీ ప్రజలంతా పిచ్చాసుపత్రిలో పడతారు. అదెలా ఉన్నా అసమర్ధ ప్రభుత్వం ఏం చేస్తుంది అని ప్రతివారూ దుమ్మెత్తిపోస్తారు. దుమ్మెత్తడం తర్వాత హాస్పిటల్‌లో వున్న వేలాది పేషంట్లు నిష్కారణంగా చనిపోతారు.

ఆమె మొదటిసారిగా దేవుడిని తలుచుకుంది. ప్రధాని పదవి ఎక్కగానే అదే మొదటిసారి దేవుడిని తలుచుకోవడం.

'స్వామీ! రేపు ఉదయం ఎలాగైనా కరెంట్ వచ్చేటట్లు చెయ్. లేకపోతే ప్రజలంతా అటవిక రాజ్యంలోకి అడుగుపెడతారు. ఒకరికొకరు చంపుకుంటారు. అలాంటి పరిస్థితి రాకూడదు. చరిత్రలో అత్యంత హీనమైన ప్రధానిగా నన్ను తలుచుకునే పరిస్థితి రాకూడదు!'

ఆమె మొర భగవంతుడు విన్నారో, లేదో ఆర్య తన పట్టుదలను ప్రస్తుతానికి సడలించాడో తెలియదు. మర్నాడు ఉదయాన్నే కరెంట్ వచ్చింది. జనజీవనం సాఫీగా కొనసాగింది. విమానాలు నడవసాగాయి. హాస్పిటల్‌లో పేషంట్ల ప్రాణాలు దక్కాయి. దాంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు.

*... జరిగిందంతా టీవీలో చూస్తున్న సమీరలో ఆలోచనలు. ఆర్యా! యూ ఆర్ గ్రేట్! అనుకున్నది చెప్పి మరీ సాధించావు. దేశంలో ఇంతమంది సైన్యం, పోలీస్, మినిస్టర్లు, సిబ్బంది ఉండీ కూడా ఏం చెయ్యలేకపోయారు. నీ ఒక్కడి దెబ్బకు ఆర్మీ, నేవి, ఎయిర్‌ఫోర్స్‌లు సైతం నిశ్చేష్టకు లోనయ్యాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మొత్తం పరిపాలనా వ్యవస్థ స్తంభించిపోయింది. ఒకే ఒక మనిషి లక్షల మందిని ప్రభావితం చేయడం చరిత్రలోనే మొదటిసారి. నీకు నా హాట్సాఫ్ ఆర్యా! ముందు ముందు ఇలాంటి ప్రయోగాలకు నీవు పాల్పడకముందే మినిస్టర్లలో అసలు ద్రోహిని నీకు పట్టించే ఏర్పాట్లు చేస్తాను. ఇవాళ్టి నుండి మా ప్రయత్నాలు ముమ్మరం చేస్తాను.*

◆ ◆ ◆

"మైగాడ్! అతడు అన్నంత పనిచేశాడు. కరెంట్‌ని రెండు రోజుల పాటు ఆపేశాడు" ఆశ్చర్యంగా కదిలింది సిబిఐ చీఫ్ అనంతరామన్ కంఠం.

"అవును! ప్రపంచ చరిత్రలో ఒక మనిషి ఇంతగా సంచలనం సృష్టించిన సంఘటన మరొకటి లేదు" కదిలింది ఐబి చీఫ్ కంఠం.

ప్రధాని, రా, సిబిఐ, ఐబి చీఫ్‌లు అర్జంట్‌గా సమావేశమయ్యారు. ప్రధాని

సమీర మొఖం లంకణాలు చేసినట్లుగా పాలిపోయి వుంది. ఆర్య ఏదో కోపంలో బెదిరిస్తున్నాడు కదాని తేలికగా తీసుకుంది. కాని తనెంత శక్తివంతుడో అతడు రుజువు చేశడు. ప్రపంచ చరిత్రలోనే అంతమంది ప్రజలను ఒంటిచేత్తో ఎంత అసౌకర్యానికి గురిచేయగలడో నిరూపించాడు. తాను తలుచుకుంటే మొత్తం ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి ఉండగలదని చేసి మరీ చూపించాడు.

ఆలోచనల నుండి బయటపడిన ప్రధాని ఎదురుగా ఉన్న వారికేసి చూసింది.

"ఇప్పుడేమిటి చెయ్యడం?" అందరిలో అదే ప్రశ్న కదలాడుతోంది.

"చేసేదేం లేదు" కదిలింది ఐబి చీఫ్ కంఠం "ఆర్యను పట్టుకోవడం అంత తేలిక కాదు. అసలే అతడు దెబ్బతిన్న బెబ్బులిలాంటివాడు. అనవసరంగా అతడి జోలికి వెళ్తే మొత్తం దేశాన్ని అంధకారంలో ఉంచేటట్లు చేయగలడు. అందువల్ల అతడిని వెంటాడే పనిని మానెయ్యడం ఉత్తమం".

అతడి వాదనలో వాస్తవం అందరి మెదడులోని స్పృశిస్తోంది.

"ఈ నేపథ్యంలో" కదిలింది సిబిఐ చీఫ్" ఒకే ఒక దారి కనిపిస్తోంది".

"ఏమిటది?" అడిగాడు 'రా' చీఫ్

"వీలైనంత తొందరగా ఆ మినిష్టర్ ఎవడో వెతికి పట్టుకోవడం. అందువల్ల ఆర్య తేజ మరిన్ని దురాగతాలకు పాల్పడకుండా ఆపవచ్చు."

"అయితే దర్యాప్తుని వెంటనే ప్రారంభిస్తే బాగుంటుంది కదా" కదిలింది ఐబి చీఫ్ కంఠం.

"నిజమే! కాని ఇది చాలా సున్నితమైన విషయం. ఆ రోజు ప్రొఫెసర్ ధన్‌రాజ్ ఇచ్చిన పార్టీకి వెళ్ళిన మినిస్టర్లు ఎంతమందో ఎంక్వయిరీ చేయాలి. ఆర్య చెప్పినట్లు ఆ నలుగురు మినిష్టర్లు గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ మంత్రుల్లాగే కొనసాగుతున్నారు" కదిలింది సిబిఐ చీఫ్ కంఠం.

అంతా ప్రధాని వేపే చూస్తున్నారు. వారికి తెలుసు ప్రొఫెసర్ ధన్‌రాజ్ ఆమె తండ్రేనని. ఆయనకు పుల్జిర్ ప్రయిజు వచ్చిన సందర్భంలో పార్టీ ఇచ్చాడని, ఆ పార్టీకి వచ్చిన నలుగురు మినిస్టర్లలోనే అసలైన నేరస్థుడు ఉన్నాడని, ఇదంతా బయట ప్రెస్‌కు తెలిస్తే చిలికి చిలికి గాలి వాన అవుతుందని వారికి తెలుసు. తెలుసు కాబట్టే ప్రధాని ఆదేశాల కోసం చూస్తున్నారు.

అప్పుడు కదిలిందామె కంఠం సిబిఐ చీఫ్ కేసి.

"దర్యాప్తుని రహస్యంగా చేయండి. దాని వల్ల ప్రజలకు అసలు విషయం తెలిసే అవసరం లేదు. ఆ నలుగురు మినిస్టర్లలో ఎవరు ఉమనైజరో, డ్రింకరో అన్నీ స్టడీ చేయండి. ఆ రోజు మెటల్ డిటెక్టర్ ద్వారా అడుగుపెట్టిన వారి లిస్ట్‌ని చూడండి. పార్టీ ఎన్ని గంటల దాకా జరిగిందో, పార్టీ తర్వాత ఆ రేప్ జరిగిందో, లేదా పార్టీ జరుగుతున్నప్పుడే ఆ రేప్ జరిగిందో రహస్యంగా దర్యాప్తు చేయండి".

"అలాగే మేడమ్" వినయం సిబిఐ చీఫ్ అనంతరామన్.

"మరో విషయం" కదిలిందామె కంఠం. "ఆ నలుగురు మినిస్టర్లకు ఏమాత్రం అనుమానం రాకూడదు. తమ మీద ఎంక్వయిరీ జరుగుతున్నదని తెలిసిన మరుక్షణం వారు జాగ్రత్తపడతారు. దాంతో నేరస్థుడిని పట్టుకునే అవకాశాలు తగ్గిపోతాయి".

"అలాగే యువర్ మెజస్టీ" వినయం అనంతరామన్‌లో.

"ఈ ఆపరేషన్‌కు మిమ్మల్ని ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నాను. రా, మిలటరీ, ఐబి డిపార్ట్‌మెంట్‌లు సైతం ఈ విషయంలో మీరు చెప్పే ఆదేశాలు పాటిస్తాయి".

"అలాగే యువర్ మెజస్టీ" మిగతా డిపార్ట్‌మెంట్‌ల చీఫ్‌లు సైతం అన్నారు.

"ఒక్క విషయం! ఈ దర్యాప్తు విషయం మినిస్టర్లకే కాదు, ప్రెస్‌కు, ప్రెసిడెంట్‌కు ఇతరులకు ఎవరికీ తెలియకూడదు. అత్యంత రహస్యంగా చాపక్రింద నీరులా కొనసాగాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మన నలుగురికి తప్ప ఐదో వాడికి ఈ విషయం తెలియకూడదు".

"తప్పకుండా మేడమ్"

"అదే సమయంలో దర్యాప్తు చాలా వేగంగా కూడా జరగాలి. ఎందుకంటే ఆర్య చాలా కోపంగా ఉన్నాడు. తన అక్కని రేప్ గురిచేసినవాడు మినిస్టర్‌గా సకల సౌఖర్యాలు అనుభవిస్తున్నాడని ఆగ్రహంగా ఉన్నాడు. ఇంకా లేట్ చేస్తే తన దగ్గరున్న ఆయుధంతో మళ్ళీ ఎవరి మీద విరుచుకుపడతాడో తెలియదు".

"కరెక్ట్ మేడమ్! కేవలం వారం రోజుల్లోనే అసలు దోషి పేరు మీకు తెలియజేస్తాను"

"గుడ్! యూకెన్ ప్రోసీడ్" కదిలింది ప్రధాని కంఠం.

అంతా లేచాడు వెళ్లడానికి. డోర్ దగ్గరకు వెళ్ళగానే వెనకనుండి ప్రధాని కంఠం కదిలింది.

"ఆల్ ది బెస్ట్ అనంతరామన్"

"థాంక్స్ మేడమ్" అని చెప్పి బయటున్న లిఫ్ట్‌లోకి నడిచాడు అనంతరామన్. అతడిని అనుసరించారు మిగతావారు.

వంటరిగా ఆ గదిలో మిగిలిపోయిందామె. మైగాడ్! ఆర్య ఇంటలిజెంట్ అని తెలుసుకాని ఇంతగా సంచలనం సృష్టిస్తాడని అసలు తెలియదు. తన అక్కని రేప్‌కి గురిచేసిన ఒకే ఒక వ్యక్తి కోసం న్యూఢిల్లీ నగరాన్ని అంధకారంలో ముంచాడు. రేపు ఆ పథకంలో అసలు వ్యక్తి బయటికి రాకపోతే ఏం జరుగుతుంది? మొత్తం భారతావనినే చీకటిమయం చేస్తాడు. దేశాన్ని రాతియుగంలోకి తీసుకెళ్తాడు. సైంటిస్ట్స్ ఆర్ క్రేజీ అని విన్నది కాని చరిత్రలో తన పగ కోసం క్షణకాలంలో దేశాన్నే అంధకారంలో ముంచగల ఘటన సమర్థుడని తాను అసలు అనుకోలేదు. చివరకు అతడి పగ దేశాన్ని చీకటిమయంగా చేస్తుందో, లేదో కాలమే నిర్ణయించాలి. ఓన్లీ టైమ్ నోస్!

సరిగ్గా అప్పుడు...

వంటరిగా మిగిలిపోయిన ఆమెలో కదిలిక తెప్పిస్తున్నట్లుగా మోగింది ఫోన్.

అన్‌లిస్టెడ్ ల్యాండ్‌లైన్ నెంబర్ అది. పర్సనల్ అసిస్టెంట్‌కు, పి.ఏ.కు చేయకుండా డైరెక్ట్‌గా ఆమె అందుకునే పర్సనల్ నెంబర్ అది. చాలా తక్కువమందికి తెలుసా నెంబర్.

ఆమె ఫోన్ ఎత్తింది.

"హలో..." ఆర్య కంఠంలో వంకర నవ్వు.

"హలో... నీవా?"

"అవును నేనే! ఒకప్పుడు నిన్ను ప్రేమించిన నేరానికి జీవితాన్ని బలి చేసుకున్న వ్యక్తిని."

"ఆర్యా!" మొదటిసారిగా ఆమె కంఠంలో అతడి పట్లా జాలి "పరిస్థితుల ప్రభావం వల్ల ఏదో జరిగింది. దానికి నా తండ్రిని బలి తీసుకున్నావు. ఒకే, కాని ఈ సామాన్య ప్రజలేం చేశారు? రెండు రోజులు పాటు కరెంట్ తీసేసి భూలోకంలో యమలోకం చూపించావు".

"మా అక్కని రేప్ చేసినప్పుడు ఈ సామాన్య ప్రజలు చలించారా? చేయని నేరానికి ఒక యువకుడు కుమిలికుమిలిపోతుంటే ఒక్కరైనా నా పట్లా సానుభూతి చూపించారా? అందుకే నాకు ఈ దేశమన్నా, ప్రజలన్నా సానుభూతి లేదు.

"మరి కరెంట్ ఎందుకు తెప్పించావు?"

"నీ కోసం" మెరుపువేగంతో కదిలిందతడి కంఠం. "ఇంకొక్క రెండు రోజులు కరెంట్ రాకపోతే ఈ సామాన్య ప్రజలు ఆవేశంతో ఏం చేస్తారో తెలుసా? మీ పార్టీ ఆఫీసుని కాల్చేస్తారు. ఇంకా ఆవేశం ఎక్కువైతే మిమ్మల్ని, ఎంపీలను కొట్టినా ఆశ్చర్యం లేదు".

"అంటే నా మీద నీకు ఇప్పటికీ ప్రేమ ఉందా?"

"ప్రేమా?" వ్యంగ్యం అతడి కంఠంలో "అదెప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడు నీ మీద ఉన్నది సానుభూతి. ఎంతలేదన్నా ఒకప్పుడు మనిద్దరం కలిసి తిరిగాం. పైగా ఉన్న తండ్రిపోయాడు. చాలాకాలానికి ప్రధాని పదవి వచ్చింది. వచ్చిన పదవిని నిలుపుకోవాలి. ఏదైనా తేడా వస్తే అదిగో ఆ ఆర్య నా బంగారంలాంటి అవకాశాన్ని పోగొట్టాడు అని విమర్శిస్తావు. ఇదంతా ఎందుకు, నా శక్తేమిటో నీకు తెలిసింది. అది చాలు. అందుకే తిరిగి కరెంట్‌ని పునరుద్ధరించాను..."

సమీర అప్రతిభురాలైంది. కేవలం తనను, తన పదవిని రక్షించడానికే అతడు కరెంట్‌ని పునరుద్ధరించాడు. అంతే కాని ప్రజల కోసం కాదు.

"అన్నట్లు నా పర్సనల్ నెంబర్ నీకు ఎలా తెలిసింది?"

"మనసుంటే మార్గం ఉంటుంది. ఇతరులకు కనిపించనివన్నీ నాకు కనిపిస్తాయి. అలాగే ఇతరులకు తెలియనివన్నీ నాకు తెలుస్తాయి..."

"అది సరే ఆర్యా! ఇంకెంతకాలం ఈ ఆజ్ఞాతవాసం? మా డాడీ మీద ఎలాగూ పగతీర్చుకున్నావు. ఇంకెంతకాలం ఇలా.."

"నా అక్కని రేప్ చేసిన దుర్మార్గుడిని మీరు నాకప్పగించేదాకా. నాలాంటి సాధారణ వ్యక్తికి అంత పెద్ద మినిష్టర్‌ని పట్టుకునే స్థాయి లేదు. అందుకే సైన్స్ ఆధారంగా మీలాంటివారి ద్వారా మినిస్టర్‌ని పట్టుకోవడానికి ప్లాన్ చేశాను. ఆ మినిస్టర్‌ని మీరు పట్టుకుంటే కుదరదు. వాడిని నాకు అప్పగించాలి. నేనే వాడిని చిత్రహింసలు పెట్టి చంపాలి. అప్పుడే నాకు శాంతి...."

"ఒకవేళ ఆ మినిస్టర్‌ని నీకు అప్పగించకపోతే?"

"మొత్తం వ్యవస్థనే స్తంభింపచేస్తాను. అదెలా చేస్తాను ఇప్పుడే చెప్పను. చేసి చూపిస్తాను."

"డోంట్ డూ దట్ ఆర్యా!" ఆమె కంఠంలో కొద్దిపాటి టెన్షన్" ఒక్క పదిరోజులు టైమ్ ఇవ్వు. ఈలోపు ఆ మినిస్టర్ ఎవరో పట్టుకొని మీకు అప్పజెపుతాను. అందుకోసం సిబిఐ, రా, ఐబి చీఫ్‌ల సహాయం తీసుకుంటున్నాను..."

"గుడ్! పదిరోజులకు ఒక్కరోజు కూడా ఆగను... సరిగ్గా పది రోజులలో ఆ మంత్రిని నాకు అప్పగించాలి. లేదా పదకొండవ రోజు మొత్తం భారతావనిని స్తంభింపచేస్తాను. దట్సాల్...."

మరుక్షణం ఫోన్ పెట్టేసినట్లుగా క్లిక్‌మన్న శబ్దం వచ్చింది. శరీరంలో సర్వశక్తులన్నీ హరించుకుపోయినట్లుగా అలాగే కూర్చుండిపోయింది.

◆ ◆ ◆

సమయం ఉదయం 9.55.

దేశంలో కొన్ని కోట్ల చేతులు ఆ సమయంలో డైనమిక్ వండర్‌మిషన్ వెబ్‌సైట్ అడ్రసుని టైప్ చేయసాగాయి.

ఇంకొక్క ఐదు నిమిషాలు ఉంది సమయం. అందరిలో ఆశ్చర్యం, ఉత్సాహం, ఉద్రిక్తత, దిగ్భ్రాంతి. ఆ రోజు ఏం సెన్సేషనల్ వార్త రానున్నదోనన్న ఉద్వేగం వారిని పట్టి ఊపేస్తున్నాయ్.

రోజుకో కొత్త సంచలన వార్త సృష్టిస్తున్న ఆ వెబ్‌సైట్ తాలూకు దృశ్యాలను అప్పటికప్పుడు తమ టీవీల్లో ప్రకటించేస్తున్నాయి ఛానళ్ళు. ప్రపంచంలోనే అత్యధిక రేటింగ్స్ లభించాయ్ ఆ వెబ్‌సైట్‌కి.

కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఆ వెబ్‌సైట్‌ని చూసే వాళ్ళు ఉన్నారు. లైవ్‌మిషన్ ద్వారా ప్రత్యక్షంగా అసాంఘిక చర్యలకు పాల్పడేవారి బండారాలను బయటపెట్టే ఆ వెబ్‌సైట్‌కు ప్రకటనలు ఇవ్వడానికి ఎంతోమంది రెడీగా ఉన్నారు. అయినా అలాంటి వాటిని స్వీకరించే ఉద్దేశం లేదని, తమ వెబ్‌సైట్ కేవలం సమాజ సంక్షేమానికి పాటుపడే ఉద్దేశంలో ప్రారంభించిందని ఆ వెబ్‌సైట్‌వారు పేర్కొన్నారు.

ఆ వెబ్‌సైట్‌కు సమచారం ఇచ్చేది ఆర్యేనని ఎవరికీ తెలియదు.

గడియారం మీద ముళ్ళు పదిగంటలు చూపిస్తున్నాయ్. అప్పుడు తెరుచుకుంది ఆ వెబ్‌సైట్. తెరుచుకుంటూనే ఆ రోజు సంచలన వార్తని ప్రకటించింది.

## ఐక్యరాజ్యసమితి మీటింగ్‌కని వెళ్ళిన మంత్రి రాసలీలలు

సరిగ్గా ఇదే సమయానికి ఐక్యరాజ్యసమితి మీటింగ్‌లో పాల్గొని మన దేశం మీద పాక్ టెర్రరిస్టుల దాడి ఖండించాల్సిన మన విదేశాంగ మంత్రి ఈ సమయంలో ఆ సమావేశానికి వెళ్ళకుండా, అదే సిటీలో నలుగురు విదేశాంగ వనితలతో రాసక్రీడలు నడిపిస్తున్నాడు. మనదేశపు ఖర్చుల మీద విమానంలో వెళ్ళి, అక్కడ సమావేశంలోనే పాల్గొనకుండా, అదే సిటీలోని మరో గెస్ట్‌హౌస్‌లో పూర్తి మద్యం మత్తులో విదేశాంగ అతివలతో శృంగార క్రీడలు నడిపిస్తున్నాడు... అంటూ ఆ వెబ్‌సైట్ ఆ దృశ్యాలను ప్రదర్శింపసాగింది.

మంత్రి ఒంటిమీద నూలు పోగు కూడా లేదు. ఆయన చుట్టూ వున్న నలుగురు విదేశీ అంగనలు ఆయన సేవలో ఉన్నారు. ఒక యువతి మద్యం అందిస్తుండగా, మరో యువతి ఆయన శరీరాన్ని నూనెతో మసాజ్ చేస్తోంది. ఆయన చేతులు మిగతా ఇద్దరి అంగనల అంగాంగాలు ఆబగా తడుముతున్నాయ్.

... ఆ దృశ్యాలను చూసిన రాజకీయ నాయకులు నివ్వెరపోయాడు. నిత్యం నామాలు పెట్టుకొని, మెడలో రుద్రాక్షలు వేసుకొని పంచె కట్టుకొని పవిత్రంగా కనిపించే తన సహచరుడు పూర్తిగా మరో రూపంలో కనిపించేసరికి నివ్వెరపోయారు. వారే కాదు, ఎం.పీలు, సామాన్య ప్రజలు అవాక్కయి చూస్తుండిపోయారు.

ఇవేమీ తెలియని ఆ మంత్రి పూర్తి శృంగార ఘటనల్లో నిమగ్నులై ఉన్నాడు.

మరో రెండు గంటల తర్వాత... తన గెస్ట్‌హౌస్‌కు వచ్చిన ఆయనను విలేఖరులు ఇంటర్వ్యూ చేస్తున్నారు.

"సార్! ఐక్యరాజ్యసమితిలో మన దేశ వాదన విన్పించారా?"

"ఆ! చాలా బాగా వినిపించాను" తిరిగి పాత గెటప్‌లో ఉన్న ఆ మంత్రి కంఠం ఉత్సాహంగా కదిలింది" నా వాగ్ధాటికి అంతా అదిరిపోయారు. అసలు పాక్‌దే తప్పని కూడా నిరూపించాను. నన్ను పూర్తిగా సపోర్ట్ చేశారు".

"అలాగా" ఓ విలేఖరి కంఠం వ్యంగ్యంగా కదిలింది "ఇవాళ అంతా అక్కడే ఉన్నారా సార్?"

"అవును" విజయగర్వంతో కదిలిందా మంత్రి కంఠం" ఉదయం నుండి సాయంకాలం దాకా ఆ సమావేశంలోనే నేను వాడివేడీగా విషయాలు చర్చించాను. మనదేశానికి వచ్చాక మరిన్ని విషయాలు చెప్తాను."

"అప్పటిదాకా అవసరం లేదు సార్! డైనమిక్ వండర్ మిషన్ వెబ్‌సైట్ మీరు కష్టపడిన దృశ్యాలన్నింటినీ ముందే చూపించేసింది..."

అక్కడ సూది పడితే వినపడేటంత శబ్దం ఏర్పడింది. ఆ నిశ్శబ్దంలోనే ఒక విలేఖరి తన లాప్‌టాప్‌లో ఆ వెబ్‌సైట్ దృశ్యాలను ఆయనకు ప్రదర్శించాడు.

తన కాళ్ళ క్రింది భూమి కదిలిపోతున్నట్లుగా అనిపించింది ఆయనకు. అలా చూస్తుండగానే ఒక విలేఖరి సెల్ శబ్దం చేసింది. వెంటనే ఉత్సాహంగా కదిలింది.

"ఇప్పుడే అందిన వార్త సార్! మిమ్మల్ని మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేశారట ప్రధాని. ఇక మిమ్మల్ని పూర్తిగా ఆ రాసక్రీడల్లోనే నిమగ్నులై ఉండమని వారి కోరిక కాబోలు"

వంట్లో సత్తా లేనట్లుగా అలాగే కూర్చుండిపోయాడు ఆ మంత్రి మెడలో కండువాని తలకు కప్పుకుంటూ.

విలేఖరులు నవ్వుకుంటూ అక్కడ నుండి కదిలిపోయారు.

◆ ◆ ◆

సిబిఐ హెడ్ క్వార్టర్స్.

తన ముందు సబ్‌మిట్ చేయబడిన రిపోర్ట్ కేసి కదిలాయి చీఫ్ అనంతరామన్ కంఠం.

"ఆ రోజు కపిలవర్ధ యూనివర్సిటీలో ప్రొఫెసర్ ధన్‌రాజ్ ఏర్పాటు చేసిన పార్టీకి మొత్తం రెండు వందల మంది వచ్చారు. అందులో నలుగురు మినిస్టర్లు, డజన్‌మంది ఎంపీలు ఉన్నారు. మిగతావారిలో రీసెర్చి స్కాలర్లు, ఆర్యచంద్ర, ఇతరులు ఉన్నారు.

పార్టీ రాత్రి ఎనిమిదింటికి మొదలైంది. ఒక ప్రక్కన విస్కీ, స్కాచ్‌లు సెక్షన్, మరో ప్రక్కన ఫుడ్ సెక్షన్, ఇంకో వైపు ఎంటర్‌టైన్‌మెంట్ సెక్షన్ నడిచింది. ఫుడ్ సెక్షన్‌లో అన్ని రకాల వంటకాలు ఉదాహరణకు పంజాబీ, బెంగాలీ, సౌత్ ఇండియన్ ఫుడ్‌లు ఉంచారు. మద్యం సెక్షన్‌లలో ప్రపంచంలో దొరికే రకరకాల విస్కీలు, బ్రాందీలు, రమ్‌లు, బీర్‌లు ఉంచారు."

"మరి ఎంటర్‌టైన్‌మెంట్?" అడిగాడో అనంతరామన్.

"దేశంలో ప్రముఖ గాయనీగాయకులతో పాటలు, సినీతారలతో నాట్య ప్రదర్శనలు ఉంచారు" అన్నాడు సిబిఐ ఇన్స్‌పెక్టర్ సుదేష్ణన్.

"పార్టీకి వచ్చిన నలుగురు మినిస్టర్లు ఎవరు?" కదిలింది అనంతరామన్ కంఠం.

"ఫైనాన్స్ మినిస్టర్ జయేష్‌రంజన్, హోమ్ మినిస్టర్ రామ్ అవతార్, విదేశాంగ మంత్రి కైలాస్‌సింగ్, రక్షణమంత్రి కిరణ్ జైస్వాల్‌లు ఉన్నారు"

"ఒక్కొక్కసారి పర్సనల్ హిస్టరీ షీట్ చూశారా?"

"ఫైనాన్స్ మినిస్టర్ జయేష్‌సింఘాల్, విదేశాంగమంత్రి కైలాస్ సింగ్‌లు అరవై సంవత్సరాలు నిండినవారు. ఇక హోమ్ మినిస్టర్ రామ్ అవతార్ రక్షణ మంత్రి కిరణ్ జైస్వాల్‌లు నలభై సంవత్సరాలు ఉంటాయి."

"అంటే ఆర్థిక మరియు విదేశాంగమంత్రిని లిస్ట్‌లో నుండి తీసెయ్యవచ్చా?"

"చెప్పలేము. ఇటీవల ఒక రాష్ట్ర గవర్నర్ ఎనభై సంవత్సరాలలో కూడా శృంగార కాండ నడిపిస్తూ పట్టుబట్ట విషయం తెలిసిందే కదా"

"అవును! శృంగారానికి, వయసుకు సంబంధం లేదని మానసిక శాస్త్రవేత్తలు నిరూపించారు కూడా"

"ఒకే! అయితే అందరి మూవ్‌మెంట్స్ మీద ఓ కన్ను వేయాల్సిందే అన్నమాట"

"అవును సర్"

"అయితే ఆ నలుగురు మినిస్టర్ల చరిత్ర, గతంలో వారి మీద వచ్చిన ఆరోపణలు, వారి బలహీనతల మీద రిపోర్ట్ ఇవ్వాలి."

"అలాగే సర్"

"ఆ రిపోర్ట్‌ని వీలైనంత త్వరగా ఇవ్వాలి. ఎందుకంటే ఇది ప్రధాని ప్రత్యేకంగా కోరింది కాబట్టి".

"అలాగే సర్"

సమావేశం ముగిసింది. ఇద్దరూ లేచారు.

**కాని వారికా సమయంలో తెలియదు కథ వూహించని రీతిలో కదలనున్నదని.**

◆ ◆ ◆

# 11

వండర్ మిషన్‌ని ఓపెన్ చేశాడు ఆర్యచంద్ర. అతడికెందుకో దాక్షాయణిని చూడాలనిపిస్తోంది. ఆ అమ్మాయే ఓ అద్భుతం. జీవితాన్ని ఆనందంగా ఎలా మలుచుకోవాలో తనకు తెలుసు. అందరిలా హడావిడి, పరిగెత్తడం, ఆయాసపడడం చేయదు. తనకేం కావాలో ఆమెకు తెలుసు.

వెంటనే ఆత్రుతగా దాక్షాయణీ అడ్రసు టైప్ చేశాడు. అతడు సూచించిన విధంగా కాంతిపుంజం బయలుదేరింది.

మరో క్షణం టీవీలో స్క్రీన్ కనిపించింది. దాక్షాయణీ ఇల్లు తాళం వేసుంది.

'ఏమయ్యింది దాక్షాయణీకి? ఈ సమయంలో ఎక్కడికెళ్ళిందో' అనుకుంటుం డగా అతడికి ఆకస్మాత్తుగా గుర్తొచ్చింది ఆమె చెప్పిన మాటలు.

'నేను ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండింటిదాకా కాలేజీలో ఉంటాను. రామ్‌లహన్ కాలేజీలో ఎం.ఎ. చదువుతున్నాను'.

వెంటనే కంప్యూటర్ గూగుట్ సెర్చింజన్‌లో రామ్‌లహన్ కాలేజీ అడ్రసుని శోధించాడు. రామ్‌లహన్ కాలేజీ, సైఫాబాద్, 36, హైదరాబాద్ అన్న అడ్రసుని టైప్ చేశాడు.

మరుక్షణం రామ్‌లహన్ కాలేజీ స్క్రీన్‌లో ప్రత్యక్షమైంది. అతడు మౌస్‌తో ఎం.ఎ. అని క్లాసులో ఉన్న చోటకు కదిలించాడు.

◆ ◆ ◆

సరిగ్గా అదే సమయంలో –

తెలుగు మాస్టారు మార్కండేయ ఆ క్లాసులో అడుగుపెట్టాడు. విద్యార్థులంతా లేచి నిలబడ్డారు. ఆయన తృప్తిగా తలాడించారు. అంతా కూర్చున్నారు.

లెక్చరర్ మార్కండేయకు అహం ఎక్కువ. ఆ మాటకొస్తే ప్రతి మనిషిలోనూ అహం అంతో ఇంతో ఉంటుంది. కాని లెక్చరర్ మార్కండేయకు నూటికి నూరు పాళ్ళు అహం ఎక్కువ. తాను చాలా గొప్పవాడినని, ఈ పాటికి యూనివర్సిటీలో ఉండాల్సిన వాడినని, పిల్లల్ని ఉద్ధరించడానికి ఆ కాలేజీలో పడ్డానని అతడి అభిప్రాయం.

దాంతో పాఠం చెప్పడం మానేసి తన తాతతండ్రుల గొప్పతనం, కుటుంబ ప్రఖ్యాతుల గురించే చెపుతాడు.

"ఆ రోజు మా ముత్తాతగారు నడిచి వెళ్తుంటే బ్రిటీష్ దొరలు బండి ఆపి మరీ ఎక్కించుకునేవారట. ఆయన ముహూర్తాలు పెట్టనిదే బ్రిటీష్‌వారు ఏమాత్రం ముందుకు ఎదిలేవారు కారట" అనేవాడు. ఎవరైనా పొరబాటున బ్రిటిష్ వారికి అలాంటి నమ్మకాలే లేవు కదా అని అన్నారా అంతే సంగతులు.

"అసలు నమ్మకాలు మనకంటే వారికే ఎక్కువ. ఈస్టిండియా కంపెనీ స్థాపించేటప్పుడే వారు అన్ని తిథి, నక్షత్రం చూసుకునే బయలుదేరారు. అదిగో ఆ ముహూర్తం దెబ్బకు వారు దేశాన్ని రెండొందల సంవత్సరాలు అవిశ్రాంతంగా పరిపాలించారు. అసలు బ్రిటిష్‌వారి గొప్పతనం మీకేం తెలుసు? చాలా చిన్న దేశం వారిది. అలాంటి వారు ప్రపంచంలో సగం దేశాలను గుప్పిటిలో పెట్టుకున్నారు. దీనికి కారణం ఆ రోజుల్లో మా ముత్తాతలు ముహూర్తం పెట్టడమే"

ఆయన పాఠం చెప్పడం మానేసి కొన్ని సంవత్సరాలు అయింది. క్లాసుకు రావడం రావడమే తమ వంశ గొప్పతనం మొదలుపెడతాడు. ఆయనే హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ కావడం చేత విద్యార్థులు కొద్దిపాటి భయభక్తులు చూపిస్తారు. మార్కులు ఎక్కువగా ఆయన చేతిలో ఉండడం ఒక కారణం కూడా.

ఇక తన కుటుంబం గురించి టాపిక్ వచ్చిందా విజృంభించేస్తాడు.

"అసలు మా పెద్దబ్బాయి ఉంటాడు. వాడు ఈ కాలంలో పుట్టాల్సిన వాడు కాడు. ఎప్పుడూ చూసిన పుస్తకం పట్టుకునే ఉంటాడు. ఎలాంటి చెడు అలవాట్లు లేవు. సినిమాలు, షికార్లు అసలే లేవు. నేను ఎంత చెబితే అంత వింటాడు. మా ఆవిడ గురించి ఎంత చెప్పినా తక్కువ. భర్తకు ఎంత గౌరవం ఇవ్వాలో ఆమెకు తెలిసినట్లుగా ఎవరికీ తెలియదు. రోజూ స్నానం చేసి నా కాళ్ళకు దండం పెట్టనిదే ఆమె దినచర్య మొదలుపెట్టదు.

కాని అతడి పెద్దకొడుకు ఈ మధ్యనే ఓ వ్యభిచార కేంద్రంలో పోలీసులకు పట్టుబడిన విషయం చాలా తక్కువ మందికి తెలుసు. అలాగే వాళ్ళావిడ చెప్పినట్లే ఇతడు వింటాడని, ఆమె కూర్చోమంటే నోర్మూసుకుని పడుంటాడని చాలామందికి తెలుసు.

ఇటీవల ఓ వూరు పూరూ లేని పత్రికలో ఆయన వ్యాసం వచ్చింది. దానిని పాతిక కాపీల తీసి అందరికి పంచిపెట్టాడు. ఆ వ్యాసాన్ని చదివిన వారికి ఒక్క

ముక్క కూడా అర్థం కాలేదు. అలాంటి వ్యాసాన్ని ఆ పత్రికవాడు ఎందుకు వేశాడో కూడా చాలామందికి అర్థం కాలేదు. భూలోకంలో యమలోకం కనిపించింది. కాని ఆయనకు అవేమీ పట్టవు. తన వ్యాసంలో విషయాలు మహాపండితులకే అర్థం అవుతాయని అతడి అభిప్రాయం.

“అసలు నన్నడిగితే నాకు జ్ఞానపీఠ అవార్డ్ ఇవ్వాలి దానికి. కాని ఆ మురికి రాజకీయాల చూశారు. అవే నాకు ఆ అవార్డు రాకుండా చేశాయి” అని చెప్పుకుంటుం టాడు.

అలాంటి మార్గండేయ క్లాసంటే ఆ విద్యార్థులకు హడల్. తనకు తానే చాలా గొప్పగా ఫీలయ్యే అతడిని భరించడం కష్టంగానే వున్నా, తప్పదు కాబట్టి ఆ నరకయాతన భరించేవారు.

ఎప్పటిలా ఆ రోజు కూడా మార్కండేయ ఠీవిగా ఉత్తరీయం సర్దుకుంటూ నస మొదలుపెట్టాడు.

“మొన్న మా ఇంటికి ఓ పబ్లిషర్ వచ్చాడు. మీరు తెలుగు సాహిత్యం మీద ఒక మంచి పుస్తకం రాయాల్సిందే సార్ అని బ్రతిమాలాడు. బ్లాంక్ చెక్కు ఇస్తాను, మీకెంత కావాలంటే అంత వేసుకోండి అని కాళ్ళు పట్టుకున్నాడు. నేను ‘అబ్బే! నాకు టైమ్ లేదయ్యా’ అన్నా వినడం లేదు. సర్లే, ఆలోచిస్తాను అన్నాక వెళ్ళిపోయాడు. అదేమిటో నేను చాలా బిజీ అన్నా వినిపించుకోరు ఈ పబ్లిషర్లు...”

విద్యార్థులకేం చేయాలో పాలుపోలేదు. ఆయన మళ్ళీ మొదలుపెట్టబోతుండగా మొదటి బెంచీలో ఉన్న దాక్షాయణీ కనిపించింది. ఆమెని చూస్తే చాలు అతడికి పూనకం ఎక్కుతుంది. చక్కటి ఆరోగ్యంతో మిసమిసలాడుతున్న ఆమెకేసి ఆరాధనగా చూసి మళ్ళీ మొదలుపెట్టాడు.

“అసలు హ్యారిపోటర్ పుస్తకాలకు ఎంత గిరాకీ ఉందో మీకు తెలిసిందే. సమకాలీన రాజకీయాల మీద ఉంటాయని. నేను రాస్తే వాటిని మించి పోతానని ఆ పబ్లిషర్ చెప్పాడు. ఆయన నాకు ఇంట్రస్ట్ లేదని చెప్పాను.

ఓ క్షణం ఆగి తిరిగి కదిలిందతడి కంఠం.

“ఇటీవల స్టీఫెనీ మేయర్ అనే ఆయన పుస్తకాలు హాట్‌కేకులుగా పోతున్నాయి. అతడి పుస్తకాలు ఓ మాదిరి క్రైమ్ నవల్లా ఉంటాయి.”

దాక్షాయణీ అసహనంగా కదిలింది. చాలారోజుల నుండి ఆమెకు వంటి

మీద తేళ్ళు, జెర్రులు పాకినట్లుంది. ఆయన చెప్పేవన్నీ అపశృతులు. ఒకటి కూడా కరెక్ట్ కాదు. మనసున్న మనిషి ఇలాంటి అపస్వరాలు భరించలేదు.

మరుక్షణం వినయంగా నిలబడింది దాక్షాయణి.

“సార్! స్టీఫెన్ మేయర్ మగవాడు కాదు. లేడీ సార్”.

అప్పుడు అక్కడ సూది పడితే వినిపించేటంత నిశ్శబ్దం ఏర్పడింది. తెలుగు మాస్టారు అపనమ్మకంగా చూశాడు. అతడి మొఖం ఎర్రబడింది. ఇప్పటివరకూ తాను చెప్పేదే శాసనం. కాని ఇలా ఎదురు ప్రశ్నించినవారు లేరు.

“నీకు తెలియదులే...” విసురుగా అన్నాడు. “స్టీఫెనీ మేయర్ పేరు చూస్తూ తెలియడంలా మగవాడే! తెలియకుండా అలా మాట్లాడకూడదు”.

“అది కాదు సార్! స్టీఫెనీ మేయర్ ఖచ్చితంగా లేడీ రైటర్. కావాలంటే కనుక్కోండి. అంతేకాదు, హ్యారీపొట్టర్ పుస్తకాలు రాజకీయాల గురించి అని మీరు చెప్పారు. అవి మంత్రశక్తులు, దెయ్యాలకు సంబంధించిన సబ్జెక్టు సార్! అలాగే స్టీఫెన్ మేయర్ పుస్తకాలు క్రైమ్ రచనలకు సంబంధించినవి కావు. అవి రోమాన్స్ ప్రధానంగా ఉండే హర్రర్ పుస్తకాలు...”

ఆయన మొహం కత్తితో గాటు పెట్టి కనిపించేటంత ఎర్రగా మారిపోయింది. తన పరువు తీసిన దాక్షాయణిని మింగేసేటట్లుగా చూశాడు. ఆ అమ్మాయి తాను అనుకున్నంత అమాయకురాలు కాదని, ప్రపంచ సాహిత్యం గురించి అవగాహన వుందని ఆయనకు అర్థమైనా ఆ విషయం ఒప్పుకోవడం ఇష్టం లేదు.

ఈలోపు బెల్ అయింది. బ్రతుకు జీవుడా అన్నట్లుగా అటెండెన్స్, డస్టర్ చేతిలో పట్టుకొని వెళ్ళిపోతూ దాక్షాయణీ వంక చూశాడు. ‘నీ సంగతి చూస్తాను’ అన్నట్లుగా ఆ మొహంలో కసి కనిపిస్తోంది.

అప్పుడు కాని దాక్షాయణికి తాను చేసిన పొరబాటు గుర్తు రాలేదు. అనవసరంగా తాను విషయాన్ని కెలికింది. ఇప్పుడు తనను టార్గెట్ పెట్టుకొని సతాయించడు కదా! ఆమెకు భయం వేసింది మొదటిసారిగా. చేసేదేం లేక బిక్కుబిక్కుమంటూ కూర్చుంది.

ఆ సాయంకాలం ఇంటర్నల్ మార్కుల లిస్ట్ నోటీసు బోర్డులో పెట్టాడు. ఎప్పుడూ క్లాసు ఫస్ట్ వచ్చే ఆమె ఆ పరీక్షలో ఫెయిలయ్యింది.

లెక్చరర్ మార్కండేయ కసిగా మొదటి దెబ్బ కొట్టాడు.

ఇంటికి ఎలా వచ్చి పడిందో ఆమెకే తెలియదు. అనవసరంగా నోరు పెట్టింది. ఫలితంగా అనుభవించింది. జీవితంలో తొందరపడకూడదని తెలుసు. కాని అన్నీ అపస్వరాలే పలుకుతున్న మాస్టారికి నిజం చెప్పాలని నోరు తెరిచింది. దానిని ఆయన పాజిటివ్‌గా తీసుకోకుండా దారుణంగా దెబ్బకొట్టాడు.

ఆమె అలా విచారంగా పడుకున్న సమయంలో ఫోన్ మ్రోగింది గణగణ మంటూ.

'అసలే నా సమస్యలో నేనుంటే, మధ్యలో ఇదొక గొల' విసుక్కుంటూ రిసీవర్ ఎత్తింది.

"హలో..." అవతల నుండి ఆర్య కంఠం.

"హలో..." నీరసం ఆమెలో

"అదేమిటి అంత డల్‌గా ఉన్నారు? ఎనీ ప్రాబ్లమ్?"

"ఏం లేదు" ముభావం ఆమెలో.

"ఏమంటాడు మీ మార్కండేయుడు? స్టీఫెనీ మేయర్ ఇంకా మగ రచయితే అంటున్నాడా?"

అదిరిపడింది దాక్షాయణీ! మైగాడ్. అతడికెలా తెలిసింది తన కాలేజీలో విషయం? ఏది ఏమైనా అతడు మామూలు మనిషి కాడు. అన్నీ తెలుసుకుంటున్నాడు.

"మీ వండర్ మిషన్‌ని మా కాలేజీ క్లాసురూమ్‌కు సైతం తీసుకొచ్చారా?"

"అవును! మీ కోసం వెతికాను. మీలాంటి ఆత్మీయులను చూడాలనిపించింది. ఇంట్లో లేరు. దాంతో కాలేజీ వేపు ఫోకస్ చేశాను. మొత్తం విషయమంతా తెలిసింది".

"అనవసరంగా తొందరపడ్డాను. సార్ నన్ను ఫెయిల్ చేశారు".

ఇంత జరిగినా ఆమె లెక్చరర్‌ని మిగతా విద్యార్థుల్లా వాడూ, వీడూ అని తేలికగా మాట్లాడడం లేదు. లెక్చరర్‌ని సార్ అని గౌరవిస్తుంది. ఇవాళా, రేపూ కాలేజీల్లో ఎంత బాగా చెప్పిన లెక్చరర్ల గురించి అవాకులు, చవాకులు మాట్లాడుకునే వారిని చూశాడు. కాని ఇంత జరిగినా లెక్చరర్లను సార్ అని గౌరవించడం ఆమె సంస్కారానికి నిదర్శనం. అదీ ఆ లెక్చరర్ దగ్గర సరుకు లేదని తెలిసినా గురువు అన్న దృష్టితో గౌరవించడం ఆమె సభ్యతకు అద్దం పడుతోంది.

"ఒకే దాక్షాయణీ! మీ లెక్చరర్ సంగతి నేను చూసుకుంటాను. మీరు నిశ్చింతగా నిద్రపోండి"

"నో... ఆయన్ని మీరేం భయపెట్టవద్దు. మనకు చదువు చెప్పే గురువు భగవంతుడితో సమానం. అలాంటి సరస్వతీపుత్రులను భయపెడితే అది మనకే దెబ్బ".

"ఆయన సరస్వతీ పుత్రుడా? రోడ్డు మీద పెడితే రూపాయికి కూడా విలువ చెయ్యడు. అలాంటివాడిని?"

"ప్లీజ్! ఆయనని వదిలెయ్యండి. ఈ ఇంటర్నల్ పరీక్షలో ఫెయిలయినా నెక్స్ట్ ఇంటర్నల్ ఎగ్జామ్‌లో ప్యాస్ అవడానికి ప్రయత్నిస్తాను..."

"నెక్స్ట్ ఎగ్జామ్‌లో కూడా మిమ్మల్ని ఫెయిల్ చేస్తే?"

"చేస్తే చేయనీయండి. మహా అయితే ఒక సంవత్సరం వృథా అవుతుంది. అయితే అవనీయండి..."

"నో. అలా కాకూడదు. నాకు ఒక అవకాశం ఇవ్వండి..."

"వద్దు. ఆయన మీద మీ ప్రయోగాలు చేస్తే నా మీద ఒట్టే సుమా!"

అతడు కదలిపోయాడు. తనకు చెడు చేసినా గురుర్బ్రహ్మా సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపం అన్నట్లుగా ఆమె ఆయన మీద ఎలాంటి చర్యకు ఉపక్రమించకపోవడం అతడికి దిగ్భ్రాంతిగా ఉంది. ఆమెలోని పాజిటివ్ దృక్పథానికి ముచ్చటేసింది. ఇవాళ, రేపు అమ్మాయిఉలు చిన్న అన్యాయం జరిగితే చాలు. ప్రిన్సిపాల్‌కు, రిపోర్ట్ చేయడం, తోటి విద్యార్థులను కూడగట్టుకొని ధర్నా చేయడం లాంటివి చేస్తున్న ఈ రోజుల్లో దాక్షాయణీ లాంటి విద్యార్థులు ఉండడం అరుదు.

"ఒకే దాక్షాయణీ! నీ ఇష్టం. బై గుడ్ నైట్..." అంటూ ఆమె నుండి వీడ్కోలు తీసుకున్నాడు అతడు.

◆ ◆ ◆

# 12

అదే సమయంలో సాఫీగా సాగుతున్న భారతదేశం మీద పిడుగు పడ్డట్లుగా దురాక్రమణ మొదలైంది. ఆ ప్రమాదం అంతర్గత శత్రువుల వల్ల వచ్చింది కాదు. టెర్రరిస్ట్‌ల వల్ల, మాఫియావల్ల వచ్చింది కాదు. ఓ పెద్ద అగ్రరాజ్యం వల్ల సంభవించింది.

ప్రధాని సమీరకు అసలు సిసలు సవాలు అప్పుడే ఏర్పడింది.

**దానికి కారణం... చైనా మన దేశం మీద దాడి చేయడం.** క్రమక్రమంగా భారత భూభాగాన్ని ఆక్రమిస్తూ అస్సాం ప్రాంతం వేపుగా తమ సైన్యాన్ని రంగంలోకి దించింది. ఇది ఊహించని భారత్ షాక్ తింది.

యుద్ధమంటే దేశంలో అన్ని రంగాల మీద ప్రభావాన్ని చూపిస్తుంది. రేట్లన్నీ పెరిగిపోతాయి. పెట్రోలు, బంగారం ప్రియమైపోతాయి. అదే సమయంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతుంది. తిండి గింజలు ప్రియమైపోతాయి. ప్రజలంతా భీతిల్లి చూస్తుంటారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక టెన్షన్‌తో ఉండిపోతారు. అసలు తమ అస్థిత్వానికి జీవం ఉంటుందో, లేదో తెలియక అయోమయంలోకి జారిపోతారు.

అన్నింటికంటే పెద్ద సమస్య – ఆ యుద్ధాన్ని ఎదుర్కొనే దేశ ప్రధానికి ఎదురవుతుంది. తాను తీసుకునే చర్య మీదే యుద్ధం ఆధారపడి వుంటుందని ఆమెకు తెలుసు.

అసలే కొత్త ప్రధాని, దానికి తోడు ఇలాంటి పరిస్థితిని ఆమె అంతకుముందు ఎదుర్కొని ఉండలేదు. ఈ నేపథ్యంలో ఏమి చేయాలో అర్థం కాక ఆమె అస్థిమితానికి లోనవసాగింది.

అదిలా ఉండగా రోజు రోజు చైనా ముందు ముందుకు కదులుతోంది. ఇప్పటికే భారత్‌లోని వేల కిలోమీటర్ల భూభాగాన్ని కబళించింది. ఇంకా సమరోత్సాహంతో ముందుకు కదుల్తుంది. అసలే పెద్ద దేశం, భారత్ కంటే రెండు రెట్లు అధిక సైనికులు గలది. నౌకాయాన పాటవంలో, వైమానిక పాటవంలో భారత్‌ని మించిపోయింది. అందుకే తన తడాఖా చూపడానికి ఉవ్విళ్ళూరుతోంది.

ఆ ఉద్రిక్త పరిస్థితులలోనే ఆమె భారత్ ఆర్మీ, నేవీ చీఫ్‌లతో సమావేశం అయింది. నిజానికి భారత్ యుద్ధానికి సిద్ధంగా లేదు. అదీ గాక శాంతికాముక దేశం. గత పదివేల సంవత్సరాలలో భారత్ ఒక్క దేశాన్ని కూడా ఆక్రమించుకోలేదు. ఇది చరిత్ర చెపుతున్న నిజం.

అందుకే ప్రధాని సమీరలో టెన్షన్. తాను తీసుకునే ఒక నిర్ణయం... ఒకే ఒక నిర్ణయం.... ఎన్నో వేల, లక్షల సైనికుల భవిష్యత్‌ని, వారి కుటుంబాలను ప్రభావితం చేస్తుంది. చేసేది లేక ఆమె ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి నివేదించింది. సమితి సమావేశమైంది. కాని చైనా వాగ్ధాటికి సమితి మిన్నకుండిపోయింది. తమంటే పడని దలైలామాకు భారత్ ఆశ్రయమిచ్చి, మత భావాలు రెచ్చగొట్టి తమ దేశంలో

ప్రజల మీద రుద్దుతుందని చైనా వాదన. అది సరైన కారణం కాదని తెలిసినా వీటో పవర్ గల చైనాకు ఎదురు తిరిగే శక్తి లేక సమితి చేతులు ఎత్తేసింది.

దాంతో చైనా మరింత వేగంగా ముందుకు ఉరికింది. పెద్దన్నలాంటి ఐక్యరాజ్యసమితే ఏం చేయలేనని చేతులు ఎత్తేశాక ఇక తమకు తిరుగులేదని ఉత్సాహంగా కదనరంగంలోకి దూసుకెళ్ళసాగింది. దాంతో ప్రధాని సమీరకు కాళ్ళు చేతులు ఆడనట్లయింది. ఏం చేయాలో తోచక ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్ట్ చీఫ్‌లతో సమావేశమైంది.

అంతా ఉద్వేగంగా ఆమెకేసి చూస్తున్నారు. యుద్ధం చేయడమా, లేక చేతులు ఎత్తేసి చైనా అడిగిన హిరణ్య కక్ష వరాలకు తలవంచడమా అన్నదే ప్రస్తుత సవాల్.

అప్పుడు వచ్చింది బీఫ్ శబ్దం ఆమె లాప్ టాప్ నుండి. ఆలోచనల్లో ఉన్న సమీర లాప్‌టాప్‌కేసి చూసింది. తనకేదో ఇ–మెయిల్ వచ్చింది. తర్వాత ఓపెన్ చేద్దామనుకుంది. కాని అది అత్యవసరమైనదని సిక్త్ సెన్స్ తెలపడంతో ఆమె చేయి కదిలింది మౌస్‌కేసి.

మరుక్షణం ఆ ఇ–మెయిల్ ఓ పువ్వులాగే విచ్చుకొని ఆమె ముందు ప్రత్యక్షమైంది.

అందులో కొన్ని ఫోటోలు ఉన్నాయి.

అవి – భారత్ దాడిలో చైనా ఉపయోగించే ఆధునిక ఆయుధ సామాగ్రిని ఎక్కడెక్కడ ఉంచింది తెలియజేసే ఫోటోలు. ఆ ఆయుధ సామాగ్రిని అటాక్ చేయడానికి వీలుగా మ్యాప్‌లైన్‌లో ఆ ప్రదేశాన్ని గుర్తించి పిలిపించారు. దాని క్రిందే ఆ మెయిల్ మెసేజ్ ఇలా ఉంది.

"ప్రస్తుతం భారతదేశం మీద దాడి చేసే ఆయుధ సామాగ్రి గిడ్డంగులు మొత్తం మూడు. వాటి మీద భారత్ వైమానిక దళంతో అటాక్ చేసి నాశనం చేస్తే, చైనా ఆయువు పట్టుమీద కొట్టినట్లే! కొన్ని కోట్ల ఖరీదు గల ఆయుధ సామాగ్రి నాశనం అయితే చాలు, ప్రస్తుతానికి చైనా తోక ముడుచుకుని వెనక్కి వెళ్ళిపోతుంది. మళ్లీ అంత ఖరీదైన అత్యంత ఆధునాతన ఆయుధాలు సమకూర్చుకోవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. అటాక్ దెమ్".

ప్రధాని సమీర కళ్ళు పెద్దవయ్యాయి. ఎవరు పంపించారు వాటిని? దేశంలో అత్యంత శక్తివంతమైన రాడార్‌లు సైతం పసిగట్టలేని విషయాన్ని ఎవరు కనిపెట్టారు?

వాటిని తమకు ఎవరు పంపించారు? సరే ఆ పంపించిన వారి సంగతి తర్వాత చూద్దాం. ప్రస్తుతానికి అసలు విషయానికి వద్దాం అనుకుంటూ వెంటనే అప్పటికప్పుడే ఓ ప్రొజెక్టర్ తెప్పించి అందులోకి ఆ దృశ్యాలను ప్రదర్శించింది.

"ఈ మూడు ప్రదేశాలలో మనం ఇప్పుడు పై నుండి అటాక్ చేయాలి" వైమానిక దళాధిపతికేసి చూస్తూ ప్రొజెక్టర్‌లో ఆ ప్రదేశాలను స్టిక్‌తో చూపిస్తూ కదిలిందామె కంఠం.

'మైగాడ్' తమ శరీరంలో పేరుకున్న కంపన వారికి తెలుస్తోంది. వైమానిక దళాధిపతి వాటిని జాగ్రత్తగా నోట్ చేసుకుంటున్నాడు.

"ఇప్పుడు" కదిలిందామె కంఠం "రాత్రికి రాత్రే ఆ ప్రదేశాలలో అటాక్ చేయండి. ఒక్కటంటే ఒక్క ఆయుధం కూడా మిగలకూడదు. దాంతో మళ్ళీ చైనా తిరిగి మన దేశం వేపు చూడకూడదు".

ఆమె చెప్పిన ప్రదేశాలను ఆకళింపు చేసుకున్న వైమానిక దళాధిపతి తన తదుపరి ప్లాన్‌ని సిద్ధం చేసుకుంటున్నాడు. మొత్తం ఎన్ని యుద్ధ విమానాలు ఆ ప్రదేశాలకు వెళ్ళాలి, అక్కడ పై నుండి ఎలాంటి బాంబులు లేదా లాంచర్‌లు ఉపయోగించి వాటిని ఎలా నాశనం చేయాలా అని వైమానిక దళాధిపతి ఆలోచిస్తున్నాడు.

సమావేశం ముగిసింది. అంతా లేచారు. ఆమె వైమానిక దళాధిపతిని ఆగమంది.

అంతా వెళ్ళిపోయాక కదిలిందామె కంఠం.

"జాగ్రత్త! ఒక చిన్న పొరబాటు... ఒక చిన్న మిస్టేక్ మనల్ని ప్రపంచం ముందు తలవంపులు చేస్తుంది. అంతేకాదు, దేశాన్ని దేశ ప్రజలకు అంధకారంలో దింపుతుంది. మూడవ ప్రపంచ యుద్ధం ముంచుకు వచ్చినా ఆశ్చర్యం లేదు. అందుకు జాగ్రత్తగా డీల్ చేయండి."

అలాగే అన్నట్లుగా తలవూపి వెళ్ళబోతూ కదిలింది అతడి కంఠం. "ఈ విషయం సర్వసైన్యాధికారి అయిన రాష్ట్రపతికి చెప్పాలా, అవసరం లేదా?"

"ఆయన విషయం నేను చూసుకుంటాను. మీరు మీ పనిని నిర్విఘ్నంగా కానీవ్వండి. ఆల్ ది బెస్ట్".

◆ ◆ ◆

అనుకున్నట్లుగానే అంతా నిర్విఘ్నంగా జరిగిపోయింది. భారత్ వైమానిక దళం మెరుపుదాడికి మొత్తం మూడు ఆయుధ గిడ్డంగులు ధ్వంసమయ్యాయి. మెరుపు వేగంతో అర్థరాత్రి జరిగిన ఆ దాడిని ప్రతిఘటించే లోపు వైమానిక దళం వాటిని నాశనం చేసింది. అసలే అర్ధరాత్రి... కొత్త ప్రదేశం... ఎటువైపు నుండి దూసుకొస్తు న్నారో చైనా సైన్యాధికారులకు తెలియని పరిస్థితి.

ఆ కన్‌ఫ్యూజన్‌లోనే వైమానిక దళం ఆ ఆయుధాల గిడ్డంగుల మీద మెరుపుదాడి చేసింది. మొత్తం ఆయుధాలు నాశనం అయ్యాయి.

తాము చేసేదే అక్రమ దురాక్రమణ. ఆ మోసాన్ని భారత్ మోసంతోనే జయించిన విషయం అర్థమైంది చైనాకి. దాంతో చేసేదేం లేక ప్రపంచశాంతి దృష్ట్యా, వివిధ దేశాల ప్రజల విజ్ఞప్తుల దృష్ట్యా ప్రస్తుతానికి యుద్ధాన్ని విరమిస్తున్నామని పేర్కొని చైనా వెనక్కి తిరిగింది.

అప్పుడు కురిశాయ్ భారత్‌లో ప్రశంసల వెల్లువ ఆమె పైన. వేనోళ్ళ పొగిడాయి పత్రికలు ఆమెని. ఆమెంత డైనమిక్ ప్రధాని లేదని కితాబు ఇచ్చాయి టీవీ ఛానళ్ళు. అలా భారత రాజకీయ చరిత్రలో ఆమె తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

◆ ◆ ◆

# 13

వండర్‌మిషన్‌ని వరల్డ్ వెదర్ ఫోర్‌కేస్టింగ్‌కేసి ఎక్కుపెట్టాడు ఆర్య. మొత్తం గ్లోబంతా అతడికి కనిపిస్తుంది. మౌస్‌ని అలా అన్ని దేశాలు, ప్రాంతాల కేసి ప్రసరించాడు.

అప్పుడు ముడిపడింది అతడి భృకుటి.

సముద్ర తీరాల్లో అంటార్కిటికా పక్క స్థలంలో అలలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సముద్రతీరం లోపల భూముల్లోని అలల కదలికల్లో ఏదో తేడా కనిపిస్తోంది.

మరుక్షణం ఆ దృశ్యాలను పెద్దవి చేసి చూశాడు.

అంతే! మరుక్షణం కీబోర్డు మీద అతడి వేళ్లు చకచకా కదిలాయి. ఇంటర్నేషనల్ సునామీ అలర్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఇ-మెయిల్ టైప్ చేశాడు.

“ఇండోనేషియా సముద్ర తీరం ప్రాంతంలో పెద్ద ఎత్తున సునామీ రాబోతోంది.

ఇంకో రెండు రోజుల్లో సముద్రాలు పొంగిపోవచ్చు. కనీసం పది దేశాలు ఈ ప్రభావానికి లోనుకావచ్చు. కాబట్టి వెంటనే అన్ని దేశాలకు రెడ్అలర్ట్ని జారీచేయండి".

దానిని అంత సీరియస్గా తీసుకోలేదు వరల్డ్ అలర్ట్ డిపార్ట్మెంట్. ఎందుకైనా మంచిదని వాళ్ళు కూడా తమ టెలిస్కోప్ల ద్వారా అటువైపు దృష్టిని సారించారు. నిజమే! సముద్రతీరంలో అలల తాకిడులు విపరీతంగా ఉన్నాయి. సమ్థింగ్ ఈజ్ రాంగ్!

వెంటనే అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేశారు. ఆయా దేశాలన్నీ అలర్ట్ అయ్యాయి. సముద్రతీరం పక్కనే ఉన్న అణు రియాక్టర్లలో ప్రమాదం జరగకుండా ముందే చర్యలు తీసుకున్నాయి.

మరో రోజు గడుస్తూండగా... అప్పుడు విరుచుకుపడింది సునామీ. ఇప్పటివరకూ వచ్చిన అన్ని సునామీల కంటే బలంగా విరుచుకుపడింది ప్రపంచం మీద. ప్రపంచం గజగజలాడింది ఆ తాకిడికి.

అయితే ముందే చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదం అంతగా జరగలేదు. సునామీ అలర్ట్ డిపార్ట్మెంట్ ముందు చూపుకు ధన్యవాదాలు అర్పిస్తూ ఇ-మెయిళ్ళు ప్రవాహంలా వచ్చాయి.

కాని ఆ సునామీ అలర్ట్ డిపార్ట్మెంట్కు అర్థం కానిది ఒకటే. తాము ఎంతో అత్యంత ఆధునాతన పరికరాలు ఉపయోగిస్తూ ఉన్నా కూడా తమకు తెలియని సునామీ సమాచారం ముందస్తుగా ఆ ఇ-మెయిల్ పంపిన వారికి ఎలా తెలిసిందా అనేదే అర్థం కాని సమస్యగా మారింది.

ఆ ఇ-మెయిల్కి ఆ డిపార్ట్మెంట్వారు తిరిగి రిప్లయి ఇచ్చారు. ఆ ఇ-మెయిల్ ఇచ్చిన వారి ఆచూకీ వివరాలు తెలియజేయమని మెసేజ్ పంపారు.

కాని ఆ ఇ-మెయిల్ నుండి తిరిగి వచ్చింది ఒకే ఒక్క చిన్న మెసేజ్!

"ప్రస్తుతానికి ప్రమాదం తప్పింది కదా! అది చాలు.. మా వ్యక్తిగత వివరాలతో మీకు పనిలేదు".

◆ ◆ ◆

వండర్ మిషన్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. కాని అది ఓ ఈది అమీన్, హిట్లర్, బిన్లాడెన్లాంటి చేతుల్లో పడితేనే ప్రమాదం. అప్పుడు ప్రపంచానికే పెనుసవాల్ ఎదురవుతోంది.

సరిగ్గా వండర్ మిషన్ అలాంటి వ్యక్తి చేతిలోనే పడింది.

అతడి పేరు హాసన్ డిస్‌లైడ్ ఘోస్. ఎలా పడిందో వండర్ మిషన్ అతడి చేతిలో పడింది.

అంతే! దానిని ఆధారంగా చేసుకొని తనకు ఇష్టం వచ్చిన సినీ హీరోయిన్‌లు బాత్‌రూమ్‌లలో స్నానం చేస్తున్నప్పుడు, ప్రొడ్యూసర్లు, హీరోలతో ఉన్నపుడు బ్లూఫిల్మ్‌లాగా సినిమాలు తీసి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనకు కొన్ని కోట్ల రూపాయలు ఇవ్వాలని కొంతమందిని, తనతో గడపమని, తన వికృత కోరికలు తీర్చాలని ఇంకొంతమందిని అతడు బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. అతడి తాకిడికి తట్టుకోలేక ఎక్కువమంది మౌనంగా తమలో తాము రోదిస్తున్నారు. కేవలం సినీ హీరోయిన్‌లు, మోడళ్ళను మాత్రమే కాక తనకు నచ్చిన కాలేజీ అమ్మాయిలనే కాక అందంగా ఉండే కుటుంబ గృహిణులను సైతం బెదిరించసాగాడు. అతడు తాకిడికి తట్టుకోలేక కొంతమంది పిచ్చోళ్ళయిపోయారు. ఇంకొంతమంది ఆత్మహత్య చేసుకున్నారు.

అదలా ఉండగా కేవలం సెక్స్ పిచ్చే కాకుండా రాజకీయ నాయకులను, అయ్యేఎస్, పరిశ్రమాధిపతులను సైతం బెదిరించసాగాడు. వాళ్ళు తమ పరిశ్రమలకు, కంపెనీలకు ఎంతెంత లంచాలిచ్చి ఆర్డర్‌లు పొందిందో రుజువులతో సహా తన దగ్గర ఉన్నాయని మెసేజ్‌లు పంపించారు. దాంతో వాళ్ళంతా గజగజ వణుక్కుంటూ అతడు కోరిన డబ్బు సమర్పించుకుంటూ కాలం గడపసాగారు.

అంతేనా! ఐఐటీ, మెడిసిన్ సీట్లు సైతం అతడి కంట్రోల్‌లోకి తీసుకున్నాయి. ఆ పేపర్ సెట్ చేసిన వారి మహిళల ఫోటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసేవాడు. దాంతో ప్రశ్నపత్రాలు అతడి చేతికి వచ్చేవి. వాటి ఆధారంతో విద్యార్థుల దగ్గర కోట్లు మింగేవాడు.

ఇక బ్యాంకులో ఇంటర్‌నెట్ ద్వారా ఆపరేట్ అయ్యే వారి పాస్‌వర్డ్‌లను చూసి డబ్బుని డ్రా చేసుకునేవాడు. ఏటియం కార్డుల్లోని పిన్ నెంబర్‌ని గ్రహించి సంఘవిద్రోహులకు ఇచ్చేవాడు. వారు నకిలీ కార్డులు తయారుచేసి, ఆ పిన్ నెంబర్ సాయంతో డబ్బు డ్రా చేసుకునేవారు. దాంతో బ్యాంకింగ్ రంగం కకావికలైపోయింది.

అంతటితో ఆగాడా! లేదు! స్టాక్ మార్కెట్‌లో సైతం బడా బ్రోకర్లు ఏ ఏ షేర్లను ఆపరేట్ చేస్తున్నారో వండర్ మిషన్ ద్వారా గ్రహించి, వాటిని కొనేవాడు.

తన అనుచరులకు చెప్పేవాడు. అవన్నీ అధిక రేట్లకు రాగానే అమ్మేసేవాడు. బ్రోకర్లను, ఆపరేటర్లను బెదిరించి తాము ఆ రోజు అధిక రేట్లకు షేర్లను అమ్ముతామని, అందువల్ల ఆ రోజు ఆ అధిక రేటుకు తీసుకెళ్ళమని చెప్పి మొత్తం షేర్లు అమ్మేసేవాడు.

ఇక సాఫ్ట్‌వేర్ కంపెనీలను వదల్లేదు. డిఫెన్స్‌లలో, అంతరిక్షంలో ఆయుధాలు, రాకెట్లు తయారీలలో వాడే కంప్యూటర్ల పాస్‌వర్డ్‌లను విదేశాలకు అమ్మేసి, కోట్ల డబ్బుని కూడబెట్టుకోసాగాడు.

అంతేనా, ఆఖరికి పేరు పొందిన టెర్రరిస్ట్‌లను సైతం బెదిరించి వాళ్ళ ఆచూకీని ప్రభుత్వానికి తెలియజేస్తానని వారిని లోబరుచుకున్నాడు. వారి ద్వారా తనంటే పడని వారిని ఏకంగా పైకి పంపించేటట్లుగా చేసుకునేవాడు. తనకు లొంగని వారిని, సిన్సియర్ ఆఫీసర్లకు టెర్రరిస్ట్‌ల చేత హతం చేయించేవాడు. అంతేకాదు, ఇండియా సూపర్ కంప్యూటర్ పాస్‌వర్డ్ అతడికి తెలిసింది. దాంతో అణ్వాయుధాలు ఎక్కడున్నాయో, రాకెట్లని పైకి ఎలా పంపాలో, ఏఏ ప్రదేశాలను టార్గెట్ చేయాలో అతడికి తెలిసిపోయింది.

అక్కడితో ఆగాయా అతడి ఆకృత్యాలు? లేదు. ఇంకా ముందుకెళ్ళి ప్రధాని, ఇతర మంత్రుల ఫోటోలు తీసి వారిని సైతం బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. తాను చెప్పిన వ్యక్తులకే ఎం.పీ. ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని వేధించసాగాడు. అలా ఇవ్వకపోతే వాళ్ళ బండారాలు బయటపెడతానని బెదిరించసాగాడు. దాంతో వాళ్లు అతడికి లొంగిపోక తప్పలేదు.

దాంతో మొత్తం ప్రభుత్వం అతడికి దాసోహం అయింది. అతడి ధాటికి దేశం దేశమంతా గగ్గోలెత్తిపోయింది.

ఈ దేశాన్ని అదుపులో ఉంచుకోవడమే తన ధ్యేయమని ప్రకటించేవాడు. ఈ దేశానికే అధిపతి కావాలని తనకు ఎదురు తిరిగిన వారిని నిర్దాక్షిణ్యంగా అణిచేవాడు. ఈ దేశంలో పార్లమెంట్‌ని రద్దు చేసి అధ్యక్ష పాలనని ప్రవేశపెట్టి ఈ దేశ నియంత కావాలని అతడి కోరిక. దాంతో దేశం దేశమంతా అల్లాడిపోసాగింది. ప్రధాని ధర్మపీఠం సైతం కదలసాగింది.

◆ ◆ ◆

....గబుక్కున మేలుకువ వచ్చింది సమీరకు. వళ్ళంతా చెమట్లు పట్టేశాయి. మైగాడ్! ఎంత భయంకరమైన కల వచ్చింది. నిజంగా వండర్‌మిషన్ ఎంత

పనిచేసింది? ఇది కల కాబట్టి సరిపోయింది. అది నిజమైతే ఈ దేశంలో శాంతిభద్రతలు ఏమవుతాయి? సంఘవిద్రోహకశక్తులు చెలరేగిపోతాయి. అయినా ఆర్యతేజ అలాంటిది ఎలా కనిపెట్టాడు? ఆ మిషన్ ఏఈడి అమీన్, హిట్లర్, బిన్‌లాడెన్ చేతిలో పడితే ఏమవుతుంది? అగ్రరాజ్యాల ఆయుధాలు, సైనిక పాటవాల మీద గురిచేసి లాంచర్లతో, రాకెట్లతో దాడి కొట్టి అల్లకల్లోలానికి గురిచేసేవారు.

ఏది ఏమైనా ఇప్పటిదాకా అలాంటి విధ్వంసం జరగలేదు. అలాంటి ప్రమాదం సంభవించలేదు. అందుకే తాను చేసేది ఏం లేదు. ఆ వండర్ మిషన్ సంఘవిద్రోహుల చేతిలో పడకుండా కాపాడమని ఆ భగవంతుడిని ప్రార్థించడం తప్ప.

◆ ◆ ◆

# 14

“అవినీతి కాన్సర్ లాంటిది. దానిని నిర్మూలించడం అంత తేలిక కాదు. అయినా నా ప్రయత్నం నేను చేస్తున్నాను అంకుల్”.

“గుడ్!” కదిలింది పార్టీ చీఫ్ సిన్హా కంఠం “నీవు చేస్తున్న ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే సఫలీకృతం అవుతున్నాయి కూడా”.

“ఏమిటి ప్రధాని, పార్టీ చీఫ్‌లు మంతనాలు మొదలుపెట్టారా?” అంటూ వచ్చాడు తుషార్.

“రండి!” అతడిని చూస్తూ ఉత్సాహంగా కదిలింది సమీర కంఠం. అతడిని చూస్తే ఉత్సాహం వస్తుంది ఆమెకు. పార్టీ చీఫ్ ఏకైక కొడుకు అతడు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో పిహెచ్.డి. చేశాడు. గత ప్రధాని (బాబాయ్) హయాంలో సహాయ కేంద్రమంత్రిగా కూడా పనిచేశాడు. ఆ తర్వాత తాను ప్రధాని అయ్యాక ఏదైనా పదవి ఇద్దామనుకుంది. అయితే తుషార్ తృణీకరించాడు.

నిజానికి ఆమెను ప్రధానిని చేసింది పార్టీ చీఫే. కాని తన కొడుకు తుషార్ సలహా ఇచ్చిన మేరకే ఆమెని ఎన్నిక చేశానని చెప్పాడు. ఎందుకంటే సమీరలాంటి యంగ్ డైనమిక్ వ్యక్తులే ఆ పదవికి అర్హులని తుషార్ ఉద్దేశ్యం. దాంతో తండ్రి చక్రం తిప్పి ఆమెకు పదవి వచ్చేలా చేశాడు.

ఆమె ప్రధాని అయ్యాక తుషార్‌కు ఏదైనా పదవి ఇవ్వాలని అనుకుంది. కాని తుషార్ నవ్వి ప్రజాసేవ చేయడానికి పదవులే అక్కరలేదు. కావాలంటే బయట

ఉండి సలహాలు ఇస్తానని పదవిని సున్నితంగా తిరస్కరించాడు. ఒకవేళ పదవి ఇచ్చానా పార్టీ చీఫ్ తన కొడుక్కి పదవి ఇప్పించుకోవడానికే ఆమెని ప్రధాని చేశారని ఆరోపణలు వస్తాయని తుషార్ అభిప్రాయం.

పేరుకు పదవి లేకపోయినా తుషార్ ఆమెకు సలహాలు ఇస్తుంటాడు. ఆమె తండ్రిని కలుసుకోవడానికి వచ్చిన ప్రతిసారి అతడు కూడా చర్చలో పాల్గొంటుంటాడు. వారి ముగ్గురి చర్చల్లో ముఖ్యాంశం – దేశం ఎదుర్కొంటున్న అవినీతిని అంతమొందించడం.

"ఏమిటి దీర్ఘాలోచనలో మునిగిపోయారు?" తుషార్ పెదవుల మీద నవ్వు.

"అబ్బే ఏం లేదు" నవ్వుతున్న అతడి మొహం చూస్తూ కదిలిందామె కంఠం.

"ఎలా ఉన్నాయి రాజకీయాలు?"

"ఇప్పుడిప్పుడే అలవాటవుతున్నాయి."

"నాకు మటుకు హాయిగా ఉంది. పదవి ఉన్నప్పుడు ఇంటికి త్వరగా రావాలన్నా రాకపోయేవాడిని. ఇప్పుడు హాయిగా యోగా, ప్రాణాయామం చేసుకుంటున్నాను. నచ్చిన పుస్తకం చదువుకుంటున్నాను" అన్నాడు తుషార్.

"మీ హాయి చూస్తుంటే నాకు కన్ను కుడుతోంది. మీకేదైన పదవి ఇవ్వాలనిపిస్తోంది".

"మైగాడ్! ఆ పని మాత్రం చేయకండి. నేను ఏదైనా, కాలేజీలో ప్రొఫెసర్గా జాయిన్ అవ్వాలనుకుంటున్నాను."

"నిజానికి లెక్చరర్ జాబ్ని మించిన జాబ్ లేదు. హాయిగా రెండు క్లాసులు చెప్పి బయటికి పడవచ్చు."

పార్టీ చీఫ్ కలగజేసుకున్నాడు.

"త్వరలో తుషార్కి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను."

తన పెళ్ళి మాటరాగానే తుషార్ ఎవరో పిలుస్తున్నట్లుగా అక్కడ నుండి లోపలికి వెళ్ళిపోయాడు.

పార్టీ చీఫ్ మోడి కంఠం కదిలింది. "మొన్న గట్టిగా నిలదీసి అడిగాను, అతడి మనస్సులో ఎవరైనా ఉన్నారా అని"

సమీర మౌనంగా వింటోంది.

"అప్పుడు బయటపడ్డాడు" పార్టీ చీఫ్ కంఠం కదిలింది". "వాడి మనస్సులో వున్నది ఎవరో కాదు".

ఒక్క క్షణం ఆగి కదిలింది ఆయన కంఠం.

"నీవేనట"

ఆమె షాక్ తగిలినట్టుగా చూస్తుండిపోయింది. ఆయన కొనసాగించాడు. "అవును! నాకు సమీర నచ్చింది. ఆమెను చూశాక వేరే వారినెవరిని చేసుకోవాలన్పించడం లేదన్నాడు".

సమీరలో నిశ్చేష్టత. తుషార్‌తో తను ఎన్నోసార్లు కలిసింది, చర్చించింది. అతడి సన్నిధి మనోహరంగా ఉంటుంది. గల గల మాట్లాడుతూ అవతల వారిని ఉత్సాహపరుస్తాడు. వీటికి తోడు అందగాడు. ఆస్థిపరుడు, చదువుకున్నవాడు. అలాంటివాడు తనని ఇష్టపడ్డాడా?

ఆమె అలా దిగ్భ్రాంతిలో వుండగానే ఆయన కంఠం కదిలింది.

"వాడి నిర్ణయం విన్నాక నేను నిన్ను ఆ దృష్టితో చూశాను. వాడి నిర్ణయం అన్ని విధాల సమంజసమేనన్పించింది. కాకపోతే ఇంతకుముందు నిన్ను నా కూతురుగా భావించాను. ఇప్పుడు తుషార్ మాటలు విన్నాక నీవు నా కోడలయితే బాగుంటుందనిపించింది. నీకు ఇష్టమేనా? కాదో ఆలోచించి చెప్పు".

సమీర ఇంకా షాక్‌లోనే వుంది. చాలా సాధారణమైన అమ్మాయి తను. తండ్రి మరణించాడు. ఎవరూ లేరనుకున్నాక ఒంటరితనంతో అలమటించింది. అప్పుడు పార్టీ చీఫ్ మోడి, అతడి భార్య సుప్రియ, కొడుకు తుషార్ తనని వాళ్ళ కుటుంబంలోని మనిషిలా ఆదరించారు. మీకు నేనున్నామని భరోసా ఇచ్చారు. అంతటితో ఆగారా, కలలో సైతం ఊహించని ప్రధాని పదవికి తన పేరు సిఫార్సు చేశాడు. ఒక రకంగా చెప్పాలంటే వాళ్ళు తనకు పునర్జన్మ ఇచ్చారు. ఇప్పుడు తిరిగి ఆ ఇంటి కోడలుగా చేసుకుంటామంటున్నారు. పైగా తుషార్ అంటే తనకు అయిష్టం లేదు. ఓ ఆత్మీయుడిని చూసిన ఫీలింగ్ ఉంది.

ఏది ఏమైనా ఈ విషయంలో తాను ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోయింది. ప్రధాని పదవికి పెళ్లి ఓ అడ్డంకులా మారుతుందా?

ఆమె మనసులోని భావాలు చదివేసినట్లుగా కదిలిందాయన కంఠం.

"పదవికి, పెళ్ళికి లంకె లేదమ్మా! పెళ్ళైనా సలహాలు ఇవ్వడానికి నేనున్నాను, తుషార్ ఉన్నాడు. పెళ్ళైనా ఆ పదవిని నీవు సమర్ధవంతంగా నిర్వహించడానికి మనమంతా శాయశక్తులా ప్రయత్నిద్దాం".

సమీర ఇంకా ఏమి తేల్చుకోలేకపోతోంది. ద్వంద్వ భావాలతో సతమత మవుతోంది.

"అంకుల్! ఈ విషయం ఇపుడే కదా మీరు నాకు చెప్పారు. నాకు ఆలోచించు కోవడానికి కొంచెం సమయం ఇవ్వండి. నా నిర్ణయం ఓ వారం, పది రోజుల్లో చెపుతాను."

"అలాగేనమ్మా" అనునయం ఆయనలో "నీ ఇష్టం వచ్చినంత సమయం తీసుకొని ఆలోచించు, మీరిద్దరూ తెలివైనవారు, బాగా చదువుకున్నవారు, జీవితాన్ని అర్థవంతం చేసుకుంటారనే ఉద్దేశ్యంతో అలా ప్రపోజ్ చేశాను. బాగా ఆలోచించే నీ నిర్ణయం నాకు తెలియజేయమ్మా"

"అలాగే అంకుల్"

ఆమె బయలుదేరడం చూసి దూరంగా ఉన్న పర్సనల్ సెక్రటరీ కదిలాడు. మరుక్షణం బ్లాక్ క్యాట్ కమెండోలు అలర్ట్ అయ్యారు. ఆమె బయటికి రాగానే త్రివర్ణ పతాకం ఉన్న కారు వచ్చి ఆగింది.

వినయంగా డోర్ తీసి పట్టుకున్నాడు పర్సనల్ సెక్రటరీ. ఆమె ఎక్కగానే సెక్యూరిటీ చీఫ్ తల పరికించాడు. ముందు నాలుగు కార్లు, వెనకాల మరో నాలుగు కార్లు అనుసరిస్తుండగా ఆమె కారు కదిలింది.

## 15

"తనకు, తుషార్‌కు పెళ్ళి"

ఆ ఊహే ఆమెకు గమ్మత్తుగా అనిపించింది.

తుషార్ ఆహ్లాదకరమైన వ్యక్తి. అద్భుతంగా సంభాషిస్తాడు, చూడగానే రాజ కుటుంబానికి చెందిన వ్యక్తిలా అనిపిస్తాడు. మాటల్లో రాజసం, చేతల్లో ఠీవి కనిపిస్తాయి. వాళ్ళ పూర్వీకులు రాజకుటంబీలకులు కావడం వల్ల అనేక రాజభవనాలు, రత్నకాంతులు వారసత్వంగా అతనికి సంక్రమించాయి. పువ్వుకు సువాసన అద్దినట్లుగా రాజకీయాలు ఆ సంపదకు కలికితురాయిగా నిలిచాయి.

నిజానికి తుషార్ రాజకీయాల్లో తనకంటే సీనియర్. అతడు మానవ వనరుల సహాయక మంత్రిగా నాలుగేళ్ళ పదవి నిర్వహించాడు. ఆ నాలుగేళ్ళలో ఒక్కటంటే ఒక్క అవినీతి ఆరోపణ లేదు. డమ్మి యూనివర్సిటీలను మూయించేశాడు. అక్రమ డెఇకల్ కాలేజీల స్థాపనని నిరసించాడు. వాటి మీద ఎంక్వయిరీ వేసి అక్రమాలు బయటపెట్టాడు. ఫారిన్ యూనివర్సిటీలు ఇండియాలో అడుగుపెట్టడానికి దారులు తెరిచాడు. విద్యావ్యవస్థను పటిష్టం చేశాడు. అతడి చర్యలకు విద్యావంతుల ప్రశంసలు లభించాయి. అలా దేశంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు తెచ్చాడు.

తుషార్ సమక్షంలో తనని తాను మర్చిపోతుంది. ఆర్యచంద్ర దెబ్బతో జీవితంలో మరే మగాడిని నమ్మకూడదనుకుంది. కాని తుషార్ మాటలు, తెలివితేటలు తిరిగి తనను మామూలు ప్రపంచంలో పడేసాయి. కేవలం తుషారే కాదు, వాళ్ళ అమ్మగారు చాలా మంచి మనిషి. తనని ప్రధానిగా కాక ఓ కూతురిగా చూసుకునేది. ఆమెకు ఈ రాజకీయాలు తెలియదు. తను వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడల్లా తల్లిదండ్రులు లేని కూతురని కొసరి తిన్పించేది. వారి అభిమానానికి తనకు కళ్ళు చెమర్చేవి.

అలాంటి కుటుంబంలోకి వారు తనని నూతన వధువుగా ఆహ్వానిస్తున్నారు. ఎటొచ్చి తన అంగీకారం కోసమే ఎదురుచూస్తున్నారు.

తాను ఎంత ప్రధాని అయినా ఎప్పుడో ఒకప్పుడు పెళ్ళి చేసుకోవాల్సిందే. ఇలా ఎంతకాలం ఒంటరిగా ఉంటుంది? తను పగలంతా ఎంత బిజీగా ఉన్నప్పటికీ రాత్రయ్యే సరికి ఒంటరితనం తనని ఆవహిస్తుంది. తనకు ఓ తోడు కావాలి. తోడు కావలంటే ఎవరినో ఒకరిని పెళ్ళి చేసుకోవాలి. ఆ చేసుకునేదేదో తనని ఇష్టపడే తుషార్‌నే చేసుకుంటే సరి.

అలా అనుకోగానే ఆమె ఫోన్‌ని చేతిలోకి తీసుకోబోయింది. కాని అంతకు ముందే అది మ్రోగింది. అన్‌లిస్టెడ్ నెంబరది. చాలా తక్కువ మందికి తెలుసు. అలాంటిది ఇప్పుడు తనకు ఎవరు ఫోన్ చేశారు?

"హలో సమీరా...." వ్యంగ్యంగా కదిలింది అవతల నుండి ఆర్యచంద్ర కంఠం.

"నువ్వా? ఏమిటి?" కరుకుగా కదిలిందామె కంఠం.

"ఎంతవరకు వచ్చింది మా అక్క జీవితం నాశనం చేసిన వాడిని పట్టుకోవడం".

"ప్రయత్నిస్తున్నాం" విసుగ్గా ధ్వనించింది సమీర కంఠం "అయినా ఎంతసేపు నీకు అదే గోలా? అయినా మా ప్రయత్నం మేము చేస్తున్నాం"

"సరిగ్గా ఐదు రోజులే ఉంది సమయం ఇంకా. ఐదో రోజుకల్లా అతడిని నాకు అప్పజెప్పాలి.

సమీరకు చిరాకు వచ్చింది. తన ఇష్టం వచ్చిన సమయంలో ఫోన్ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నాడు. ఆ సైన్స్‌ని అడ్డం పెట్టుకొని తనలాంటి ప్రధానినే బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. మామూలుగా అయితే తన హోదాకు అతడిని రెండు నిమిషాల్లో లోపల పడేయించగలడు. కాని అతడి చేతులో ఉన్న 'సైన్స్' అనే ఆయుధానికి భయపడాల్సి వస్తుంది. రెండోది తన ఆచూకీ తెలియకుండా డీల్ చేస్తుంటాడు. ఎక్కడో పబ్లిక్ బూత్ నుండి ఫోన్ చేస్తాడు. ఇలాంటి వారిని పట్టుకోవడం అంత తేలిక కాదు.

"ఏం సమీరా? ఏదో రొమాంటిక్ ఊహల్లో తేలుతున్నట్లున్నావ్? ఎవరి గురించి.." ఆమెని ఉడికించాలని అన్నాడు.

"నా తండ్రిని ఆత్మహత్యకు కారకుడైన నీ గురించి ఆలోచించడం ఎప్పుడో మానేశాను..." కంపరంగా కదిలింది ఆమె కంఠం.

"ఏమిటి నీవు అంత గొప్పదానివా? దేశంలో నీలాంటి అందగత్తెలు లేరనా? లేదా ప్రధాని అన్న అహంకారమా? నిన్ను ప్రేమించిన నేరానికి నేనెంత చిత్రహింసలు అనుభవిస్తున్నానో తెలుసా?"

"అంతా నీలాగా ఉండరు" అక్కసుగా కదిలింది "నీకంటే ఉన్నతమైన వాడిని, నీకంటే సంస్కారం ఉన్నవాడిని, నీకంటే కుటుంబ స్టేటస్ ఉన్న వారినే నేను చేసుకుంటాను. అంతేకాని చీకట్లో దాక్కుని వ్యర్థ ప్రేలాపనలు ప్రేలేవాడిని కాదు"

"సమీరా..." కదిలిందతడి కంఠం ఆగ్రహంగా "నీవు ఎవరిని చూసుకుంటే నాకేమిటి? ఆ మాటకొస్తే నేను నిన్ను ఎప్పుడో మర్చిపోయాను. నాకు కావల్సిన అమ్మాయినే నేను కోరుకుంటాను. నేనంటే ప్రాణం ఇచ్చే వారినే..."

అతడి మాట పూర్తికాకుండానే ఆమె కంఠం కదిలింది.

"రేపు ఉదయం పేపరు చూడు. నా ఎంగేజ్‌మెంట్ తాలూకు వార్త వస్తుంది. అది చూసి కుళ్ళి కుళ్ళి ఏడుద్దువులే".

అవతల నుండి కొద్దిసేపు నిశ్శబ్దం. ఆ తర్వాత కదిలింది ఆర్య కంఠం.

"అలాగా! కంగ్రాట్స్! నాకంటే ఉన్నతమైన వాడినే నీవు చేసుకోవాలని నా

ఆశ. నా జీవితం ఎలాగూ నాశనమైంది. నాకు అదృష్టం లేకపోతే ఇంకొకరికి అది ఉండకూడదనుకొనే మనస్తత్వం కాదు నాది. విష్ యు ఆల్ ది బెస్ట్... బై”

మరుక్షణం ఫోన్ పెట్టేసినట్లుగా క్లిక్ మంది.

◆ ◆ ◆

మర్నాడు అన్ని న్యూస్ పేపర్లు, టీ.వి. ఛానళ్ళు చెలరేగిపోయాయి.

**ప్రధాని సమీరకు, పార్టీ చీఫ్ తనయుడు తుషార్‌తో వివాహం నిశ్చయం.**

న్యూఢిల్లీ 20, మార్చి 2013; భారత నూతన ప్రధాని సమీర తనకు కాబోయే వరుడిని ఎన్నుకుంది. వరుడు ఎవరో కాదు. పార్టీ చీఫ్ సిన్హా తనయుడు తుషార్. అతడు గతంలో మానవ వనరుల శాఖ సహాయమంత్రిగా అత్యంత సమర్థుడిగా పేరు తెచ్చుకున్నాడు. సమీరని ప్రధానిగా నిలబెట్టి సిన్హా ఆమె మీద అభిమానంతో ఆమెని తన కోడలిగా చేసుకొంటున్నానని చెప్పారు.

ఏది ఏమైనా పెళ్ళయిన తర్వాత నుండి తుషార్ కూడా పార్టీలో, రాజకీయాల్లో క్రియాశీలక వ్యక్తిగా చెలామణి కావచ్చని అభిజ్ఞ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కొన్ని టి.వి. ఛానళ్ళయితే సమీర, తుషార్ ఫోటోలు పక్క పక్కనే ఫ్లాష్ చేసి, అప్పుడే పెళ్ళి పాటలు వినిపించసాగాయి. ఇంకొన్ని ఛానళ్ళయితే తుషార్ ఇంటి దగ్గరే కాపలాకాశాయి.

ఏది ఏమైనా ఆ వార్త దేశంలో చర్చనీయాంశమైంది. సమీర అంటే ఆరాధన ఉన్న యువకులు ఆ వార్తని చూసి నిరాశపడ్డారు. కొంతమంది అమ్మాయిలు తుషార్‌ని చూసి అచ్చెరువొందారు. కలల రాకుమారుడిలా ఉన్నాడని సమీర అదృష్టానికి కొద్దిగా జెలసి కూడా ఫీలయ్యారు. ఆ వార్త వినగానే వేల వేల టెలిగ్రామ్‌లు, ఉత్తరాలు ముంచెత్తాయి సమీరని అభినందనలతో

◆ ◆ ◆

సరిగ్గా అదే సమయంలో –

తన ఫ్లాట్‌లో టి.వీ.ల్లో ఆ దృశ్యాలను చూస్తున్నాడు ఆర్యచంద్ర. అతడి కనుకొలనుల్లో ఒక నీటి చుక్క నిలిచింది.

ఒకప్పుడు సమీర తన ఆరాధ్య దేవత. తనంతట తానే వలచింది, వలపించు కుంది. తండ్రితో చెప్పి పెళ్ళికి ఒప్పిస్తానన్నది. ఆఖరికి ఆ తండ్రి తనకు, తన

కుటుంబానికి యమకింకరుడయ్యాడు. తన అక్క నాశనానికి కారకుడయ్యాడు. చివరకు తాను అజ్ఞాతంలోకి నెట్టబడ్డాడు. ఆమెకు మటుకు తండ్రి, పినతండ్రి మరణించిన సెంటిమెంట్‌ని అడ్డుపెట్టుకొని ప్రధాని అయింది. చివరకు తన స్టేటస్‌కు తగిన రాకుమారుడిని వలచి అతడినే పరిణయమాడటానికి నిశ్చయించుకుంది. నిశ్చయించు కుంటే నిశ్చయించుకుంది, కాని తనను, తన స్టేటస్‌ని హేళన చేసింది. తన కంటే ఉన్నతమైన వాడిని, స్టేటస్, డబ్బు ఉన్నవాడిని, పైగా చీకట్లో దాక్కోకుండా స్వేచ్ఛగా తిరిగే వాడినే చేసుకుంటానని సవాల్ చేసి మరీ చూపించింది. ఫలితంగా దేశమంతటా ఆమె పెళ్ళి నిశ్చయ వేడుకల్లో కళకళలాడుతోంది. తను మటుకు నిజంగా దిక్కులేని వాడిలా ఈ అపార్ట్‌మెంట్‌లో వంటరిగా... ఏకాకిగా... ఆలోచిస్తూ పడివున్నాడు.

అతడికెందుకో దుఃఖం పొరలు పొరలుగా వచ్చింది. ఒకప్పుడు... అక్క మరణించిన రోజు వచ్చింది దుఃఖం. ఇప్పుడు మళ్ళీ తన ప్రేయసి తనని అవమానించి, ఇంకొకరితో ఎంగేజ్‌మెంట్ వార్త ప్రకటించినందుకు దుఃఖం వచ్చింది. తనంత దురదృష్టవంతుడు మరొకరు ఉండడేమో! ఈ ప్రపంచంలో తనని అర్థం చేసుకునేవారే లేరా?

దుఃఖాన్ని కంట్రోలు చేసుకుంటూ ఉండగా అప్పుడు గుర్తొచ్చింది దాక్షాయణీ.

అవును! ఆమె ఒకతే తనకు ఈ ప్రపంచంలో మిగిలున్న ఆత్మీయురాలు. ఆమె ఒకటే తనని అర్థం చేసుకోగలుగుతోంది.

అఁద్రసు వెంటనే అతడు వండర్‌మిషన్ ద్వారా దాక్షాయణికి కనెక్ట్ చేశాడు.

దాక్షాయణి భోజనం చేస్తోంది. ఇంట్లో ఎవరూ లేరు.

ఆమె భోజనం పూర్తయ్యే దాకా ఆగి అతడు ఆమెకు రింగ్ చేశాడు.

“హలో”

“నేనే....”

“ఎలా ఉన్నారు?”

“ఏదో ఇలా పడున్నాను”

“అదేమిటి? ఏం జరిగింది? మీరెప్పుడూ ఇంత డల్‌గా లేరు. ఏమయ్యిందీ వేళ?”

“ఏమిటో దాక్షాయణీ! ప్రపంచం మీదే విరక్తి పుట్టేస్తోంది”

"ఎందుకలా అన్పిస్తోంది? ఏం జరిగింది?" ఆందోళన ఆమెలో.

అతడు బరస్ట్ అయ్యాడు. కంఠం గాద్గికంగా తయారయ్యింది. తను సమీరని ప్రేమించడం, ఆమె ప్రధాని కావడం, తనను హేళన చేయడం – మొత్తం వివరించాడు.

క్షణాలు గడుస్తున్నాయి... ఆ ఉద్వేగంలోనే

"మీరు ఇప్పటికీ ఆమెని ప్రేమిస్తున్నారా?"

"లేదు" కదిలిందతడి కంఠం "ఎప్పుడైతే ప్రధాని అయ్యాక ఆమెను కలవాలనుకొని వెళ్ళినప్పుడు సెక్యూరిటీతో నన్ను కుక్కని కొట్టించినట్లు కొట్టించిందే ఆ రోజే ఆమె మీద ప్రేమ సగం పోయింది. దానికి తోడు ఎప్పుడైతే తుషార్‌తో ఎంగేజ్‌మెంట్ జరిగిందో అప్పుడు ఆమె మీద ప్రేమ మొత్తం పోయింది. కాని ఆమె ఎప్పుడైతే నేను స్టేటస్ తక్కువ గలవాడినని, చీకట్లో దాక్కునే వాడినని అన్నదో అప్పుడే నా మనస్సు విరిగిపోయింది. ఆ మాటలే హృదయాన్ని తూట్లు తూట్లు పడేశాయి. దాంతో విరక్తి పుట్టింది".

"డోంట్ ఎక్సయిట్! ప్లీజ్ డోంట్ ఎక్సయిట్" దాక్షాయణి అనునయించింది అతడిని.

"ఇందులో నా కష్టం ఎవరూ అర్థం చేసుకోవడం లేదన్న బాధ నా హృదయాన్ని మెలిపెడుతోంది".

"నేనున్నాను కదా" అనునయం దాక్షాయణితో "నేను ఉన్నంతవరకు మీరు బాధపడక్కరలేదు. మీ గురించి నాకు బాగా తెలుసు. ఉత్తమ సంస్కారవంతులు. ఆడవారిని గురించి నీచంగా మాట్లాడడం నేనెప్పుడూ చూడలేదు. మీరంటే నాకు గౌరవం".

"దాక్షాయణి" అతడి గొంతు గుండెల్లో కొట్టుకులాడుతోంది.

"అవును ఆర్యగారు! మీకు నేనున్నాను. సమీర అంత స్టేటస్, చదువు నాకు లేకపోవచ్చు. కాని మీ జీవితాన్ని ఓ మధుర భావనగా మలుచుతానన్న నమ్మకం నాకుంది".

నోట మాట రానట్లుగా అలాగే ఉండిపోయాడు. కాసేపయ్యాక కదిలిందతడి కంఠం ఉద్వేగంగా.

"థ్యాంక్స్ దాక్షాయణి! థ్యాంక్స్! ఈ ప్రపంచంలో నా కోసం చూసేవారొకరు

ఉన్నారన్న భావన చాలు. నిన్ను నిన్నుగా ప్రేమించుటకు, నీ కోసం నేనొకరిని ఉన్నావన్న ఫీలింగ్ చాలు. ఈ మిగిలిన జీవితాన్ని నేను తృప్తిగా బ్రతికేస్తాను".

◆ ◆ ◆

*"తుషార్ నీకంటే ఉన్నతుడు, సంస్కారవంతుడు, ఉన్నత కుటుంబానికి చెందినవాడు".*

సమీర ఆ రోజు ఫోన్‌లో అన్న మాటలు ఆర్యని తిరిగి తూట్లు పొడుస్తున్నాయి. తనను ప్రేమలోకి దింపి, తన జీవితాన్ని గాడి తప్పించి, తుదకు ప్రధాని అయి తుషార్‌తో ఎంగేజ్‌మెంట్‌కు మానసికంగా సిద్ధం అయి తనని హేళన చేసిందామె. తన స్టేటస్‌ని కించపరిచిందామె. తన లేమితనాన్ని హేళన చేసిందామె. నిజంగా తుషార్ ఉన్నతవంతుడు కావచ్చు, సంస్కారవంతుడు కావచ్చు. ఇంకేదైనా కావచ్చు. కాని ఒక మనిషిని మరో మనిషితో పోల్చడం తప్పు. ఈ ప్రపంచంలో ఎవరి గొప్పతనం వారిదే. ఒకరు చేసే పని ఇంకొకరు చేయలేరు.

అతడికెందుకో తుషార్ గుర్తొచ్చాడు. అతడిని తన టీవీలో ఒకటి, రెండుసార్లు చూశాడు. హ్యాండ్‌సమ్‌గా ఉంటాడు. సమీరకు ఈడూ జోడులాగే ఉంటాడు.

అతడికెందుకో ఒకసారి వండర్ మిషన్‌ని ఉంచి తుషార్‌ని చూడాలన్పించింది. వెంటనే గూగుల్ సెర్చి ఇంజన్‌లో తుషార్ అడ్రసుని టైప్ చేశాడు. మరుక్షణం గూగుల్ రంగులు విరజిమ్ముతూ అతడి అడ్రసుని చూపించింది.

ఆర్య వండర్‌మిషన్‌ని తుషార్ ఇంటికేసి కనెక్ట్ చేశాడు.

మరుక్షణం ధగధగ మెరిసే రాజభవనంలాంటి తుషార్ భవనం కన్పించింది. అక్కడ అణువు అణువు బంగారం అద్దినట్లుంది. ఆ ఇంట్లో అలంకరణ అల్ట్రా మోడ్రన్‌గా ఉంది. ఆఖరికి కుర్చీలు, మంచాలు కూడా బంగారంతోనే చేసినట్లున్నాయి.

హాల్లో పార్టీ ఛీఫ్ సిన్హా కూర్చొని ఉన్నాడు. అతడి చుట్టూ పార్టీ సభ్యులు, ఎంపీలు ఉన్నారు. దేశం ఎదుర్కొంటున్న పరిస్థితులు, పార్టీ సభ్యుల్లో కీచులాటల గురించి వారు చర్చించుకుంటున్నారు.

ఆర్య మౌస్‌ని లోపలి రూమ్‌కేసి కదిలించాడు. లోపల మాస్టర్ బెడ్‌రూమ్‌లో తుషార్ యోగా చేస్తున్నాడు. నైట్ డ్రస్‌లో ఉన్న అతడు క్రింద జింక చర్మం పైన కూర్చుని యోగా చేస్తున్నాడు. కండలు తిరిగిన చర్మం.

సమయం గడుస్తోంది. అప్పటికే రెండు గంటలు అయింది. ఆర్య అతడికేసి వండర్ మిషన్‌ని ఫోకస్ చేసి. ఆ రెండు గంటల్లో యోగా, ప్రాణాయామం, ధ్యానం విడవకుండా చేస్తూనే ఉన్నాడు. అన్ని సెల్‌ఫోన్‌లు, ల్యాండ్‌లైన్‌లు ఆఫ్ చేసి మరీ దీక్షగా యోగా చేస్తున్నాడు.

"ఇంకా ఎంతసేపురా నీ యోగా?" తల్లి కంఠంతో ఈ లోకంలోకి వచ్చాడు తుషార్.

"అమ్మా! నా టీచింగ్ జాబ్‌లో నేను కష్టపడేది తక్కువ. మిగతా వారంతా ఆఫీసుల్లో తెగ కష్టపడుతుంటే నేను కనీసం ఉదయం రెండు మూడు గంటలైనా కష్టపడకపోతే ఎలా? కొద్దిగా ఆగమ్మా"

ఆమె కొడుకుని ముద్దుగా చూస్తూ అక్కడే కూర్చుంది. ఆర్యకు ఆమెను చూస్తే ముచ్చటేసింది. తల్లంటే ఇలా ఉంటుంది కాబోలు! తను జీవితంలో తల్లిని కోల్పోయాడు. తండ్రి పుట్టకముందే పోయాడు. నిజం చెప్పాలంటే తుషార్‌కు అన్నీ వున్నాయి. అటు అమ్మ అనురాగం, ఇటు తండ్రి ప్రేమాభిమానాలు, ఆస్థి, అంతస్తులు, వీటికి తోడు ప్రధానిగా ఓ అందాల భరణి భార్యగా రావడం....

... ఆలోచనలు ఆపి టివీ స్క్రీన్‌కేసి చూశాడు ఆర్య. తుషార్ యోగా ముగించి తల్లి ఇచ్చిన పండ్ల రసం తాగుతున్నాడు.

"రేపు సమీర నీ భార్యగా ఇక్కడ అడుగుపెడితే నీవు కూడా రాజకీయాలలో బిజీ అయిపోతావనుకుంటాను".

"పాపం తాను ఒక్కతే ఇప్పటికి బాగా కష్టపడుతుంది. తనకు హెల్ప్ చేయాలి కదమ్మా"

"అవునురా! తల్లీ తండ్రి లేని పిల్ల! ఆ లోటు మనమే తీర్చాలిరా పిల్లకు" అంటూ ఆమె లోపలికి వెళ్ళిపోయింది గ్లాసు లోపల పెట్టడానికి.

తుషార్ అటు తిరిగి డ్రాయర్‌లో ఓ ఫోటో తీశాడు. అది సమీర ఫోటో.

"హాయ్ డార్లింగ్! ఇంకో పదిహేను రోజుల్లోనే మన పెళ్ళి" పరవశంగా అనుకుంటున్నాడు.

అతడి భావావేశంలోనే క్షణాలు గడుస్తున్నాయ్.

మరో పది నిమిషాల తర్వాత స్నానం చేసి పూజ మొదలుపెట్టాడు తుషార్. అర్థగంటపాటు నిష్ఠగా పూజ చేశాడు.

ఆ తర్వాత టిఫిన్ చేసి యూనివర్సిటీకి బయలుదేరాడు. తన మౌస్‌ని అతడి కారు వెంటనే అనుసంధానించాడు ఆర్య.

తన ప్రియురాలు కాబోయే భర్త గురించి సమాచారం తెలుసుకోవాలని అనుకున్నాడు. కాని తుషార్ వ్యక్తిత్వంలో అతడికి ఎలాంటి పొరబాటు కనిపించడం లేదు.

యూనివర్సిటీ దగ్గర కారు ఆగింది. సూటు, బూటు, టై కట్టుకొన్న తుషార్ హుందాగా నడుస్తున్నాడు. అతడి చేతిలో చిన్నపాటి బ్రీఫ్‌కేస్ ఉంది.

అతడిని చూస్తూనే కారిడార్‌లో విద్యార్థులు వినయంగా పక్కకు తప్పుకున్నారు. ఒక అటెండర్ పరుగుపరుగున వచ్చి అతడి చేతిలోని బ్రీఫ్‌కేస్ చేతిలోకి తీసుకున్నాడు.

తుషార్ హుందాగా నడుస్తూ తన పర్సనల్ ఛాంబర్‌లోకి నడిచాడు. 'తుషార్ మోడి, విజిటింగ్ ప్రొఫెసర్' అన్న నేమ్ ప్లేట్ ట్యూబ్‌లైట్ వెలుగుకు మెరుస్తోంది.

బెల్ కాగానే చేతిలోకి డస్టర్, మార్కర్ పట్టుకొని క్లాసురూమ్‌లోకి నడిచాడు. స్టూడెంట్స్ లేచి నిలబడ్డారు.

"గుడ్ మార్నింగ్ స్టూడెంట్స్! ప్లీజ్ బీ సీటెడ్" అంటూ పాఠం మొదలుపెట్టాడు.

అద్భుతమైన గొంతు అతడిది. కేవలం గంభీర స్వరమే కాదు, మెలోడియస్ వాయిస్ కూడా! విద్యార్థులంతా ట్రాన్స్‌లో వున్నట్లుగా వింటున్నారు. అతడు ఒకసారి చెబితే, మళ్ళీ టెక్స్ట్‌బుక్ చూడాల్సిన అవసరం లేదు. అంత చక్కగా చెప్పగలరు.

మధ్యమధ్యలో చిన్నపాటి జోక్స్ వేస్తూ ఆహ్లాదకరంగా ఉపన్యసిస్తున్నాడు. క్లాస్‌లో అమ్మాయిలు అతడినే ఆరాధనగా చూస్తున్నారు. చాలా మంచి లెక్చరర్ అతడు. మంచి పర్సనాలిటీకి తోడు అద్భుత వాక్చాతుర్యం ఉండడం అదృష్టం. ఆర్య తనలో తాను అనుకున్నాడు.

... క్లాస్‌రూమ్‌లో తుషార్ లెక్చర్ ముగిసింది. స్టూడెంట్సంతా 'థాంక్స్' చెబుతున్నారు. అతడు చిరునవ్వుతో అందరికీ అభివాదం చేసి తన పర్సనల్ ఛాంబర్‌కేసి నడిచాడు.

అలా మధ్యాహ్నం దాకా మూడు క్లాసులు తీసుకొని కారులో ఇంటికి వచ్చాడు. రాగానే కుటుంబ సభ్యులతో భోజనానికి కూర్చున్నాడు.

అతడు ఎక్కువగా సాత్వికాహారం తీసుకున్నాడు. చికెన్, మటన్ లాంటి పదార్థాలు అక్కడ వున్నా తుషార్ ఎక్కువగా సంప్రదాయ వంటలు మీద పడ్డాడు.

"కాస్తా చికెన్ వేసుకోరా" తల్లి వడ్డించబోయింది.

"వద్దమ్మా! మాంసాహారం మానేశాను. దానివల్ల ఎన్నో దుష్ఫలితాలు సంభవిస్తున్నాయి" అంటూ కొబ్బరి చట్నీ వేసుకున్నాడు.

ఆ తర్వాత కొద్దిపాటి పెరుగన్నం తిని చేయి కడుక్కున్నాడు.

"సమీరకు ఫోన్ చేశావా?" తండ్రి అడిగాడు వెనకాల నుండి.

"చేయలేదు నాన్న! తను మీటింగ్‌లతో బిజీగా ఉండి ఉంటుంది. తనని డిస్టర్బ్ చేయడం ఎందుకని చేయలేదు. వీలైతే రాత్రికి చేస్తాను".

"మీరిద్దరు కలసి ఒకసారి కూర్చుంటే పెళ్ళి ఎలా చేయాలో, ఎక్కడ చేయాలో, ఎంతమందిని పిలవాలో నిర్ణయించుకోవచ్చు".

"తొందరేముంది డాడీ! తనకు కాస్త తీరిక దొరికాక వస్తుంది. లేదా ఆమె బిజీగా ఉంటే మనమే వెళ్దాం".

"అలాగే"

ఆర్య సంభ్రమంగా చూస్తున్నాడు. తుషార్ పరిస్థితులకనుగుణంగా నడుచుకుని వాడని తెలుస్తోంది. సమీర అంటే అతడికి ఇష్టం. ఆమె కష్టపడడం అతడు చూడలేడని పిస్తోంది.

... ఆ తర్వాత తుషార్ ఏదో సెమినార్‌కు పేపర్ రాసుకున్నాడు. నాలుగింటికి 'టీ' తాగి, బ్యాట్‌మెంటన్ కోర్టుకు బయలుదేరాడు.

అతడిని చూస్తూనే కేరింతలు కొడుతూ ఉత్సాహంగా వచ్చారు మిత్రులు.

"హాయ్ తుషార్! కంగ్రాచ్యులేషన్స్! ప్రధానితో నీ పెళ్ళి ఫిక్సయిందట".

"నీకంటే అదృష్టవంతుడు లేడు. అందానికి అందం, పదవికి పదవి ఉన్నాయి ఆమెకు..."

"రియల్లీ గ్రేట్! దేశంలో ఇంతమంది ఉండగా ఆమె నిన్నే ఎన్నుకోవడం"

"గురూ! పెళ్ళి ఫిక్సయిన సందర్భంగా పార్టీ ఇవ్వవా?"

అంత అతడిని అభినందిస్తున్నారు. షేక్‌హ్యాండ్‌లు ఇస్తున్నారు. అతడు మాత్రం చిరునవ్వు నవ్వి బ్యాడ్‌మింటన్ కోర్టుకు వెళ్ళి ఆడసాగాడు.

శరీరమంతా చెమట్లు వచ్చేలా రెండు గంటలు బ్యాడ్‌మెంటన్ ఆడాడు. ఆట అయిపోయాక అక్కడున్న టర్కీటవల్‌తో ముఖం, కాళ్ళు, చేతులు తుడుచుకున్నాడు".

"గురూ! పెళ్ళి ఫిక్సయింది కదా! ఇంక రేపట్నుంచి ఆడతావా?" ఓ మిత్రుడు అడిగాడు.

"తప్పకుండా ఆడతాను. మన శరీరంలో మలినాలు చెమట ద్వారా బయటికి రావాలంటే రోజుకు రెండు గంటలు ఆడాలి".

"గుడ్"

"అది సరే గురూ! దేశంలోనే అత్యున్నత పదవిలో ఉన్న ఆమెతో పెళ్ళి పిక్సయింది కదా! మరి పార్టీ ఇవ్వవా?"

"తప్పకుండా" ఓ క్షణం ఆలోచించి "ఎల్లుండి హొటల్ సవేరాలో రాత్రి ఏడింటికి డిన్నర్‌కి రండి. అక్కడ మీ కోసం మూడొందల ఐటమ్స్ రెడీ చేయిస్తాను".

"ఓహ్" అంటూ గంతులు వేశారంతా ఆనందంగా.

ఫ్రెండ్స్ నుండి వీడ్కోలు తీసుకొని కారు వైపు నడిచాడు. డ్రైవర్ వినయంగా తలుపు తీశాడు. తుషార్ కూర్చున్నాక కారులో టేప్ రికార్డ్ ఆన్ చేశాడు. మహ్మద్ రఫీ పాటలు వినిపిస్తున్నాయి.

అతడు కళ్ళు మూసుకున్నాడు రిలాక్సింగ్‌గా అలాగే ఇంటిని సమీపించాడు.

ఇల్లు రాగానే తలారా స్నానం చేశాడు. ఈలోగా తల్లి గబగబా వచ్చింది.

"సమీర ఫోన్ చేసింది. రాత్రి ఎనిమిదింటికి ఇక్కడకు వస్తుందట" తల్లి చెప్పింది.

అతడి హృదయం మానస సరోవరంలో విహరించినట్లయింది. ఆమె పేరు తలుచుకుంటున్నకొద్దీ అతడిలో ఉత్సాహం పరవళ్ళు త్రొక్కుతోంది.

◆ ◆ ◆

సరిగ్గా ఎనిమిదయింది.

ఆ భవనం ముందు కోలాహలం వినిపించింది. ముందు రెండు కార్లు, వెనకాల మరో రెండు కార్లలో సెక్యూరిటీ కమెండోలు వాచ్ చేస్తుండగా సమీర దిగింది. ఆమెలోపలికి అడుగుపెట్టగానే సెక్యూరిటీ అంత బయటే నిలబడిపోయారు.

"రామ్మా! లోపలికి రా...." అంటూ ఎదురేగి ఆహ్వానించాడు సిన్హా.

సమీర ఆ రోజు ప్రత్యేకంగా అలంకరించుకుంది. అందంగా, ఠీవిగా కనిపిస్తోంది. సోఫాలో దర్జాగా కూర్చుంది.

"హాయ్ సమీ...." అంటూ మెట్లు దిగి వచ్చాడు తుషార్.

"హాయ్..." ఆమెలో మధురోహాలు, నిన్నటి దాకా అతడు ఓ ఫ్రెండ్! ఇవ్వాల్టి నుండి అతడు తన వుడ్‌బీ.

ఇద్దరు ఎదురెదురుగా కూర్చున్నారు తుషార్ నవ్వుతూ జోక్స్ వేస్తున్నాడు. ఆమె కూడా అతడికి తగినట్లుగా జోక్స్ వేస్తోంది.

క్షణాలు కదుల్తున్నాయ్ అక్కడ చతురోక్తులతో.

ఆ తర్వాత సిన్హా దంపతులతో డిన్నర్‌కు కూర్చున్నారు. ఆమెకు సిన్హా దంపతులు కొసరి కొసరి వడ్డించారు. కాబోయే కోడలు కాబట్టి చాలా అభిమానంగా ఆప్యాయంగా చూసుకుంటున్నారు.

డిన్నర్ ముగిశాక అందరికి గుడ్‌నైట్ చెప్పి ఆమె కదిలింది.

ఆమెని చూస్తూనే బ్లాక్ క్యాట్ కమెండోలు అలర్ట్ అయ్యారు. ఆమె కూర్చున్నాక కార్లు కదిలాయి.

... ఓ కలలా జరుగుతూ ఉన్న దానిని అలాగే చూస్తున్నాడు ఆర్యచంద్ర.

◆ ◆ ◆

"ఒక రకంగా చూస్తుంటే తుషార్‌ని ఎంపిక చేసుకొని సమీర మంచి పనే చేసినట్లనిపిస్తోంది. తుషార్ దినచర్యని ఒక రోజంతా పరిశీలించాను. అతడు ఎంతో క్రమశిక్షణ గల వ్యక్తి అని తెలుస్తోంది" కదిలింది ఆర్య కంఠం.

"ఎలా చెప్పగలరు?" దాక్షాయణి కంఠం కదిలింది. "ఒక రోజులోనే మనిషి గొప్పతనం తెలుస్తుందా?"

"ఎందుకు తెలియదు దాక్షాయణీ? అన్నం ఉడికిందా, లేదా అన్నది ఒక మెతుకు చూస్తే తెలుస్తుంది. అతడి దినచర్యని మొత్తం వండర్ మిషన్ ద్వారా చూశాను" అంటూ ఆ రోజు తను చూసినంత ఆమెకు వివరించాడు.

దాక్షాయణి మౌనంగా వింటోంది. అప్పుడు కదిలిందతడి కంఠం తిరిగి "దీనిని బట్టి చూస్తే అతడు సెల్ఫ్ డిసిప్లిన్ మనిషని, నిముషం కూడా టైమ్ వేస్ట్ చేసే మనిషి కాదని తెలుస్తోంది. ఎవరి కోసమో కాక తనకోసం తాను సెల్ఫ్ డిసిప్లిన్‌లో బ్రతికే మనిషని అర్థమవుతుంది. అటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే నిముషం సమయం వృథా చేయలేదు. కంప్యూటర్‌లో ఇ-మెయిళ్ళు మాత్రమే చెక్ చేసుకొని మూసేశాడు.

ఈ కాలపు యువకుల్లా ఛాటింగ్, పోర్నోగ్రఫీ వెబ్‌సైట్‌లు ఓపెన్ చేస్తూ సమయం వృథా చేయలేదు. ఏది ఏమైనా సమీర అదృష్టవంతురాల క్రింద లెక్క".

దాక్షాయణి ఆలోచనలో పడింది. ఆర్య చెప్తున్నట్లు తుషార్ చక్కటి క్రమశిక్షణ గల వ్యక్తి కావచ్చు. టైమ్ మేనేజ్‌మెంట్, హెల్త్ మేనేజ్‌మెంట్‌ని పొందిగ్గా తీర్చిదిద్దుకునే వ్యక్తి కావచ్చు. కాని ఒక మనిషిని అంచెనా వేయాలంటే ఈ లక్షణాలు చాలా?

"ఏమిటి దాక్షాయణి ఆలోచిస్తున్నావు?" ఆర్య ప్రశ్నతో అక్కడ నిశ్శబ్దం తన వునికిని కోల్పోయింది.

"ఏమి లేదు. ప్రతి ఒక మనిషి వెనకాల ఎక్కడో ఒక రకపు శాడిజం లేదా రాక్షసత్వం ఉంటుందని ఎక్కడో చదివాను. నేను మగవారిని అంత తేలికగా నమ్మను. ఏదో ఒక పార్శ్వపు కోణంలో అతడిలో అవకరం కనిపిస్తుంది. అందుకే మగవారి మీద నేను అంత త్వరగా ఒక నిర్ణయానికి రాలేను".

"అంటే నీవు నన్ను కూడా నమ్మవా?" ఆశ్చర్యం ఆర్యలో.

"ఛ... మీలాంటి ఉత్తమ పురుషులను అలా అంటే కళ్ళుపోతాయి. మిమ్మల్ని తప్ప ఈ ప్రపంచంలో నేను ఎవరిని నమ్మలేను".

"నాలో అంత గొప్పతనం ఉందా? ఉంటే సమీర నన్ను ఎందుకు వదిలేసింది."

"కొంతమందికి హోదా, డబ్బు, పదవి నచ్చుతాయి. బహుశ ఇవి కూడా కారణం కాకపోవచ్చు. తన తండ్రి ఆత్మహత్యకు మీరే కారకులని ఆమె మనస్సులో నమ్మకం అయిండొచ్చు. ఏది ఏమైనా ఆమె దేశానికి ప్రధాని అయితే మీరు ఆమెని మించిన సృష్టికర్త. మీ వండర్ మిషన్ సహాయంతో ఎంతోమంది అవినీతిని, అక్రమాలను బయటపెడుతున్నారు. దేశంలో అన్ని రంగాలలో ఉన్న కుళ్ళుని, కుతంత్రాలను వెలికి తీస్తున్నారు. సమీరకు అలా అన్ని రంగాలలో కుళ్ళుని తీయడం కష్టం. కాని మీరు ప్రపంచానికి తలమానికంలాంటివారు. మీ మిషన్ లాంటిది ఒకటి చాలు. మొత్తం ప్రపంచాన్ని సస్యశ్యామలం చేయవచ్చు. మీరు అజ్ఞాతంలో ఉండటం వల్ల మీ గొప్పతనం ప్రపంచానికి తెలియకపోవచ్చు. అయినా చేతిలో ఇంత అద్భుతమైన పరికరాన్ని ఉంచుకొన్న ఇంత నిరాడంబరంగా ఉండడం ఇంకొకరి వల్ల కానే కాదు. అలాంటి మీ ముందు తుషార్ లాంటి మామూలు మనిషి ఎంత? అన్నట్లూ తుషార్ అంటే గుర్తు వచ్చింది. మీరు తుషార్‌ని మరింతగా వాచ్ చేస్తే ఏదో ఒక లోపం దొరకవచ్చు".

"లేదు! తుషార్ అంత తొందరగా బయటపడే మనిషి కాడు. అన్నట్లు ఇందాక మీరు అతడి గురించి చెప్తుంటే గుర్తొచ్చింది. అతడు ఎల్లుండి ఫ్రెండ్స్‌కు ఏదో హొటల్‌లో పార్టీ ఇస్తానని చెప్పాడు కదా".

"అవును! హొటల్ సవేరాలో రాత్రి రోజు హొటల్‌లో అతడికేసి ఎక్కుపెట్టండి. అక్కడ ఏదైనా లోపం దొరికితే దొరకవచ్చు. తన మిత్రుల దగ్గర త్రాగేసి ఎన్నో విషయాలు గుప్పిట విప్పవచ్చు".

"అసలు అతడు నాన్‌వెజ్ సరిగ్గా తీసుకోవడం లేదు. అలాంటిది త్రాగుడు అలవాటు ఉంటుందా?" విసుగ్గా కదిలింది ఆర్య కంఠం.

"చెప్పలేము, మామూలుగా బయటపడని వికృత స్వరూపాలు అలాంటి పార్టీల్లో బయటపడవచ్చు. ఒక రాయి వేసి చూడండి. పండు క్రింద పడవచ్చు"

"సరే! ఎల్లుండి సాయంకాలం నాకు అర్జంట్ పని వుంది. ఇవన్ని వాచ్ చేయాలంటే కష్టం కదా".

"వెరీ సింపుల్!! వండర్ మిషన్‌ని ఆ హొటల్ సవేరాలో వాళ్లుండే రూమ్‌కి అటాచ్ చేసి మీ పని మీరు చేసుకోండి. ఆ తర్వాత మీరు ఖాళీ ఉన్నప్పుడు రికార్డు చేసిన ఆ వీడియో క్లిప్పింగ్స్ చూడండి"

"గుడ్ ఐడియా! అలాగే చేస్తాను... బై..."

"సీ యూ... ఆల్ ది బెస్ట్".

◆ ◆ ◆

మరుసటి రోజు....

డైనమిక్ వండర్ మిషన్ వెబ్‌సైట్ వెబ్‌సైట్ మరో బాంబుని పేల్చింది.

**నేషనల్ హైవే దిక్కు మార్చిన మంత్రులు**

సాఫీగా సాగుతున్న పది రోడ్ల ఢిల్లీ నేషనల్ హైవేని కావాలని తమకు ఇష్టం వచ్చినట్లు దిక్కుగా మార్చుకున్నారు కొందరు మంత్రులు, మామూలుగా సాగే నేషనల్ హైవేను వంకరగా మార్చే ఉద్దేశంతో వేల వేల ఎకరాలు కొన్నారు. ఆ తర్వాత అంతకుముందే నిర్ణయించిన దారిలో ఇళ్ళు ఎక్కువ పోతాయన్న ఉద్దేశంతో తమ తమ భూముల ద్వారా వెళ్ళేటట్టుగా ఢిల్లీ రోడ్డు శాఖలోని పట్టుకుని అనుకూలంగా మార్చుకున్నారు.

ఈ విషయంలో జరిగిన సంఘటనల్ని ఈ వెబ్‌సైట్ దృశ్యాలుగా తీసి పాఠకులకు సమర్పించింది.

ఆ దృశ్యాలలో... ఓ ఇద్దరు కేంద్రమంత్రులు ఆ జాతీయ రహదారిని తమ భూముల కేసి మార్చడానికి డబ్బుల కట్టల్ని ముట్టజెపుతున్న దృశ్యాలు మాటలతో సహా కనిపించాయి.

అంతా అయ్యాక డైనమిక్ వండర్ మిషన్ వెబ్‌సైట్ ఇలా వ్యాఖ్యానించింది.

"ప్రజలు ఎంతో కష్టపడి పెరుగుతాయన్న ఉద్దేశంతో ఎన్నో లక్షలు పోసి ఆ స్థలాల్లో భూములు కొన్నారు. కాని ఇలాంటి రాబందులు వారి ఆశలను అడియాసలు చేస్తూ తమ అంతస్తులను పెంచుకుంటున్నారు. అలా అలైన్‌మెంట్‌ని మార్చడం వల్ల జాతీయ సంపద హరించుకుపోవడమే కాక ఎన్నో ఆశలతో స్థలాలు కొన్న ప్రజల పొట్ట కొట్టడమే!"

... అంతే! ఆ వార్తని చూసిన ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో గోలగోల చేశాయి. ప్రధాని అంటే పడని అసమ్మతి వాదులు కూడా వారితో గొంతు కలిపి అరవసాగారు. ప్రజా పౌర సంఘాలు, మానవ హక్కుల సంఘాలు ధర్నాలు చేశాయి, బంద్‌లు నిర్వహించాయి.

దాంతో ప్రధాని సమీర ఆ ఇద్దరు మంత్రుల రాజీనామా కోరక తప్పలేదు. అలా డైనమిక్ వెబ్‌సైట్ ఇద్దరు కేబినేట్ మంత్రుల రాజీనామా చేయడానికి కేంద్ర బిందువుగా నిలిచింది.

దాంతో డైనమిక్ వండర్‌మిషన్ వెబ్‌సైట్ ఎవరిదా అని ఎంక్వయిరీ చేశారంతా. కాని దానిని తమ దగ్గర ఎవరో అనామకులు రిజిష్టర్ చేయించుకునానరని ఆ సైట్ నిర్వాహకులు అమెరికా నుండి తెలియజేయడంతో అంతా మిన్నకుండిపోయారు.

◆ ◆ ◆

సమీర ప్రధాని పీఠం దద్దరిల్లేలా ఓ పెద్ద ప్రమాదం వచ్చి పడింది.

ఆ రోజు ఉదయం అన్ని న్యూస్ పేపర్లలో, టివి ఛానళ్ళు సంచలనాన్ని సృష్టించాయి.

ఆ సంచలనానికి కారణం... బోయింగ్ 737 విమానం హైజాక్.

**విమానంలో ప్రయాణిస్తున్న 200 ప్రయాణికుల హైజాక్**

ఇరాన్ నుండి భారత్ వస్తున్న బోయింగ్ విమానాన్ని కొంతమంది దుండగులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సుమారు 200 ప్రయాణీకుల్లో 10 ఎం.పీ.లు, భారత ఉప రాష్ట్రపతి, 20 మంది పారిశ్రామిక వేత్తలు, 15 మంది దౌత్యవేత్తలు ఉన్నారు. ఒక రకంగా చెప్పాలంటే వీరంతా భారత ప్రభుత్వానికి పునాది లాంటివారు. ఈ విమానాన్ని హైజాక్ చేసిన దుండగులు తమ డిమాండ్‌లను భారత ప్రధాని ముందు పెట్టారు.

వారి డిమాండ్‌లు ఇవి:

1. ప్రపంచంలోనే అత్యంత భయంకర టెర్రరిస్ట్ సుఖదేవ్ ఖాన్‌ను రిలీజ్ చేయాలి.
2. ప్రస్తుతం భారతదేశంలో పర్యటిస్తున్న అమెరికన్ వైస్ ప్రెసిడెంట్ నికోక్సన్‌ని మాకు అప్పగించాలి.
3. భారతదేశ నెంబర్ వన్ సినీతార అనుపమ రాయ్‌ని మా నాయకుడు ఇష్టపడ్డాడు. ఆమెను ఆయనకు అప్పగించాలి.

హైజాకర్ల డిమాండ్‌లు అసమంజసమైనవే కాక సభ్య సమాజం హర్షించనవి. అతి భయంకర టెర్రరిస్ట్ సుఖదేవ్‌ని కొన్ని వందల కుటుంబాల మరణాలకు కారకుడు. బాంబు దాడిలో ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నాడు. అతడికి ఇటీవలనే సుప్రీంకోర్టు మరణ శిక్ష విధించిన విషయం తెలిసిందే!

ఇక అమెరికా వైస్ ప్రెసిడెంట్ మన దేశాన్ని సందర్శించిన సందర్భంలో ఆయనను కిడ్నాప్ చేయాలనుకున్నారు. కాని అత్యంత భద్రత కారణాల దృష్ట్యా అది కుదరక, దుండగులు ఈ హైజాకింగ్‌కు పాల్పడి ఉంటారని తెలుస్తోంది. ఒక దేశపు ఉపాధ్యక్షుని టెర్రరిస్ట్‌లకు అప్పజెప్పే సాహసం ఎవరికీ లేదు. ఒకవేళ అలాంటి ప్రయత్నం ఏదైతే జరిగితే అమెరికా లాంటి అగ్రదేశం చేతులు ముడుచుకుని కూర్చోదన్న విషయం తెలిసిందే.

ఇక ఆఖరి డిమాండ్ – భారతీయ సినీరంగంలోనే నెంబర్ వన్ హీరోయిన్ అనుపమ రాయ్‌ని హైజాకర్లకు అప్పజెప్పడం చరిత్రలోనే అత్యంత హీన విషయమని అలా చేయడం భారతదేశ సంస్కృతికి, సంప్రదాయానికే విరుద్ధమని విజ్ఞులు భావిస్తున్నారు.

కాబట్టి ఎటు నుండి చూసినా కిడ్నాపర్ల డిమాండ్‌లు సమంజసం కాదని తెలుస్తోంది. అయితే తను డిమాండ్లని ఆమోదించని పక్షంలో అందరిని చంపేస్తామని కిడ్నాపర్లు హెచ్చరించడం ఆందోళనకు గురిచేస్తోంది... అటూ టివీ ఛానళ్ళు ఆ వార్తని పదే పదే చూపిస్తున్నాయి.

ఫలితంగా దేశమంతటా సంచలనం. ఎక్కడ చూసినా ప్రజలు ఆ విషయాలే చర్చించుకోవడం మొదలెట్టారు. టీవీ ఛానళ్ళు మాటిమాటికి హైజాకర్ల విమానం ఫైల్ ఫోటోని చూపిస్తున్నాయి. ఆ ప్రక్కనే ప్రధాని ఫోటోని ఫ్లాష్ చేస్తున్నాయి.

ప్రతిపక్షాలు ధర్నాలు ప్రారంభించాయి. ఎన్నడూ నోరు విప్పని రాష్ట్రపతి సైతం ఆందోళన వ్యక్తపరిచాడు. ముంబాయి సినీరంగం హైజాకర్ల డిమాండ్లను ఖండించింది. అనుపమరాయ్‌ని వారికి అప్పగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోమని హెచ్చరించింది. సుప్రీంకోర్టు సైతం ఓ ప్రజావాజ్యం ఆధారంగా ప్రధానిని ఈ విషయం మీద త్వరగా స్పందించాలని కోరింది.

అదలా ఉండగా ఈ వార్త ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. హైజాకర్ల డిమాండ్‌లలో అమెరికా వైస్ ప్రెసిడెంట్ ప్రసక్తి ఉండటం వల్ల అది అంతర్జాతీయ సంచలన వార్తగా మారింది. అన్ని దేశాల వార్తాపత్రికలు, టివి ఛానళ్ళు ఆ వార్తను ప్రసిద్ధంగా పేర్కొన్నాయి. ప్రముఖ టెర్రరిస్టు సుఖదేవ్ సింగ్ హస్తం కేవలం భారతదేశంలోనే కాదు, తమ దేశపు బాంబుదాడుల్లో సైతం ఉందని, అతడిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదని ఇతర దేశాలు భారతదేశాన్ని హెచ్చరించాయి.

తన గదిలో టీవీ ఛానళ్ళనే చూస్తున్న సమీరలో నిశ్చేష్టత... ఇంకో వారం రోజుల్లో తుషార్‌తో తన పెళ్ళి. ఆ హడావిడిలో ఉండగానే ఆశనిపాతంలా ఈ సంఘటన చోటుచేసుకుంది.

'ఇప్పుడేం చేయాలి?' ప్రశ్న ఆమెలో. హైజాకర్ల డిమాండ్లు సాధ్యం కానివి. ఒప్పుకునే ప్రసక్తే లేదు. ఒప్పుకోకపోతే తమ ఎంపీలను, ఇతర ప్రముఖులను చంపేస్తారు. అప్పుడు దేశమంతటా గగ్గోలు మొదలవుతుంది. చేతకాని ప్రధాని పదవి నుండి దిగి పోవాలంటూ ఈసారి ప్రజల నుండి నిరసన మొదలవుతుంది. చరిత్రలోనే అత్యంత చేతకాని ప్రధానిగా తన పేరు నమోదు అవుతుంది.

ఆమె బాధగా నుదురు చేత్తో పట్టుకుంది. ఇప్పటివరకు రాజకీయాలు నత్త క్రింద నల్లేరులా సాగాయి. ఇప్పుడు ముంచుకొచ్చింది అసలైన సమస్య.

గంట క్రితం ఆమె జాయింట్ స్టీరింగ్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసింది. సిబిఐ, రా, ఐబి, మిలిటరీ, ఇంటలిజెన్స్ కలయికతో ఏర్పడిన జాయింట్ స్టీరింగ్ కమిటీలో ఆమె ఆ సమస్యని నివేదించింది. ఆ సమస్యకు పరిష్కారం తెలియక కమిటీ చేతులు ఎత్తేసింది. అందుకే ఏం చేయాలో అర్థం కాక ప్రధాని కోరిక మేరకు ఆ కమిటీ తన చర్చలను ప్రస్తుతానికి వాయిదా వేసి నిష్క్రమించింది.

... ఆలోచిస్తున్న ఆమెకు తుషార్ గుర్తొచ్చాడు. ఈ సమస్యకు అతడేమైనా పరిష్కారం చెప్పగలడేమోనన్న ఆలోచన వచ్చింది.

వెంటనే అతడి నెంబర్‌కు రింగ్ చేసింది.

"హాయ్... సమీ..." అవతల నుండి తుషార్ కంఠం వినిపించింది.

"హాయ్..." నీరసంగా కదిలిందామె కంఠం.

"టీవీలో చూశాను హైజాకింగ్ గొడవ. మన పెళ్ళి దగ్గరకు రాగానే ఈ గొడవ రావడం నిజంగా దురదృష్టం" నిస్పృహగా కదిలింది తుషార్ కంఠం.

"ఛ... బ్యాడ్‌లక్... రాజకీయాలంటే ఏదో అనుకున్నాను కాని ఇంత దారుణంగా ఉంటాయని అసలు అనుకోలేదు"

"అందుకే నేను ప్రస్తుతం మంత్రి పదవి వద్దనుకున్నాను. కాని నాన్నగారు రాజకీయాల్లో ఉండడం వల్ల నాకు అంతో ఇంతో రాజకీయాలు వంటబట్టాయి. ఈ పరిస్థితుల్లో ఎవరైనా నీరు కారిపోవడం సహజం. అయినా ప్రధానికేమైనా వేయి కళ్ళుంటాయా అన్నింటిని పట్టించుకోవడానికి? హైజాకర్లను బ్రతిమాలడం తప్ప వేరే పద్ధతి కనిపించడం లేదు".

"నిజమే కాని హైజాకర్లు కరుడు కట్టిన టెర్రరిస్ట్‌లు. వారు మాట వింటారని నమ్మకం లేదు".

"సమీ... డోంట్ ఎక్సయిట్! కాలమే కొన్ని సమస్యల్ని పరిష్కరిస్తుంది. లెటజ్ సీ.."

"ఓ.కే. తుషార్! బై..."

ఆమె నిరాశగా ఫోన్ పెట్టేసింది. అతనేదో పరిష్కారం చెబుతాడేమోననుకుంది.

కాని సరైన పరిష్కారం రాలేదు. అయిన ఈ సమస్య చాలా జటిలమైనది. ఈ విషయంలో ఎవరైనా ఏం చేయగలరు?

క్షణాలు కదుల్తున్నాయ్ ఆ ఉద్వేగంలోనే

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? అప్పుడే అమెరికా హ్యాటిలైన్ నుండి ఫోన్ కూడా వచ్చింది. తమ వైస్ ప్రెసిడెంట్‌ని రేపే అమెరికాకు పంపించెయ్యమని. అదలా ఉండగా ప్రముఖ సినీతార అనుపమరాయ్ ముంబై హైకోర్టులో కేసు కూడా వేసింది. తనను హైజాకర్లకి అప్పగించకూడదని, అది రాజ్యాంగంలోని వ్యక్తిగత స్వేచ్ఛకు భంగమని 'స్టే' కూడా తెచ్చుకుంది. అంటే కిడ్నాపర్ల డిమాండ్‌లలో రెండింటిని ఆమోదించే అవకాశం లేదు. ఇక మిగిలింది ఒకటే. అది అంతర్జాతీయ టెర్రరిస్ట్‌ని విడుదల చేయడం. దానికి కూడా అంతర్జాతీయ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పైగా ప్రభుత్వం చేతకాక అలా చేసిందన్న విమర్శలు చెలరేగుతాయి కూడా! మీరేం చెయ్యాలి?

క్షణాలు కదుల్తున్నాయ్... ఆ ఉద్రిక్తతతోనే ఆమెని ఆలోచనల్లోంచి మ్రోగింది బయటపడేస్తూ.

"హలో"

ఒక్క క్షణం నిశ్శబ్దం. ఆ తర్వాత వినిపించింది.

"హలో సమీరా! నేను ఆర్యను..."

ఆమెకు చిర్రెత్తుకు వచ్చింది. అసలే తను క్లిష్టమైన సమస్యతో సతమత మవుతుంటే, మధ్యలో ఇతడి గొడవేమిటి? అసలు అతడిని చూస్తేనే తనకు చికాకు అలాంటిది. తన పర్సనల్ ఫోన్ నెంబర్ తెలుసుకొని మాటిమాటికి ఫోన్ చేసి తనని విసిగిస్తున్నాడు. పైగా తను ఈ హైజాకింగ్ సమస్యతో సతమతమవుతుంటే చూసి శాడిస్టిక్‌గా ఎంజాయ్ చేయాలనుకుంటున్నాడేమో!

"ఏమిటి?" కటువుగా కదిలిందామె కంఠం.

"అదే హైజాకింగ్ విషయం..."

"దానితో నీకేమిటి సంబంధం? అసలు నీవెందుకు ఫోన్ చేశావు?" కోపంగా అరిచిందామె.

"అది కాదు సమీరా..."

ఏదో చెప్పబోతున్న అతడిని మధ్యలోనే కట్ చేస్తూ కదిలిందామె కంఠం.

"అది నీకు సంబంధం లేని విషయం"

"ఒక్కసారి నా మాట విను సమీరా..." ఆర్య కంఠం కదిలింది అనునయంగా.

"ఏమిటి?" అనుమానంగా కదిలిందామె కంఠం.

"ఆ హైజాకింగ్ వారిని నేను నీకు పట్టిస్తాను..."

"నీవా...జోకా..." ఆమెకు పిచ్చెక్కింది. "ఏం పిచ్చిపిచ్చిగా ఉందా? సిబిఐ, రా, ఐబి లాంటి డిపార్ట్‌మెంట్లే చేతులెత్తేశాయి. మామూలు వ్యక్తిని. నీవేమన్నా స్పైడర్‌మ్యాన్‌వా? ఇలా అర్థరాత్రి సమయంలో ఫోన్‌చేసి నా టైమ్ తినెయ్యకు".

"సమీరా! ప్లీజ్ నేను నీకు సహాయం చేయడానికే ఫోన్ చేశాను. ఒక్కసారికి నా మాట విను..."

"ఏమిటిది?" అనుమానం ఆమెలో.

"నా దగ్గరున్న వండర్ మిషన్ సహాయంతో నేను హైజాకర్లు ఎక్కడున్నారో చెప్తాను. నీవు ఐబి, రా లలో శిక్షణ పొందిన నలుగురు కమెండోలను రహస్యంగా మూడో కంటికి తెలియకుండా అక్కడికి పంపు. గుట్టు చప్పుడు కాకుండా వారిని మట్టుపెట్టవచ్చు"

"అది ... అది సాధ్యమా?" అనుమానం తిరిగి ఆమెలో.

"ఏదీ వీలుకానప్పుడు ఏదోకటి చేయాలి కదా! ఎలాగూ వారి డిమాండ్‌లను మీరు తీర్చలేరు. వారు ప్యాసింజర్లను చంపేస్తారు. అలాంటప్పుడు మనం ఒక ఛాన్స్ తీసుకోవడంలో తప్పు లేదు కదా!"

అతడి మాటలు ఆమె మెదడులోకి కన్విన్సింగ్‌గా నాటుకుంటున్నాయి.

ఆమె మౌనంగా ఉండటం చూసి ఆర్య కంఠం కదిలింది.

"నీవు చేయాల్సిందల్లా ఒకటే. మెరికల్లాంటి ఓ నలుగురి కమెండోలను ఏర్పాటు చెయ్. వారికి శబ్దం చేయని సెల్‌ఫోన్‌లు ఇవ్వు. ఆ నలుగురి సెల్‌ఫోన్ నెంబర్లకు నేను ఆ అడ్రసులోని ఫోటోలు, మ్యాప్‌లతో సహా నా కంప్యూటర్ నుండి పంపిస్తాను. ఆ రూట్ మ్యాప్‌లను బట్టి ఆ టెర్రరిస్ట్‌లను హతం చేయవచ్చు".

ఆమె అప్రతిభురాలైంది. ఆర్య తనకు సహాయం చేయడం కోసమే అష్టకష్టాలు పడి ఫోన్ చేస్తున్నాడు. తన మెషిన్ సహాయంతో తనకు సహాయం చేస్తానంటున్నాడు.

సరే, నిండా మనిగాక ఏ రాయి అయితేనేం? ఇతడు చెప్పింది సమంజసంగానే కనిపిస్తోంది. పైగా ఇప్పుడున్న పరిస్థితుల్లో మరో ప్రత్యామ్నాయం కూడా లేదు.

"ఓకే ఆర్యా" ఆమె కంఠంలో కొద్దిపాటి ఉత్సాహం "నీవు చెప్పినట్లే ఒక గంటలో మెరికలాంటి నలుగురు కమెండోలను ఏర్పాటు చేస్తాను. వారి ఫోన్ నెంబర్లు నీకు ఇస్తాను..."

"ఓకే సమీరా! మరో గంట తర్వాత నీకు కాల్ చేస్తాను"

◆ ◆ ◆

మరో గంట తర్వాత –

ఆర్య ఫోన్ చేశాడు. అంతకుముందే మిలటరీ ఇంటలిజెన్స్ ఛీఫ్‌తో అత్యంత రహస్యంగా మాట్లాడి ఆమె నలుగురు కమెండోలను, అత్యంత అధునాతన పరికరాలను సమకూర్చి ఆపరేషన్‌కు రెడీ అవమని ఆజ్ఞాపించింది.

ఆ తర్వాత ఆ నలుగురు నెంబర్లను ఆర్యకు తెలియజేసింది.

◆ ◆ ◆

ఇండియా–పాకిస్తాన్ బోర్డర్ రెడ్ క్లిఫ్‌లైను దగ్గర జెట్ విమానంలో దిగారు ఆ నలుగురు కమెండోలు. అంతకు ముందే పాక్ ప్రధానితో సమీర మాట్లాడడం వల్ల ఆ కమెండోలకు పాక్ అధికారులు స్వాగతం పలికారు.

అక్కడ నుండి ఇంకా యాభై కిలోమీటర్ల దూరం ఉంది కిడ్నాపింగ్ జరిగిన స్థలం. పాకిస్తాన్ – ఆఫ్గనిస్తాన్ సరిహద్దుల దగ్గరకు వెళ్ళాలి. మిలటరీ జీపులో వేగంగా బయలుదేరారు ఆ కమెండోలు. కొండలు, గుట్టలు ఉన్న ప్రదేశంలో దిగారు.

అక్కడ నుండి ఇరవై కిలోమీటర్ల దూరంలో హైజాకింగ్ స్థలం ఉందని వారి సెల్‌ఫోన్‌లో మ్యాప్‌లో చూపిస్తుంది. ఆ జీప్‌ని వదిలేసి అక్కడ నుండి కొండల్లో, గుట్టల్లో ఒక్క కిలోమీటర్‌ను అధిగమిస్తూ కదుల్తున్నారు. వారికి తెలుసు తాము వేసే ఒక్క తప్పటడుగు రెండొందల మందిని పొట్టన బెట్టుకుంటుందని. అయితే వారికి ఆశ్చర్యం గొలిపేది ఒకటే – మ్యాప్ మాత్రమే కాక హైజాకింగ్ దృశ్యాలు సైతం తమ సెల్‌ఫోన్‌ల్లో కనిపిస్తుండడం.

మొత్తం పదిమంది కిడ్నాపర్లు కనిపిస్తున్నారు. ఒక్కొక్కరి చేతుల్లో ఆయుధాలు ఉన్నాయి. ప్యాసింజర్లందరినీ సీట్లలోనే తాళ్ళతో కట్టేశారు. నలుగురు కాపలా

కాస్తుండగా మిగతా టెర్రరిస్టులు నిద్రపోతున్నారు. ప్రయాణీకులలో ఎక్కువమంది నిద్రలో మునిగి వున్నారు.

కమెండోలకు తమ గుండె చప్పుడు తమకే వినిపిస్తోంది. చేతిలోని కెమెరాలోని దృశ్యాలు వారి కళ్ళ ఎదుట ఓ లైవ్ సినిమాలా కనిపిస్తున్నాయి. అసలు అలాంటి ఆధునాతన టెక్నాలజీ తమ ఫోన్‌లోకి ఎలా సంభవమో వారికి అర్థం కాలేదు. అయినా కర్తవ్యం కళ్ళ ముందట కదలాడడంతో ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నారు.

తాము బయలుదేరేటప్పుడు ప్రధాని సమీరకు సెల్యూట్ కొట్టినప్పుడు ప్రతిగా ఆమె అన్న పలుకులు గుర్తుకొస్తున్నాయి.

"జాగ్రత్త! మీ చేతిలో రెండొందల మంది ప్రాణాలు ఉన్నాయి. ఒక పొరబాటు... చిన్న పొరబాటు చాలు వారి ప్రాణాలే కాదు. మీ ప్రాణాలు కూడా బలైపోతాయి. అంతేకాదు, దేశ ప్రతిష్ట మొత్తం మంట గలుస్తుంది".

డైనమిక్ ప్రైమ్ మినిస్టర్ ఆమె. తమకు పూర్తి అధికారాలు ఇచ్చింది. ఆమె వచ్చాక మిలటరీ ఇంటలిజెన్స్‌కి కొత్త రక్తం వచ్చింది. అంతకుముందు మన్ను తిన్న పాముల్లా ఉన్న డిపార్ట్‌మెంట్‌లో ఆమె వల్ల జవసత్వాలు వచ్చాయి. సిబిఐ, రా, ఐబిలను నమ్మకుండా ఆమె తమ డిపార్ట్‌మెంట్‌కి ఈ ఆపరేషన్‌ని కట్టబెట్టడం తమ ప్రతిష్టకు చిహ్నం. అలాంటి ఈ ప్రతిష్ఠాత్మక ఆపరేషన్‌లో తాము ప్రాణాలు పణంగా పెట్టి ప్రధానికి పేరు తేవాలి.

క్షణాలు కదుల్తున్నాయి ఆ ఉద్రిక్తతలోనే.

రావాల్సిన గమ్యానికి ఇంకా కిలోమీటర్ ఉందని సెల్‌ఫోన్‌లో మ్యాప్ చూపిస్తోంది. వారి గుండెవేగం హెచ్చింది.

సెల్‌ఫోన్‌లో విమానం లోపల దృశ్యం కనిపిస్తోంది. నలుగురు టెర్రరిస్ట్‌లూ స్టడీగా కాపలా కాస్తున్నారు. ప్రయాణీకులను సీట్లలోనే కట్టేశారు. కాబట్టి నింపాదిగా ఉన్నారు ఆ నలుగురు టెర్రరిస్టులు.

చుట్టూ కీచురాళ్ళ శబ్దం. అప్పుడప్పుడు చెట్ల తాలూకు గాలి తప్ప మరేది కనిపించడం లేదు.

క్షణాలు కదుల్తున్నాయ్... ఆ నిశ్శబ్దంగా

గమ్యస్థానానికి వంద అడుగుల దూరంలో ఉన్నారు కమెండోలు. అక్కడే తమ స్ట్రాటజీని అమలు చేయాల్సిన సమయం వచ్చింది.

"ముందుగా సైలెన్సర్ ఉన్న పిస్తళ్ళతో విమానం బయట గుడారాలలో నిద్రపోతున్న ఆరుగురు టెర్రరిస్ట్‌లను చంపెయ్యండి. అప్పుడు క్షణం కూడా ఆలస్యం చేయకండి. ఆ విమానానికి వంద అడుగుల దూరంలో ఒక బాంబు పేల్చండి. దాంతో ఆ నలుగురు టెర్రరిస్ట్‌లు అటుగా పరిగెడుతారు. మీరు విమానం వెనకాల నుండి మెరుపు వేగంతో ఆ నలుగురిని మట్టుపెట్టండి".

తమ కళ్ళ ముందు సినిమా దృశ్యం కనిపిస్తున్న ఆ దృశ్యాలు ఆ కమెండోలను ఉత్సాహపరుస్తున్నాయి. ఎన్నో ఆపరేషన్‌లలో పాల్గొన్నారు. కాని ఇలా సినిమా దృశ్యాల్లా కళ్ళ ముందు ప్రత్యర్థుల డెన్ కనిపిస్తుంటే అటాక్ చేయడం ఇదే మొదటిసారి.

గమ్యస్థానం సమీపించారు. తమ బూట్లు తీసి పడేశారు శబ్దం రాకుండా ఉండడానికి.

మరుక్షణం...

తమ గూఢారాలలో నిద్రపోతున్న టెర్రరిస్టుల మీద సైలెన్సర్‌తో మెరుపు వేగంతో దాడి చేస్తూనే దూరంగా బాంబు పేల్చారు.

ఆ బాంబు దాడికి దూరంగా నిప్పులు కనిపిస్తున్నాయి. ఫ్లైట్‌లో ఉన్న టెర్రరిస్టులు ఉలిక్కిపడి అటుగా పరుగుతీశారు శత్రువులు అక్కడ ఉన్నారేమోనని.

అప్పుడు...

లోపల ఆరుగురు టెర్రరిస్టులను సైలెన్సర్‌తో చంపేసిన కమెండోలు వెనకాల నుండి మెరుపువేగంతో ఆ నలుగురిని తమ ఏకె 57 రైఫిళ్ళతో మట్టుపెట్టేశారు.

ఆ శబ్దానికి విమానంలో ప్రయాణీకులంతా ఉలిక్కిపడి నిద్రలేచారు.

ఒక నిముషం తర్వాత ... అక్కడ సెల్‌ఫోన్‌లో చూశారా కమెండోలు.

ఒక్కరు కూడా ప్రాణాలతో మిగిలి లేరన్నట్లుగా దృశ్యం చూపించాయి సెల్‌ఫోన్స్.

మరుక్షణం అక్కడ తమతో తెచ్చిన టార్చిలైట్లు వెలిగించారు కమెండోలు. ప్రయాణికుల కట్లు విప్పేశారు.

ప్రయాణీకులకు అర్థమైంది భారత కమెండోలు విజయవంతంగా టెర్రరిస్టులలోమట్టుపెట్టి తమని కాపాడారని.

ఒక్కసారిగా ఆనందోత్సాహాలు వెల్లువిరిశాయి అక్కడ.

◆ ◆ ◆

ఆకాశం మిరుమిట్లు గొల్పినట్లుగా, వేల వేల నక్షత్రాలు మెరిసినట్లుగా ఆ విజయం అద్భుతంగా, అనూహ్యంగా, అపురూపంగా భాసించింది సమీరకు.

ఓ డైనమిక్ ప్రధానిగా సరైన నిర్ణయాలు తీసుకొనే ప్రధానిగా ఆమెను ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్ళాయి పేపర్లు, టీవీ ఛానళ్ళు. ప్రపంచంలో మరే ప్రధాని అంతటి సాహసోపేతమైన నిర్ణయం ఇప్పటిదాకా తీసుకోలేదని పత్రికలు ప్రశంసించాయి. కరుడు కట్టిన టెర్రరిస్ట్‌లను అత్యంత లాఘవంగా మట్టుపెట్టిన ఆమె ప్రతిభని వేనోళ్ళ ప్రశంసించాయి టీవీ ఛానళ్ళు. ఇక ప్రజల దృష్టిలో అయితే ఆమె ఆరాధ్యదేవత అయిపోయింది.

కేవలం దేశంలోనే కాదు, విదేశాల్లో సైతం ఆమె తీసుకున్న సాహసేతర నిర్ణయానికి అచ్చెరవొందారు. నిజానికి రెండొందల మంది ప్రయాణీకుల ప్రాణాలు గాలిలో ఉంచి మెరుపు వేగంతో నిర్ణయాలు తీసుకున్న ఆమె ప్రతిభకు జోహార్లు అర్పించారు.

ఆమె సాధించింది తక్కువ విజయం కాదు. అనేక దేశాల్లో హిట్‌లిస్ట్‌లో ఉన్న సుఖదేవ్ ఖాన్‌ని మట్టుపెట్టించింది. అతడు తలపై అన్ని దేశాలలో కలిపి దాదాపు ఇరవై కోట్లు ప్రైజ్‌మనీ ఉంది. ఆ డబ్బంతా ప్రైమ్ మినిస్టర్ నిధికే పంపిస్తున్నామని వారు పేర్కొన్నారు.

ఆమె దానిని దేశరక్షణ నిధికి ఇచ్చేసింది. ఆపరేషన్‌లో పాల్గొన్న నలుగురు కమెండోలకు ఆమె ప్రమోషన్‌లు, స్థలం, ఇతర సౌకర్యాలు ప్రకటించి వారిని స్వయానా ఆమె అభినందించింది.

◆ ◆ ◆

*నా దేశంలో ఓ కుక్క కూడా ఆకలితో మాడకుండా ఉండాలి.*

– *వివేకానందుడు*

ఆమె కూర్చున్న టేబుల్ పైన ఆ క్యాప్షన్, వివేకానందుడి ఫోటో కనిపిస్తున్నాయి.

ఉదయం నుండి రాత్రిదాకా ఎంతోమంది కలిసి అభినందించారు. రాత్రయినా ఆమె అలిసిపోలేదు. ఇంకా ఉత్సాహంగా ఉంది.

ఆమె తర్వాత రోజు చేయాల్సిన షెడ్యూల్ చూస్తుంది. అప్పుడు మ్రోగింది ఫోన్. ఫోన్ ఎత్తగానే వినిపించింది.

'అభినందన మందార మాల

వేయి వేణువులు నిన్నే పిలవగా,

విజయం సాధించిన ధీర వనితవు" అంటూ

ఒక క్షణం అర్థం కాలేదు. ఎవరు తుషారా? అతడు అంతకుముందే అభినందనలు చెప్పేశాడు. పార్టీ చీఫ్ మోడీ, ఆయన సతీమణి సైతం తని నివాసానికి పర్సనల్‌గా వచ్చి మరీ చెప్పారు. తమ కాబోయే కోడలు ధైర్యసాహసాలను పత్రికా ముఖంగా వర్ణించారు. మరెవరు?

అప్పుడు... అప్పుడు స్ట్రయిక్ అయిందామెకు.

"ఆర్యా..."

"అవును నేనే! కంగ్రాచ్యులేషన్స్...."

కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి ఆమెకు. నిజానికి ఆ విజయం తనది కాదు ఆర్యదే. అతడిచ్చిన గైడ్‌లైన్స్ మాత్రమే తాము అనుసరించారు. అభినందనలు. పొగడ్తలు తను అందుకుంది. కమెండోలు అందుకున్నారు. కాని అసలు వ్యక్తి అందుకోలేదు. అజ్ఞాతంలోనే ఉన్నాడు. తను అతడిని ఛీకొట్టింది. అతడిని కాదని తుషార్‌ని ఎన్నుకుంది. అయినా సరే అతడు తన శ్రేయస్సు కోరి మరీ ఫోన్ చేసి తనకు వ్యూహం ఎలా అమలు చేయాలో చెప్పాడు. అతడు చెప్పిన వ్యూహాన్ని తను అనుసరించింది. ఇందులో తను చేసిందేమి లేదు. న్యాయంగా క్రెడిట్ అంతా అతడికే దక్కాలి.

"వాట్ సమీర... మౌనంగా ఉండిపోయావేం? నా మీద కోపం ఇంకా కోపంగా ఉందా?"

ఇక నిగ్రహించుకోలేకపోయిందామె.

"కోపమెందుకు ఆర్యా? ఈ రోజు నీవు పెట్టిన భిక్ష ఇది. లేకపోతే ఆ టెర్రరిస్ట్‌లు ప్రయాణీకులను చంపేసి ఉండేవారు. అప్పుడు ప్రధానిగా ప్రజలు నా మీద దుమ్మెత్తిపోసేవారు. నేను ఎప్పటికీ తల ఎత్తుకు తిరిగే దానిని కూడా కాదు. రాజీనామా కూడా చేయాల్సి వచ్చేది"

"డోంట్ ఎక్సయిట్ సమీరా! ప్రేమ ఎప్పుడూ త్యాగం కోరుకుంటుంది. తన ప్రియురాలు సుఖంగా ఉండాలన్నదే అవతల వారి మనోగతం. అంతే తప్ప వేరే ఆలోచన లేదు"

సమీర ఒక్కసారిగా బరస్ట్ అయింది.

"ఆ కృతజ్ఞత ఎంతమందికి ఉంటుంది అంది? నా తండ్రి మరణానికి కారకుడయ్యావని నీ మీద ఆగ్రహం పెంచుకున్నాను. కాని నీవు అదేమీ పట్టించుకోకుండా నాకు సహాయం చేశావు. అది... అదే నన్ను నిలువునా కోసేస్తోంది".

"సమీరా! ఒకటి మాత్రం చెప్పగలను. నీ తండ్రి ఆత్మహత్యకు నేనే కారకుడనుకున్నావు. తల్లి లేని నిన్ను గారంగా పెంచాడనుకున్నావు... కాని"

అతడి మాటలను తుంచేస్తూ కదిలిందామె కంఠం.

"ఆ విషయంలో మటుకు తిరుగేలేదు. ఒక్కగానొక్క నా తండ్రిని ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొల్పినందుకు నిన్ను ఎప్పటికీ నేను క్షమించలేను ఆర్యా"

"ఒక్క నిముషం నేను చెప్పేది విను" ఆర్య కంఠంలో ప్రాధేయత" నీ తండ్రి ఆ రోజు ఆత్మహత్య చేసుకోకపోయినా నెల తర్వాత ఎలాగూ చనిపోయేవాడు తెలుసా?"

"నో... నేను నమ్మను. నీవేదో కట్టుకథ అల్లుతున్నావు"

"ఈ ఆర్యా ఇంతవరకు జీవితంలో అబద్ధం చెప్పలేదు, చెప్పడు కూడా! మీ తండ్రికి క్యాన్సర్ ముదిరిపోయింది, నాలుగో స్టేజ్..."

"నిజమా?" ఆకాశంలో నుండి ఓ బాణం రివ్వున తన మెడకు నాటుకున్నట్లుగా బాధ ఆమెలో.

"అవును! కావాలంటే నీ తండ్రి పర్సనల్ రూమ్ కెళ్ళు. అక్కడ ఆయన బీరువాలో మెడికల్ రిపోర్టులు చూడు. ఆయనకు బ్లడ్ కాన్సర్. ఇంకో నెలకంటే ఎక్కువ బ్రతికే అవకాశం లేదని డాక్టర్ పరాంపజే చెప్పాడు. డాక్టర్ పరాంజప్‌ని కలిసినా ఆ విషయం బయటికి వస్తుంది"

"మైగాడ్" షాక్‌లోనే ఆమె పాదాలు కదిలాయి తండ్రి పర్సనల్ ఛాంబర్‌లోకి. ఆమె చేతులు వణుకుతున్నాయి.

తండ్రి పర్సనల్ మెడికల్ రిపోర్టులు తీసింది. నిజమే! బ్లడ్ కాన్సర్ ఆఖరి స్టేజ్ అని అవి చూపిస్తున్నాయి.

"సమీరా! ఒకసారి ఆలోచించు. నా పిహెచ్.డి. కలను ఆయన నాశనం చేశారు. నేను కనిపెట్టిన ఫార్ములాని తన ఘనతగా ఆయన చాటుకున్నారు. ఆఖరికి అంధురాలైన అక్క జీవితం నాశనం కావడానికి ఆయనే కారణం. అలాంటప్పుడు నాకు పగ ఉండదా?"

ఒక్క క్షణం ఆగి తిరిగి కదిలిందతడి కంఠం.

"పైగా ఆయన చేసినవన్నీ అన్యాయాలు, అక్రమాలే. పిహెచ్.డి. కోసం వచ్చిన యువతులను వలలో వేసుకోవడం, డబ్బు తీసుకొని పిహెచ్.డి.లు ఇవ్వడం, యూజిసి ఫండ్స్‌ని అక్రమంగా తినేయడం... ఇవ్వన్నీ ఆయన చేసిన అక్రమాలు. అలాంటి వాటిని నేను బయటపెట్టాను. అది సక్రమమని నీవు చెప్పగలవా?"

ఆమె కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి. ఆయన ఎంత అవినీతిపరుడైనా, అక్రమాలు చేసినా, పాపాలు చేసినా ఆయన తన కన్నతండ్రి. ఆయన పరువు బజారు ఎక్కిందంటే తన పరువు బజారుకెక్కినట్లే!

ఆమెలో కదిలిన ఆలోచనల్ని కనిపెట్టినట్లుగా కదిలింది ఆర్య కంఠం.

"నీకో భయంకర నిజం చెప్పనా? ఇన్నాళ్ళు నీవు బాధపడతావని చెప్పలేదు. ఇప్పుడు చెప్పనా?"

ఆమె ఇంకా నిశ్చేష్టతలో ఉంది. అతడి మాటలకు ఆమె నిశ్చేష్టత నుండి బయటికి వచ్చింది.

"ఏమిటది? ఇంతకంటే భయంకరమైన నిజం ఉందా?"

"అవును అదీ చెప్తాను. నీకు డైజెస్ట్ చేసుకునే మనస్తత్వం ఉందా?"

ఆమెలో ఉద్వేగం. అసలే షాక్‌తో మొద్దుబారి ఉంది మెదడు. ఇంకా వార్తలు ఉన్నాయా?

"చెప్పు ఆర్యా! ఒకటి విన్నా, రెండు విన్నా ఒకటే, నిండా మునిగాక చలేమిటి?"

అప్పుడు దూసుకొచ్చాయి పదాలు ఆర్య నోట రివాల్వర్‌లోంచి దూసుకొచ్చిన బులెట్‌ల్లా.

***"మీ అమ్మగారు సహజంగా చనిపోలేదు.. మీ నాన్న ఆమెని చంపేశారు"***

బయట ఆకాశం బ్రద్దలైన ఫీలింగ్. కాళ్ళ క్రింద భూమి కదులుతున్నట్లని పిస్తోంది.

అప్పుడు ఆమె స్వరపేటికను బ్రద్దలు కొడుతూ కదిలాయ్ పెదాలు.

"నో... నేను నమ్మను! ఎన్నో రాత్రులు నేను నిద్ర మధ్యలో లేచే సరికి ఆయన అమ్మ ఫోటో ముందు కూర్చుని కన్నీళ్ళు పెట్టుకోవడం చూశాను. నేను నమ్మను, కట్టుకథలు చెప్పవద్దు".

ఆర్య కంఠం మెరుపువేగంతో కదిలింది.

"అదంతా నాటకం. నీ ముందు ఉత్తమ తండ్రిలా నటించడానికి ఆయన ఆడిన నాటకం"

ఆ పదాలు ఆమె మెదడుని చేరుకొని రక్తనాళాల్ని బద్దలు కొడుతున్నాయి.

"నో... నీవు మా నాన్న మీద నాకు అన్నీ నూరిపోస్తున్నావు"

"అలా చేస్తే నాకేం వస్తుంది సమీరా! నీ కంప్యూటర్ ఆన్ చేయ్. అందులో – నేను నీకు కొన్ని వీడియోలు ఇ–మెయిల్ ద్వారా పంపించాను. అవి ఒకసారి చూడు"

మరుక్షణం ఆమె చేతులు ఇంటర్‌నెట్ ఎక్స్‌ప్లోరల్ మీద కదిలి జి–మెయిల్‌ని ఓపెన్ చేశాయి. అక్కడ కొత్తగా వచ్చిన ఉత్తరాలలో 'ఆర్య' అన్నదాని మీద క్లిక్ చేసింది.

మరుక్షణం ఆ లెటర్ ఓపెన్ అయింది. దాని క్రిందనే ఉన్న 'అటాచ్‌మెంట్స్' మీద క్లిక్ చేసింది. మరుక్షణం ఆర్య పంపిన మినీ క్లిప్‌లు యూట్యూబ్ ద్వారా కనిపించసాగాయి.

ఒక వీడియోలో... తండ్రి – తల్లి ఫోటో ముందు కూర్చొని శాడిస్టిక్‌గా నవ్వుతున్నాడు.

"హీబా! యూనివర్సిటీలో నీవు నా సహవిద్యార్థివి కదా ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను. ఆ రోజుల్లో నాకు అంతగా ఉద్యోగం లేదు. కేవలం స్కాలర్‌షిప్‌తో బ్రతికేవాడిని. అలాంటిది నేను, మా తమ్ముడు ప్రధాని కావడం వల్ల కోట్లకు పడగలు ఎత్తాను. అప్పుడు నీవంటే నాకు చిరాకు వచ్చింది. నా చుట్టూ సీతాకోకచిలుకల్లా అమ్మాయిలు. దాంతో నీ మీకు నాకు మోజుపోయింది. అందుకే నీవు నా సరదాలకు అడ్డు వస్తున్నావని పాలల్లో నిద్రమాత్రలు కలిపి ఇచ్చి పైకి పంపేశాను. ఇప్పుడు అడ్డు చెప్పేవారే లేదు. మన కూతురు కూడా స్టేట్స్ వెళ్ళిపోయింది. అందుకే నేను పూర్తిగా విందు, వినోదాలలో మునిగి జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నాను"

బయట ఉరుముతున్న ఆకాశం వచ్చి తన తలలో బ్రద్దలవుతున్న ఫీలింగ్ ఆమెలో. ఇన్నాళ్ళు తండ్రిని దేవుడు కంటే ఎక్కువగా భావించింది. కాని అతడు రాక్షసుడికంటే హీనంగా తన తల్లిని అడ్డు తొలిగించాడు. ప్రాణప్రదంగా ప్రేమించి

పెళ్ళి చేసుకున్న తల్లి అతడికి పాతదైపోయింది. చినిగిపోయిన వస్త్రాన్ని తీసి పారేసినట్లుగా ఆమెను వదిలించుకొని తన దారిన తాను జల్సా చేస్తున్నాడు.

ఆమె చేయి స్తబ్దుగా కదిలింది మరో వీడియో కేసి. రెక్కలు విప్పుకున్నట్లుగా ఆ వీడియో కనిపించింది.

ఆ వీడియోలో తండ్రి చుట్టూ వున్న పడుచు అమ్మాయిలతో రాసక్రీడలు జరుపుతున్నాడు. అందులో యాక్టివ్‌గా కదులుతున్న ఓ అమ్మాయి అడిగింది.

"సార్! మీ ఆవిడ ఎలా వుండేవారు? మీకులా అందంగా ఉండేవారా?

"అదా! అంత అందగత్తె కాదు. ఆమె తండ్రికి ఆస్థి కలిసి వస్తుందని ఆమెని చేసుకున్నాను. కాని దావాలో ఆమె ఆస్థి మొత్తం పోయింది. దాంతో నాకు ఆమె మీద మోజు పోయింది. పైగా నా రాసక్రీడలకు అడ్డుపడసాగింది. నేను విడాకులు ఇస్తానన్నాను. తను ఒప్పుకోలేదు. కోర్టుకు లాగుతానని బెదిరించింది. ఇక గత్యంతరం లేక..." నవ్వాడు తండ్రి పొరలుపొరలుగా.

ఆమెకు కాకులు గుర్తొచ్చాయి. పిండాన్ని కొరుక్కునే కాకులు.

తిరిగి ప్రక్కనే ఉన్న ఫోన్ మ్రోగింది. ఆమె చేతులు నిర్లిప్తంగా రిసీవర్‌ని ఎత్తాయి.

"ఐయాం సారీ సమీరా!" ఆర్య గొంతులో బాధ "ఈ విషయం నీకు ఎప్పుడో చెబుదామనుకున్నాను. నీవు బాధపడతావని చెప్పలేదు. కాని నీవు మాటిమాటికి నా కన్నతండ్రిని నీవే చంపావు అంటుంటే నా మనస్సు తూట్లు పడేస్తున్నట్లనిపించి ఎప్పటికైనా నిజం చెప్పాలని రుజువులతో సహా చూపించాను. ఈ వీడియోలన్నీ నా వండర్ మిషన్ ద్వారా నీవు ఫారిన్ వెళ్ళినపుడు ఆయన గదికి ఫోకస్ చేసి రికార్డు చేశాను. వాటినే వాటినే నీకు ఇ–మెయిల్ ద్వారా పంపించాను. ఐయాంసారీ సమీరా! నీ మనసు బాధ పెట్టినందుకు నన్ను క్షమించు" షాక్‌లో నుండి ఇంకా తేరుకోలేదు ఆమె.

తండ్రి అంటే ఎంతో ఎత్తుమీద ఉండే వాడనుకుంది. కాని ఆర్య అది తప్పని నిరూపించాడు. ఈ ప్రపంచంలో తనకు మిగిలిన ఏకైక శ్రేయోభిలాషి తండ్రే అనుకుంది. కాని తన నమ్మకాల వంతెనని తండ్రి బ్రద్దలు కొట్టారు. అసలు ప్రపంచంలో మగవారంతా ఇంతేనా?

అప్పుడు గుర్తొచ్చాడు తుషార్ ఆమెకు. అతడు ఎలాంటి వాడో? చూడటానికి అతడు మంచివాడిలా కన్పిస్తున్నాడు. ఆ మాటొకొస్తే తన తండ్రిలాంటి ఉత్తముడు ఈ భూమ్మీద మరొకరు లేడనుకుంది. కాని తన నమ్మకాన్ని వమ్ముచేశాడు. ప్రేమించి పెళ్ళి చేసుకున్న తన తల్లి జీవితాన్ని కాలరాశాడు. మరి తుషార్ ఎలాంటి వాడో?

మరుక్షణం అదే ప్రశ్న ఆమె నోటినుండి బయటికి వచ్చింది.

"ఆర్యా! తుషార్ గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

జవాబుగా ఆర్య నోట వేగంగా వచ్చాయి పదాలు.

"చాలా మంచివాడు. నీకు తగినవాడు. మీ ఇద్దరి ఈడు జోడూ బాగుంటుంది కూడా"

"నీకెలా తెలుసు?"

"ఎప్పుడైతే నీవు అతడిని పెళ్ళిచేసుకుందామని అనుకున్నావో అప్పుడు నేను అతడి దినచర్యని ఒక రోజంతా పరిశీలించాను. చాలా క్రమశిక్షణ గల వ్యక్తి. ఒక నిమిషం కూడా టైమ్ వేస్ట్ చేయని కాలిక్యులేటెడ్ మనిషి. తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అతడికి తెలుసు. అన్నింటికి మించి సెల్ఫ్‌డిసిప్లెన్ గల వ్యక్తి. తనకేం కావాలో అతడికి బాగా తెలుసు. జీవితాన్ని తనకు అనుకూలంగా మార్చుకొనే వ్యక్తి. వీటికి తోడు నీపైన అపరిమితమైన ప్రేమాభిమానాలు ఉన్నాయి. పైగా అతడి తండ్రి మీ పార్టీ ఛీఫ్. మీరు ప్రధాని. ఆ కుటుంబంలో నీవు హాయిగా ఉండవచ్చని నా అభిప్రాయం."

"కాని నా తండ్రి కూడా ఒకప్పుడు ఇలాగే ఉండేవాడు"

"ఉండొచ్చు, కాని వండర్ మిషన్ ద్వారా తుషార్‌ని నిశితంగా పరిశీలించాను. ఎక్కడ లోపం కన్పించలేదు"

"అంటే అతడు పూర్తిగా వందశాతం పరిపూర్ణ పురుషుడా?"

"99 శాతం మాత్రం నేను గ్యారంటీ ఇవ్వగలను. మిగతా ఒక శాతం రేపు పార్టీలో అతడి క్యారెక్టర్‌ని విశ్లేషించి చెప్పగలను".

"ఏమో ఆర్యా! నాకు చాలా దిగులుగా ఉంది" అమె కంఠంలో ఆవేదన "నా తండ్రి గురించి తెలిశాక ఈ జీవితంలో మగవాడిని నమ్మాలంటే భయం వేస్తోంది."

"బీ బ్రేవ్ సమీరా! దేశానికి ప్రధానివి. నీకు భయం ఎందుకు? ఏ మగవాడిలో లోపం కన్పించినా నీ అధికారంతో నీవు లొంగతీసుకోవచ్చు కదా"

"అధికారం పక్కన ఉంచు. వివాహం అనేది నూరేళ్ళ పంట. అందుకే తుషార్ నాకు సరైన ఎన్నికేనని నేను భావించాను. కాని నా తండ్రి నిజస్వరూపం తెలిశాక నేను చేసుకునే వాడిని సైతం అనుమానించాల్సి వస్తుంది."

"డోంట్ వర్రీ సమీరా! రేపు సాయంకాలం పార్టీ తర్వాత నేను తుషార్ మీద నీకు రిపోర్టు ఇస్తాను. అది వందశాతం పాజిటివ్‌గా ఉంటుందని నా ఆశ."

"నా ఆశ కూడా అదే ఆర్య! మంచికో, చెడుకో అతడినే నా భర్తగా నిర్ణయించు కున్నాను. దేశ ప్రజల దృష్టిలో మా ఇద్దరికి నిశ్చితార్థం జరిగింది. ఇప్పుడు నేను కాదనుకుంటే ప్రజల దృష్టిలో నేను చులకనకు గురవుతాను అదే నా బాధ."

"ఓకే సమీర! చాలా రాత్రి అయింది. ఇవేం ఆలోచించకుండా హాయిగా నిద్రపో! నాకు తెలిసీ తుషార్ ఉత్తమమైన వ్యక్తి. అతడి మీద ఎలాంటి అపవాదులు రావు. రేపు అతడిచ్చే పార్టీలో అతడి పద్ధతులు పరిశీలించి రిపోర్ట్ ఇస్తాను. మామూలుగా దొరకని వారు ఇలాంటి పార్టీలో దొరికే అవకాశం ఉంది. ఎనీ హౌ విష్ యు ఆల్ ది బెస్ట్ సమీరా! గుడ్ నైట్"

"గుడ్ నైట్ ఆర్యా"

## 16

హొటల్ సవేరా!

రాత్రి ఏడుగంటలు కావస్తోంది. తుషార్ తన పార్టీకి వచ్చిన వారిని ఆహ్వానిస్తున్నాడు. పూర్తి సూట్‌లో ఉన్న అతడు హ్యాండ్‌సమ్‌గా కన్పిస్తున్నాడు.

వచ్చిన ఫ్రెండ్స్‌కి వెల్‌కమ్ చెపుతూ షేక్‌హ్యాండ్ ఇస్తున్నాడు. ఇంకొంత మందిని గాఢంగా భుజాలకు హత్తుకుంటున్నాడు.

అక్కడ దాదాపు 95 శాతం మగవారే. మిగతా 5 శాతం ఆడవారిని తుషార్ చిరునవ్వుతో చేతులు జోడించి నమస్కరించి లోపలికి ఆహ్వానిస్తున్నాడు.

మంద్రస్థాయిలో సంగీతం విన్పిస్తోంది. డ్రింక్స్ సర్వ్ చేయబడుతున్నాయి. అందరి చేతుల్లో గ్లాసులు తళతళలాడుతున్నాయి. తుషార్‌కు మందు అలవాటు లేదు కాబోలు ఒక కూల్‌డ్రింక్ బాటిల్ పట్టుకొని కొద్ది కొద్దిగా సిప్ చేస్తున్నాడు.

లండన్‌లో అతడితో పాటు చదువుకున్న ఫ్రెండ్ ఉజ్జ్వల్ సింఘాల్ వచ్చాడు.

అతడిని గాఢంగా కౌగిలించుకున్నాడు. అతడిని తన టేబుల్ దగ్గర కూర్చొండ బెట్టుకున్నాడు తుషార్.

ఈలోగా అనౌన్స్‌మెంట్ విన్పించింది. “ఇప్పుడు ప్రముఖ గాయని ఉషా భండార్కర్ తన సంగీతంతో మిమ్మల్ని ఓలలాడిస్తారు” అంటూ.

మరుక్షణం అక్కడ నిశ్శబ్దం తన ఉనికిని కోల్పోయింది. ఉషాభండార్కర్ పాట మనోహరంగా విన్పిస్తోంది. పెళ్ళి కావాల్సిన ఇద్దరు ప్రేమికుల ఆర్భాటాన్ని ఆమె తన పాటతో ప్రస్తావిస్తోంది.

దూరంగా ఓ ప్రొజెక్టర్‌లాంటి స్క్రీన్ మీద తుషార్–సమీరల ఎంగేజ్‌మెంట్ ప్రోగ్రాం ప్రదర్శింపబడుతోంది. వారం క్రిందట జరిగిన ఎంగేజ్‌మెంట్ తాలూకా దృశ్యాలు అందులో చకచక ప్రదర్శింపబడుతున్నాయి.

తుషార్ అంటే ఆ హొటల్ మేనేజర్లు, స్టీవార్డులు, బేరర్లు అతివినయం చూపిస్తున్నారు. కాబోయే ప్రధాని భర్తగా అతడి పట్ల విపరీతమైన భయభక్తులు చూపిస్తున్నారు.

కాని తుషార్ ఇవేమి పట్టించుకోవడం లేదు. ఎలాంటి డాబూ, దర్పం ప్రదర్శించడం లేదు. చాలా సింపుల్‌గా అందరిని పలకరిస్తున్నారు. మేనేజర్, స్టీవార్ట్‌ల భుజం మీద చేయి వేసి చిరునవ్వుతో ఆర్డర్ ఇస్తున్నారు. ఎక్కడ గర్వంగాని, అతిశయం గాని లేకుండా అందరితో కలిసిపోతున్నాడు.

వేదిక మీద ఉషాభండార్కర్ గొంతెత్తి పాడుతోంది. తదనుగుణంగా సంగీత వాయిద్యాలు మారుమ్రోగుతున్నాయ్.

మందు అక్కడ ఏరులై పారుతోంది. తుషార్ చేతిలో కూల్‌డ్రింక్ మాత్రం పూర్తి కాలేదు. ఏదో మర్యాదకు తాగాలి కాబట్టి దానిని పట్టుకొని తిరుగుతున్నాడు.

క్షణాలు కదులుతున్నాయ్ అక్కడ ఉత్సాహంగా.

మందు పార్టీ తర్వాత రకరకాల మాంసాహార, శాఖాహార పదార్థాలు సప్లయి చేయబడ్డాయి. పంజాబి, బెంగాలి, అస్సాం లాంటి నార్త్ ఇండియన్, ఆంధ్ర, కర్నాటక వంటకాలు ఘుమఘుమలాడుతున్నాయి. ఇవి కాక 40 రకాల టిఫిన్‌లు, వంద రకాల స్వీట్లు, హాట్లు, ఐస్‌క్రీమ్‌లు అక్కడ ప్రత్యక్షమయ్యాయి.

అంతా వంటకాల మీద పడ్డారు. తుషార్ తను లండన్ ఫ్రెండ్ ఉజ్జ్వల్

సింఘాల్‌తో పాటు ఓ టేబుల్ దగ్గర సెటిల్ అయ్యారు. వారిద్దరూ నవ్వుకుంటూ డిన్నర్ తీసుకోసాగారు.

ఉజ్జ్వల్ సింఘాల్ చిలిపిగా తుషార్‌ని ఏదో అడుగుతున్నారు. తుషార్ చిరునవ్వుతో జవాబిస్తున్నాడు.

గాయని ఉషాభండార్కర్ పాట తాలూకు సంగీత హోరు వల్ల అక్కడ ఎవరి మాటలూ వినిపించలేదు. దూరంగా ప్రొజెక్టర్‌లలో మటుకు తుషార్ – తన నెచ్చెలి సమీరకు ఎంగేజ్‌మెంట్ ఉంగరం తొడుగుతున్న దృశ్యం కనిపిస్తోంది. దానిని చూసి తుషార్ నవ్వుతూ తన మిత్రుడికి ఏదో వర్ణిస్తున్నాడు.

వారిద్దరూ చిలిపిగా నవ్వుకుంటున్నారు.

పార్టీ ముగింపుకు వస్తోంది. ఉషాభండార్కర్ ఊగిపోతూ పాడుతోంది. క్లైమాక్స్‌కు వస్తున్నట్లుగా స్వరం పెంచింది. అంతా చప్పట్లు కొట్టారు.

పార్టీ అయిపోవస్తోంది. ఒక్కొక్కరు తుషార్‌కు శుభాకాంక్షలు చెప్పి నిష్క్రమిస్తున్నారు. తుషార్ అందరికి షేక్‌హ్యాండ్‌లు ఇచ్చి సాగనంపుతున్నారు. ఆడవారికి మాత్రం వినయంగా చేతులెత్తి నమస్కరిస్తున్నాడు. పార్టీకి వచ్చినందుకు థ్యాంక్స్ చెప్పి బయట డోర్ దాకా వచ్చి బై చెబుతున్నాడు.

అంతా నిష్క్రమించాక అతడు కూడా ఇంటికి బయలుదేరాడు.

... తన వండర్ మిషన్‌లో ఈ దృశ్యాలన్నీ చూస్తున్న ఆర్యతేజకు ఇందులో అసహజమైనది ఏమీ కనిపించలేదు. తుషార్ చాలా చురుకైన వ్యక్తిని, అతడిలో ఎనర్జిటిక్ లెవెల్‌లు చాలా హైస్థాయిలో ఉన్నాయని, సింప్లిసిటీకి అతడు నిదర్శనమని తెలుస్తోంది. పుట్టింది రాయల్ కుటుంబంలో అయినా నిరాడంబరంగా బ్రతకడం అతడి ప్రత్యేకతను తెలుపుతోంది. ఏది ఏమైనా సమీర అదృష్టవంతురాలు. ఇవాళ, రేపు డ్రింక్స్, సిగరెట్‌లు ఫ్యాషన్ అయిన రోజుల్లో సమీరలాంటి ఉన్నత కుటుంబానికి చెందిన యువకుడిలో అలాంటి ఛాయలేమీ కనిపించడం లేదు. పైగా అతడిలో స్త్రీ కాంక్ష అసలు లేదని తెలుస్తోంది. ఒక మగవాడు స్త్రీని చూసే తీరులోనే అతడు స్త్రీ కాంక్ష కలవాడా, కాదా అని తెలిసిపోతుంది. కాని తుషార్‌లో అలాంటి ఛాయలేమీ లేవు. తన లేడి క్లాస్‌మేట్స్‌ని కూడా చిరునవ్వుతో మిగతా బాయ్‌ఫ్రెండ్‌లా ఆహ్వానించాడు. ఎక్కడ వారి పట్ల అతి ప్రేమగాని, అభిమానంగా చూడటంగాని

లేదు. సో... ఇతడికి క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చేయవచ్చు. ఇతను సమీరకు పర్‌ఫెక్ట్ మ్యాచ్. ఈ విషయం రాత్రి సమీరకు ఫోన్ చేసి చెప్పాలి.

అతడికి ఉన్నట్లుండి దాక్షాయణి గుర్తొచ్చింది. తను ఇప్పుడేం చేస్తుందో అనుకుంటూ వండర్ మిషన్‌ని ఆమె అడ్రసుకు కనెక్ట్ చేశాడు. ఆమె ఖళీగానే కనిపించడంతో ఫోన్ చేశాడు.

“హాయ్....” ఉత్సాహం ఆమెలో. మొదట్లో సిగ్గు ఉండేది ఆమెలో. ఇప్పుడు ధైర్యంగా మాట్లాడుతోంది.

“హాయ్! ఏం చేస్తున్నావు?” ఆర్య కంఠంలో మెస్మరిజం.

“మీకు తెలుసు కదా! వండర్ మిషన్‌లో చూసే ఉంటారు కదా” చిలిపితనంతో కదిలిందామె కంఠం.

“భోజనం చేశావా దాక్షాయణి?”

“ఓ ఫుల్‌గా! మీరేం చేస్తున్నారు అక్కడ?”

“తుషార్, అదే సమీర కాబోయే భర్త ఇవ్వాళ తన ఫ్రెండ్స్‌కి తన పెళ్ళి సందర్భంగా పార్టీ ఇచ్చాడు...” అంటూ మొత్తం వివరించి “అతడిచ్చిన పార్టీలో ఎక్కడ వెకిలివేషాలుగాని, ఆకతాయి పనులు గాని లేవు. పేరుకు లండన్‌లో చదివి వచ్చినా భారతీయ సంస్కృతికి నిదర్శనంగా ఉన్నాడు. ఏ మగవాడిలోనైనా బలహీనతలు పట్టుకోవచ్చు. కాని తుషార్‌లో మటుకు నాకు అలాంటి చిహ్నాలేమీ కనిపించలేదు?”

“అవునా? ఏమో నాకు మటుకు ఈ మగవారిపైన నమ్మకం లేదు. అంతెందుకు పక్కింటి రామారావు అంకుల్ మా ఇంటికి వచ్చినప్పుడల్లా” ఏమ్మా! నాన్నగారు లేరా?” అంటూ ముఖం చూస్తాడు. నేను కొద్దిగా పక్కకి తిరిగేసరికి నా పైట వెనకాల ఎక్స్‌రే తీస్తాడు. మొన్న అటువైపు తిరిగినప్పుడు అద్దంలో అతడి వాలకం అర్థమైంది. కాబట్టి ఫలానా అతడు ఆదర్శపురుషుడు, రాముడులాంటి వాడు అని సర్టిఫికెట్ అంత త్వరగా ఇవ్వలేం. అయినా మీకొక విషయం తెలుసా? మొరిగే కుక్క కరవదు, కరిచే కుక్క మొరగదన్నట్లుగా సంస్కారయుతంగా వుండేవారిలో అసలు లక్షణాలు అంత త్వరగా బయటకు రావు”.

ఆర్యకు మతిపోయింది. దాక్షాయణి ఎంతగా ఎదిగిపోయింది. మొన్నటికి మొన్న రౌడీలకు, పోలీసులకు భయపడుతూ మేకపిల్లలా ఉండే దాక్షాయణి ఈ

రోజు మగవారి మనస్తత్వాల మీద కాచి వడబోసినట్లుగా మాట్లాడుతోంది. ఆడపిల్లలు ఎంతగా ఎదిగిపోతారు?

"ఏమిటి ఆలోచనల్లో మునిగిపోయారు? ఈ పిల్ల చాలా ఎక్కువగా మాట్లాడుతుందేమిటనా?"

"అబ్బే అది కాదు" తడబడ్డాడు ఆర్య. "నీవు ఎన్ని చెప్పు తుషార్‌లో మటుకు అలాంటి లక్షణాలేమి కనిపించవు".

"ఈజిట్? ఓ పని చేయండి. అతడు పార్టీ ఇచ్చిన సిడి కాపీ నాకు ఒకటి నా కంప్యూటర్‌లోకి ఇ–మెయిల్ చేయండి. నేను కూడా పరిశీలిస్తాను. సరేనా?"

"అందులో చూసేదేమీ లేదు. అంత పర్‌ఫెక్ట్‌గా ఉంది. అయినా పంపమంటే పంపిస్తాను. అయినా నీకు కంప్యూటర్ లేదు కదా"

"అదిగో అటు చూడండి" అంటూ దూరంగా కనిపిస్తున్న టాబ్లెట్ పీసిని చూపించింది. "మా నాన్నగారి ఆఫీసులో ప్రతి ఉద్యోగికి వాళ్ళ కంపెనీ తరఫున టాబ్లెట్ పిసి గిఫ్ట్ ఇచ్చారట. ఇంటర్‌నెట్ కనెక్షన్ కూడా దానికే ఇచ్చారు. నాన్నగారు ఇంటికి తీసుకొచ్చి "నీకేమైనా పనికి వస్తుందేమో, చూడమ్మా' అంటూ అక్కడతెచ్చి పెట్టారు. నిన్నంతా దాంతోనే కుస్తీపట్టాను. నా ఫ్రెండ్‌ని తీసుకొచ్చి ఇ–మెయిల్‌ని తెరవడం, తదితర ప్రోగ్రామ్‌ల మీద పడ్డాను. ఎందుకంటే మీ ప్రొఫెషన్ అది కదా! రేపు మీకు ఏదైనా సహాయపడాలంటే నాకు కూడా ఎంతో కొంత కంప్యూటర్, ఇంటర్‌నెట్ పరిజ్ఞానం ఉండాలి కదా"

దిగ్భ్రాంతిగా చూస్తూండిపోయాడు ఆర్య, ఒకప్పుడు దాక్షాయణికి సెల్, కంప్యూటర్ అంటే విముఖత, కాని తన కోసం ఆమె తన ఇష్టాలను వదిలిపెట్టి వాటిని నేర్చుకుంది. ఇతరులకు అనుగుణంగా పరిస్థితులను మార్చుకునే స్త్రీ ఎప్పుడూ ఉత్తమురాలే! కార్యేషుమంత్రి, కరణేషు దాసీ అని ఇలాంటి వారిని చూసే అంటారేమో! ఏది ఏమైనా దాక్షాయణిలాంటి అమ్మాయి దొరకడం తన అదృష్టం.

ఆలోచనల్లోంచి తేరుకొన్నాక కదిలింది ఆర్య కంఠం.

"అలాగే దాక్షాయణి! నీవు కోరినట్లే తుషార్‌కు సంబంధించిన పార్టీ దృశ్యాలు నీకు ఇ–మెయిల్ ద్వారా పంపిస్తాను. అన్నట్లు నీకు ఇ–మెయిల్ ఐడి వుందా?"

"ఉంది! నిన్ననే నా ఫ్రెండ్ నాకు క్రియేట్ చేసింది. దాక్షాయణి 19#3*@ జి–మెయిల్‌కు పంపండి.

"ఓహ్! అయితే వెంటనే నేను ఇ–మెయిల్ చేస్తాను. బై"

"బై... సీయూ అగైన్"

## 17

మరో పది నిముషాల తర్వాత దాక్షాయణి తన టాబ్లెట్ పిసీని తెరిచింది. వైర్‌లెస్ ఇంటర్‌నెట్ కనెక్షన్ గల ఆ టాబ్లెట్ పిసీ టచ్ స్క్రీన్ ద్వారా నడుస్తుంది. దాక్షాయణి తన వేళ్ళను సుతారంగా కదిలిస్తూ ఆర్య పంపిన ఇ–మెయిల్ తాలూకు అటాచ్‌మెంట్‌ని తెరిచింది.

పార్టీ మొత్తం మూడు గంటలు జరిగింది. రాత్రి ఏడింటి నుండి పది దాకా కోలాహలంగా జరిగింది.

ఆమెకు ఎక్కడ ఎలాంటి అసహజత్వం కనిపించలేదు. ఆర్య చెప్పినట్లే తుషార్ చాలా చురుకైన యువకుడు. తను ఓ పార్టీ చీఫ్ కొడుకనిగాని, కాబోయే ప్రధాని భర్తన్న గర్వంగాని అతిశయం గాని కనపడడం లేదు. ఆఖరికి స్టీవార్ట్ అడిగిన వాటికి కూడా ఓపికగా జవాబు చెబుతున్నాడు. ఆ పార్టీకి ఒకరిద్దరు వృద్ధులు కూడా వచ్చారు. వారిని సగౌరవంగా కూర్చొబెట్టారు. వారు ఏదో అడుగుతుంటే అతడు లేచి వినయంగా జవాబు ఇచ్చాడు.

ఎట్టొచ్చి మాటలు మాత్రం వినపడడం లేదు. మామూలుగా వండర్ మిషన్ అయితే ఎలాంటి శబ్దాన్నయినా రికార్డు చేస్తుంది. కాని అదే సమయంలో గాయని ఉషాభండార్కర్ తన సంగీత వాయిద్యాలతో ఆ వాతావరణాన్ని మోత ఎక్కించడంతో మాటలు వినపడడం లేదు.

దాక్షాయణికి కూడా అందులో అనుమానస్పదంగా ఏమీ కనిపించలేదు. అయినా పురుషులలో పుణ్య పురుషులు వేరయా అన్నట్లుగా ఈ ఆధునిక ప్రపంచంలో అక్కడక్కడ తుషార్ లాంటి వారు ఉండవచ్చు.

వెంటనే అదే విషయాన్ని ఆర్యకు ఆమె ఇ–మెయిల్ ద్వారా పంపించింది.

ఆ తర్వాత పిసీని ఆఫ్ చేస్తూ మైండ్ ప్రశాంతంగా ఉన్నప్పుడు ఆ మూవీ క్లిప్‌లను మరోసారి చూడాలనుకుంది.

◆ ◆ ◆

ఆ రోజు రాత్రి పదింటికి –

సమీరకు ఆర్య ఫోన్ చేశాడు.

"సమీరా! తుషార్ ఎన్నిక విషయంలో నీ నిర్ణయం సమంజసంగానే ఉంది. అతడు నిన్న ఇచ్చిన పార్టీలో ఎలాంటి అసహజత్వంగాని, అవకరంగాని కనిపించలేదు. ఓ పరిపూర్ణ పురుషుడికి ఉన్న లక్షణాలన్నీ ఉన్న అసలు సిసలు మగాడులా ఉన్నాడు తుషార్. హోదాలో, చదువులో, స్టేటస్‌లో, అలవాట్లలో అతడు అన్ని విధాలా నీకు తగిన వ్యక్తేననిపిస్తోంది..."

"థ్యాంక్స్ ఆర్యా!" సమీర కంఠంలో ఉత్సాహం "ఈ లోకంలో మగవాళ్ళంటేనే ఏవగింపు కలిగిన నాకు ఈ విషయంలో రిలీఫ్‌ని ఇచ్చావు. నీవు చేసిన సహాయానికి థ్యాంక్స్"

"స్నేహితుల మధ్య థాంక్స్ అవసరం లేదు సమీర! బై... గుడ్ నైట్..."

సమీర కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆర్యని తను అపార్థం చేసుకుంది. తన తండ్రి మరణానికి కారకుడనుకుంది. కాని తన తండ్రే పెద్ద విలన్ అని అతడు నిరూపించాడు. అంతేనా తను తుషార్‌లాంటి స్టేటస్ ఉన్న యువకుడిని ఎన్నుకుంటే అతడిని అన్ని విధాలా పరిక్షించి అతడికి సర్టిఫికెట్ ఇచ్చాడు. అదే ఇంకొకరయితే తనను ప్రేమించిన అమ్మాయికి కాబోయే భర్త గురించి కావలానే నెగిటివ్ రిపోర్ట్ ఇచ్చేవాడు. కాని ఆర్య,... అలాంటివేం మనసులో పెట్టుకోకుండా తన వండర్ మిషన్ ద్వారా తుషార్ నఖశిఖ పర్యంతం పరిశీలించి మరీ మంచి కండక్ట్ సర్టిఫికెట్ ఇచ్చాడు. నిజంగా ఆర్య తన శ్రేయోభిలాషి. తాను బాగుండాలనే తన కోసం తపించి అన్ని విధాల తనకు రక్షణగా నిలుస్తున్నాడు. హ్యాట్సాఫ్ టు హిమ్!

◆ ◆ ◆

రాత్రి పదకొండు అవుతోంది.

పేరుకు పడుకుంది కాని దాక్షాయణిని ఎక్కడో ఏదో సందేహం చుట్టుముడు తోంది. తుషార్ నిజంగా పరిపూర్ణ పురుషుడేనా? ఆ వీడియోలో ఎక్కడో ఏదో అసహజత్వం కనిపిస్తోంది. అదేమిటో తెలియడం లేదు.

ఒకటి

రెండు

మూడు... క్షణాలు కదుల్తున్నాయ్ ఆ ఉద్రిక్తతలోనే

అప్పుడు లేచిందామె తన విదిలించి. మరోసారి టాబ్లెట్ పిసీని చేతిలోకి తీసుకొని డెస్క్‌టాప్‌లోకి డౌన్‌లోడ్ చేసిన తుషార్ పార్టీ వీడియోని ఓపెన్ చేసింది.

మరుక్షణం ఆ వీడియో దృశ్యాలు పిసీని ఆక్రమించాయి.

చాలా పరీక్షగా చూడసాగింది దాక్షాయణి. తుషార్ గెస్ట్‌లో రిసీవ్ చేసుకోవడం, అందరితో కరచాలనం చేయడం, అందరికి డ్రింక్స్ సర్వ్ చేయడం, తాను మాత్రం కూల్‌డ్రింక్ సీసా పట్టుకొని తిరగడం... ఇక్కడ వరకూ బాగానే ఉన్నాయి.

ఎటొచ్చి అతడు – తన ఫ్రెండ్ ఉజ్జ్వల్ సింఘాల్‌తో ఓ టేబుల్ దగ్గర కూర్చొని మాట్లాడుతున్న దృశ్యమే ఆమెకు అసహజంగా అన్పించింది. మరోసారి ఆ దృశ్యాలను ఆమె పెద్దవిగా చేసింది.

ఆ టేబుల్ దగ్గర తుషార్, ఉజ్జ్వల్ సింఘాల్ నవ్వుకుంటూ మాట్లాడుతున్నారు. ఉజ్జ్వల్ సింఘాల్ ఏదో అడుగుతున్నాడు. అప్పుడు తుషార్ అతడి వంక కన్నుగీటి ఏదో చెప్పాడు. అదేమిటి ఆ సంగీత హోరులో వినిపించడం లేదు.

అక్కడే దాక్షాయణిలో ఏదో అనుమానం పొడసూపింది. ఆ సమయంలో తుషార్ అతడితో ఏం మాట్లాడాడు? కన్నుగీటి చిలిపిగా మాట్లాడడం వెనకాల ఏముంది? మామూలు విషయమేనా? ఏదైనా అసహజత్వం ఉందా?

ఉన్నట్లుండి ఆమె చేయి కదిలి తుషార్ లిప్ మూమెంట్స్ వైపు దృశ్యాన్ని పెద్దది చేస్తూ కదిలింది. కేవలం మూవ్‌మెంట్ మాత్రమే కన్పిస్తుంది. కాని శబ్దం వినిపించడం లేదు. అదే... అదే.. దాక్షాయణిలో ఏదో అనుమానాన్ని సృష్టిస్తోంది.

'ఆ సమయంలో అతడు ఏం మాట్లాడాడు?' ప్రశ్న ఆమెలో.

ఆ ఒక్కటి తెలిస్తే చాలు. తుషార్ వంద శాతం పరిపూర్ణ పురుషుడా, కాదా అన్నది తెలుస్తుంది.

ఏదన్నా అద్భుతం జరిగితే తప్ప ఆ విషయం తెలియదు.

ఆమె మనసంతా ఉద్వేగంతో ఊగుసులాడుతోంది. ఆ విషయాన్ని ఎలా తెలుసుకోవడం అన్నదే ఆమె ముందున్న సందేహం.

ఒకటి

రెండు.. క్షణాలు జారుతున్నాయి ఆ ఉద్వేగంలోనే

సరిగ్గా అప్పుడు...

ఆకాశంలో ఓ మేఘం ఫోటిల్లున గర్జిస్తున్నట్లుగా మెరిసిందా ఐడియా ఆమె తలలో అది...

ఇంటర్‌నెట్‌లో లిప్ మూవ్‌మెంట్స్‌ని గుర్తించి మాటలు చెప్పే సైట్ ఒకటుందని తన క్లాసురూమ్‌లో ఒకప్పుడు ఒక స్నేహితురాలు చెప్పిన విషయం గుర్తొచ్చింది.

మరుక్షణం తన శరీరంలో ఏర్పడిన కంపనని అదిమిపెడుతూ కదిలిందామె చేయి గూగుల్‌ని ఓపెన్ చేస్తూ.

గూగుల్ సెర్చి ఇంజన్‌లో ఆమె లిప్ మూవ్‌మెంట్స్ సైట్‌కోసం టైప్ చేసి వెతికింది.

మెరుపు వేగంతో రంగులు విరజిమ్ముతూ ఆ సైట్ కన్పించింది.

వెంటనే ఆ సైట్‌కు తన లిప్ మూవ్‌మెంట్ గల తుషార్ వీడియో క్లిప్‌ని పంపించి, తన ఇ-మెయిల్ అడ్రస్ ఇచ్చింది.

తన రిక్వెస్ట్ ప్రాసెస్ అవుతుందని, కొద్ది క్షణాలపాటు వెయిట్ చేయమని ఆ సైట్ తాలూకు మెసేజ్ కన్పించింది.

మరో రెండు నిమిషాలు గడిచాయి... ఆ ఉద్వేగంలోనే.

అప్పుడు ఆ సైట్ తాలూకు సమాచారం కన్పించింది.

"మీరు పంపిన వీడియో క్లిప్ తాలూకు లిప్ మూమెంట్స్‌ని మా సైట్ అనుభవజ్ఞులు డీ కోడ్ చేసాక సమాచారం మీ ఇ-మెయిల్‌కు పంపబడుతుంది".

దాక్షాయణిలో ఉద్వేగం. మరికొద్ది క్షణాల దాకా ఓపిక పట్టాలా అన్న టెన్షన్ ఆమెలో. చేసేది లేక ఇ-మెయిల్ కోసం చూస్తూ కూర్చుంది.

ఆమె టైమ్ చూసింది. పన్నెండవుతోంది. పక్కగదిలో తండ్రి నిద్రపోతున్నాడు. అర్థరాత్రి కాబట్టి వాతావరణమంతా ప్రశాంతంగా, నిశబ్దంగా ఉంది.

ఆలోచనల్లో వున్న దాక్షాయణి బీప్‌మన్న సౌండ్ విని కంప్యూటర్ కేసి చూసింది. కొత్త ఇ-మెయిల్ వచ్చినప్పుడల్లా అలా బీప్ సౌండ్ వచ్చేలా ఏర్పాటు చేసుకుంది.

లిప్ మూవ్‌మెంట్ డాట్‌కామ్ నుండి కొత్త ఇ-మెయిల్ వచ్చినట్లుగా ఎర్రటి గుర్తు కన్పిస్తోంది.

వడివడిగా కొట్టుకుంటున్న గుండెలతో ఆమె వేలు ఆ ఇ-మెయిల్‌ని ఓపెన్ చేశాయి. ఆ మెసేజ్‌ని చూస్తూ ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. ఆ కంప్యూటర్‌లో అక్షరాలు వేలాదిగా ఎగురుకుంటూ మెదడుని తాకిన భావన.

“సింఘాల్! ఆరు నెలల క్రితం నేను ఓ గుడ్డిదానిని అనుభవించాను. ఆ అనుభవం ఎంత రంజుగా ఉంటుందో తెలుసా? తన మీద ఉన్నది ఎవరో దానికి తెలియదు. మామూలు దానిని ఎంజాయ్ చేస్తే మజా ఏముంటుంది? అందుకే ఆ రోజు కళ్ళు లేని కన్నెపిల్లని బలవంతంగా రేప్ చేశాను. పిట్ట కూడా చక్కటి వాటంగా, ఎవరి చేయి పడని విధంగా ఉంది. జాగ్రత్త! ఇది ఎవరితో చెప్పకు. నా ప్రాణస్నేహితుడివి కాబట్టి నీకు మాత్రమే చెప్తున్నాను. ఆ గుడ్డి దాని తర్వాత నేను టేస్ట్ చేయబోయేది సమీరనే...”

‘మైగాడ్! తుషార్ ఎంతకు తెగించాడు? అతడి వెనకాల ఇంత కథ ఉందా? మరెందుకు అలా రాముడు మంచి బాలుడు అన్నట్లుగా ఇంటా, బయటా నటించాడు?’ ప్రశ్నలు ఆమె మెదడుని తూట్లు పొడుస్తున్నాయి.

అప్పుడు స్ట్రయిక్ అయ్యిందామెకు తుషార్ ఎందుకలా నటించాడో, ప్రధాని కాబోయే భర్తగా అతడి మీద ప్రెస్, పార్టీ సభ్యులు వేయి కళ్ళతో కనిపెడుతుంటారు. అతడిలో ఏ మాత్రం అవకారం దొరికినా వెంటనే పత్రికలు, టీవీ ఛానళ్ళు రోడ్డు మీదకెక్కిస్తాయి. అందుకే ప్రధానితో పెళ్ళయ్యేదాకా ‘రాముడు మంచి బాలుడు’లా నటిస్తున్నాడు. అలా నటించి మంచి మార్కులు కొట్టేస్తాడు. పెళ్ళాయ్యాక ఎన్ని వెధవ్వేషాలు వేసినా ఎవరూ పట్టించుకోరు. బంగారు కలశం దొరికే దాకా అద్భుతంగా నటించాలి. ఒకసారి బంగారు కలశం దొరికాక ఇక తన విశ్వస్వరూపం చూపించినా ఎవరూ ఏం చేయలేరు. అదీ అతడి ప్లాన్!

మరుక్షణం ఆమె చేయి కదిలింది ఆ లిప్ మూవ్‌మెంట్ ఢీకోడ్ మెసేజ్‌ని ఆర్య ఇ–మెయిల్‌కు పంపిస్తూ. దానితో పాటు అసలు తనకు వచ్చిన సందేహమేమిటో, దానిని లప్‌మూవ్‌మెంట్‌కు ఎందుకు పంపించానో వివరంగా రాసి ఇ–మెయిల్‌తో జత చేసింది.

కంప్యూటర్‌లో ఆ ఇ–మెయిల్ తాలూక మెసేజ్ వచ్చింది.

"Your mail has been successfully sent. Congratulations" అంటూ ఆమె పిసిని ఆఫ్ చేసింది. ఇపుడు ఆమె మనసు ప్రశాంతంగా ఉంది. వెంటనే లైట్ తీసేసి, నిద్రకు ఉపక్రమించింది.

***కాని ఆ క్షణంలో ఆమెకు తెలియదు తను ఢీకోడ్ చేసిన ఆ సమాచారం దేశ రాజకీయాలను సమూలంగా మార్చనున్నదని.***

◆ ◆ ◆

# 18

ఉదయం ఏడు గంటలయింది.

ఆర్య బద్దకంగా వళ్ళు విరుచుకున్నాడు. రిమోట్‌లో ఎదురుగా టీవిని ఆన్‌చేశాడు.

"మరో నాలుగు రోజుల్లో ప్రధాని సమీర వివాహం" అంటూ వివరాల్లోకి వెళ్ళిపోయాయి.

"ప్రముఖ పార్టీ ఛీఫ్ వీరేంద్రసిన్హా ఏకైక తనయుడు తుషార్‌తో ప్రధాని సమీర వివాహం జరగనున్నదని ప్రధాని కార్యాలయం ప్రత్యేక సెక్రటరి హసత్ ఆలీ పేర్కొన్నారు. ఈ వివాహ వేదికను ప్రజలంతా తిలకించడానికి న్యూఢిల్లీలోని ప్రగతిమైదానంలో జరగనుందని, అందుకు అత్యంత ప్రతిష్ఠాకరమైన బందోబస్తు మధ్య జరగనున్నదని ప్రధాని కార్యాలయం సెక్రటరీ పేర్కొన్నారు."

అన్ని టీవీ ఛానళ్ళలో ప్రధాని ఫోటో ఫ్లాష్ చేసి చూపిస్తున్నారు. ఆరోజు ప్రత్యేక వార్త ఏదీ లేకపోవడంతో ఆ వార్తనే పదే పదే ఫ్లాష్ చేస్తున్నాయి టీవీ ఛానళ్ళు. ఇంకొన్ని ఛానళ్ళయితే ప్రధాని, ఆమె ప్రక్కనే కాబోయే భర్త తుషార్ ఫోటోని చూపిస్తూ బ్యాక్‌గ్రౌండ్ నుండి పెళ్ళి పాటల ప్రసారం చేస్తున్నాయి.

వాటినే చూస్తూ ఆర్య బ్రష్ చేసుకొని మొఖం కడుక్కున్నాడు. ఆ తర్వాత కాఫీ తయారుచేసుకొని, లాప్‌ట్యాప్‌ని తెరిచాడు.

మరో ఇరవై సెకన్ల తర్వాత మెరుపులు మెరుస్తూ విండోస్-8 ఓపెన్ అయింది. అతడు ఇంటర్నెట్‌ని తెరిచి బ్రౌజర్‌మీద క్లిక్ చేశాడు.

సైట్‌కి వెళ్ళి తనకేమైనా ఇ-మెయిల్స్ వచ్చాయేమోనని చెక్ చేశాడు.

Dhakshaayani అని కన్పించింది. వెంటనే దానిని తెరిచాడు.

తుషార్ పెదాల కదలికను బట్టి డీకోడ్ చేసిన మెసేజ్‌ను దాక్షాయణి పంపించింది. తుషార్ పెదాల్లోంచి వచ్చిన పదాలు ఇలా కన్పించాయి.

*"సింఘాల్! ఆరు నెలల క్రితం నేను ఓ గుడ్డి దానిని అనుభవించాను. ఆ అనుభవం ఎంత రంజుగా ఉంటుందో తెలుసా? తన మీద ఉన్నది ఎవరో దానికి తెలియదు. మామూలు దానిని ఎంజాయ్ చేస్తే మజా ఏముంటుంది? అందుకే ఆ*

*రోజు కళ్ళు లేని కన్నెపిల్లను బలవంతంగా రేప్ చేశాను. పిట్ట కూడా చక్కటి వాటంగా, ఎవరి చేయి పడని విధంగా ఉంది. జాగ్రత్త ఇది ఎవరితో చెప్పకు. నా ప్రాణస్నేహితుడివి కాబట్టి నీకు మాత్రమే చెప్తున్నాను. ఆ గుడ్డి దాని తర్వాత నేను టేస్ట్ చేయబోయేది సమీరనే...”*

‘బాస్టర్డ్’ ఆ మాటలు ఆర్య స్వరపేటికను బ్రద్దలు కొడుతూ బయటికి వచ్చాయి. అతడి శరీరంలో రక్తనాళాలు అంగుళం వంతున వచ్చాయి. ఎంత మోసం చేశాడు తుషార్. మైగాడ్! తేనే పూసిన కత్తిలా ఎంత బాగా నటించాడు. తన నటనతో తనంతట ఆదర్శవ్యక్తి లేనట్లుగా జీవించాడు. అవును! దాక్షాయణి చెప్పినట్లుగా ప్రెస్, టీవి ఛానళ్ళ కళ్ళు గప్పడానికే మేకవన్నె తోలు కప్పుకున్నాడు. వండర్ మిషన్ లేకుంటే ఇలాంటి మేక వన్నె పులులు ప్రాణులను భక్షిస్తాయి.

అప్పుడు గుర్తొచ్చింది ఆర్యకు ఒక విషయం. నిన్న రాత్రే తను తుషార్ గురించి వందశాతం సర్టిఫికెట్ ఇచ్చాడు. తనని నమ్మి ఆమె నిశ్చింతగా నిద్రపోయింది. ఇప్పుడు ఆమె సాలెగూడులో చిక్కుకుంది. ఎలా ఆమెను కాపాడం? పైగా దేశ ప్రజల దృష్టిలో ఆమె పెళ్ళి ఫిక్సయిపోయింది. ఇప్పుడు పీటల మీద ప్రజల దృష్టిలో ఆమె పరువు, ప్రతిష్టలు ఏమవుతాయి?

అతడి తల పగిలిపోతోంది. మెదడులో రక్తనాళాలు ఒకదానికొకటి కలిసిపోయి ఛీద్రం చేస్తున్నాయి. ఇంకసేపు అలాగే ఉంటే పిచ్చెక్కుతుందనిపిస్తోంది.

దాంతో గభాలున లేచి చక్కటి నీళ్ళలో మొఖం కడుక్కున్నాడు. ఫ్లాస్క్‌లో వేడి వేడి టీని కప్పులో పోసుకొని సిప్ చేయసాగాడు. తిరిగి ఆలోచనలు కందిరీగల్లా అతడి చుట్టుముట్టాయి.

‘ఇప్పుడేం చేయాలి? ఈ విషయాన్ని సమీరకు చెప్పాలా? చెబితే తానే కావాలని ఆమె పెళ్ళి చెడగొట్టడానికి ఇలా చేస్తున్నాడనుకుంటుందా? కేవలం లిప్ మూవ్‌మెంట్ ద్వారా మెసెజ్‌ని డీ కోడ్ చేశామంటే ఆమె నమ్ముతుందా? అసలు ఆ లిప్ మూవ్‌మెంట్ సైట్ విషయాన్ని సరిగ్గా డీకోడ్ చేసిందా? ఒక చిన్న పొరబాటు.. ఒక చిన్న తప్పు ఓ నిండు జీవితాన్ని నాశనం చేస్తుంది. అందువల్ల ఆ లిప్ మూవ్‌మెంట్ కరెక్టా, కాదా తెలుసుకోవాలంటే తను మరోసారి తుషార్‌ని వాచ్ చేయాలి. అంతే కాదు, అతడి ఫ్రెండ్ సింఘాల్‌ని కూడా వండర్ మిషన్ ద్వారా మరోసారి పరిశీలించాలి.

ఆ ఆలోచన వచ్చిన మరుక్షణం అతడు వండర్ మిషన్‌ని తుషార్ ఇంటికేసి దృష్టిని సారించాడు.

అప్పుడు ప్రత్యక్షమయ్యాయి దృశ్యాలు. తుషార్ అతడి తండ్రి సిన్హా మాట్లాడుకుంటున్నారు రహస్యంగా. ఆర్య తన సౌండ్ సిస్టమ్‌ని పెంచాడు.

"ఇక మనకు తిరుగులేదు డాడీ! అది పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇయ భయపడాల్సిన అవసరం లేదు. ప్రెస్, టీవి ఛానళ్ళ, కోసం ఎంతగా నటించాల్సి వచ్చిందో?

"నీ సంగతి సరే" సిన్హా కంఠం కదిలింది. "దానిని ప్రధాని చేసేటప్పుడు ఈ ప్లాన్ నా మెదడులో అంకురార్పణ దిద్దుకుంది. అది ఇప్పటి ప్లాన్ కాదు. దీని వెనకాల కొన్ని నెలల సుదీర్ఘ శ్రమ, మేధస్సు ఉంది తెలుసా? ఎప్పటికైనా ప్రధాని పదవి మన కుటుంబానికే రావాలన్న ఉద్దేశంతో ఆ రోజు పార్టీలో ఎంపీల మద్దతు కూడగట్టుకొని దానిని ప్రధానిని చేశాను. ఆ తర్వాత క్రమక్రమంగా అది మన కుటుంబం వైపుకు ఆకర్షితురాలయ్యేటట్లు ఒక్కో పావుని ముందుకు జరుపుకుంటూ వచ్చాను. ఆ తర్వాత నీవు రంగంలోకి దిగావు. నీ వాక్చతుర్యంతో, నీ అద్భుత నటనతో దాని మనసు కొల్లగొట్టి ఈ స్థితికి తీసుకొచ్చావు. ఇదంతా ఎందుకు చేశాం? ప్రధాని పదవిని ఎలాగైనా మన కుటుంబంలోకి తీసుకురావాలన్న కోరిక వల్ల. పెళ్ళయ్యాక దానిని ఓ మూలపెట్టి ఈ దేశాన్ని మనమే పాలిస్తాం…"

ఇద్దరు చేతుల్లో ఖరీదైన విస్కీ బాటిల్స్ ఉన్నాయి. తండ్రీ కొడుకులిద్దరూ కలిసి మందు కొడుతూ రాక్షసానందంతో మంతనాలు జరుపుతున్నారు.

"కాని…." తుషార్ కంఠం కదిలింది "పెళ్ళయ్యాక అది మన నిజస్వరూపాలు తెలుసుకొని ఎదురు తిరిగితే?"

"తిరిగితే దానిని పైకి పంపించడమే! టెర్రరిస్ట్‌లు జరిపిన కాల్పుల్లో అది చస్తుంది. దాంతో సానుభూతి పవనాల్లో దాని మొగుడైన నీవు ప్రధాని అవుతావు…"

"అబ్బా… ఏం బుర్ర డాడీ నీది?" తండ్రి బట్టతలని ముద్దుపెట్టుకున్నాడు తుషార్.

కళ్ళు పెద్దవి చేసి అలాగే చూస్తుంటే పోయాడు ఆర్య. అతడిలో నిశ్చేష్టత. అతడి హృదయం మౌనంగా రోదిస్తోంది. అతని బాధంతా సమీర గురించి. ఎన్నెన్నో కష్టాల తర్వాత ఆమె జీవితానికి ఓ ఆలంబన లభించిందనుకున్నాడు. కాని ఇలాంటి గోముఖ వ్యాఘ్రాలపాలిట పడుతుందనుకోలేదు. కథ ఎటుపోయి ఎటు తిరుగుతోంది?

మరుక్షణం అతడు తన వండర్ మిషన్‌ను తుషార్ మిత్రుడైన సింఘాల్ వైపు

దృష్టి సారించాడు. తుషార్ తన మిత్రులందరిని ఖరీదైన ఓ హొటల్‌లో పెట్టాడాన్ని పార్టీలో మాటల మధ్య తెలిసింది. ఢిల్లీలో అలాంటి సెవన్ స్టార్ హొటళ్ళు రెండున్నాయి.

మరో పది నిముషాలు అతడి చేతి వేళ్ళు కీబోర్డు మీద, నిరంతరాయంగా కదిలాయి. ఆఖరికి తాజ్ ఓబెరాయ్ హొటల్‌లో సింఘాల్ ఉన్నట్లుగా తెలిసింది.

మరుక్షణం ఆర్య – సింఘాల్ సూట్ నెంబర్ 203ని టైప్ చేశాడు.

వెంటనే ఆ సూట్ దృశ్యాలు వండర్ మిషన్‌లోకి ప్రత్యక్షమయ్యాయి.

సింఘాల్ ఓ అందమైన అమ్మాయిలో రాసక్రీడలో ఉన్నాడు. ఇద్దరి వంటిమీద నూలుపోగు లేదు. ఆమె మీద ఉన్న సింఘాల్ రసానందంతో ఊగిపోతున్నాడు. ఆ అమ్మాయి కూడ అతడికి తగ్గినట్లుగా సహకరిస్తోంది.

మరో పది నిమిషాల తర్వాత సింఘాల్ ఆ అమ్మాయి మీద నుండి లేచాడు తృప్తిగా. ఆ అమ్మాయి సైతం లేచి బట్టలు వేసుకోసాగింది.

"అబ్బా! నా ఫ్రెండ్ తుషార్ నీలాంటి చక్కటి అమ్మాయి పొందు కల్పిస్తాడను కోలేదు. లండన్‌లో నాకు ఎప్పుడూ నీలాంటి పసందైన పిల్ల తగల్లేదు. అవునూ! నాకొక సందేహం! తుషార్ నిన్నెప్పుడన్నా టచ్ చేశాడా?"

"లేదు, కాని అతడు టచ్ చేస్తే నాకు చాలా ఇష్టం"

"అవునా! అయినా తుషార్ నీలాంటి సెకండ్ హ్యాండ్ పిట్టల్ని టచ్ చేయడు. అతనిదంతా ఓరిజినల్ ఛాయిస్. ఒకే ఒకప్పుడు ఒక బ్లైండ్ కన్నెపిల్ల పొందు చూశాడట. ఆ తర్వాత మళ్ళీ లేదట. మరో రెండు రోజుల్లో అతడి పెళ్ళి కదా! తాను చాలా బిజీగా ఉండి ఉంటాడు...."

ఆర్య వినడం లేదు. అతడి కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి. తాను పొరబాటుపడ్డానని అనుకున్నాడు. అది పొరబాటు కాదు. వాస్తవమేనని తెలిసింది. అదే తన మెదడుని తూట్లు పొడుస్తున్నాయ్. తన ప్రియనెచ్చెలిని తిరిగి అగాధంలోకి నెట్టబోతున్నాడు. ఆమె బ్రతుకు సాలెగూడులో చిక్కుకున్న పురుగు బధంలా మారబోతుంది.

'ఇప్పుడేం చేయాలి?' అన్నదే అతడికి మింగుడు పడని విధంగా తయాఐంది.

వెంటనే దాక్షాయణికి ఫోన్ చేశాడు. తాను వండర్ మిషన్ ద్వారా చూసిన దృశ్యాలన్నీ ఆమెకు వివరించాడు. అంతా విన్న దాక్షాయణి కంఠం కదిలింది.

"మీరు చూసిన విషయాలన్నీ ఆమె ఇ-మెయిల్ వెంటనే పంపించేయండి. ఆ దృశ్యాలన్నీ అటాచ్ చేసి పంపండి"

"కాని... దీనిని ఆమె ఎలా తీసుకుంటుందోనన్న భయంగా ఉంది"

"చూడండి ఆర్యా!" స్థిరంగా కదిలింది దాక్షాయణి కంఠం "మనకు తెలిసింది మనం తెలియజేయాలి. తెలిసీ తప్పులు దాచిపెట్టకూడదు...."

ఆర్యలో దిగ్భ్రాంతి, ఇంకా ఏవేవో సందేహాలు చుట్టుముడుతున్నాయి.

ఈలోగా అవతల నుండి దాక్షాయణి కంఠం కదిలింది. "చూడండి! ఇందులో మీ తప్పేమీ లేదు. అసలు వండర్ మిషన్ అనేదే లేదనుకోండి. అప్పుడు తుషార్ చేసిన దురంతాలు ఎలా బయటికి వస్తాయి? రావు కదా! వండర్ మిషన్ ఉన్నా, లేకపోయినా తుషార్ దోషే కదా! అందులో తిరుగులేదు. కాకపోతే వండర్ మిషన్ ఉండటం వల్ల మనం వాటినే ముందు బయటపెట్టాం. ఇక నిర్ణయాన్ని సమీరకు వదిలెయ్యడం ఉత్తమం"

"అంతేనంటావా?"

"అంతే! సమయం ముంచుకొస్తుంది. మీరు వెంటనే విషయాన్ని సమీరకు తెలియజేయండి. ఆమె ఏదో ఒక నిర్ణయం తీసుకుంటుంది."

"ఓకే" మరుక్షణం అతడు ఫోన్ పెట్టేశాడు.

ఆ తర్వాత అతడి చేతులు మెషన్‌లో కదిలాయి. సమీరకు ఇ-మెయిల్‌కి ఆ దృశ్యాలన్ని అటాచ్ చేసి తన స్వంత మెసేజ్‌ని ఇలా టైప్ చేసాడు.

"అయామ్ వెరీ సారీ సమీరా! తుషార్ గురించి నిన్ననే నేను పాజిటివ్ రిపోర్ట్ ఇచ్చాను. కాని ఇంతలోనే ఆ నిర్ణయాన్ని మార్చుకోవలసి వచ్చింది. దీనికి కారణం – తుషార్ అద్భుత నటనాకౌశల్యం. ప్రపంచంలో ఏ యాక్టర్ అంత అద్భుతంగా నటించి వుండడు. అందుకే వండర్ మెషిన్ సైతం అతన్ని పట్టుకోలేకపోయింది. కాని, అతడు చేసిన చిన్న పొరపాటుని డీకోడ్ చేస్తే బయటికి వచ్చింది. అది ఓ మిత్రురాలు రాత్రంతా కూర్చుని లిప్ మూవ్‌మెంట్‌ని విశ్లేషించి తీసుకొన్న నిర్ణయం ఇది. తను ఎక్కడో పొరబడిందేమోనన్న మిణుకు మిణుకు ఆశతో నేను వండర్ మిషన్‌ని తిరిగి తుషార్ వైపు, అతడి లండన్ మిత్రుడి వైపు దృష్టిని సారిస్తే విషయాలు బయటికి వచ్చాయి. ఇలాంటి విషయాలు నీకు డైరెక్ట్‌గా చెప్పే సాహసం లేక ఇలా ఈ మెయిల్ ద్వారా పంపిస్తున్నాను. అయామ్ వెరీ సారీ, గుడ్ బై..."

ఆ లెటర్‌తోపాటు తుషార్ – మోడిలు మందు కొట్టినప్పుడు మాట్లాడుకున్న దృశ్యాలు, లండన్ మిత్రుడు సింఘాల్ హొటల్‌లో ఓ అమ్మాయితో రాసక్రీడల్లో వుండి తుషార్ గురించి మాట్లాడిన దృశ్యాలు కూడా అటాచ్ చేసి పంపించాడు.

## 19

ప్రైమ్ మినిస్టర్ ఆఫీసు

బిజీబిజీగా వున్న సమీరా చుట్టూ ప్రజలు గుమిగూడి ఉన్నారు.

అదే సమయంలో ఆమె టేబుల్ మీద వున్న ల్యాప్‌టాప్‌లో ఇ–మెయిల్ వచ్చినట్లుగా ఎర్రరంగు బటన్ వెలువడింది.

మామూలుగా అయితే ఆమె ఇ–మెయిళ్ళని ఆ సమయంలో ఓపెన్ చేసేదే కాదు. కాని ఆర్యచంద్ర నుండి మెసేజ్ రావడంతో ఆమె ల్యాప్‌టాప్‌ని తీసుకుని పక్కనే వున్న తన పర్సనల్ రూమ్‌లోకి వెళ్ళి దానిని తెరిచింది.

తెరిచిన వెంటనే అందులోని పదాలు ఒక్కొకకటి బాకుల్లా పొడుచుకొచ్చి గుండెల్లో గుచ్చుకున్న భావన. శరీరంలో ఒక్కొక్క నరాన్ని ఎవరో అదిమేస్తున్న ఫీలింగ్.

ఇంకో రెండు రోజుల్లో తుషార్‌తో తన పెళ్ళి. కాని ఈ లోపు అతని నిజ స్వరూపం బయటపడింది. అతడొక గ్రోముఖ వ్యాఘ్రంలాంటి వాడు. తనని చూసి కాక తన పదవిని చూసి ముందుకు వచ్చినవాడు. అతడి తండ్రి సిన్హా తన తండ్రిలాంటి వాడనుకుంది. ఆఖరికి ప్రధాని పదవిని తన కుటుంబానికి దక్కేటట్లుగా ప్రణాళి వేసి తనని పదవిలోకి ఎక్కించాడు. అవసరం తీరిపోయాక తనని చంపేసి పదవిని దక్కించుకోవాలన్న దుర్బిద్ధితో చేసిన పనని కలలో కూడా తను వూహించలేదు.

ఆలోచిస్తున్న ఆమె కళ్ళు రక్తంలో ముంచినట్లుగా ఎర్రబడ్డాయి. ఆమె చేతుల్లో మౌస్ నలిగిపోతుంది, మొఖంలో రక్తనాళాలు ఉబ్బాయి.

సరిగ్గా అప్పుడు.....

ఆకాశంలో ఓ మేఘం ఘెటిల్లున ప్రేలినట్లుగా మెరసిందా వూహ ఆమెలో.

ఇంతకు ఆ వూహ ఏమిటంటే –

తుషార్ ఒక గుడ్డి దానిని అనుభవించాడు. ఆర్యచంద్ర అక్క కూడా గుడ్డిదే. ఈ రెండింటికీ ఏదైనా సామ్యం ఉందా?

మరుక్షణం ఆమె ఆ ఇ-మెయిల్‌ని మరోసారి చదివింది.

అవును! కరెక్ట్‌గా ఆరునెలల క్రితమే ఆర్యచంద్ర అక్క రేప్‌తో గురయి చనిపోయింది. ఆ రేప్ సమయంలో ఆమె చనిపోతూ తనని రేప్ చేసిన వాడు ఓ మినిస్టర్ అని చెప్పింది. దాంతో తన దృష్టి ఆ నలుగురూ కేబినెట్ మినిస్టర్ల మీదే ఉంది.

అప్పుడు గుర్తొచ్చిందామెకు గత ప్రభుత్వంలో తుషార్ కూడా మినిస్టరేనని. అయితే అతడు సహాయక మినిస్టర్. ఆర్యచంద్ర అక్కయ్య చనిపోతూ తనని రేప్ చేసినవాడు 'మినిస్టర్' అంది. అంటే ఏ మినిస్టరైనా కావచ్చు. కేబినెట్ లేదా సహాయక మినిస్టర్‌లో ఎవరైనా కావచ్చు. ఆ రెండింటికి తేడా తెలియక ఆమె మినిస్టర్ అనుండవచ్చు.

ఇక కథలో తేలాల్సింది, ఆ సమయంలో తుషార్-తన తండ్రి ఇచ్చిన పార్టీకి వచ్చాడా, లేదా అన్నదే. ఆర్యచంద్ర ఈ కోణంలో ఆలోచించి ఉండకపోవచ్చు. అతడి దృష్టి ఎంతసేపు తనకు కాబోయే భర్తగా తుషార్ సరైనా వాడా, కాడా అన్న దాని మీదే ఉంది. కాని తన అక్కని రేప్ చేసిన వ్యక్తి మీదలేదు. దాంతో గుడ్డి దానిని రేప్ చేశానన్న తుషార్‌ని ఆర్యపుత్ర అతడి వైపు నుండి ఆలోచించి ఉండడు. అదృష్టవశాత్తు ఆ ఐడియా తనకు వచ్చింది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. ఆర్యపుత్ర తనకు ఎంతో సహాయం చేశాడు. అతడు చేసిన సహాయానికి తను బదులు తీర్చుకోవాలి, అంతే!

ఆమె దిగ్గున లేచింది. సిబిఐలో అత్యంత నమ్మకస్తుడైన వ్యక్తి ఎవరా అని ఆలోచించింది.

అప్పుడే గుర్తొచ్చాడు సిబిఐ ఎక్సిక్యూటివ్ డైరక్టర్ అలెక్స్ టాండన్.

వెంటనే తన ల్యాప్‌టాప్‌లో ఔట్‌లుక్ ఎక్స్‌ప్రెస్‌లో అతడి ఫోన్ నెంబర్ తీసి రింగ్ చేసింది.

"హలో...."

"హలో... దిసిజ్ ఇండియన్ ప్రైమ్ మినిస్టర్ సమీర" మెరుపు వేగంతో కదిలింది సమీర కంఠం.

"చెప్పండి యువర్ ఆనెస్టీ..."

“నీవు వెంటనే నన్ను కలుసుకోవాలి”

“ఇప్పుడే వస్తున్నాను మేడమ్! ఇంకో అర్ధగంటలో మీ ముందుంటాను”

◆ ◆ ◆

మరో అర్ధగంట తర్వాత–

అలెక్స్ టాండన్ ఆమె పర్సనల్ రూమ్‌లో ఉన్నాడు. అతడు వచ్చాక ఆమె తన పర్సనల్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీలను బయటకు పంపించింది.

“చెప్పండి మేడమ్! అయామ్ ఆల్‌వేజ్ అట్ యువర్ సర్వీస్ మేడమ్”

ఆమె చెప్పడం ప్రారంభించింది. ఫలానా రోజు ప్రొఫెసర్ ఇచ్చిన పార్టీకి అప్పటి సహాయక మంత్రయిన తుషార్ వచ్చాడా? ఆ సమయంలో తుషార్ ఎక్కడున్నాడు? ఆ పార్టీకి ఇవతల వేపు ఉన్న గెస్ట్ హౌస్‌లో ఒక కళ్ళు లేని అమ్మాయి రేప్‌కి గురయిందని, ఆ అమ్మాయిని రేప్ చేసింది తుషారా లేక ఇతర మంత్రుల్లో ఒకరా? ఇవన్నీ కనుక్కొని తనకు పూర్తి సమాచారం ఇవ్వమని ఆర్డర్ చేసింది.

“జీ హుజూర్ మేడమ్” తుషార్ పేరు వినగానే అతడి కళ్ళు కొద్దిగా పెద్దవైనా వెంటనే మామూలు అయిపోయాడు. పర్సనల్ విషయాలు ఎక్కువగా ఆలోచించడం అతడికి అలవాటు లేదు. స్వామి కార్యం చేసుకురావడమే అతడి ప్రథమ ధ్యేయమని ఆమెకు తెలుసు. అందుకే అతడిని ప్రత్యేకంగా ఎన్నుకొని పిలిపించింది.

అతడు బయలుదేరబోతుండగా వెనకాల నుండి కంఠం విన్పించింది.

“అలెక్స్! ఈ రాత్రికల్లా మొత్తం ఇన్ వెస్టిగేషన్ పూర్తి చేసి అర్ధరాత్రయినా సరే నాకు పూర్తి రిపోర్ట్ ఇవ్వు....”

“అలాగే మేడమ్! రాత్రికల్లా ఈ రిపోర్ట్ మీ చేతిలో వుంటుంది.”

◆ ◆ ◆

ఆపరేషన్ చేపట్టిన అలెక్స్ మెదడు మెరుపు వేగంతో పనిచేయసాగింది.

ముందుగా ప్రొఫెసర్ ధనరాజ్ – పార్టీ రోజు పంపిన అతిథులకు పంపిన ఇన్విటేషన్‌ల లిస్ట్ చెక్ చేశాడు.

అందులో నలుగురు కేబినెట్ మినిస్టర్లు, పదిమంది ఎంపీలు, ఇద్దరు సహాయక మినిస్టర్లు, విద్యార్థులు తదితర ఆహ్వానితులు ఉన్నారు.

*సహాయక (డిప్యూటి) మినిస్టర్ల పేర్లు ఇవి:*

*ఒకరు... మహేంద్రదేవ్, రక్షణ సహాయమంత్రి*

*రెండు.. తుషార్, మానవ వనరుల సహాయమంత్రి*

ఒకసారి లిస్ట్‌లో తుషార్ పేరు ఉందని నిర్ధారించుకున్నాక, అసలు అతడు పార్టీకి వచ్చాడా, లేదా అన్నది తెలుసుకోవాలని అలెక్స్ నిర్ణయించుకున్నాడు.

ముందుగా పార్టీ జరిగిన రోజు రిసెప్షనిష్ట్ దగ్గర, మెటల్ డిటెక్టర్ దగ్గర ఉన్నవారిని ప్రశ్నించాలనుకున్నాడు. అంతేకాక పార్టీకి వచ్చిన కొంతమందిని అడిగి తెలుసుకోవాలనుకున్నాడు.

అయితే రిసెప్షనిస్ట్ ఉద్యోగం మానేసి వెళ్ళిపోయాడని తెలిసింది. ఎక్కడికి పోయాడా, ఎందుకు వెళ్ళిపోయాడో తెలియదు. ఇక మిగిలింది మెటల్ డిటెక్టర్ ఇన్‌ఛార్జి పంకజ్‌నాథ్‌ని కలిశాడు.

ఆశ్చర్యం... ఆ రోజు పార్టీకి వచ్చిన వారిలో తుషార్ లేడని తెలిసింది. పంకజ్ నాథ్ పొరబడ్డాడేమోనని ఆ రోజు పార్టీకి వచ్చిన రీసెర్చి విద్యార్థులను అడిగాడు. వాళ్ళు కూడా అదే చెప్పారు.

అంటే ఆ పార్టీకి పిలుపు వచ్చినా తుషార్ వెళ్ళలేదు. అంటే తన అనుమానితుల జాబితాలో తుషార్ లేడు.

మరి ఇంకెవరు ఆ గుడ్డి అమ్మాయిని రేప్ చేసింది? ప్రధాని అయితే తన అనుమానాన్ని తుషార్ మీదే వ్యక్తం చేసింది. కాని తుషార్ ఆ రోజు పార్టీకి రాలేదు.

ఐపియస్ అయిన అతడి సునిశిత మెదడు ఆలోచిస్తోంది. రిసెప్షనిస్ట్ ఎక్కడికి పోయాడు ? అతడి అడ్రసు ఎందుకని దొరకడం లేదు. ఎక్కడో ఏదో తిరకాసు ఉంది. ఆ తిరకాసు ఏమిటి? ఆ రోజు తుషార్ ఏమయ్యాడు? ఆ పార్టీ జరిగే సమయంలో తుషార్ ఎక్కడున్నాడు?

మరో గంట తర్వాత ఎంక్వయిరీ చేస్తే తెలిసింది, తుషార్ ఆరోజు పార్టీ ఆఫీసులోనే ఉన్నాడని. అయితే సమయంలో తేడా కన్పిస్తుంది. తుషార్ తన ఆఫీసులోనే ఉన్నాడని. ఎనిమిదిన్నర దాకా ఆఫీసులోనే ఉన్నాడు. మరి ఆ కపిలవస్థ గెస్ట్‌హౌస్ లోపల ఉన్న కళ్ళు లేని అమ్మాయిని చెరిచిందెవరు?

అప్పుడు గుర్తొచ్చింది అతడికి తుషార్ కార్‌డ్రైవర్ గురించి. తుషార్ మంత్రిగా ఉన్నప్పుడు సలీమ్ అనే డ్రైవర్‌ని నియమించుకున్నాడు. అతడి జీతభత్యాలన్నీ ప్రభుత్వమే చెల్లించేది.

ఇప్పుడెక్కడ ఆ సలీం? వెంటనే ఎంక్వయిరీ మొదలు పెట్టాడు. మరో పావుగంట తర్వాత తెలిసింది సమాచారం అతడికి.

ఆ డ్రైవర్ సలీమ్ ఇప్పటికీ తుషార్ పర్సనల్ డ్రైవర్‌గానే ఉన్నాడని. అతడి కనుబొమ్మలు ముడిపడ్డాయి. ప్రభుత్వ డ్రైవర్ అతడు. అలాంటి అతడు ఇంకా ప్రభుత్వ సర్వీసులోనే ఉండకుండా ఆ జాబ్‌కి రిజైన్‌చేసి, తుషార్ దగ్గర పర్సనల్ డ్రైవర్‌గా ఎందుకు చేరాడు? బహుశా తుషార్ అతడికి రెండు, మూడు రెట్లు జీతం ఎక్కువ ఇస్తుండాలి లేదా తన రహస్యాలన్నింటిని కాపాడుకోవడం కోసం అతడిని తన పర్సనల్ డ్రైవర్‌గా ఉంచుకొని ఉంటాడు.

మరుఓణం ఆ రోజు సలీమ్ ఎక్కడున్నాడో ఎంక్వయిరీ మొదలుపెట్టాడు అలెక్స్ టాండన్.

ఆ రోజు సలీమ్ డ్యూటీకి రాలేదు. వంట్లో బాగోక ఇంట్లో వున్నాడని తెలిసింది.

మరో పది నిమిషాల తర్వాత న్యూఢిల్లీలోని డ్రైవర్ అడ్రస్ తీసుకొని బయలుదేరాడు అలెక్స్ టాండన్.

ఇన్‌వెస్ట్‌గేషన్ అతడికి చాలా ఇష్టమైన రంగం. ఆ ఇన్వెస్ట్‌గేషన్ పడితే ఎన్ని గంటలైనా ఇట్టే గడిపేయగలడు. పైగా ఇన్వెస్టిగేషన్‌కి ఆదేశించింది దేశానికే సుప్రీం కమాండరైన ప్రధాని. అందుకే అతడే స్వయంగా మనుషులెవరినీ పెట్టుకోకుండా బయలుదేరాడు.

కారు డ్రైవర్ సలీం ఇంటిని సమీపిస్తుంది. అతడు కారుని దూరంగా ఆపి, సలీమ్ ఇంటికి స్వయంగా బయలుదేరాడు.

మరో నిముషం తర్వాత అతడు సలీమ్ ఇంటి ముందు ఉన్నాడు. సలీమ్‌కు పెళ్లి కాలేదు. ఒక్కడే దూరంగా ఉంటున్నాడు. ఆ ఇంటి చుట్టూ ఇళ్ళు కూడా లేదు.

తలుపు తట్టాడు అలెక్స్. లోపలి నుండి ముప్పై సంవత్సరాల వ్యక్తి తలుపు తీశాడు. అతడే సలీమ్ అని అర్థమైంది అలెక్స్ టాండన్‌కి. తలుపు తీసిన వెంటనే తను లోపలికి ప్రవేశించి తలుపు గడియ పెట్టాడు.

దౌర్జన్యంగా లోపలికి వస్తున్న అతడిని చూసి సలీమ్ కంగారుపడ్డాడు. మరుక్షణం సలీమ్ చేయి ప్యాంటు జేబులోకి కదలబోయింది రివాల్వర్‌కేసి. కాని అంతకుముందే అలెక్స్ టాండన్ చేతిలో ప్రత్యక్షమైంది పిస్టల్.

"జాగ్రత్త! ఈ పిస్టల్ బుల్లెట్ నీ నుదుటిని బ్రద్దలు కొడుతుంది. ఫలితంగా మెదడు ముక్కలు ముక్కలవుతుంది" అంటూనే మెరుపు వేగంతో తన పిస్టల్‌ని అతడి కనితకు ఆనించి, అతడి జేబులోని రివాల్వర్‌ని తీసుకొని తన జేబులో పెట్టుకున్నాడు.

అంత వేగంగా మనుషులు కదుల్తారని తెలియదు సలీమ్‌కి. అవతల వ్యక్తి మామూలు వ్యక్తి కాదని అర్థమైంది. అర్థమైన మరుక్షణం అతడి చొక్కాకు వ్రేలాడుతున్న ఐడీ కార్డు మీద పడింది సలీమ్ దృష్టి.

*"అలెక్స్ టాండన్"*

*ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్*

*సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్*

ఒక్కసారిగా మొదలైంది భయం సలీమ్ నరనరాలలో. మెదడులో జొరబడ్డ ఆ భయం అక్కడ నుండి గుండెల్లోకి, అక్కడ నుండి కాళ్ళలోకి నిలువెల్లా ప్రాకింది. కాళ్లు వణకసాగాయి.

"చెప్పు! నేనడిగిన ప్రశ్నలకు మర్యాదగా జవాబు చెప్పు. లేకపోతే నిన్ను చిత్రహింసలు పెట్టాల్సి వస్తోంది" అంటూ సలీమ్‌ని ఒక కుర్చీలో కూర్చోబెట్టి తనతో పాటు తెచ్చిన బాక్స్‌లోంచి నైలాన్ తాళ్ళతో కట్టేశాడు.

సలీం కళ్ళు భయంతో పెద్దవయ్యాయి.

"చూడు సలీమ్! నేను అడిగే ప్రశ్నలకు సమాధానాలు సరిగ్గా చెప్పు. ఏమాత్రం తేడా వచ్చిందా ఇదిగో ఈ డైనమెట్ నీ కాళ్ళ దగ్గర ఉంచుతున్నాను. దానిని పేల్చేస్తాను. దాంతో నీ శరీరం ముక్కలు ముక్కలవుతుంది"

సిబిఐ అనడంతో సగం షాక్‌లో ఉన్నాడు సలీమ్. ఇక డైనమెట్ కాళ్ళ క్రింద పేలిస్తే తను జీవితంలో దేనికి పనికిరానన్న విషయం సలీమ్‌కి అర్థమైంది. అర్థమైన మరుక్షణం తల ఊపేశాడు చెబుతానన్నట్లు.

"కపిల వర్ధ దీవి తెలుసు కదా! ఆరు నెలల క్రితం ప్రొఫెసర్ ధనరాజ్ అక్కడ పార్టీ ఇచ్చాడు"

సలీమ్ మెదడు వెనక్కి వెళ్ళసాగింది ఆ జ్ఞాపకాలను తెచ్చుకోవడానికి.

"అవును" తల అడించాడు సలీం.

"ఆ రోజు అక్కడికి మీ సార్ అంటే అప్పటి సహాయకమంత్రి తుషార్ వచ్చాడు కదూ"

సలీం కంఠం కదిలింది.

"ఆ రోజు మేము అసలు పార్టీకి వెళ్ళలేదు"

"ఇదిగో దీనితో డైనమైట్ పేలుస్తున్నాను. ఇప్పటికైనా నిజం చెప్పు"

"నిజం! ఆ రోజు... వెళ్ళలేదు" భయంగా కదిలింది సలీం కంఠం. అయితే అలెక్స్ సిగరెట్ లైటర్‌ని నిజంగానే డైనమైట్ దగ్గరకి తీసుకెళ్తున్నాడన్న విషయం అర్థం కాగానే అరిచాడు.

"నిజం చెప్తాను. కాల్చొద్దు... ప్లీజ్ నన్ను కాల్చొద్దు..."

"గుడ్ బాయ్ అంటే అలా ఉండాలి" అని ఆ సిగరెట్ లైటర్‌తో సిగరెట్ వెలిగించుకున్నాడు అలెక్స్.

"చెప్పు... ఆ రోజు ఏం జరిగింది?"

సలీం మాట్లాడడం మొదలుపెట్టాడు. అలెక్స్ టాండన్ అతడి మాటలను తన సెల్‌ఫోన్‌లోని వీడియోతో రికార్డు చేయసాగాడు.

"ఆ రోజు నేను, తుషార్ సార్ పార్టీకి తొమ్మిదింటికి బయలుదేరాము. కార్లోనే తుషార్ సార్ బాగా మందు కొట్టాడు. మందు కొట్టినప్పుడల్లా తుషార్ సార్ నాతో చాలా చనువుగా మాట్లాడుతాడు. ఆ రోజు కపివర్ధ దీవికి వెళ్ళేసరికి తొమ్మిదిన్నర అయింది. తుషార్ సార్‌కి పూర్తి మత్తు ఎక్కింది. 'ఓరే సలీం! నాకు అమ్మాయి కావాలిరా. చూడరా ఎవరైనా దొరుకుతారేమో. నీకు లక్ష రూపాయలైన ఇస్తారా?' అన్నాడు. కారు దీవిలో పార్టీ జరుగుతున్న ఎంట్రన్స్ దగ్గర ఆపాను. 'చూస్తాను సార్! ఇది దీవి. ఇక్కడ పార్టీవారు తప్ప వేరే వారు ఎవరూ లేరు' అని నేను మెటల్ డిటెక్టర్ దాటి లోపలికి వెళ్ళాను. దూరంగా దీపాల వెలుగులో పార్టీ జరుగుతోంది. పార్టీకి ఇవతల గెస్ట్‌హౌస్‌లు కట్టబడి ఉన్నాయి. నేను ఒకో గెస్ట్‌హౌస్ రూమ్‌ని దాటుతుండగా ఓ కళ్ళులేని అమ్మాయి కనిపించింది. నా అలికిడి వినిపించి 'ఎవరూ తమ్ముడా' అంది. దాంతో నాకు మొత్తం అర్థమైంది. నేను వెంటనే 'నేను ఉదయ్‌ని! మీ తమ్ముడు ఫ్రెండ్‌ను. నిన్ను తీసుకు రమ్మని తమ్ముడు పంపించాడు' అన్నాను. ఆమె నమ్మి నాతో వచ్చింది. నేను తిరిగి మెటల్ డిటెక్టర్ దగ్గరకు వచ్చాను. అప్పటికే మెటల్ డిటెక్టర్ దగ్గరున్న కాపలా మనిషి తాగి పడిపోయి ఉన్నాడు. నేను ఆమెని

మా కారు దగ్గరకి తీసుకెళ్తుంటే రిసెప్షనిస్ట్ చూశాడు. అయితే మినిస్టర్‌గారి డ్రైవర్‌నని తెలిశాక నోర్మూసుకుని కూర్చున్నాడు.

ఆ తర్వాత ఆ అమ్మాయిని మా బాస్ తుషార్ దగ్గరకు తీసుకెళ్ళాను. ఆ అమ్మాయిని చూస్తేనే బాస్ కళ్ళు మెరిశాయి. 'శభాష్! కళ్ళు లేని చక్కటి అమ్మాయిని తీసుకొచ్చావు. వెరైటీ అంటే ఇలా ఉండాలిరా' అన్నాడు. నేను గర్వంగా "మినిస్టర్ గారికి తగిన టేస్టే సార్" అన్నాను. ఈ లోగా ఆ అమ్మాయికి విషయం అర్థమై అక్కడ నుండి పారిపోసాగింది. అయితే కళ్ళు లేకపోవడం వల్ల ఆ దీవిలో చెట్లవైపుకు పారిపోబోయింది. నేను, తుషార్ సార్ ఆమె వెంట పరిగెత్తాము. ఆమెను నేను బలవంతంగా పట్టుకొని క్రింద పడుకోబెట్టి కాళ్ళూ చేతులు చెట్టుకు కట్టేశాను. తుషార్ సార్ రేప్ చేశాడు. ఆ బలవంతంలో కొన వూపిరితో మిగిలిపోయింది. తుషార్ సార్ ఆమెను రెండుసార్లు మానభంగం చేశారు. రెండోసారి ఆమె జరిగిన తొక్కిసలాటలో ఆమె ఆఖరి క్షణాల్లో వుంది.

దాంతో నేను, తుషార్ సార్ భయపడ్డాం. అయితే తుషార్ సార్ మినిస్టర్ కావడంతో ఊపిరి పీల్చుకుని, ఆ అమ్మాయి కట్లు విప్పి గెస్ట్‌హౌస్‌లో దింపి రమ్మని చెప్పాడు. నేను దింపి వచ్చాను. ఎవరు చూడలేదు. రిసెప్షనిస్ట్ తప్ప. అతడికి తుషార్ సార్ పది లక్షలు ఇచ్చాడు. జరిగింది ఎవరికి చెప్పొద్దని, చెబితే చంపేస్తామని శ్రీలంకకి పంపించాడు. అక్కడ తనకు తెలిసిన వారితో మాట్లాడి అతడికి జాబ్ ఇప్పించాడు"

'మైగాడ్' తన జీవితంలో ఎన్ని మిస్టరీ కేసులు సాల్వ్ చేసిన అలెక్స్ టాండన్ సైతం ఆ క్షణం దిగ్భ్రాంతికి లోనయ్యాడు.

అందుకేనన్నమాట తుషార్ ఆ రోజు పార్టీ లోపలికి రాలేదు. పార్టీలో తననెవరూ చూడలేదు. కాబట్టి వెంటనే ఆ అమ్మాయిని రేప్ చేసి అట్నుంచి అటే ఇంటికి వెళ్ళిపోయాడు.  చూసే వారికి అసలు అతను పార్టీకే రాలేదన్న భ్రమ కలిపించాడు. దాంతో ఎంతసేపూ ఆ నలుగురు కేబినేట్ మినిస్టర్ల వైపే చూపు ఉంది. కాని ఇలా గోడ చాటున దాగిన పిల్లి విషయం తనకు తెలియదు.

మరుక్షణం అలెక్స్ టాండన్ చూపులు సలీం వైపు కదిలాయ్. సలీం భయంతో వణుకుతున్నాడు.

"సార్ నిజం చెప్పేశాను సార్! ఇక నన్ను వదిలెయ్యండి. ఇలా చెప్పిన విషయం తుషార్ సార్‌కు తెలిస్తే నన్ను బ్రతకనీయడు" అంటూ ప్రాధేయపడసాగాడు.

అలెక్స్ దవడ కండరం బిగుసుకుంది. అసలు ఆ గుడ్డి అమ్మాయి రేప్‌కి కారణం సలీమ్! ఆ రోజు ఆ అమ్మాయిని ఈ నీచుడు పట్టి తేకపోతే ఈ రేప్ జరిగేది కాదు. ఇలాంటి వాళ్ళు బ్రతికి ఉండకూడదు.

మరుక్షణం అలెక్స్ టాండన్‌కి ప్రధాని మాటలు గుర్తుకొచ్చాయి.

'అలెక్స్! ఈ ఆపరేషన్‌లో ఎంత పెద్ద తలకాయలు అడ్డువచ్చినా లెక్కచేయకు. నీకు నేను పూర్తి అధికారాలు ఇస్తున్నాను. ఎంతమంది ప్రాణాలు తీయాల్సి వచ్చినా లెక్కచేయకు. ఇది చాలా కాన్ఫిడెన్షియల్ మ్యాటర్. మీపై వాళ్ళకెవరికీ నీవు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. నీవు నీ ఒక్కరికే జవాబుదారుడివి. చట్టాన్ని, న్యాయాన్ని లెక్కచేయకు. నిర్దాక్షిణ్యంగా వ్యవహరించు".

మరుక్షణం అలెక్స్ చేతిలో సైలెన్సర్ ప్రత్యక్షమైంది. అది చూసి అరవబోయాడు సలీం.

అలెక్స్ చేతిలో సైలెన్సర్ తాలూకు గుళ్ళు సలీం అంగుటిలో దూసుకుపోయి ఛిద్రం చేశాయి. నెత్తురు వరదలై పారుతుండగా సలీం తల వాల్చేశాడు.

మరుక్షణం అలెక్స్ టాండన్ బయటికి వచ్చాడు. దూరంగా ఆగిన కారు వైపు నడిచాడు.

మరో రెండు నిముషాల తర్వాత కారు బయలుదేరింది ప్రధాని ఆఫీసుకేసి.

## 21

జడత్వం కోల్పోయిన దానిలో అలెక్స్ టాండన్‌నే చూస్తుండిపోయింది ప్రధాని సమీర.

అయిపోయింది! అంతా అయిపోయింది. తన వల్లనే ఆర్యచంద్ర జీవితం జీవితం నాశనమైంది. అతడి అక్క రేప్‌కు గురై మరణించింది. తనకు కాబోయే భర్త వల్ల ఆమె మరణించింది. ఈ విషయం ఆర్యచంద్ర ఎలా తీసుకుంటాడు? జన్మ జన్మలకు తనను అసహ్యించుకుంటాడేమో! అదలా ఉండనీ! ఎల్లుండే తుషార్‌కు, తనకు పెళ్ళి! ఇప్పుడు తను ఈ పెళ్ళి వద్దనుకుంటే దేశంలోని ప్రజలు, రాజకీయ నాయకులు ఏమనుకుంటారు? పెళ్లి చేసుకుంటే ఒక తంటా, పెళ్ళి వద్దనుకుంటే మరొక తంటా. అయినా అభం శుభం తెలియని ఓ కళ్లు లేని అమ్మాయిని రేప్

చేసిన తుషార్‌ని తను ఎలా పెళ్ళిచేసుకుంటుంది? నెవర్... తను అతడిని చేసుకోదు. మరి ఇప్పుడేం చేయాలి?

అలెక్స్ ఆమె వంకే చూస్తున్నాడు నిశ్శబ్దంగా. ఆమె మానసిక పరిస్థితి అతడికి కూడా అర్థమైంది.

క్షణాలు గడుస్తున్నాయ్ ఆ ఉద్వేగంలోనే.

సమీర పెదాలు వణుకుతున్నాయి. దవడ కండరం బిగుసుకుంటోంది. ఇంతకు ఇంతా తీర్చుకోవాలన్న కసి ఆమె మొహాన్ని మరింత ఎర్రగా మారుస్తోంది. మెదడులో రక్త కణాలు వేగంగా పరుగెడుతున్నాయి.

అప్పుడు రూపుదిద్దుకుంది పథకం ఆమె మెదడులో. ఆ దుర్మార్గుల దురాగతాలకు తగిన శిక్షగా ఆమె మెదడులో ఓ ప్లాన్ రూపుదిద్దుకుంది.

మరుక్షణం ఆమె పెదవులు కదిలాయ్. తన పథకం తాలూకు ప్లాన్‌ని ఎలా అమలు చేయాలో తెలుపుతూ కదిలిందామె కంఠం.

ఆ ప్లాన్ విన్న అలెక్స్ టాండన్ నోరు పెద్దదైంది ఆశ్చర్యంగా. అయినా ప్రభుభక్త పరాయణుడు కావడంతో నోరు విప్పకుండా తల వూపాడు.

"జాగ్రత్త! ఈ పథకం నీకూ-నాకు మధ్య వుండాలి. మూడో కంటికి తెలియకూడదు. ముళ్ళుని ముళ్ళతోనే తీయాలి. ఈ విషయంలో ఎవరూ అడ్డుపడ్డా కేర్ చేయకు. నీకు పూర్తి అధికారాలు ఇస్తున్నాను"

"అలాగే మేడమ్" ఆమెకు సెల్యూట్ చేసి బయలుదేరాడు అలెక్స్.

"విష్ యూ ఆల్ ది బెస్ట్..." కదిలింది సమీర కంఠం.

"థ్యాంక్ యూ మేడమ్..."

◆ ◆ ◆

'కలుగులో ఉన్న ఎలుకను ఎలా బయటికి రాబట్టాలి?' ఆలోచిస్తూ బయలుదేరాడు అలెక్స్ టాండన్.

అప్పుడు శబ్దం చేసిందతడి ఫోన్ ఏదో మెసేజ్ వచ్చినట్లుగా.

అంతకుముందే అతడు తన సిబిఐ ఏజంట్లకు ఫోన్ చేశాడు. సిటీలో దాగున్న ఏ టెర్రరిస్ట్ అడ్రస్‌నైనా ట్రేస్ చెయ్యమని.

దాని ఫలితంగా ఓ సిబిఐ ఏజంట్ నుండి వచ్చింది మెసేజ్.

'ప్రముఖ టెర్రరిస్ట్ అయూబ్‌ఖాన్ దర్సన్ గంజ్‌లో దాగి వున్నాడు. అతడి ఫ్లాట్ నెంబర్ 102' అన్న మెసేజ్ కనిపించింది.

మరో అర్ధగంటలో అతడి కారు దర్సాన్ గంజ్‌లో ఆగింది. మరో పది నిమిషాల తర్వాత అతడు టెర్రరిస్టు ఆయూబ్‌ఖాన్‌ని జీపు ఎక్కించాడు. అతడి చేతులకు బేడీలు ఉన్నాయి.

ఆయూబ్‌ఖాన్ మీద పది రేప్‌లు, ఇరవై మర్డర్ కేసులు ఉన్నాయి. రెండు బాంబుల దాడుల కేసులు ఉన్నాయి. అతడి తలమీద కోటి రూపాయల ప్రైజ్‌మనీ ఉంది.

మరో అర్ధగంటలో కారు తుషార్ ఆడే బ్యాడ్‌మెంటన్ కోర్టుకు కొద్దిదూరంలో ఆగింది. ఆయూబ్‌ఖాన్ సంకెళ్ళు తొలగించాడు అలెక్స్.

ఆయూబ్‌ఖాన్ భయంగా చూశాడు అతడి వైపు. అలెక్స్ గురించి అతడు అంతకు ముందే విన్నాడు. తన అనుచరులు పది మందిని గత సంవత్సరం నడి బజారులో కాల్చి చంపాడు. నేరస్థుల దృష్టిలో అలెక్స్ అంటే సింహస్వప్నం. అవతల వాడు ఎవరు, ఏమిటి అని చూడకుండా మెరుపు వేగంతో కాల్చి పారేస్తాడు. దానికి కారణం అలెక్స్ టాండన్ ఒంటరివాడు. పెళ్ళికాలేదు. తన వెనకాల ఎవరూ లేకపోవడంలో ప్రాణాలకు తెగించి నేరస్థులను పట్టుకొని చట్టానికి అప్పజెప్తాడు లేదా తనకు అధికారాలు ఉంటే నడిబజార్లోనే కాల్చి చంపుతాడు. అందుకే అతడిని గత ప్రభుత్వం ఓ అప్రధాన శాఖకు బదిలీ చేశారు. అయితే ప్రస్తుత ప్రధాని సమీర అలాంటి సామర్థ్యంగల ఆఫీసర్లను తిరిగి పిలిపించి అపరిమిత అధికారాలు కట్టబెట్టింది.

"చూడు" ఆయూబ్‌ఖాన్ కేసి కదిలింది అలెక్స్‌టాండన్ "ఇప్పుడు టెన్నిస్ కోర్టు నుండి ఇంటికి బయలుదేరడానికి మాజీ మంత్రి తుషార్ బయటకు వచ్చి కారు ఎక్కుతాడు. అతడు కారు ఎక్కేలోపే నీవు పిస్తల్‌తో కాల్చివేయాలి. దాంతో నిన్ను నేను ఎలాంటి శిక్ష వేయకుండా వదిలేస్తాను లేదా నేను ఇక్కడికక్కడే చంపేస్తాను. ఏది నిర్ణయించుకుంటావో నిర్ణయించుకో"

ఆయూబ్‌ఖాన్‌లో అనుమానాలు. తానెందుకు తుషార్‌ని చంపాలి? చంపకపోతే ఇతడు తనను చంపేస్తాడు. దాని బదులు తుషార్‌ని చంపేసి ఇతడికి కూడా దొరకకుండా అటువైపు నుండే పారిపోతే సరి అనుకున్నాడు.

ఆ ఊహ కదలిన ఆయూబ్‌ఖాన్ తల వూపాడు తుషార్‌ని చంపడానికి.

తుషార్ బ్యాట్‌మింటన్ ఆట ముగించుకొని బయటకు వచ్చాడు.

ఆయూబ్‌ఖాన్ పిస్తల్ తీసుకొని అతని వైపు బయలుదేరాడు. తుషార్ బాడీగార్డులు తుషార్ ముందు నడుస్తున్నాడు.

సరిగ్గా అప్పుడు...

మెరుపు వేగంతో కదిలింది ఆయూబ్‌ఖాన్ చేతిలో పిస్తల్. ఆ గుండు రెప్పపాటు కాలంలో దూసుకెళ్ళి తుషార్ గుండెని చీల్చుకుంటూ పోయింది.

అనుచరులు అలర్ట్ అయ్యేలోపు ఆయూబ్‌ఖాన్ చేతిలో పిస్తల్ మరోసారి నిప్పులు కక్కింది. ఈ సారి గుళ్ళు తుషార్ మెదడుని చీల్చుకుంటూ లోపలికి ప్రవేశించాయి. తుషార్ మెదడు బ్రద్దలై సెరిబ్రమ్ బయటకు వచ్చింది.

మెరుపులా జరిగిన దానికి దిగ్భ్రాంతిలో వున్న తుషార్ అనుచరులు అప్పుడు అలర్ట్ అయ్యారు... పిస్తల్ పేల్చి పారిపోతున్న ఆయూబ్ ఖాన్ వైపు ఏకె 47 రైఫిళ్ళతో కాల్చారు అనుచరులు.

ఆ గుళ్ళు ఆయూబ్‌ఖాన్ శరీరాన్ని జల్లెడ చేశాయి. "ష్..." అనుకుంటూ క్రింద పడిపోయాడు.

అదే సమయంలో ఇద్దరు అనుచరులు తుషార్ వైపు పరుగెత్తుకు వెళ్ళారు హాస్పటల్‌కి తీసుకెళ్దామని. అప్పటికే తుషార్ శరీరంలో ఊపిరి ఆగిపోయింది.

*ఒక కళ్ళులేని కభోదిని కామించి, ఆ విషయాన్ని దాచి, ఈ దేశపు ప్రధానిచే చేపడదామని ప్లాన్ వేసిన తుషార్ ఆఖరికి తన ప్రాణాలు తానే పోగొట్టుకున్నాడు.*

అదే సమయంలో ఆయూబ్‌ఖాన్ ఊపిరి సైతం ఆగిపోయింది.

మరుక్షణం అక్కడ పోలీసులు, న్యూస్ పేపర్, టీవీ ఛానళ్ళ విలేఖరులు వ్యాన్లు వస్తున్న శబ్దం విన్పించింది. ఆ వార్త స్టేడియం బయట కాపు కాస్తున్న విలేఖరులకు చేరడం, పోలీస్ స్టేషన్‌కూడా స్టేడియం ప్రక్కనే ఉండడం వల్ల పోలీసుల జీపులు, టీవీ ఛానళ్ళు అక్కడ చుట్టుముట్టాయి.

జరిగిందంతా దూరం నుంచి చూసిన అలెక్స్ ఆ హడావుడిలో అక్కడ నుండి ప్రక్కకు తప్పుకున్నాడు నిశ్శబ్దంగా. శత్రుశేషం ముగిసోయినందుకు అతడికి తృప్తిగా ఉంది.

అందుకే తన సెల్‌లో ప్రధానికి మెసేజ్‌ని పంపాడు.

**"ఆపరేషన్ సక్సెస్‌ఫుల్" అంటూ.**

◆ ◆ ◆

జరిగిందంతా తెలిసిన దేశం గగ్గోలెత్తిపోయింది. ప్రధాని కాబోయే భర్తని మర్డర్ చేస్తే ఈ దేశంలో సామాన్యులకురక్షణ ఏమిటని ప్రతిపక్షాలు నలదీశాయి.

టీవీ ఛానళ్ళు క్షణ క్షణానికి మర్డర్ జరిగిన దృశ్యాలను పదే పదే ప్రకటిస్తున్నాయి. తుషార్ భౌతికకాయాన్ని నిరంతరాయంగా చూపిస్తున్నాయి. దానితోపాటు అప్పుడప్పుడు ఆయూబ్‌ఖాన్ మృతదేహాన్ని సైతం ప్రదర్శిస్తున్నాయి.

టీవీ ఛానళ్ళు ఆ రాత్రి నిరంతరాయంగా ఆ సంచలన వార్తలని ప్రదర్శించాయి. ఇప్పుడు ప్రధాని పరిస్థితి ఏమిటని ఒక ఛానల్, ప్రధాని–తుషార్ పెళ్ళి ఫోటోలు, ఆ ప్రక్కనే తుషార్ భౌతికకాయం చూపిస్తూ మరో ఛానళ్ళు పోటీపడ్డాయి. మరో ఛానల్ అయితే పార్టీ ఛీఫ్ ఇంటికి ఫోకస్ చేసి, కొడుకు పార్ధీవ దేహం ప్రక్కనే విలపిస్తున్న సిన్హాని పదే పదే చూపిస్తుంది.

మరో గంటలో ప్రధాని కార్యాలయం నుండి అధికారిక వార్త వెలువడింది.

'ఎల్లుండి జరిగే ప్రధాని వివాహం కాన్సిల్ అయింది' అని.

ఆ వార్త తెలిసిన పత్రిక విలేఖరులు, టీవీ ఛానళ్ళు ప్రధాని ఇంటికేసి బయలుదేరాయి. కాని ప్రధాని ప్రస్తుత పరిస్థితుల్లోఎవరిని కలుసుకునే పరిస్థితుల్లో లేరని ఆమె అధికార ప్రతినిధి రాధేశ్యం బయటకొచ్చి తెలియజేశారు.

## 22

"మామూలుగా అయితే చట్టం, కోర్టులు అంటూ కొన్ని సంవత్సరాలు పడుతుంది. దాంతో నేరస్థుడు బెయిల్ మీద కొన్ని సంవత్సరాలు బయటే స్వేచ్ఛగా తిరుగుతాడు. ఈ లోపు ప్రభుత్వం మారిపోతుంది. నేరస్థుల మీద కేసులు వీగిపోతాయి. నేరస్థులు రొమ్ము విరుచుకొని తిరుగుతారు. ఈ గొడవంతా లేకుండా ముల్లుని ముల్లుతోనే తీయాలనుకొని ఇలా చేశాను..."

ప్రధాని సమీర ఫోన్‌లోంచి పదాలు ఆర్యచంద్రని చేరుతున్నాయి.

తిరిగి సమీర పెదాల్లోంచి పదాలు కదిలాయి.

"ఐ యామ్ సారీ ఆర్యా! నీ అక్కని చంపిన వారిని నీకు స్వయంగా పట్టించలేక పోయాను. నేనే చట్టాన్ని చేతిలోకి తీసుకొని దోషులను శిక్షించాల్సి వచ్చింది. ఎందుకంటే ఈ లోగా దోషులు పారిపోయే ప్రమాదం ఉంది. లేదా సాక్షులు తారుమారు చేయవచ్చు. కనీసం వాడిని పట్టించలేకపోయినా రూపుమాపేశానన్న ఆనందం నాలో ఉంది…"

ఆర్యలో ఇక నిశ్చేష్టత. షాక్ నుండి తేరుకోలేనట్లుగా నిశ్శబ్దం. కథ ఎటు తిరిగి ఎటు వెళ్తుందో అర్థం కావడం లేదు ఆర్యతేజకు.

మళ్ళీ కదిలింది సమీర కంఠం. "నిజానికీ నీ మీద కసితో ఏదో అధికారం కావాలన్న కోరికతో ఈ ప్రధాని పదవిని అంగీకరించాను. కాని అదే ప్రధాని పదవి – తుషార్ లాంటి వాడి కుహన రాజకీయ నాయకుడిని మట్టుపెట్టడానికి పనికి వచ్చింది. నిజం చెప్పాలంటే అలాంటి గోముఖ వ్యాఘ్రాలను రూపుమాపాలంటే అంతకంటే పెద్ద పదవి ఉంటేనే వీలవుతుంది. ఆర్యా! నీవు ఈ విషయంలో వ్యక్తిగతంగా పగ తీర్చుకుంటే అది చట్టరీత్యా నేరం అవుతుంది. అదే ఓ పోలీస్ ఆఫీసర్ చేస్తే చట్టబద్ధం అవుతుంది. టెర్రరిస్టులు అంటే బాంబులు పెట్టేవారు, మనుషుల్ని చంపేవారే కాదు. తుషార్ లాంటి క్రిమినల్ బ్రెయిన్ వున్న వాళ్ళు కూడా టెర్రరిస్టులే! అలాంటి టెర్రరిస్ట్‌ని మరో టెర్రరిస్ట్ చేత చంపించడం న్యాయం కూడా! అలా చంపించాలంటే పెద్ద పదవి కావాలి! ఈ ప్రధాని పదవి వల్ల నేను చేసిన పనులలో ఇదే ఉత్తమమైన పనని నా మనస్సాక్షి చెబుతోంది. అది చాలు నాకు. నేనేం చేసినా చేయకపోయినా అదొక్కటి చాలు. కరుడు కట్టిన ఒక దుర్మార్గుడిని అంతం చేశానన్న తృప్తి ఒకటి చాలు. ఇక ఈ ప్రధాని పదవి ఉన్నా, లేకపోయినా ఒకటే…"

ఆమె మాటలు ఒక్కొక్కటి ఆర్య గుండెని తూట్లు పడేస్తున్నాయి. నిజమే! ఆమె చెప్తున్నదంతా సత్యమే! తన కాబోయే భర్త అని కూడా చూడకుండా అతడని మట్టు పెట్టించింది ఎంతగా ఎదిగిపోయిందామె. ఒకనాడు కపిలతీర్థ వద్ద ఓ మామూలు అడ్మినిస్ట్రేటర్‌గా వున్న ఆమె నేడు భారత ప్రధానిగా ఎంతగా ఎదిగిపోయింది. ముల్లుని ముల్లుతోనే తీయాలని తనంతట తానే తన అక్కని రేప్ చేసిన వారిని కనిపెట్టి గుట్టు చప్పుడు కాకుండా హతం చేయించింది. హ్యాట్సాఫ్ టు హర్!

"ఆర్యా! ఆర్ యూ దేర్?" సమీర పలకరింపుతో ఈ లోకానికి వచ్చాడు.

"ఉన్నాను సమీరా! థ్యాంక్స్! నా అక్కని రేప్ చేసిన వారిని నిర్దాక్షిణ్యంగా హతం చేయించావు. నాకు నీవు చేసిన సహాయానికి ధన్యవాదాలు…"

"ఆర్యా! "ఆమె గుండె గొంతుకలో కొట్టుమిట్టాడుతోంది" ఒకప్పుడు మనం ప్రేమికులం. ఇప్పుడు నాకు ఎవరూ లేరు. నీకు ఎవరూ లేరు. నీకు అభ్యంతరం లేకపోతే ఐ లవ్ యూ..."

ఆర్యలో షాక్ తిరిగి. ఇన్నాళ్ళ తర్వాత ఆమె తనను ప్రేమించానంటుంది. తామిద్దరి జీవితాల్లో ఎన్నెన్నో మలుపులు. తనని ప్రేమించింది, ద్వేషించింది. వేరే వ్యక్తితో ఎంగేజ్‌మెంట్ జరిపించుకుంది. తిరిగి తనని ప్రేమిస్తున్నానంటుంది. అది సాధ్యమేనా?

అతడలా ఆలోచనల్లో వుండగానే ఆమె కంఠం కదిలింది.

"ఆర్యా! జరిగిందేదో జరిగిపోయింది. ఇక మనకు ఈ ప్రపంచంలో ఆత్మీయులు ఎవరూ లేరు. నాకు నీవు, నీకు నేనే ఆత్మీయులం..."

ఆర్యా తనలో తాను అనుకున్నాడు 'తప్పు సమీర! నాకు ఓ ఆత్మీయురాలు ఉంది. ఎవరూ లేరనుకోవడం పొరబాటు'.

అటువైపు నుండి సమీర కంఠం ఉత్సాహంగా కదులుతోంది.

"ఆర్యా! నా చేతిలో ప్రధాని పీఠం ఉంది. నీ చేతిలో వండర్ మిషన్ ఉంది. ఆ వండర్ మిషన్ సహాయంతో నన్ను నీవు ఎన్నోసార్లు విపత్కర పరిస్థితుల నుండి కాపాడావు. ఇప్పుడు నీ వండర్ మిషన్, నా ప్రధాని పదవి కలిస్తే ఈ ప్రపంచంలో ఏ శక్తీ మనల్ని విడదీయలేదు..."

ఆర్య వింటున్నాడు. ఆమె మనసేమిటో అర్థమవుతోంది.

"ఆర్యా! నా తప్పులను నేను ఒప్పుకుంటున్నాను. ఇకనైనా మనిద్దరం ఒకటై ఈ దేశాన్ని పాలిద్దాం. ఈ ప్రజలను పీడితుల నుండి రక్షిద్దాం. ఈ దేశ సౌభాగ్యానికి, సంస్కృతికి కృషి చేద్దాం. నా చేయి పట్టుకొని నడవడం నీకు ఇష్టమే కదా"

ఆర్యా ఇంకా షాక్‌లోనే ఉన్నాడు. అతడి స్థితిని కనిపెట్టినట్టుగా అవతల నుండి సమీర కంఠం కదిలింది.

"ఓకే ఆర్యా! నీవు ఇంకా నీ అక్కని చంపిన వాడి షాక్ నుండి కోలుకున్నట్లు లేదు. నేను చెప్పిన ప్రపోజల్ ఆలోచించు చెప్పు. ఇప్పుడు కాదు, ఒకటి రెండు రోజులు సమయం తీసుకో. అప్పుడే ఆలోచించి చెప్పు తొందరేం లేదు. ఓకేనా?"

"ఓకే సమీరా! బై గుడ్ నైట్"

"బై... సీ యూ ఆగైన్"

◆ ◆ ◆

అది జరిగిన మరో గంట తర్వాత –

దాక్షాయణీకి అతడు ఫోన్ చేశాడు.

"దాక్షాయణీ! నాదాకా తీసుకురాకుండానే సమీర తనంతట తానే – నా అక్క జీవితాన్ని పాడు చేసిన తుషార్‌ని చంపించేసింది...." అంటూ జరిగిందంతా వివరించాడు.

"చాలా మంచి పని చేసింది..." మెచ్చుకుంది దాక్షాయణీ "అలాంటి దుర్మార్గులకు అదే సరైన శిక్ష కూడా! ఏది ఏమైనా నేటితో మీ పగ తీరిపోయింది.."

"పగ తీరిపోయింది. కాని మరో సమస్య ప్రారంభమయ్యింది. సమీర మళ్ళీ నన్ను ప్రేమిస్తున్నాను, పెళ్ళి చేసుకుందామని ప్రపోజల్ పెట్టింది..."

అవతల వేపు నుండి దాక్షాయణీ నిస్తేజంగా వింటోంది. ఆమె మనసులో ఏముందో తెలియడం లేదు ఆర్యకి.

మరో క్షణం తర్వాత కదిలింది దాక్షాయణి కంఠం.

"చేసుకోండి!! ఆమె దేశానికే ప్రధాని. ఈ దేశంలో ప్రతి ఆడపిల్ల కోరుకునే లక్షణాలన్నీ ఆమెలో ఉన్నాయి. పైగా ఇన్నాళ్ళ తర్వాత..."

"ఎంత తేలికగా చెపుతున్నాను దాక్షాయణీ! ఇలా మాటి మాటికి మనసులు మార్చుకోవడమంటే నేనేమైనా మనిషినా, వండర్ మిషన్‌ననుకుంటున్నావా?"

"అన్నట్లూ వండర్‌మిషన్‌తో పని అయిపోయింది కదా! ఇంకెందుకు అది. దానిని తీసి బయట పారెయ్యండి.... అదొక ప్రాణం లేని యంత్రం కదా!"

"అదేమిటి దాక్షాయణీ" విస్మయం ఆర్యలో "ఆ వండర్ మిషన్ సహాయంతో దేశాన్ని ఇంకా సస్యశ్యామలంగా చేద్దామని సమీర అంటోంది. నీవేమో అదొక పనికిరాని యంత్రంలా భావిస్తున్నావు".

"మనిషి జీవిత లక్ష్యం ఏమిటి?" సూటిగా ప్రశ్నించింది దాక్షాయణీ.

"సుఖంగా బ్రతకడం"

"అవునా! ఆ సుఖంగా ఎలా బ్రతుకుతాము? కష్టపడి సంపాదించడం ద్వారా! అవునా, అలాంటప్పుడు వండర్ మిషన్ ద్వారా అన్నీ ఆయాచితంగా పొందుతుంటే మనిషి ఇంకా ఏం కష్టపడతాడు? ఎక్కడ బంగారం దొరుకుతుందో, ఎక్కడ పెట్రోలు దొరుకుతుందో అన్నీ దానిలో చూస్తూ ఉంటే ఇంకా మనిషి ఏం కష్టపడతాడు?

అన్నీ ఆయాచితంగా దొరుకుతుంటే మనిషి పని తిని కూర్చోవడమేగా! అది మనిషి ధ్యేయం కాదు కదా!

ఇంకో విషయం – మనిషి జీవితానికి ప్రైవసీ చాలా అవసరం. ప్రతి మనిషి తనకంటూ ఓ ప్రైవసీని ఏర్పాటు చేసుకుంటాడు. అది లేక బ్రతుకులు బహిరంగమై జీవితాలు ఛిద్రమైపోతాయి. సృష్టికర్త ప్రతి మనిషికి ఎంతో అందమైన జీవితాన్ని ప్రసాదించాడు. ఫలానా ఇంట్లో ఫలానా వ్యక్తి ఏం చేస్తున్నాడో అని అనుక్షణం వాచ్ చేస్తూంటే జీవితానికి భద్రత ఏముంటుంది?

మన ఇంట్లో మనం స్వేచ్ఛగా కూర్చోలేం పని చెయ్యలేం. బాత్‌రూమ్‌కెళ్ళాలన్నా, లైఫ్ పార్టనర్‌తో మైథునంలో పాల్గొనాలన్నా ప్రతిక్షణం భయపడుతూ ఉండాల్సిందే. ఇప్పటికే సిసి కెమెరాల ద్వారా మనిషిని యంత్రంలా తయారు చేశారు. ఇక దానికి అడ్వాన్స్‌డ్ వెర్షన్ అయిన వండర్ మిషన్ ద్వారా మనుషులంతా యంత్రాల్లా, రాబోట్‌లా తయారుచేస్తారు. మనిషి జీవితాల్లో స్వచ్ఛత, ఆర్ద్రత అనేవి వుండవు. ఆధునిక టెక్నాలజీ ఇప్పటికే దేశాన్ని అధోగతికి తీసుకెళ్ళింది. విద్యార్థుల దగ్గర నుండి వృద్ధుల దాకా పనిపాటలు మానేసి సెల్‌లోకే ఉత్తరాలు, మాటలు, ఫోటోలు, పాటలు, ఆఖరికి వీడియోలు, సినిమాలు చూస్తున్నారు. అలాంటిది మీరు కనిపెట్టిన వండర్ మిషన్ ఈ ప్రపంచాన్ని మరింత జడత్వహీనులుగా, నీరసంగా తయారుచేస్తుంది.

నిజానికీ మీరు కనిపెట్టాల్సింది వండర్‌మిషన్ కాదు. ఆడవారి మనసుల్లో ఏముందో కనిపెట్టే యంత్రం కావాలి. దాని వల్ల మధ్య తరగతి మహిళలు మగవారి ఆధిపత్యం క్రింది ఎలా నలిగిపోతున్నారో తెలుస్తుంది. దానివల్ల అవతల మనసులోని భావాలు బహిర్గతమవుతుంటే ఇతరులు కొద్దిగానైనా చలించే అవకాశం ఉంది. నిజానికి వండర్‌మిషన్ ఉండాల్సింది సిబిఐ, పోలీస్ దగ్గర మాత్రమే! అంతేకాని ఇంటర్‌నెట్‌లా ప్రతి ఇంట్లో కాదు!"

'మైగాడ్!' ఆర్యలో దిగ్భ్రాంతి. వండర్ మిషన్‌ని దాక్షాయణీ ఎంతగా విశ్లేషించింది. ఆమెలో ఇంత విశ్లేషణ శక్తి ఉందని తానెప్పుడూ అనుకోలేదు.

అప్పుడు కదిలిందా అనుమానం ఆర్యలో.

"దాక్షాయణీ! మరి ఇన్నాళ్ళూ ఆ వండర్ మిషన్‌ని నా విషయంలో ఎందుకు సపోర్ట్ చేశావు?"

“మీ పగ తీరడం కోసం! మీ ఆశయం నెరవేరడం కోసం. కేవలం ఒక ప్రత్యేక ఆశయం నెరవేరడానికే తప్ప దానిని జీవితాంతం నేను సపోర్ట్ చేయలేను…”

“అది కాదు దాక్షాయణీ! వండర్ మిషన్ ద్వారా మనం కోట్లు కోట్లు సంపాదించవచ్చు కదా”

“అలా మిషన్‌ల ద్వారా సంపాదించే కోట్లు మనిషి మనుగడకు అచ్చిరావు. నాకు ఇష్టం లేదు కూడా. నా ఉద్దేశంలో వండర్ మిషన్ లేకుండానే మనం కష్టపడి, ఆ ఫలాన్ని సంతోషంగా అరగించాలి తప్ప అప్పనంగా, తేలికగా వచ్చి పడే డబ్బుతో గడిపే బ్రతుకు జీవితం కాదు”

“అంటే వండర్ మిషన్‌తో వచ్చే నన్ను నీవు చేపట్టవా?”

“మిమ్మల్ని మిమ్మల్నిగా చేపడతాను కాని వండర్ మిషన్‌తో కాదు. నా దృష్టిలో ఆర్య అంటే నా భర్త. అంటే డబ్బు తేలికగా సంపాదించే యంత్రం కాదు. మిమ్మల్ని మిమ్మలుగా ప్రేమించాలి తప్ప డబ్బు, ఆస్తి, అంతస్తు, పొజిషన్‌తో కాదని నా అభిప్రాయం.

నిశ్చేషత ఆర్యలో. దాక్షాయణీ ఎంతగా ఎదిగిపోయింది. రోజురోజుకు ఆమె వ్యక్తిత్వం ఇంతింతై అన్నట్లుగా పెరిగిపోతోంది.

“థాంక్స్ దాక్షాయణీ! నా జీవితంలో నేనొక కీలక నిర్ణయం తీసుకోవాలను కున్నాను. నీ మాటలతో నేను ఎటువైపు వెళ్ళాలో నిర్ణయించుకున్నాను. థాంక్స్…”

# ఉపసంహారం

సమీరకు ఉద్వేగంగా ఉంది. ఆర్య నుండి వచ్చే నిర్ణయం కోసం ఆమె చకోర పక్షిలా ఎదురుచూస్తోంది.

తన జీవిత కాలంలో అంత టెన్షన్ ఎప్పుడూ పడలేదు. ఆర్యంటే ఆమెకు క్షణక్షణానికి ప్రేమ పెరిగిపోతుంది. ఆర్య సహృదయం అర్థమైన ఆమెకు అతడి మీద ఆరాధన భావం నిమిష నిముషానికి పెరిగిపోతుంది. అతడు తన పక్కనుంటే చాలు, ఎన్ని శక్తులు ఎదురైనా జయించవచ్చు. తనకూ, అతడికి అంతస్తులు, పొజిషన్‌లో తేడాలు ఉండవచ్చు. కాని భావాలు ఎన్నో అయిన హృదయాలు ఒకటే అన్నట్లుగా తామిద్దరూ తేలికగా కలిసిపోగలరు.

సమయం గడుస్తోంది. క్షణాలు నిమిషాలుగా, నిముషాలు గంటలుగా పరిణామం చెందుతున్నాయి. ఆర్య ఫోన్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తోందామె. ఆర్య ఇ-మెయిల్ కోసం కంప్యూటర్‌ని పదే పదే వెతుకుతోంది.

సరిగ్గా రాత్రి పదకొండు గంటలయ్యాక... కంప్యూటర్‌లో బీప్ శబ్దం వచ్చింది. వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో ఆమె కంప్యూటర్ కేసి చూసింది.

ఆర్య నుండి మెయిల్

ఆమె హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. శరీరంలో పరవశంతో నాట్యం చేస్తోంది.

ఒక్కదుటున ఆమె మౌస్‌తో ఆ మెయిల్‌ని ఓపెన్ చేసింది.

**సమీరా,**

ఇన్నాళ్ళూ పగ తీర్చుకోవడం కోసం అహోరాత్రులు శ్రమించాను. నేడు అది తీరిపోయింది.

దాంతో నాకు ఈ ప్రపంచం మీద, మనుషుల మీద విరక్తి పుట్టింది. ఇప్పటికే నేను బాగా అలిసిపోయాను.

ఒకప్పుడు నేను నిన్ను మనసా, వాచా ప్రేమించాను. కాని మీ తండ్రి కొట్టిన దెబ్బకు నా జీవితమే చెల్లాచెదురయ్యింది. నన్ను ప్రాణప్రదంగా చూసుకొనే ఒక్కగానొక్క అక్క చనిపోయింది.

నాకు జరిగిన అన్యాయాన్ని నీకు చెబుదామని ప్రయత్నిస్తే నీవు చీదరించుకున్నావు. నన్ను అసహ్యించుకున్నావు. ఆఖరికి నీ సెక్యూరిటీతో నన్ను చిత్రహింసలు పెట్టించావు అయినా అవేం పట్టించుకోలేదు నేను.

నీవు ప్రధాని అయ్యాక నీవంటే పడని శక్తులు నీ మీద దాడి చేయడానికి ప్రయత్నించాయి. తండ్రి లేని అమ్మాయిని... వంటరిగా బ్రతుకూడీస్తున్న నిన్ను ఆ స్థితిలో వదిలెయ్యకూడదని ఫోన్ వండర్ మిషన్ సహాయంతో నిన్ను ఎన్నోసార్లు కాపాడాను. దానికి కారణం నీ మీద నాకు ఇంకా ప్రేమ మిగిలి ఉండడమే.

కాని.... ఎప్పుడైతే తుషార్‌తో ఎంగేజ్‌మెంట్‌కు ఒప్పుకున్నావో ఆ రోజే నా మనసు విరిగిపోయింది. అంతేకాదు, ఆ సమయంలో ఫోన్ చేసిన నన్ను హేళన చేశావు. తుషార్‌తో పోలిస్తే నాకు ఆస్తి అంతస్తులు, స్టేటస్, అధికారం... ఏది లేదని

అవహేళన చేశావు. ఆ రోజే నా మనసు పూర్తిగా పగిలిపోయింది. నీమీద ప్రేమ తునాతునకలైపోయింది. ఒకసారి మనసు పగిలిపోతే, మళ్ళీ అతుక్కోడం కష్టం.

అందుకే నీ ప్రేమని నేను అంగీకరించలేకపోతున్నాను. ఐయామ్ సారీ సమీరా! నా పగ జీవితంలో, నా వంటరితనంలో నాకు చేయూతనిచ్చిందో యువతి.

ఆమె నీలా ప్రధాని కాదు, అంతగా ఆస్థి, అంతస్తు ఉన్న యువతి కాదు. నీలాగే నా వండర్ మిషన్ని ఆశించి వచ్చే అమ్మాయి కాదు. నన్ను నన్నుగా ప్రేమించడానికి ముందుకొచ్చి సాధారణ యువతి. ఆ అమ్మాయి చేయి పట్టుకొని ముందుకు నడవడానికి నేను మానసికంగా సిద్ధం అయ్యాను.

ఇదంతా నీ మీద కోపంతో చేయడం లేదు. మొదట్నుంచి... అంటే నా ప్రారంభం నుండి ఆమె నాతో భావాలు పంచుకుంది. మానసికంగా అలసిపోయిన నాకు స్వాంతన చేకూర్చింది. నాకేం కావాలో అలా అన్ని రకాలుగా తనను తను తేలికగా మార్చుకునేది. నిజానికీ ఆమే తుషార్ లిప్ మూవ్మెంట్ని బట్టి అతడు దోషి అని తేల్చింది. ఒక రకంగా చెప్పాలంటే తుషార్లాంటి వాడి అసలు స్వరూపం కనిపెట్టడానికి, నా అక్క మరణానికి కారకులైన వారిని ఆమె తన అద్భుత పటిమతో కనిపెట్టింది.

ఐయాం సారీ సమీరా! నిన్ను మళ్ళీ వంటరిగా వదిలేస్తున్నందుకు ఈ ప్రపంచంలో.

అయితే నీ శ్రేయోభిలాషిగా, మాజీ ప్రేమికుడిగా నీకో కానుకని వెళ్తున్నాను. అదేమిటో తెలుసా? **నేను రాత్రింబవళ్ళు కనిపెట్టిన, వండర్ మిషన్ని నీకు ప్రేమతో ఇచ్చి వెళ్తున్నాను.**

ప్రేమ ఎప్పుడూ త్యాగాన్ని కోరుకుంటుంది. అందుకే వండర్ మిషన్ని ప్రేమ కానుకగా ఇచ్చి నిష్క్రమిస్తున్నాను. నేను ఉన్నా లేకపోయినా వండర్ మిషన్ నీకు బాగా ఉపయోగపడుతుంది. ఆ వండర్ మిషన్ ఫార్ములాని, సాఫ్ట్వేర్ని ఈ ఇ–మెయిల్తో పంపిస్తున్నాను. ఇక పాలించు ఈ దేశాన్ని! తరతరాలుగా నీ ప్రజల్ని మెప్పించి చరిత్రలో సమర్థురాలైన ప్రధానిగా నీవు పేరు తెచ్చుకోవాలని నా ఆశ.

ఇక నేను నీకు మళ్ళీ కనిపించను. వండర్ మిషన్ లేని నేను ఎలా బ్రతుకుతానో అన్నదే నీ సందేహం కదూ! నేను ఏ కాలేజీలో పాఠాలు చెప్పుకున్నా ఎంతో కొంత డబ్బు వస్తుంది. నాతో కూడా వచ్చే అమ్మాయి కూడా తన కొచ్చిన సంగీతం,

చిత్రలేఖనంతో పదిమందికి ఆలంబన చూపిస్తానని చెప్పింది. ఆ చిరు సంపాదన చాలు మా ఇద్దరికి.

అన్నట్లు నా కోసం వెతికే ప్రయత్నం చేయకు. నేను వండర్ మిషన్ సైతం అందని దూరతీరాలకు వెళ్తున్నాను. బ్రతికినన్నాళ్ళు అక్కడే బ్రతికి తనువు చాలిస్తాను. ఈ అభాగ్యుడి కోసం ఆరాటపడవద్దు.

గుడ్‌బై... మళ్ళీ కలుసుకుందాం... వచ్చే జన్మలో.

నీ

ఆర్య


*ఒక సాధారణ పౌరుడిగా జన్మించి, ప్రపంచ ప్రఖ్యాతి గల వండర్ మిషన్‌ని కనిపెట్టి, తుదకు తిరిగి సాధారణ పౌరుడిగా దూరతీరాలకు వెళ్ళిపోతున్న ఆర్య కోసం సమీర కళ్ళల్లో రెండు నీటి బొట్లు వెలువడ్డాయి.*

'ఒకే ఆర్యా! ఈ జన్మలో నీలాంటి సుగుణాల రత్నాన్ని జారవిడుచుకున్నాను. నాకు మరుజన్మ అంటూ ఉంటే అది నీకే ఆర్యా' అనుకొని కళ్ళ నీళ్ళు తుడుచుకుంది.

**(అయిపోయింది)**

## డా. కె. కిరణ్‌కుమార్ రాసిన
## మరో అత్యంత సెన్సేషనల్ నవల

# "ఆమె ఓ ప్రభంజనం"




రు. 80/-

తన భర్తని చంపిన వ్యక్తుల మీద పగ తీర్చుకోవడానికి ఆమె హ్యాకింగ్‌ని నేర్చుకొంది. ముందుగా బ్యాంకింగ్ వ్యవస్థని స్తంభించింది. ఆ తర్వాత స్టాక్ మార్కెట్ ఆర్థిక వ్యవస్థని స్తంభింపజేసింది. ఆ తర్వాత సెల్‌ఫోన్‌లు, టీవీలు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్‌లు పనిచేయకుండా చేసే ప్రయత్నం కొనసాగించింది. ఆమె ధాటికి ఆర్థిక మంత్రి, ఐటి మినిస్టర్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయినా ఆమె లొంగలేదు. తన భర్తని చంపిన బ్లాక్ మాస్‌ని పట్టించేదాకా ఆ ప్రభంజనాన్ని కొనసాగిస్తానని ప్రతిన బూనింది.

అప్పుడు ప్రధాని ఏం చేశారు? ఆమె ఆట కట్టించాడా? లేదా ఆమె సెల్‌ఫోన్‌లను స్తంభించే యత్నాన్ని సఫలం చేశాడు? విఫలం చెందాడా? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం సంచలన నవల 'ఆమె ఓ ప్రభంజనం' చూడండి.

వివరాలకు:

## శ్రీ వైభవ పబ్లికేషన్స్

**102, దివ్యసాయి అపార్ట్‌మెంట్స్**
**1-9-285/9/1, విద్యానగర్, హైదరాబాద్-44**
**ఫోన్ : 040-27090541**

## డా. కె. కిరణ్‌కుమార్ మరో సంచలన నవల

# ఓ హృదయం లేని ప్రియురాలా!

*('స్వాతి' సపరి వారపత్రిక అద్భుత సీరియల్)*




తనతో పాటు డాక్టర్ కోర్సు చదువుతున్న ఆ అమ్మాయిని ప్రేమిస్తాడు అతడు. ఆ ప్రేమని నిరాకరిస్తుందామె. కాలక్రమేణా ఆ అమ్మాయి దేశ ప్రధాని అవుతుంది. ఆ పదవిని సమర్ధవంతంగా నిర్వహించాలంటే ప్రేమ, పెళ్ళిలాంటి వాటికి దూరంగా ఉంటానని మరణశయ్య మీదున్న తండ్రికి మాట ఇస్తుంది. ఆ అమ్మాయిని చూద్దామని వెళ్ళిన ఆ అబ్బాయిని కుక్కని కొట్టినట్లుగా కొట్టి చెత్తకుండీలో పడేస్తారు సెక్యూరిటీ సిబ్బంది. అప్పుడా యువకుడు ఎలా పగ తీర్చుకున్నాడు? ఆ అమ్మాయి ప్రేమని సామాన్యుడైన అతడు గెలుపొందాడు! ఆ తర్వాత ఏం జరిగింది?

అత్యద్భుత కథనంతో రాచరిక వ్యవస్థలోని జీవన పద్ధతులను కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించిన నవల.


**డా. కె. కిరణ్‌కుమార్ మాత్రమే రాయగలిగిన అసామాన్య నవల.**

# ఓ హృదయం లేని ప్రియురాలా!

*మార్కెట్‌లో ఉంది... చదవండి....*

## డా॥ కె. కిరణ్‌కుమార్ రాసిన
## మరో అత్యంత సెన్సేషనల్ నవల

# అణుజ్వాల




రూ. 60/-

*ఈ వ్యవస్థ మీద విసిగిపోయిన ఓ సైంటిస్ట్ ఆటంబాంబుని తయారుచేసి ఢిల్లీ నగరం మీద వేస్తానని పగబూనుతాడు. అందుకు శాంపిల్‌గా గోవా సముద్రంలో ముందుగా ఓ బాంబు పేలుస్తాడు. అది కొన్ని వందల, వేల టన్నుల రేడియేషన్‌ని వెదజల్లుతుంది. ఆ భయంకర విధ్వంసం చూసి అతడిని ఎలాగైనా ఆపాలని భారత ప్రధాని తన సైన్యాన్ని ఆజ్ఞాపిస్తాడు. అందుకు ఢిల్లీ నగరాన్ని కూడా ఖాళీ చేయిస్తాడు. చివరికేం జరిగింది? ఆ ఆటంబాంబు పేలిందా? సైంటిస్ట్ పగ తీరిందా!*

*ఈ ప్రశ్నలకు సమాధానమే డా॥ కె. కిరణ్‌కుమార్ రాసిన అద్భుత కథనం.*

# అణుజ్వాల

(స్వాతి సీరియల్)

**ప్రచురణ**

## శ్రీ వైభవ పబ్లికేషన్స్

ప్లాట్ నెం. 102, దివ్యసాయి అపార్ట్‌మెంట్స్
ఇం.నెం. 1-9-285/9/1, విద్యానగర్
హైదరాబాద్-44. ఫోన్ : 27090541
e-mail: srivaibhavapublications@gmail.com

**అద్వితీయ కథనం, అనన్యసామాన్య కథతో కూడిన అత్యద్భుత నవల**

డా. కె. కిరణ్‌కుమార్ అత్యద్భుత నవల

## ఈ ప్రేమ వర్షం ఏ మేఘానిదో

మనిషి ఆరోగ్యరీత్యా ఎంతకాలం బ్రతకగలడో చూపించే వండర్ మిషన్‌ని కనిపెడుతుంది సైంటిస్ట్ శర్మిష్ఠ. తన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జ్యోతిష్యాన్ని విమర్శిస్తుంది. అది చూసి దేశంలో నెంబర్‌వన్ జ్యోతిష్య ఆచార్యులు మండిపడతాడు. టీవీలో కనిపిస్తున్న ఆమె చేతి రేఖలను బట్టి ఆమెను చేసుకునేవాడు ఆరు నెలలకంటే ఎక్కువ బ్రతకడని సవాలు చేస్తాడు. దానికి శర్మిష్ఠ సమాధానమిస్తూ తను చేసుకునేది ఎవరినో కాదని, ఆ జ్యోతిష్కుడి కొడుకునేనంటుంది. దేశం తీవ్ర సంచలనానికి లోనవుతుంది. వారి ఎంగేజ్‌మెంట్ సమయంలో ఆమె కాబోయే భర్త సరదాగా వండర్ మిషన్‌ని ఎక్కుతాడు. అప్పుడా మిషన్ పెద్ద అక్షరాలలో **"ఈ వ్యక్తి ఆరు నెలలకంటే ఎక్కువ బ్రతకడు"** అని చూపిస్తుంది. దేశమంతటా తిరిగి సంచలనం.

అప్పుడు సైంటిస్ట్ శర్మిష్ఠ ప్రపంచంలోనే కనీవినీ ఎరుగని సాహసానికి పాల్పడుతుంది. ఆ తర్వాతేం జరిగింది? డా. కె. కిరణ్‌కుమార్ మాత్రమే రాయగలిగే అద్భుత నవల ఇది.

'ఈ ప్రేమవర్షం ఏ మేఘానిదో'

చదవండి!

**ఓ దీవిలో చిక్కుకున్న జంటల కథాసమాహారం**

డా. కె. కిరణ్‌కుమార్ అద్భుత నవల

## సెలయేరు

ప్రస్తుత నగర బిజీలైఫ్‌తో విసిగిపోయిన నలుగురు సైంటిస్టులు, వారి భార్యలతో కలిసి ఓ కంపెనీ ఛైర్మన్ ఓ దీవిలోకి వెళ్తారు. అక్కడి డమ్మీ పిస్తళ్ళతో రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరినొకరు కాల్చుకొనే ఆట ఆడుతారు. ఆ ప్రక్రియలో ఒక నిజమైన పిస్టల్ వస్తుంది. అది కొంతమందిని బలిగొంటుంది. ఆ పిస్టల్ ఎవరిది? ఎక్కడ్నుంచి వచ్చింది! ఇదిలా ఉండగా ఓరోజు ఉదయాన వారి కుక్కలు, పనివారు అకస్మాత్తుగా మాయం అవుతారు. అసలేం జరిగింది? ఇలాంటి అత్యద్భుత కథ, కథనంతో చకచకా నడిపించే అద్భుత రచయిత **డా. కె. కిరణ్‌కుమార్** చేతి నుండి వెలువరించిన అద్భుత నవల

**సెలయేరు**

చదవండి!

*A Magnificiant Story of a wife who experiences from a series of incidents*

**డా. కె. కిరణ్‌కుమార్ అత్యద్భుత నవల**

# మల్లెపూవు

(మయూరి పత్రిక సీరియల్)

దేశంలో నెంబర్‌వన్ పారిశ్రామికవేత్త భవానీ ప్రసాద్ తను చనిపోతూ ఓ వీలునామా రాస్తాడు. ఆ వీలునామా ప్రకారం - తను చనిపోయిన తర్వాత తన భార్య అలేఖ్య ఎవరితోనూ అక్రమ సంబంధం పెట్టుకోకూడదని, అలా పెట్టుకుంటే ఆస్థి మొత్తం అనాధాశ్రమానికి పోతుంది.

ఆ తర్వాతేం జరిగింది? చిత్ర విచిత్ర మలుపులతో పాఠకులను సంభ్రమాశ్చర్యాలకు లోనుచేసే అద్భుత నవల 'మల్లెపూవు'.

**భార్యాభర్తల సున్నిత సంబంధాలను సైతం సరికొత్త కోణంలో ఆవిష్కరింపచేసిన అద్భుత నవల "మల్లెపూవు"**

---

వయసు తగ్గించే ఫార్ములా కథాసమాహారం

డా. కె. కిరణ్‌కుమార్ అద్భుత కథనం

# వయసే ఒక పూలతోట

(స్వాతి వీక్లీ సీరియల్)

కొత్తగా కాలేజీలో చేరిన అమ్మాయిని సతాయిస్తుంటాడు అతడు. ఆ అమ్మాయి తల్లి సైంటిస్ట్. వయసు తగ్గించే ఫార్ములాని కనిపెడుతూ ల్యాబ్‌లో ఆ ఫార్ములా ఎలా పనిచేస్తుందో పరీక్షించడానికి దానిని తన మీద తనే ప్రయోగించుకుంటుంది. ఫలితంగా ఆమె వయసు ఇరవై సంవత్సరాలు తగ్గిపోతుంది.

అదే రాత్రి కాలేజీలో తనని పరాభవించిన కూతురిని కిడ్నాప్ చేద్దామని వచ్చి అతడు వయసు తగ్గి కన్పిస్తున్న తల్లినే కూతురిగా భ్రమించి కిడ్నాప్ చేస్తాడు.

ఆ తర్వాతేం జరిగింది?

చిత్ర విచిత్ర మలుపులతో, కథనంతో వెలువడిన అద్భుత నవల

**వయసే ఒక పూలతోట**

# డా॥ కె. కిరణ్ కుమార్
## ఇతర అద్వితీయ రచనలు

### కంప్యూటర్ పుస్తకాలు

| | | | |
|---|---|---|---|
| 1. కంప్యూటర్ శాస్త్రం | రూ. 150 | 8. 'సి' నేర్చుకుందాం | రూ. 100 |
| 2. *A to Z* ఇంటర్‌నెట్ | రూ. 100 | 9. జావా | రూ. 200 |
| 3. ఎం.ఎస్. ఆఫీస్ | రూ. 150 | 10. కంప్యూటర్ గైడ్ | రూ. 60 |
| 4. ఫోటోషాప్ | రూ. 150 | 11. ఇంటర్‌నెట్ గైడ్ | రూ. 60 |
| 5. డిటిపి | రూ. 200 | 12. కీబోర్డు షార్ట్‌కట్స్ | రూ. 50 |
| 6. ట్యాలీ | రూ. 200 | 13. A to Z వెబ్‌సైట్స్ | రూ. 40 |
| 7. ఓరాకిల్ | రూ. 150 | | |

### ఇంగ్లీషు లెర్నింగ్ పుస్తకాలు

| | |
|---|---|
| 1. స్పోకెన్ ఇంగ్లీష్ | రూ. 50 |
| 2. కమ్యూనికేటివ్ ఇంగ్లీషు | రూ. 50 |

### ఇతర పుస్తకాలు

| | |
|---|---|
| 1. మీరూ లక్షలు సంపాదించగలరు | రూ. 150 |
| 2. ప్రతిభావంతుల విజయానికి 150 మార్గాలు | రూ. 125 |
| 3. ఎమ్‌సెట్ విజయానికి 150 మార్గాలు | రూ. 60 |
| 4. ఎగ్జామ్ సక్సెస్ సీక్రెట్స్ | రూ. 80 |
| 5. డబ్బు ఆదా మార్గాలు | రూ. 40 |
| 6. స్టాక్ మార్కెట్‌లో సంపద పెంచుకోవడం ఎలా? | రూ. 50 |
| 7. స్టాక్ మార్కెట్‌లో ఉత్తమ షేర్లు కొనడం ఎలా? | రూ. 100 |
| 8. మ్యూచువల్ ఫండ్స్ | రూ. 50 |
| 9. స్టాక్ మార్కెట్ విజయ రహస్యాలు | రూ. 50 |